
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 18 సంచిక: 9
మంగళవారం 1-4-2025


'బీడుబడిన భూముల్లో జలయజ్ఞంతో ఆనందపు సిరులు పండాలి'


ముంబై బోణీ
కోల్‌కతా జట్టుపై 8 వికెట్లతో గెలుపు. 4 వికెట్లతో రాణించిన అశ్వని - 14లో


ప్రజాసేవే లక్ష్యం
సివిల్స్ సాధనే తన ఆశయం అంటోన్న గ్రూప్‌-1 టాపర్ లక్ష్మీదీపిక - 13లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


ఈసారి ఎండలెక్కువే..
ఈసారి ఎండల భగభగ తప్పదని ఐఎండీ హెచ్చరించింది. తెలుగు రాష్ట్రాల్లో వడగాడ్పులు ఎక్కువగానే ఉంటాయని పేర్కొంది.
- వివరాలు 6లో


2,000 దాటిన భూకంప మృతులు
మయన్మార్‌లో శుక్రవారం నాటి భూకంపం ధాటికి 2,000 మందికిపైగా మరణించినట్లు అక్కడి ప్రభుత్వ మీడియా వెల్లడించింది.
- వివరాలు 6లో


ఏప్రిల్ 1 విడుదల
నూతన ఆర్థిక సంవత్సరంలో కొన్ని కీలక ఆర్థిక మార్పులు చోటుచేసుకున్నాయి. ఆ మార్పులు... వాటి ప్రభావంపై కథనం.
- వివరాలు 15లో


5 లక్షల కోట్ల టన్నుల మంచు..
గ్రీన్‌లాండ్‌లో ఏటా సగటున 5,500 కోట్ల టన్నుల మేరకు మంచు శరవేగంగా కరిగిపోతోందని శాస్త్రవేత్తలు తేల్చారు.
- వివరాలు 6లో

న్యూస్‌రీల్

కాంగ్రెస్ సర్కార్‌పై సమరమే

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేలా ఉద్యమ కార్యాచరణ రూపొందించి.. ముందు కెళ్లాలని బీజేపీ నిర్ణయించింది. రైతులు, వ్యవసాయ కూలీలు, మహిళలు, నిరుద్యోగ యువత ఇలా అన్నివర్గాల ప్రజల సమస్యలపై పోరాడాలని తీర్మానించింది.
- వివరాలు 12లో

రేపట్నుంచి జేఈఈ మెయిన్స్

జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించే జేఈఈ మెయిన్స్ రెండో విడత బుధవారం నుంచి మొదలవుతుంది.
ఈ పరీక్షలకు 12.5 లక్షల మంది హాజరు అవుతారని అంచనా. తెలుగు రాష్ట్రాల నుంచి 2 లక్షల మంది పరీక్ష రాయనున్నారు.
- వివరాలు 3లో

విద్యార్థులకు 'బెస్ట్' ఇవ్వరా

ప్రతిభావంతులైన ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కోసం అమలవుతున్న బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీమ్‌ను నిధుల సమస్య వెంటాడుతోంది. మూడేళ్లుగా బకాయిలు నిలిచిపోవడంతో ఈ ఏడాది ప్రవేశాలు కల్పించరాదని యాజమాన్యాలు నిర్ణయించినట్లు సమాచారం.
- వివరాలు 5లో

అత్యాచారం చేసి.. నోట్లో మూత్రం పోసి..

వివాహితపై సామూహిక లైంగికదాడికి పాల్పడిన ఏడుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తనను వదిలేయాలని ప్రాధేయపడిన ఆమె పట్ల నిందితులు అమానుషంగా ప్రవర్తించినట్టు తెలిసింది.
- వివరాలు 5లో

కంచె.. గర్జించె..

కంచె గచ్చిబౌలి భూములపై ప్రభుత్వం, హెచ్‌సీయూ మధ్య ప్రకటనల యుద్ధం


భూములను చదును చేస్తున్న జేసీబీలు

- ఆ 400 ఎకరాలు మావే అంటున్న సర్కారు
- 2004లో 534.28 ఎకరాలు ప్రభుత్వానికి హెచ్‌సీయూ స్వాధీనం చేసినట్లుగా ఉన్న డాక్యుమెంట్ రిలీజ్
- ప్రత్యామ్నాయంగా తర్వాత 397.16 ఎకరాలు వర్సిటీకి స్వాధీనం చేసినట్లుగా ఉన్న మరో డాక్యుమెంట్ బహిర్గతం
- హెచ్‌సీయూ సమ్మతితోనే ఆ 400 ఎకరాలకు హద్దులు నిర్ధారించామంటున్న ప్రభుత్వ వర్గాలు
- సర్కారు, టీజీఐఐసీ వాదనల్లో నిజం లేదన్న వర్సిటీ రిజిస్ట్రార్.. రెవెన్యూ అధికారులు ఎలాంటి సర్వే నిర్వహించలేదని వెల్లడి
- సదరు భూములు తమవేనంటూ ప్రకటన విడుదల
- భూముల చదును కొనసాగుతుండటంతో విద్యార్థుల ఆందోళన ముమ్మరం.. విద్యార్థుల నిరసనలు, విపక్షాల మద్దతుతో రాజుకుంటున్న వేడి

2 లో

ఆ 400 ఎకరాలు వదిలేయ్
- కాంక్రీట్ జంగిల్‌లో ఉన్న ఒకేఒక లంగ్ స్పేస్ హెచ్‌సీయూ.. రాహుల్ పట్టించుకోరా?
- విద్యార్థుల ఆందోళనకు సంపూర్ణ మద్దతు
- హెచ్‌సీయూ విద్యార్థులతో కలిసి మీడియాతో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2 లో

హెచ్‌సీయూ భూములు అమ్మొద్దు
కేంద్ర మంత్రి బండి సంజయ్ డిమాండ్
భూముల రక్షణకు ఆందోళన చేస్తున్న విద్యార్థులను ఎలా కొడతారు?
సీఎంకు మానవత్వం లేదా?
ప్రభుత్వాన్ని నిలదీసిన కేంద్ర మంత్రి

2 లో

ఆ భూముల్లో జీవ వైవిధ్యం..!
- ఎటు చూసినా పచ్చదనం.. వన్యప్రాణులకు ఆవాసం
- '400 ఎకరాలపై' విద్యార్థులు, పర్యావరణవేత్తల మనోగతం

2 లో



వాన్‌గార్డ్ ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి


హైదరాబాద్‌లో వాన్‌గార్డ్ తొలి జీసీసీ

ఈ ఏడాది చివరి నాటికి ప్రారంభం..
నాలుగేళ్లలో 2,300 ఉద్యోగ అవకాశాలు
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కంపెనీ ప్రతినిధుల భేటీ

సాక్షి, హైదరాబాద్: అమెరికాకు చెందిన ప్రతిష్టాత్మక సంస్థ 'వాన్‌గార్డ్' తొలిసారిగా భారతదేశంలో అంతర్జాతీయ సామర్థ్య కేంద్రం (గ్లోబల్ కేపబిలిటీ సెంటర్)ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనుంది. ఈ ఏడాది చివరిలోగా ఈ కేంద్రాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్నట్లు.. రానున్న నాలుగేళ్లలో 2,300 మందికి ఉపాధి కల్పించనున్నట్లు ప్రకటించింది. వాన్‌గార్డ్ దాదాపు ఐదు కోట్ల మంది పెట్టుబడిదారులతో సుమారు 10.4 ట్రిలియన్ డాలర్ల సంస్థగా కొనసాగుతోంది. వాన్‌గార్డ్ సీఈవో సలీం రాంజీ, ఐటీ డివిజన్ సీఈవో, ఎండీ నితిన్ టాండన్, మానవ వనరుల ప్రధానాధికారి జాన్ కొచర్, జీసీసీ–ఇండియా వాన్‌గార్డ్ హెడ్ వెంకటేశ్ నటరాజన్‌లు సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మిగతా 3వ పేజీలో ▶

హెచ్‌సీఏ వ్యవహారంపై సీఎం సీరియస్
- సన్‌రైజర్స్ మేనేజ్‌మెంట్‌కు వేధింపులపై విజిలెన్స్ ఎంక్వైరీకి ఆదేశం?

2 లో

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులుగా టిమ్స్

సనత్‌నగర్‌లో గుండె సంబంధ వ్యాధుల ఆస్పత్రి.. జూన్‌లో ప్రారంభం
అల్వాల్‌లో గ్యాస్ట్రో... ఎల్బీనగర్‌లో న్యూరో వైద్యసేవలు
ఆయా టిమ్స్‌లకు అనుబంధంగా మెడికల్, నర్సింగ్ కాలేజీల ఏర్పాటు
వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభం కూడా జూన్‌లోనే
అవసరమయ్యే డాక్టర్లు, సిబ్బంది కోసం సర్కార్‌కు డీఎంఈ లేఖ


సాక్షి, హైదరాబాద్: సూపర్ స్పెషాలిటీ అనగానే ఇప్పటివరకు కార్పొరేట్ ఆస్పత్రులే గుర్తుకొచ్చేవి. గుండె, మూత్రపిండాలు, న్యూరో సంబంధిత సమస్యలొస్తే ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించేవారు. ఆ కొరత తీర్చేందుకు స్పెషలైజ్డ్ హాస్పిటళ్లను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) పేరుతో నగర శివార్లలో నిర్మిస్తున్న ఆస్పత్రులను స్పెషలైజ్డ్ హాస్పిటళ్లుగా మార్చనున్నారు. ప్రస్తుతం నిర్మాణపరంగా వివిధ దశల్లో ఉన్న ఈ మూడింటిని స్పెషాలిటీ ఆస్పత్రులుగా మార్చడంతోపాటు ప్రతీ ఆస్పత్రికి ఓ మెడికల్ కాలేజీని ఏర్పాటు చేయనున్నారు. తద్వారా అక్కడ ప్రొఫెసర్లు, డాక్టర్ల కొరత కూడా తీరనుంది. పీజీ స్టూడెంట్లు డాక్టర్లుగా సేవలు అందించే వీలు కలుగుతుంది. ప్రతి మెడికల్ కాలేజీకి అనుబంధంగా నర్సింగ్ కాలేజీని కూడా ఏర్పాటు చేస్తే, నర్సుల కోసం కూడా ఇబ్బంది పడే పరిస్థితి ఉండదని ప్రభుత్వం భావిస్తోంది. అదే సమయంలో పేదలు, మధ్యతరగతి వర్గాలకు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందుబాటులోకి రానుంది.



ఇప్పటివరకు స్పెషలైజ్డ్ కొన్నే..
ఉస్మానియా, గాంధీ, వరంగల్ ఎంజీఎం.. జనరల్ ఆస్పత్రులుగా ప్రసిద్ధి. ఇక్కడ అన్ని రకాల వైద్యసేవలు అందిస్తున్నా, స్పెషలైజ్డ్ ట్రీట్‌మెంట్ అందుబాటులో లేదు. హైదరాబాద్‌లో ఎంఎన్‌జే కేన్సర్ హాస్పిటల్, నిలోఫర్ పిల్లల దవాఖానా, సరోజినిదేవి కంటి ఆస్పత్రి వంటివి మాత్రమే స్పెషాలిటీ ఆస్పత్రులుగా ఉన్నాయి. అయితే గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీ, గ్యాస్ట్రో వంటి స్పెషాలిటీ ఆస్పత్రులు లేకపోవడంతో కొత్తగా నిర్మిస్తున్న మూడు టిమ్స్‌ను అందుకు మిగతా 3వ పేజీలో ▶

స్కూల్ యూనిఫాం.. ఇక పక్కా కొలతలు

సగటు కొలతలకు స్వస్తి.. ప్రతి విద్యార్థి కొలతలు సేకరించాల్సిందే
కుట్టిన యూనిఫాం సైజ్ చాలకపోతే సరిచేయాలి
విద్యార్థులు సంతృప్తి చెందితేనే స్వయం సహాయక బృందాలకు బిల్లులు
డీఈవోలకు విద్యాశాఖ ఆదేశాలు..
ఈసారి స్కూళ్లకే నేరుగా వస్త్రం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల యూనిఫాం తయారీలో ప్రభుత్వం ఈసారి మార్పులు తీసుకొచ్చింది. సగటు కొలతలకు బదులు కచ్చితమైన కొలతలతోనే యూనిఫాం అందించాలని నిర్ణయించింది. ప్రతి విద్యార్థి కొలతలనూ టైలర్లు వ్యక్తిగతంగా తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ మేరకు పాఠశాల విద్య డైరెక్టరేట్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాల్లోని విద్యాశాఖ అధికారులంతా దీన్ని విధిగా పాటించాలని ఆదేశించింది.

గతం మాదిరి కాదు...
గతంలో యూనిఫాంకు కొలతలు తీసుకొనే పద్ధతి వేరుగా ఉండేది. విద్యార్థులందరినీ గ్రూపులుగా విభజించే వారు. ఎత్తు, లావు ఆధారంగా 10 మందిలో ఒకరి కొలత తీసుకొని మిగతా వారికి కూడా అదే కొలతలతో కుట్టేవాళ్లు. దీనివల్ల కొందరికి పొట్టిగా, మరికొందరికి వదులుగా యూనిఫాం ఉంటోంది. దీంతో కొంత మంది విద్యార్థులు టైలర్ల దగ్గరకు వెళ్లి అవసరమైన సైజ్ మేరకు యూనిఫాంలో మార్పులు చేయించుకుంటున్నారు. నిరుపేద పిల్లలు మాత్రం ఇచ్చిందే వేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో విద్యా కమిషన్ సిఫార్సులు, స్థానిక హెచ్‌ఎంల ఫిర్యాదుల దృష్ట్యా ప్రతి విద్యార్థికీ కచ్చితంగా కొలతలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దుస్తులు పంపిణీ చేసిన తర్వాత విద్యార్థి నుంచి మిగతా 3వ పేజీలో ▶

వెల్'డాన్'

టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ మార్షల్ ఆర్ట్స్ పరీక్షలో నెగ్గారు. కరాటేలో బ్లాక్ బెల్ట్ 6వ డాన్ ఇప్పటికే సాధించిన ఆయన సోమవారం 7వ డాన్ బెల్ట్ కోసం జరిగిన పోటీలో నెగ్గి.. సర్టిఫికెట్ అందుకున్నారు.
- వివరాలు 16లో

ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్
- దివంగత శాకమూరి అప్పారావు ఉద్యమ సహచరి రేణుక మృతి
- దళసభ్యురాలిగా మొదలై డీకేఎస్‌జడ్‌సీ స్థాయికి...
- ఆమె స్వస్థలం ఉమ్మడి వరంగల్ జిల్లా కడవెండి
- నేడు రేణుక అంత్యక్రియలు - 5లో


గుమ్ముడవెల్లి రేణుక (ఫైల్)

ఇదండీ సంగతి


..అణుబాంబులేద్దాం సార్! సందర్భోచితంగా ఉంటుంది.!!

విజయవాడ హైవేపై తగ్గాయి.. మిగతా చోట్ల పెరిగాయి

రాష్ట్రంలోని జాతీయ రహదారులపై అమల్లోకి కొత్త టోల్ చార్జీలు
కొన్నిచోట్ల 3.5 శాతం, మరికొన్ని టోల్‌ప్లాజాల వద్ద 5 శాతం పెరుగుదల
హైదరాబాద్–విజయవాడ మార్గంలో మాత్రం గరిష్టంగా రూ. 160 దాకా తగ్గుదల
2026 మార్చి 31 వరకు ఇవే చార్జీలు: జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ

సాక్షి, హైదరాబాద్/సాక్షి ప్రతినిధి, మంచిర్యాల/చౌటుప్పల్ రూరల్, కేతేపల్లి/రఘునాథపల్లి/దేవరుప్పుల/ఇందల్వాయి: రాష్ట్రంలోని జాతీయ రహదారులపై కొత్త టోల్ చార్జీలు సోమవారం అర్ధరాత్రి నుంచి అమల్లోకి వచ్చాయి. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) సవరించిన చార్జీలను ప్రకటించింది. దీనిప్రకారం హైదరాబాద్– విజయవాడ మార్గంలోని నేషనల్ హైవే–65పై కనిష్ఠంగా రూ. 15 నుంచి గరిష్టంగా రూ. 160 దాకా టోల్ చార్జీలు తగ్గాయి. అదే సమయంలో తెలంగాణ మీదుగా సాగే ఇతర హైవేలపై మాత్రం మిగతా 16వ పేజీలో ▶



ఔటర్‌పై పెరిగిన టోల్ చార్జీలు
ఏటా కొనసాగే పెంపులో భాగమే..
ఐఆర్‌బీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్ వే వెల్లడి
16 లో



ఫిలిప్పీన్స్‌కు తెలంగాణ బియ్యం
- తొలి కన్‌సైన్‌మెంట్ కింద కాకినాడ షిప్‌యార్డు నుంచి 12,500 మెట్రిక్ టన్నుల బియ్యం ఎగుమతి
- 8 లక్షల మెట్రిక్ టన్నుల ఎగుమతి ఒప్పందం... మొదటి విడతగా లక్ష మెట్రిక్ టన్నులు
- కాకినాడ షిప్‌యార్డ్‌కు వెళ్లి జెండాఊపి ఓడను పంపిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

5 లో



అమెరికా పర్యటనా?.. వద్దు బ్రో..!

ట్రంప్ విధానాలతో పర్యాటక రంగంపై తీవ్ర ప్రభావం

- ప్రపంచంలో అత్యుత్తమ పర్యాటక దేశాల జాబితాలో అమెరికా టాప్–3లో ఉండడం పరిపాటి. ఇది నిన్నటి మాట. ఇప్పుడు పరిస్థితి మారిపోతోంది. విదేశీ ఉత్పత్తులపై సుంకాల మోత.. అక్రమ వలసదార్ల పేరిట వేలాది మందిని బలవంతంగా బయటకు పంపించడం వంటి ట్రంప్ నిర్ణయాలు పర్యాటక రంగంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. అమెరికాపై ప్రపంచ దేశాల దృక్పథంలో మార్పు కనిపిస్తోంది.

6 లో

ట్రంప్ 'మూడో' ముచ్చట తీరేనా?

ట్రంప్ టారిఫ్‌ల టెన్షన్!
- రేపే డెడ్‌లైన్.. ఎగుమతిదార్లలో అయోమయం
- రంగాలవారీ వడ్డింపా.. విడివిడిగా ఉత్పత్తుల మీదా అని ఆందోళన
- నాలుగు స్థాయిల్లో టారిఫ్‌ల ప్రభావం ఉండొచ్చని అంచనా
- వాయిదా వేసే అవకాశం ఉందని ఆశాభావం - 12లో

క్లుప్తంగా...

హెచ్‌సీఏ వ్యవహారంపై సీఎం రేవంత్ సీరియస్

సన్‌రైజర్స్ మేనేజ్‌మెంట్‌కు వేధింపులపై విజిలెన్స్ ఎంక్వైరీకి ఆదేశం?

సాక్షి, హైదరాబాద్: ఉచిత టికెట్ల విషయంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ), ఐపీఎల్ ఫ్రాంచైజీ సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య ఏర్పడిన వివాదంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సీరియస్ అయినట్టు సమాచారం. హెచ్‌సీఏ అధ్యక్షుడు, మరికొందరు ఉన్నతాధికారులు ఉచిత టికెట్ల విషయంలో ఐపీఎల్ ఫ్రాంచైజీ సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను వేధిస్తున్నారని, బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని మీడియాలో వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో, ఈ వ్యవహారంపై దర్యాప్తు చేసేందుకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ కొత్తకోట శ్రీనివాసరెడ్డిని నియమించినట్టు సోమవారం ప్రచారం జరిగింది. ఇటీవల ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం..హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్ రావు ప్రవర్తనపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఉచిత టికెట్ల డిమాండ్లతో వారిని వేధించడం కొనసాగిస్తే హైదరాబాద్ రాజీవ్ గాంధీ స్టేడియంలో మ్యాచ్‌లు ఆడటం మానేస్తామని బెదిరిస్తూ ఒక ఈ-మెయిల్‌ను పోస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ పరిణామంపై స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశంపై పూర్తిస్థాయిలో దర్యాప్తునకు ఆదేశించినట్టు సమాచారం. కాగా విజిలెన్స్ అధికారులు ఈ విచారణ అంశాన్ని ధ్రువీకరించలేదు.

భూములమ్మి అప్పులు కడతారా?

రేవంత్ ప్రభుత్వానికి ఎంపీ ఈటల ప్రశ్న



సాక్షి, హైదరాబాద్: రేవంత్ రెడ్డి ప్రభుత్వం హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం భూములు అమ్మి అప్పులు కట్టాలనే నీచమైన ప్రయత్నం చేస్తోందని బీజేపీ నేత, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మండిపడ్డారు. ఈ వర్సిటీ భూములు అమ్మకూడదని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం బీజేపీ కార్యాలయంలో ఈటల మీడియాతో మాట్లాడుతూ 'హెచ్‌సీయూ అనేది రాష్ట్రానికే తలమానికం. భూముల విక్రయాన్ని విద్యార్థులు, అధ్యాపకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. విద్యార్థులపై పోలీసుల దాడిని ఖండిస్తున్నాం' అని అన్నారు. విద్యార్థులకు పూర్తి సంఘీభావం తెలుపుతున్నామని, అవసరమైతే తాము ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని ఈటల హెచ్చరించారు. 15 నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతీ నిర్ణయం ప్రజాకంటకం, ప్రజా వ్యతిరేకమైన దేనని, తిరోగమన చర్యలు తీసుకుంటోందని ఈటల మండిపడ్డారు.

భూముల అమ్మకాన్ని సీఎం పునఃసమీక్షించాలి

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి డిమాండ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీ భూములను విక్రయించాలని యత్నించడం అనైతికమని, విద్యార్థులు, హైదరాబాద్ ప్రజల హితం దృష్టిలో ఉంచుకుని సీఎం రేవంత్ రెడ్డి పునఃసమీక్షించాలని బీజేపీ చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'ప్రభుత్వం హెచ్‌సీయూ భూమిని అమ్ముతామని ప్రకటించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. ప్రకృతికి నష్టం కలిగించేలా నిర్ణయాలు తీసుకోవడం సమంజసం కాదు. గ్రీన్ స్పేస్‌ను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలి. అవసరమైన చోట పార్కులు అభివృద్ధి చేయాలి. హైదరాబాద్‌కు లంగ్ స్పేస్‌గా తీర్చిదిద్దాలి. రియల్ ఎస్టేట్ ప్రయోజనాల కోసం కాంక్రీట్ జంగిల్‌గా మార్చాలనుకోవడం సరికాదు' అని తెలిపారు. ఈ అంశంపై బీజేపీ ఎమ్మెల్యేలతో పాటు లాయర్లతో కూడిన ఫ్యాక్ట్ ఫైండింగ్ టీమ్‌ను యూనివర్సిటీకి పంపించనున్నట్టు విశ్వేశ్వర్‌రెడ్డి చెప్పారు. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సేవెళ్ల మహేందర్ మాట్లాడుతూ ఈ యూనివర్సిటీ భూములు అమ్మొద్దని రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి అనేకసార్లు వినతిపత్రాలిచ్చినా స్పందించలేదని విమర్శించారు. ఈ భూములను కాపాడుకునేలా బీజేవైఎం ఆధ్వర్యంలో ఛలో యూనివర్సిటీ కార్యక్రమం నిర్వహించి కాపాడుకుంటామన్నారు.

విద్యార్థులను అడ్డుపెట్టుకుని బీజేపీ, బీఆర్ఎస్ కుట్ర





సాక్షి, హైదరాబాద్: సెంట్రల్ వర్సిటీ భూముల వ్యవహారంలో విద్యార్థులను అడ్డుపెట్టుకుని బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలకు పాల్పడుతున్నాయని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ ఆరోపించారు. ఆ భూములు యూనివర్సిటీకి చెందినవి కావని తెలిసి కూడా రాజకీయం చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేయాలని ప్రయత్నిస్తున్నాయని సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వ్యాఖ్యానించారు. ఉమ్మడి ఏపీలో బిల్లీరావు అనే వ్యక్తి ఐఎంజీ పేరుతో కాజేయాలని చూసిన భూమిని తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక రక్షించిందన్న విషయాన్ని దయాకర్ గుర్తుచేశారు. ఈ భూమిలో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు టీజీఐఐసీకి భూములను బదలాయించి పనులు చేస్తుంటే యూనివర్సిటీ భూములను గుంజుకున్నట్టు ప్రతిపక్షాలు రాద్ధాంతం చేయడం తగదన్నారు. రాజకీయ పార్టీల ఆలోచనల ప్రకారం వెళ్లకుండా అన్ని విషయాలను అర్థం చేసుకునే శక్తి సెంట్రల్ వర్సిటీ విద్యార్థులకు ఉంటుందని దయాకర్ వ్యాఖ్యానించారు.

కంచె.. గర్జించె..

కంచె గచ్చిబౌలి భూములపై ప్రభుత్వం, హెచ్‌సీయూ మధ్య ప్రకటనల యుద్ధం

విద్యార్థుల ఆందోళనలు, విపక్షాల మద్దతుతో రాజుకుంటున్న వేడి


హెచ్‌సీయూ భూమిని ప్రభుత్వానికి స్వాధీనం చేసినట్టుగా ఉన్న డాక్యుమెంట్


హెచ్‌సీయూకు 397 ఎకరాల భూమిని స్వాధీనం చేసినట్టున్న పత్రం

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా కంచె గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూములకు సంబంధించి మొదలైన వివాదం క్రమంగా ముదురుతోంది. భూములు తమవంటే తమవేనంటూ రాష్ట్ర ప్రభుత్వం, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ) వేర్వేరు వాదనలు వినిపిస్తూ 'ప్రకటనల యుద్ధానికి' తెరలేపాయి. మరోవైపు వర్సిటీ భూములు కాపాడుకుంటామంటూ విద్యార్థులు ఆందోళనలు కొనసాగిస్తున్నారు. విపక్షాలు వారి పోరాటానికి మద్దతు పలకడమే కాకుండా, ప్రభుత్వ వైఖరిపై విరుచుకు పడుతున్నాయి. దీంతో రాష్ట్రంలో ప్రస్తుతం కంచె గచ్చిబౌలి భూముల వివాదమే హాట్ టాపిక్‌గా మారింది.

పూర్వాపరాలు..

కంచె గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిని 2004లో చంద్రబాబు ప్రభుత్వం ఐఎంజీ అకాడమీకి అప్పగించింది. అయితే ఆ కంపెనీకి సామర్థ్యం లేదని, కంపెనీ బోగస్ అని ఆ తర్వాత వచ్చిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం ఆ కేటాయింపుల్ని రద్దు చేసింది. ఈ రద్దుపై ఐఎంజీ కోర్టును ఆశ్రయించింది. 21 ఏళ్ల పాటు జరిగిన న్యాయపోరాటం తర్వాత ఆ భూములు ప్రభుత్వానివేనని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. ఈ నేపథ్యంలో ఆ భూములను ప్రభుత్వం టీజీఐఐసీకు కేటాయించింది. ఆ భూములను అభివృద్ధి చేసి పరిశ్రమలకు విక్రయించాలని టీజీఐఐసీ నిర్ణయించి నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే ఆ భూములు హెచ్‌సీయూవి అంటూ విద్యార్థులు ఆందోళనలకు దిగడంతో వివాదం మొదలైంది.

విద్యార్థులను తప్పుదోవ పట్టిస్తున్నారు: సర్కారు

కొందరు స్థిరాస్తి వ్యాపారులు, రాజకీయ నాయకులు తమ ప్రయోజనాల కోసం విద్యార్థులను తప్పుదోవ పట్టిస్తున్నారని ప్రభుత్వం పేర్కొంటోంది. దీని వెనుక కొన్ని స్థిరాస్తి గుంటనక్కలు ఉన్నాయని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలోనే సదరు భూముల తమవేనంటూ హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ సోమవారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. మరోవైపు ఈ భూములు సర్కారువే నంటూ ప్రభుత్వం కూడా అందుకు సంబంధించి రెండు డాక్యుమెంట్లు సోమవారం విడుదల చేసింది. 2004 జనవరి 31న కంచె గచ్చిబౌలి సర్వే నంబర్ 25 లోని 534.28 ఎకరాల హెచ్‌సీయూ భూమిని ప్రభుత్వానికి స్వాధీనం చేసినట్టుగా ఉన్న, అప్పటి రిజిస్ట్రార్ వై.నర్సింహులు, మరో ముగ్గురు సాక్షులు సంతకాలతో కూడిన ఒక డాక్యుమెంట్‌ను సోమవారం సాయంత్రం విడుదల చేసింది. అలాగే ఈ భూమికి ప్రత్యామ్నాయంగా అదే రోజున అప్పటి యూనివర్సిటీ రిజిస్ట్రార్ నర్సింహులుకు గోపన్‌పల్లిలోని సర్వే నంబర్ 36లో ఉన్న 191.36 ఎకరాలు, సర్వే నంబర్ 37లో ఉన్న 205.20 ఎకరాలు మొత్తం 397.16 ఎకరాల భూమిని ముగ్గురు సాక్షుల సమక్షంలో స్వాధీనం చేసినట్లుగా ఉన్న మరో డాక్యుమెంటు కూడా బహిర్గతం చేసింది.

హెచ్‌సీయూకు సంబంధం లేదు..

కంచె గచ్చిబౌలిలోని ప్రస్తుత వివాదాస్పద భూమితో సెంట్రల్ యూనివర్సిటీకి ఎలాంటి సంబంధం లేదని సర్కారు వాదిస్తోంది. 21 ఏళ్ల క్రితం ఐఎంజీ భారత్‌కు కేటాయించిన భూమిని న్యాయపోరాటం ద్వారా దక్కించుకున్నట్లు చెబుతోంది. ప్రస్తుతం టీజీఐఐసీ ద్వారా వేలానికి ప్రతిపాదించిన భూమిలో చెరువు లేదని, శిలా సంపదకు జీవ వైవిధ్యానికి ఎలాంటి భంగం వాటిల్లదని పేర్కొంటూ సీఎంవో సోమవారం ఒక ప్రకటన జారీ చేసింది. 'చట్టపరంగా దక్కిన ఈ భూమిపై వివాదాలు సృష్టించడం కోర్టు ధిక్కరణ కిందకే వస్తుంది. కంచె గచ్చిబౌలి సర్వే నంబరు 25లోని 400 ఎకరాల భూమిని 2004లో ఐఎంజీ అకాడమీకి కేటాయించారు. పనులు ప్రారంభం కాకపోవడంతో రద్దు చేసి 2006 నవంబర్ 21న ఏపీ యువజన, టూరిజం, సాంస్కృతిక శాఖకు కేటాయించారు. దీనిపై ఐఎంజీ కోర్టుకు వెళ్లడంతో 2024లో మార్చిలో హైకోర్టు, అదే ఏడాది మే నెలలో సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇచ్చాయి' అని పేర్కొంటోంది..

ఐటీ, ఇతర ప్రాజెక్టుల కోసం టీజీఐఐసీకి..

ఈ భూముల్లో ఐటీ, ఇతర ప్రాజెక్టుల ఏర్పాటు కోసం గత ఏడాది జూన్‌లో టీజీఐఐసీకు బదలాయించారు. ఆక్రమణలకు గురికాకుండా శేరిలింగంపల్లి మండల రెవెన్యూ అధికారులు ఆ 400 ఎకరాల భూమికి సంబంధించి పంచనామా నిర్వహించి 2024, జులై 1వ తేదీన టీజీఐఐసీకి అప్పగించా రు. ఈ భూమికి సంబంధించిన ఉమ్మడి హద్దుల గుర్తింపునకు సహకరించాలని కోరుతూ టీజీఐఐసీ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ రిజిస్ట్రార్‌ను కలవడంతో పాటు మెయిల్ కూడా పంపారని, రిజిస్ట్రార్ సమ్మతితోనే 2024 జూలై 19న సర్వే చేసి హద్దులు నిర్ధారించారని ప్రభుత్వం వాదిస్తోంది.

వన్య ప్రాణులు లేవు.. చెరువులు లేవు!

'టీజీఐఐసీ అభివృద్ధి చేస్తున్న 400 ఎకరాల్లో అడవి దున్నలు, నెమళ్లు, చెరువులు లేవు. ప్రపంచ స్థాయి ఐటీ మౌలిక వసతులు, అనుసంధానత పెంపు, తగినంత పట్టణ స్థలాల లభ్యత అనే ప్రభుత్వ ప్రాధాన్యానికి ప్రస్తుత ప్రాజెక్టు కట్టుబడి ఉంది. టీజీఐఐసీ అభివృద్ధి చేసే లే ఔట్‌లో శిలా సంపద, హరిత స్థలాల పరిరక్షణ కోసం ప్రణాళిక సిద్ధమైంది. మాస్టర్‌ప్లాన్‌లో సుస్థిరాభివృద్ధికి సమగ్ర పర్యావరణ యాజమాన్య ప్రణాళిక (ఈఎంపీ) తయారు చేస్తోంది. ఈ దిశగానే 400 ఎకరాల ప్రభుత్వ భూమిని సాధ్యమైనంత ఎక్కువ ఉపయోగించుకునేలా టీజీఐఐసీ రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ జారీ చేసింది..' అని ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి.

వర్సిటీ అంగీకరించిందనడం అవాస్తవం: రిజిస్ట్రార్

'రాష్ట్ర ప్రభుత్వం, టీజీఐఐసీ చెప్తున్నట్లుగా 2024 జూలైలో సదరు భూముల్లో రెవెన్యూ అధికారులు ఎలాంటి సర్వే నిర్వహించలేదు. ఇప్పటి వరకు సదరు భూమి రూపు రేఖలను మాత్రమే ప్రాథమికంగా తనిఖీ చేశారు. భూమి హద్దులు నిర్ణయించేందుకు యూనివర్సిటీ అంగీకరించిందని టీజీఐఐసీ చేస్తున్న వాదనలో నిజం లేదు. భూమి హద్దులు నిర్ధారించేందుకు యూనివర్సిటీకి ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. దేశంలోనే పేరొందిన యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ స్వర్ణోత్సవాల సందర్భంగా ఈ భూమిని రాష్ట్ర ప్రభుత్వం అప్పగించడంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించాలని అందిన వినతులను పరిశీలించాలి. రాష్ట్రపతి నియమించిన ఆరుగురు సభ్యులతో కూడిన యూనివర్సిటీ కమిటీ అనుమతితోనే ఏదైనా భూ బదలాయింపు జరుగుతుంది..' అని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ రిజిస్ట్రార్ సోమవారం నాటి ప్రకటనలో స్పష్టం చేశారు. ఇలా రెండు పక్షాలు ఎవరి వాదనలు వారు వినిపిస్తుండగా..విద్యార్థులు తాజాగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి ఆందోళనకు సంఘీభావం తెలపాలని కోరారు. బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ప్రభుత్వం భూముల అమ్మకాలకు పూనుకోవడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. దీంతో ఈ వివాదం రాష్ట్రవ్యాప్తంగా చర్చకు తెరతీసింది.





ఆ భూముల్లో జీవ వైవిధ్యం!

- ఎటు చూసినా పచ్చదనం.. వన్యప్రాణులకు ఆవాసం
- '400 ఎకరాలపై' పర్యావరణ వేత్తలు, విద్యార్థుల మనోగతం

రాయదుర్గం: హెచ్‌సీయూతో పాటు విద్యార్థులు తమవేనంటూ చెబుతున్న ఆ 400 ఎకరాల భూముల్లో జీవ వైవిధ్యం ఉందా? అంటే ఉందనే అంటున్నారు..వర్సిటీ విద్యార్థులు, పర్యావరణ పరిరక్షకులు చెబుతున్నారు. ప్రభుత్వం పచ్చని భూములు విక్రయిస్తే.. జింకల గంతులు, దుప్పుల సందడి, పురివిప్పి ఆడే నెమళ్ళు, కుందేళ్ల పరుగులు, పక్షుల కిలకిలా రావాలు, అడవి, ముళ్ళ పందుల హంగామా..ఇవన్నీ ఒకప్పుడు అనే చెప్పాల్సి వస్తుందని విద్యార్థులు అంటున్నారు. భారీయెత్తున పురాతన బండ రాళ్ళు, వృక్ష సంపద, పండ్లు, పూలు, ఔషధ మొక్కలు, పచ్చిక బయళ్ళు, నీటి వనరుల పరిస్థితి ప్రశ్నార్థకమేనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాంక్రీట్ జంగిల్‌గా మారుతున్న నగరంలో జీవవైవిధ్యానికి నిలయంగా హెచ్‌సీయూ ప్రత్యేకతను చాటుకుంటోందని పర్యావరణ పరిరక్షకులు చెబుతున్నారు. వివిధ రకాల వృక్షాలు, మొక్కలతో పాటు సుమారు 200 వరకు వన్య ప్రాణులకు ఈ భూములు నిలయమని అంటున్నారు. అప్పుడప్పుడు క్యాంపస్‌లోని విద్యార్థులుండే ప్రాంతాలకు వచ్చే వన్య ప్రాణులను విద్యార్థులు, సెక్యూరిటీ సిబ్బంది కాపాడి తిరిగి దట్టమైన పొదల్లోకి వదిలి పెడుతుంటారని గుర్తు చేస్తున్నారు.

ఆక్సిజన్ హబ్‌గా హెచ్‌సీయూ

హెచ్‌సీయూ క్యాంపస్ శివారు ప్రాంతానికి, పర్యావరణానికి ఆక్సిజన్ హబ్‌గా ఉంటోంది. ఆ 400 ఎకరాలు తీసుకుంటే ఇక శివారు కాంక్రీట్ జంగిల్‌లో హెచ్‌సీయూ కూడా కలిసిపోక తప్పదు. నేను క్యాంపస్‌లో ఉండగా ఎన్నో మొక్కలు నాటా. అవి ఇప్పుడు చెట్లుగా మారాయి. జంతుజాలం ముఖ్యంగా జింకలు, నెమళ్లు గాయపడితే చికిత్సలు చేయించి కాపాడి తిరిగి క్యాంపస్‌లోని అటవీ ప్రాంతంలో వదిలేస్తే గంతులేస్తూ వెళ్ళిపోయేవి. ఈ భూములు తీసుకుంటే పర్యావరణంపై తీవ్ర ప్రభావం పడడం ఖాయం. ప్రభుత్వం దీనిపై పునరాలోచన చేయాలి.

– డాక్టర్ జిల్లపల్లి రవి (పర్యావరణ పరిరక్షకుడు, హెచ్‌సీయూ పూర్వ విద్యార్థి)

క్యాంపస్ నడిబొడ్డున ప్రభుత్వ భూములా?

హెచ్‌సీయూ క్యాంపస్ నడిబొడ్డున భూములను చదును చేస్తూ, అవి ప్రభుత్వ భూములనడం అన్యాయం. చుట్టూరా 50 ఏళ్ళ క్రితమే ప్రహరీగోడ నిర్మించారు. పచ్చదనం కనుమరుగు, జంతువులు, పక్షులకు నిలువనీడ, రక్షణ కరువయ్యే పరిస్థితి నెలకొంది. పోలీసులతో నిర్బంధించి భూములు లాక్కోవాలని చూడడం తగదు. క్యాంపస్ స్థలాల రక్షణ కోసం పోరాటం చేస్తాం. పర్యావరణ పరిరక్షణకు అందరం నడుం బిగించి పోరాడతాం.

– బాలకృష్ణ (ఏబీవీపీ ఆలిండియా సెంట్రల్ యూనివర్సిటీల కన్వీనర్)

400 ఎకరాల భూమి వేలం చర్యను ఖండిస్తున్నాం

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిని వేలం వేసేందుకు తెలంగాణ సర్కారు తీసుకున్న చర్యలను కేంద్ర బొగ్గు, గనుల శాఖమంత్రి జి.కిషన్ రెడ్డి ఖండించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అంత్యంత దుర్మార్గంగా వ్యవహరిస్తోందని ఒక ప్రకటనలో మండిపడ్డారు. 'ప్రతిపక్షాల గొంతునొక్కడం, విద్యార్థులను అణచివేయడం, పచ్చదనాన్ని, జీవవైవిధ్యాన్ని విధ్వంసం చేయడం, నిధుల కోసం హైదరాబాద్ పర్యావరణాన్ని పణంగా పెట్టడంపైనే ప్రభుత్వం దృష్టిపెట్టింది. కంచ గచ్చిబౌలిలో 400 ఎకరాల భూమిని కాంగ్రెస్ ప్రభుత్వం మొండిగా వేలం వేయడం.. ఈ ప్రాంతంలోని వృక్షసంపదకు, ఇక్కడ ఉంటున్న జీవవైవిధ్యానికి గొడ్డలిపెట్టుగా మారింది. అర్ధరాత్రి పూట కూడా బుల్డోజర్లు పెట్టి చెట్లు నేలకూల్చడంతో అక్కడుంటున్న జాతీయపక్షుల (నెమళ్లు) ఆర్తనాదాలు హృదయవిదారకంగా ఉన్నాయి. హెచ్‌సీయూ వంటి ప్రతిష్టాత్మక విద్యాసంస్థల విద్యార్థుల గొంతులను కూడా అక్రమంగా నొక్కేస్తూ ఆక్రమణ చర్యలను మొండిగా చేపడుతుండటం దుర్మార్గం' అని కిషన్‌రెడ్డి మండిపడ్డారు.

పోలీసు పహారాలో హెచ్‌సీయూ

- విద్యార్థులపై అడుగడుగునా నిఘా
- ఐడీ కార్డు ఉంటేనే లోనికి అనుమతి
- ఇద్దరు పీహెచ్‌డీ విద్యార్థులపై కేసు నమోదు
- నేటి నుంచి అడ్మిన్ భవనం ముందు నిరవధిక నిరసన

గచ్చిబౌలి/రాయదుర్గం: కంచె గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిపై నెలకొన్న వివాదంతో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ క్యాంపస్ అట్టుడుకిపోతోంది. క్యాంపస్ మొత్తం పోలీసు పహారాలో ఉంది. మరోవైపు ఆందోలనలు కొనసాగిస్తున్న విద్యార్థులు, మంగళవారం నుంచి పోరాటం ఉధృతం చేయాలని నిర్ణయించారు. సోమవారం సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ దిష్టబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఇద్దరు పీహెచ్‌డీ విద్యార్థులపై కేసులు నమోదు చేసిన పోలీసులు..క్యాంపస్‌లో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారి నుంచి క్యాంపస్ ప్రధాన ద్వారం వరకు స్టాపర్స్ అమర్చారు. ప్రధాన ద్వారం వద్ద యూనివర్సిటీ హస్టళ్ల ముందు గచ్చిబౌలి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థుల కదలికలపై నిఘా పెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం టీజీఐఐసీకి కేటాయించిన స్థలంలో ఎలాంటి ఆటంకం లేకుండా పనులు సాగేలా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. ఇక్కడ బందోబస్తును మాదాపూర్ అడిషనల్ డీసీపీ జయరాం పర్యవేక్షిస్తున్నారు.

ఇద్దరు విద్యార్థుల రిమాండ్

పనులను అడ్డుకోవడం, తోపులాటకు దిగడంతో పోలీసు అధికారికి గాయాలయ్యాయంటూ టీజీఐఐసీ అధికారులు ఇచ్చిన ఫిర్యాదుతో గచ్చిబౌలి పోలీసులు హెచ్‌సీయూకు చెందిన ఇద్దరు పీహెచ్‌డి విద్యార్థులపై కేసు నమోదు చేశారు. పొలిటికల్ సైన్స్ పీహెచ్‌డీ స్కాలర్, హెచ్‌సీయూ స్టూడెంట్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ (ఎస్ఎఫ్ఐ) ఎర్రం నవీన్, కంప్యూటర్ సైన్స్ పీహెచ్‌డీ స్కాలర్, ఏబీవీపీ నాయకులు రోహిత్ బొండుగులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వీరిపై బీఎన్ఎస్ 329 (3), 118(1), 132, 191(3), 351(3), రెడ్ విత్ 3(5) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

నేటి నుంచి తరగతుల బహిష్కరణ

హెచ్‌సీయూలో భూముల పరిరక్షణ కోసం మంగళవారం నుంచి తరగతులు బహిష్కరించి క్యాంపస్‌లోని పరిపాలనా భవనం ముందు నిరవధిక నిరసన చేపట్టాలని విద్యార్థి సంఘాలు నిర్ణయించాయి. ఈ మేరకు హెచ్‌సీయూ విద్యార్థి సంఘం ఇచ్చిన పిలుపునకు ఏఐఎస్ఏ, ఏఐఓబీసీఎస్ఏ, ఏఎస్ఏ, బీఎస్ఎఫ్, డీఎస్‌యూ, ఫ్రటర్నిటీ, ఎంఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, ఎస్ఐఓ, టీఎస్ఎఫ్ వంటి విద్యార్థి సంఘాలు మద్దతు ప్రకటించాయి.

ఏబీవీపీ ఆధ్వర్యంలో సీఎం శవయాత్ర

హెచ్‌సీయూ భూములను కాపాడాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా క్యాంపస్‌లో సోమవారం సాయంత్రం రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి శవయాత్రను నిర్వహించారు. వర్సిటీ ప్రధాన గేటు వద్ద పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


హెచ్‌సీయూ ప్రధాన ద్వారం వద్ద విద్యార్థులు లోపలికి వెళ్లకుండా అడ్డుకుంటున్న పోలీసులు


హెచ్‌సీయూలో ఏబీవీపీ ఆధ్వర్యంలో శవయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

40 వేల ఎకరాలు అమ్ముతున్నావు.. ఆ 400 ఎకరాలు వదిలేయ్

- కాంక్రీట్ జంగిల్‌లో ఉన్న ఒకే ఒక లంగ్ స్పేస్ హెచ్‌సీయూ
- రాహుల్‌గాంధీ ఎందుకు పట్టించుకోవడం లేదు
- విద్యార్థులు చేస్తున్న ఆందోళనకు సంపూర్ణ మద్దతు
- జేసీబీలు, బుల్డోజర్లు రాత్రికి రాత్రే పర్యావరణాన్ని నాశనం చేస్తున్నాయి
- హెచ్‌సీయూ విద్యార్థులతో కలిసి మీడియాతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్


విద్యార్థులతో కలిసి మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: 40 వేల ఎకరాలను అమ్మకానికి పెట్టిన సీఎం రేవంత్‌రెడ్డి...హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాలను వదిలేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. హెచ్‌సీయూ భూములను విక్రయించొద్దంటూ విద్యార్థులు నిస్వార్థంగా చేస్తున్న ఆందోళనకు ఆయన సంపూర్ణ మద్దతు ప్రకటించారు. సోమవారం తెలంగాణభవన్‌లో కేటీఆర్ హెచ్‌సీయూ విద్యార్థులు, విద్యార్థి సంఘ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. వందలాది మంది పోలీసులు, జేసీబీలు, బుల్డోజర్లతో వేలాది వృక్షాలను నేలకూల్చడంతోపాటు, నెమళ్లు, దుప్పులు, జింకలు, అరుదైన పక్షిజాతులను అక్కడ నుంచి తరలించే యత్నం చేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమ వీరుల త్యాగాల ఫలితమే సెంట్రల్ యూనివర్సిటీ అని చెప్పారు. యూనివర్సిటీ భూములు, విద్యార్థులపై ప్రభుత్వం రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. ఆ ప్రాంతం మొత్తం కాంక్రీట్ జంగిల్‌గా మారిందని అక్కడున్న ఈ లంగ్‌స్పేస్ లేకుండా చేయడంతో జీవవైవిధ్యాన్ని దెబ్బతీస్తున్నారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి భూములు అమ్మడం, అప్పులు తేవడమే ఎజెండాగా పనిచేస్తున్నారని విమర్శించారు. ముంబైలో 2,500 చెట్లు కొడితేనే.. పర్యావరణం నాశనమైందని గొంతు చించుకున్న రాహుల్‌గాంధీ హెచ్‌సీయూ గురించి ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. హైకోర్టులో ఇప్పటికే ఈ అంశంపై పిల్ ఉన్న నేపథ్యంలో కోర్టుకు సెలవులున్న తరుణంలో రాత్రికిరాత్రే విధ్వంసం సృష్టిస్తున్నారన్నారు. ఈ అంశంపై తమ పార్టీ ఎంపీలు రాజ్యసభలో కేంద్రాన్ని ప్రశ్నిస్తారని, కేంద్ర వైఖరి ఏమిటో చెప్పాలని డిమాండ్ చేస్తామన్నారు. రేవంత్‌రెడ్డి ఎన్నికలయ్యాక సెంట్రల్ యూనివర్సిటీలో ఫుట్‌బాల్ ఆడడానికి వచ్చినప్పుడే ఆ భూములపై కన్నేశారని కేటీఆర్ విమర్శించారు. విద్యార్థులను జైలుకు పంపించినట్టు చెబుతున్నారని, వారికి ఏ విధంగా న్యాయ సహాయం చేయాలో ఆలోచిస్తామన్నారు. గుంట నక్కలు అంటూ... ఆయన కామెంట్లు చేశారని, తాము ప్రవేశిస్తే ఇదంతా బీఆర్ఎస్ చేయిస్తుందని ఉద్యమాన్ని పక్కదారి పట్టిస్తారనే ఆగామని చెప్పారు. యూనివర్సిటీ పూర్వ విద్యార్థులైన భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు అయినా జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు.

పోరాటం చేస్తాం: విద్యార్థులు

రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీని భయకంపితం చేస్తోందని, విద్యార్థులపై తీవ్ర బలప్రయోగం చేస్తోందని, అడ్డుకుంటున్నవారిని అదుపులోకి తీసుకుంటోందని విద్యార్థి సంఘం నాయకులు ఉమేష్ అంబేడ్కర్, శరణ్య, నిహార్ సులేమాన్, త్రివేణి వాపోయారు. న్యాయపరమైన అంశాలు తర్వాత చర్చించొచ్చని ముందు పర్యావరణాన్ని కాపాడాలని, నెమళ్లు, జింకలు చేస్తున్న రోదనలు పాలకులకు వినిపించడం లేదా అని వారు ప్రశ్నించారు. ఆ భూములను కాపాడుకోవడానికి ఎంతవరకైనా పోరాడుతాం అని స్పష్టం చేశారు.

హెచ్‌సీయూ భూములు అమ్మొద్దు

- కేంద్ర మంత్రి బండి సంజయ్ డిమాండ్
- భూముల రక్షణకు ఆందోళన చేస్తున్న విద్యార్థులను ఎలా కొడతారు?
- అమ్మాయిలను కూడా జుట్టుపట్టుకుని కొట్టారు
- ముఖ్యమంత్రికి మానవత్వం లేదా?
- ప్రభుత్వాన్ని నిలదీసిన కేంద్ర మంత్రి



సాక్షి, హైదరాబాద్: 'ముఖ్యమంత్రికి కనీస మానవత్వం లేదా? హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల రక్షణకు విద్యార్థులు ఆందోళన చేస్తుంటే, వాళ్లను పోలీసులు గొడ్డును బాదినట్లు బాదుతారా? అమ్మాయిలని కూడా చూడకుండా జుట్టుపట్టుకుని చితకబాదుతారా? ఇదేం పద్ధతి? భూములు అమ్మకుంటే రాష్ట్రాన్ని పాలించే పరిస్థితి లేదా? ఈనెల జీతాలివ్వాలంటే భూములు అమ్మాల్సిందేనా? భూములన్నీ అమ్మి, వేల కోట్లు సంపాదించి దండుకోవడమే మీ పనా? ఇదేం పాలన? అంత మాత్రానికి మీరెందుకు.. కేఏ పాల్‌కు అప్పగించినా సరిపోతుంది కదా?' అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రభుత్వంపై మండిపడ్డారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. భూముల రక్షణకు ఆందోళన చేస్తున్న ఏబీవీపీ విద్యార్థులను హాస్టల్ రూముల్లో దూరి కొడతారా? అని ప్రశ్నించారు. లాఠీచార్జి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని, మొత్తం ఘటనపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఇంత జరుగుతుంటే విద్యా కమిషన్ ఏం చేస్తోందని నిలదీశారు. వేల కోట్లకు భూములమ్మితే మీకు కూడా కమీషన్లు వస్తున్నాయని మౌనంగా ఉన్నారా? అని ప్రశ్నించారు. హెచ్‌సీయూ భూముల అమ్మకాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సంజయ్ డిమాండ్ చేశారు.

న్యాయవిచారణ జరపండి..

గ్రూప్ -1 పరీక్షపై అభ్యర్థులు అనేక అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నారని, వాటిని రాష్ట్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని బండి సంజయ్ సూచించారు. మెరిట్ విద్యార్థులకు అన్యాయం జరగకుండా న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కాగా, సన్నబియ్యం విషయంలో మొత్తం ఖర్చు ఎంత? అందులో కేంద్ర, రాష్ట్రాల వాటా ఎంతో స్పష్టం చేయాలని ఆయన నిలదీశారు. బియ్యం విషయంలో నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఏటా రూ.10 వేల కోట్లకుపైగా ఖర్చు చేస్తోందని, కేంద్రం ఇంత చేస్తున్నా పథకం ప్రారంభించే కార్యక్రమంలో ఈ విషయాన్ని ఒక్క సారైనా ప్రస్తావించారా? అని ప్రశ్నించారు. 'ప్రధానమంత్రికి కనీసం థ్యాంక్స్ చెప్పరా? అసలు ప్రధాని ఫొటో పెట్టకపోవడం ఎంతవరకు కరెక్ట్?' అని నిలదీశారు. జీహెచ్ఎంసీకి సంబంధించి స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీలన్నీ ఒక్కటి కాబోతున్నాయని ఆరోపించారు.



మధ్యవర్తిత్వమే మహాభాగ్యం

మీడియేషన్ సెంటర్లకు పెరుగుతున్న ఆదరణ

కాపురాల్ని నిలబెడుతున్నారు.. వివాదాల్ని పరిష్కరిస్తున్నారు • కోర్టుల జోక్యం ఉండదు.. సమయం, డబ్బు వృథా కాదు
ఇరుపక్షాలకు ఆమోదయోగ్యమైన తీర్పు • నిజామాబాద్, కామారెడ్డి, హైదరాబాద్‌లో మీడియేషన్ సెంటర్లు

నిజామాబాద్‌కు చెందిన హర్షిక (23), హైదరాబాద్‌కు చెందిన నిరూప్ (35)కు దాదాపు ఏడాదిన్నర క్రితం పెళ్లైంది. అయితే గర్భం దాల్చిన తాను పుట్టింటికి వెళ్లినప్పటి నుంచి భర్త ఎవరో మహిళలతో మాట్లాడుతున్నాడన్నది భార్య ఆరోపణ. ఫోన్ మాట్లాడి వెంటనే నంబర్ డిలీట్ చేస్తున్నాడని పేర్కొంటోంది. మొత్తం మీద ఇక ఇద్దరూ కలసి ఉండటం సాధ్యం కాదనే అభిప్రాయానికి వచ్చారు. ఈలోగా బిడ్డ పుట్టగా.. వివాదం జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ (ఎల్ఎస్ఏ)కి చేరింది. వారు భార్యాభర్తలను కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్ (సీఎంసీ)కు పంపించి కౌన్సెలింగ్ ఇప్పించారు. చిన్నారిని తల్లికిగానీ, తండ్రికిగానీ దూరం చేయవద్దని మీడియేటర్ సూచించారు. నాలుగు కౌన్సెలింగ్‌ల తర్వాత ఇద్దరూ ఇకపై ఎలాంటి వివాదాలు లేకుండా కలసి ఉండేందుకు అంగీకరించారు. నిరూప్ కూడా ఇకపై ఎలాంటి తప్పు చేయనంటూ కుటుంబ సభ్యుల సమక్షంలో ఒప్పంద పత్రం రాసి ఇచ్చాడు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం వారిద్దరూ సంతోషంగా ఉన్నారు.

హైదరాబాద్‌కు చెందిన ఉపేందర్, శ్రీనివాస్‌మధ్య ఎనిమిదేళ్లుగా ఆస్తి తగాదా ఉంది. ఇద్దరూ సివిల్ కోర్టుకెక్కారు. అయినా వివాదం పరిష్కారం కాలేదు. విషయం ఎల్ఎస్ఏకు చేరడంతో మధ్యవర్తి ఇద్దరినీ పిలిచి మాట్లాడారు. తర్వాత వారి కుటుంబసభ్యులతోనూ చర్చించారు. పలు దఫాల చర్చల తర్వాత వివాదాన్ని పరిష్కరించుకునేందుకు అంగీకరించారు. కోర్టు కేసులు వెనక్కు తీసుకున్నారు. మధ్యవర్తిత్వం ఫలించడంపై ఇరు కుటుంబాలు సంతోషం వ్యక్తం చేశాయి.

సాక్షి, హైదరాబాద్: మధ్యవర్తిత్వానికి రోజురోజుకూ ప్రాధాన్యత బాగా పెరుగుతోంది. కోర్టుల జోక్యం లేకుండానే చాలావరకు కాపురాల్ని నిలబెడుతోంది. వివాదాల్ని పరిష్కరిస్తోంది. డబ్బు, సమయం ఆదా చేస్తోంది. దీంతో ఇటీవలి కాలంలో చాలామంది మీడియేటర్లను ఆశ్రయిస్తున్నారు. పెరుగుతున్న అవసరాలకు తగ్గట్టుగా మీడియేషన్ సెంటర్లు సైతం పుట్టుకొస్తున్నాయి. వాస్తవానికి మధ్యవర్తిత్వం అనేది ఈ నాటిది కాదు. మన దేశంలో ఎప్పట్నుంచో ఉంది. ప్రజాస్వామ్యం దేశంగా ఏర్పడిన తర్వాత కూడా పల్లెల్లో పెద్దలు మధ్యవర్తిత్వం వహించి కోర్టుల ప్రమేయం లేకుండా సమస్యలు, వివాదాలు పరిష్కరించేవారు. కాగా ఈ మధ్యవర్తిత్వాన్ని న్యాయపరంగా, చట్టబద్ధంగా ప్రోత్సహించాలని అత్యున్నత న్యాయస్థానం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఏర్పాటైందే కమ్యూనిటీ మీడియేషన్. కమ్యూనిటీ మీడియేషన్ నిర్వహించే వారినే మీడియేటర్లు అంటారు. మధ్యప్రదేశ్, కేరళలో ఈ కమ్యూనిటీ మీడియేటర్ల విధానం అద్భుతమైన ఫలితాలు ఇచ్చింది. ఆ రాష్ట్రాల ప్రేరణతో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్టుగా రెండు సెంటర్లు ప్రారంభించారు. ఆరంభంలోనే ఆయా సామాజిక వర్గాల నుంచి అనూహ్య స్పందన లభించింది. దీంతో హైదరాబాద్, హనుమకొండ సహా ఇతర ప్రాంతాల్లోనూ ప్రారంభించారు. ఈ నేపథ్యంలోనే కోర్టుల చుట్టూ తిరగడం కంటే మధ్యవర్తిత్వంతోనే సత్వర న్యాయం సాధ్యమనే అభిప్రాయం బలపడుతోంది.

రాష్ట్ర కార్యాలయం...
తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ
హైకోర్టు బిల్డింగ్స్. ఫోన్: 040-23446723
ఈ-మెయిల్: తెలంగాణఎస్ఎల్ఎస్ఏఎట్‌దిరేట్‌జీమెయిల్.డామ్
వెబ్‌సైట్: డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీఎస్ఎల్ఎస్ఏ.తెలంగాణ.జీవోవీ.ఇన్

కమ్యూనిటీ మీడియేటర్లు అంటే..

వివాదాలు లేదా సమస్యలు తలెత్తినప్పుడు వాటిని శాంతియుతంగా పరిష్కరించడంలో శిక్షణ పొందిన వ్యక్తులు ఓ మధ్యవర్తిలా పనిచేస్తారు. ఇరు పక్షాలతో మాట్లాడాతారు. ప్రతి ఒక్కరి అభిప్రాయాలను వింటారు. వారి అవసరాలను అర్థం చేసుకుంటారు. వివాద పరిష్కారానికి పోత్సహించడం ద్వారా పరిష్కరిస్తారు. ఆసక్తి, సేవా భావంతో ముందుకు వచ్చే వారు.. తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో కమ్యూనికేషన్ నైపుణ్యాలు, వివాద పరిష్కార పద్ధతులపై వీరు శిక్షణ పొందుతారు. 25 ఏళ్లు నిండిన ఎవరైనా శిక్షణ పొంది మీడియేటర్లుగా మారొచ్చు. నేర చరిత్ర ఉండకూడదు. గ్రాడ్యుయేట్, మహిళలకు ప్రాధాన్యం ఇస్తారు. వీరికి అథారిటీ 20 గంటల పాటు శిక్షణనిస్తుంది. జిల్లా, మండల, జిల్లా మేజిస్ట్రేట్, సబ్-డివిజనల్ మేజిస్ట్రేట్ ఫిర్యాదులను ఈ సెంటర్లకు పంపవచ్చు.

కేసులు పరిష్కారమిలా..

	నిజామాబాద్	కామారెడ్డి
కేసుల దాఖలు	142	20
పరిష్కరించినవి	72	09
పరిష్కారం కానివి	08	00
పెండింగ్‌లో ఉన్నవి	61	00
విత్‌డ్రా చేసుకున్నవి	01	11



పరిష్కారం సులభతరం..

సమాజంలో వ్యవస్థీకృతంగా ఉన్న పలు వివాదాలను పరిష్కరించడంలో కమ్యూనిటీ మీడియేటర్ల (మధ్యవర్తులు) పాత్ర కీలకం. ముఖ్యంగా కుటుంబ తగాదాలు, వివాహ సంబంధిత వివాదాలకు సమాజ మూలాల్లో సమాధానం దొరుకుతుంది. ఆయా సామాజిక వర్గాల ప్రతినిధులకు సమస్యలపై అవగాహన ఉంటుంది కనుక పరిష్కారం సులభతరమవుతుంది. కమ్యూనిటీ మీడియేటర్లతో సమయం, డబ్బు వృథా కాదు. పోలీసుస్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరగకుండా సులువుగా పరిష్కారం పొందవచ్చు.

– సీహెచ్.పంచాక్షరి, టీఎస్ఎస్ఎల్ఏ సభ్య కార్యదర్శి



క్రెడిబిలిటీ పెరుగుతోంది..

ప్రస్తుత కాలంలో మీడియేషన్ ప్రాధాన్యత రోజురోజుకు పెరుగుతోంది. ఆర్థిక సంస్కరణల కారణంగా దేశంలో మధ్యవర్తిత్వ ప్రాధాన్యత పెరిగింది. మధ్యవర్తిత్వ ప్రక్రియ వేగవంతంగా జరగటమే కాకుండా.. పెరుగుతున్న క్రెడిబిలిటీతో ఇరు పక్షాలకు ఉపయోగకరంగా సాగుతోంది.

– తేరాల ఉపేందర్, లెక్చరర్, సూర్యాపేట

మీడియేషన్ ప్రయోజనాలు...

- త్వరగా, శాంతియుతంగా వివాదాల పరిష్కారానికి దోహదం
- న్యాయ వ్యవస్థపై భారం తగ్గించడంలో క్రియాశీల పాత్ర
- ఇరుపక్షాలకు ఆమోదయోగ్యమైన ఫలితం
- సంఘంలో ప్రజల మధ్య మంచి సంబంధాలకు విఘాతం కలుగదు.
- స్వల్ప మొత్తంలో డబ్బు ఖర్చుతోనే ఫలితం వెలువడుతుంది
- ఇరుపక్షాల అభిప్రాయాలకు విలువ ఇస్తారు.
- వ్యక్తిగత, సాధారణ విషయాలను గోప్యంగా ఉంచుతారు.

ప్రస్తుతమున్న సెంటర్లు...

నిజామాబాద్:	4
కామారెడ్డి:	1
హైదరాబాద్:	5
వచ్చే నెల కామారెడ్డిలో ఏర్పాటు చేయనున్న సెంటర్లు:	12

(హైదరాబాద్‌లో ఇటీవలే ఏర్పాటు చేశారు)

యువ వికాసం దరఖాస్తుకు 14 వరకు చాన్స్

పథకం కోసం రూ.10 వేల కోట్లు ఖర్చు చేయనున్నాం: ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాసం పథకం కోసం రూ.10 వేల కోట్లు ఖర్చు చేయనున్నట్లు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క వెల్లడించారు. వరుస సెలవుల నేపథ్యంలో యువత కోరిక మేరకు ఈ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 14వ తేదీవరకు గడువు పొడిగించినట్లు చెప్పారు. రాజీవ్ యువ వికాసం పథకం అమలులో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆయన ఆదేశించారు. సోమవారం ప్రజాభవన్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో పాటు సంక్షేమ శాఖల కార్యదర్శులు, కమిషనర్లతో కలిసి ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ, నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి ద్వారా జీవితంలో స్థిరపడే విధంగా ప్రభుత్వం మహోన్నత ఆశయంతో రాజీవ్ యువ వికాసాన్ని అమలు చేస్తోందన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఈ పథకానికి రూ.10వేల కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించిందని చెప్పారు. అధికారులు అంతా మనసుపెట్టి పనిచేయాలని, నిరుద్యోగులకు సేవ చేసే భాగ్యం ఈ పథకం ద్వారా అధికారులకు కలుగుతుందన్నారు. దశాబ్దకాలంగా నిరుద్యోగ యువతపై బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహించిందని విమర్శించారు. ఈ పథకం అమలుపై సీఎం రేవంత్‌రెడ్డితో పాటు తాను నిరంతరం సమీక్షిస్తామని స్పష్టం చేశారు. ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనారిటీ, ఈడబ్ల్యూఎస్ వర్గాల గురించి ఆలోచించి మొదటిసారి చేస్తున్న స్వయం ఉపాధి పథకం ఇదేనన్నారు. దరఖాస్తు దారులు ఎంపీడీఓ కార్యాలయాలు, మునిసిపాలిటీలో నేరుగా దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. జూన్ 2న అర్హులకు మంజూరీ పత్రాలు అందించాలన్నారు. ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించేందుకు ప్రతి జిల్లాలో ఒక యువ అధికారిని ఇన్‌చార్జ్‌గా నియమించాలని జిల్లా కలెక్టర్లను భట్టి ఆదేశించారు.

హైదరాబాద్‌లో వాన్‌గార్డ్ తొలి జీసీసీ

▶ మొదటి పేజీ తరువాయి

జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో భేటీ అయ్యారు. ముఖ్యమంత్రితోపాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఇతర ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రితో జరిగిన చర్చల అనంతరం వాన్‌గార్డ్ తన నిర్ణయాన్ని ప్రకటించింది. ప్రస్తుతం ప్రకటించిన ఈ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ఈ సంవత్సరం చివరి నాటికి నగరంలో పనిచేయడం ప్రారంభిస్తుందని ఆ సంస్థ సీఈవో ప్రకటించారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసే ఈ జీసీసీ ఇన్నోవేషన్ హబ్‌గా పనిచేస్తుందని చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా అనలిటిక్స్, మొబైల్ ఇంజనీరింగ్ వంటి అధునాతన సాంకేతిక రంగాల్లో అందుకు అవసరమైన ఇంజనీర్లను తక్షణమే నియమించుకోవాలనే ఆలోచనలో ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ..హైదరాబాద్‌లో వాన్‌గార్డ్ జీసీసీ ఏర్పాటుకు ముందుకు రావటం ఆనందంగా ఉందని అన్నారు. తెలంగాణ రైజింగ్ విజన్‌లో భాగంగా హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి జీసీసీ గమ్యస్థానంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. వాన్‌గార్డ్ రాకతో ప్రపంచ స్థాయిలో హైదరాబాద్ మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తరఫున తగినంత సహకారం అందిస్తామని కంపెనీ ప్రతినిధులకు సీఎం భరోసా ఇచ్చారు. తమ వినియోగదారులకు ప్రపంచస్థాయి సేవలను అందించటంతో పాటు ఏఐ, మొబైల్, క్లౌడ్ టెక్నాలజీలో ప్రతిభావంతులైన ఇంజనీర్లకు అవకాశాలు కల్పించటం తమకు సంతోషంగా ఉందని సలీం రాంజీ తెలిపారు.



వాన్‌గార్డ్ సీఈవో సలీం రాంజీకి జ్ఞాపికను అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో సీఎస్ శాంతికుమారి తదితరులు

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులుగా 'టిమ్స్'

▶ మొదటి పేజీ తరువాయి

వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. కార్డియాక్ స్పెషాలిటీ ఆస్పత్రిగా సనత్‌నగర్ టిమ్స్ హైదరాబాద్‌కు నలుదిక్కులా నాలుగు టిమ్స్ ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. కరోనా సమయంలో గచ్చిబౌలి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో మొదటి టిమ్స్‌ను బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీ నగర్‌లలో మూడు టిమ్స్ భవన నిర్మాణ పనులు ప్రస్తుతం చురుగ్గా సాగుతున్నాయి. అయితే ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గచ్చిబౌలి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఉన్న టిమ్స్ ను ఖాళీ చేయించి స్పోర్ట్స్ అథారిటీకి అప్పగించారు.

• సనత్‌నగర్‌లో నిర్మిస్తున్న టిమ్స్‌ను గుండె సంబంధమైన వ్యాధుల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. కార్డియాక్ తోపాటు కార్డియో థొరాసిక్ సేవలను ఇక్కడ అందుబాటులోకి తేనున్నారు. గ్రామీణస్థాయి నుంచి హైదరాబాద్ వరకు గుండె జబ్బులు ప్రమాద ఘంటికలు మోగిస్తున్న నేపథ్యంలో ఈ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను జూన్ 2న ప్రారంభించాల ని ప్రభుత్వం భావిస్తోంది. ఈ హాస్పిటల్‌కు అవస రమైన వైద్యులు, ఇతర సిబ్బంది కోసం ఇప్పటికే ప్రభుత్వానికి డీఎంఈ నరేంద్రకుమార్ లేఖ రాశా రు. అందుబాటులో ఉన్న సిబ్బందితోనైనా హాస్పి టల్‌ను ప్రారంభించాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉంది.

న్యూరో, గ్యాస్ట్రో కోసం

ఎల్బీనగర్‌లో నిర్మిస్తున్న టిమ్స్‌ను న్యూరో సూపర్ స్పెషాలిటీగా మార్చాలని ప్రభుత్వం భావించింది. ఈ ఆస్పత్రికి అనుబంధంగా వనస్థలిపురం మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ ఉంటుంది. అల్వాల్‌లో నిర్మిస్తున్న టిమ్స్‌ను గ్యాస్ట్రో సంబంధ వ్యాధుల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌గా మారుస్తున్నారు. దీనికి కుత్బుల్లాపూర్ మెడికల్, నర్సింగ్ కాలేజీలను అనుసంధానం చేస్తారు.

• వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ (డబ్ల్యూఎస్ఎస్‌హెచ్)ను కూడా జూన్‌లోనే ప్రారంభించాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉంది. ఈ సూ పర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లోనే ఎంజీఎంను విలీనం చేస్తారు. ఈ సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్‌కు కాకతీయ మెడికల్ కాలేజ్ అనుబంధంగా కొనసాగనుంది.

రేపట్నుంచి జేఈఈ మెయిన్స్

సాక్షి, హైదరాబాద్: జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష (జేఈఈ మెయిన్స్) రెండో విడత ఏప్రిల్ 2వ తేదీ నుంచి మొదలవుతుంది. ఏప్రిల్ 2, 3, 4, 7, 8 తేదీల్లో బీటెక్, బీఈ పేపర్లకు పరీక్ష ఉంటుంది. 9వ తేదీన బీఆర్క్, బీ ప్లానింగ్ పరీక్ష ఉంటుంది. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లూ చేశామని, అడ్మిట్ కార్డులను విడుదల చేశామని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ తెలిపింది. తొలి విడత జనవరిలో జరిగింది. ఈ పరీక్షకు దేశవ్యాప్తంగా 12 లక్షల మంది హాజరయ్యారు. రెండో విడతకు 12.5 లక్షల మంది హాజరయ్యే వీలుందని తెలిపింది. తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 2 లక్షల మంది ఈ పరీక్ష రాస్తారు. ఇదే రోజున సీబీఎస్ఈ పరీక్షలు కూడా ఉన్నాయి. ఒకే రోజు రెండు పరీక్షలు ఎలా రాస్తారని విద్యార్థుల నుంచి అభ్యంతరాలు వచ్చాయి. అయినా ఎన్‌టీఏ పరీక్ష తేదీలను మార్చలేదు. పరీక్షకు ఒక్క నిమిషం ఆలస్యమైనా అను మతించేది లేదని స్పష్టంచేసింది. ఇన్‌స్ట్రుమెంట్స్, జామెట్రీ బాక్సులు, పెన్సిల్ బాక్సులు, హ్యాండ్ బ్యాగ్స్, పర్సులు, ఎలాంటి పేపర్లను అనుమతించబోమని తెలిపింది. ఫుడ్, వాటర్ బాటిల్స్, మొబైల్ ఫోన్లు, ఇయర్ ఫోన్లు, మైక్రో ఫోన్లు, ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువు లను పరీక్ష హాలులోకి తేవొద్దని సూచించింది.

హైదరాబాద్‌లో సింగరేణి
సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి!

రిఫరల్ ఆస్పత్రులకు చెల్లిస్తున్న బిల్లులు తగ్గించేలా నిర్ణయం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సంస్థ పరిధిలో పనిచేసే కార్మికులు, ఉద్యోగులకు అత్యాధునిక వైద్యం అందించేందుకు హైదరాబాద్‌లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి సింగరేణి యాజమాన్యం అడుగులు వేస్తోంది. సంస్థలో అన్ని కేడర్లు కలిపి 42 వేల మంది పర్మనెంట్ ఉద్యోగులు, 34 వేలమంది కాంట్రాక్ట్ కార్మికులే కాక రిటైర్డ్ సిబ్బంది 30 వేల మంది వరకు ఉన్నారు. వీరికి చికిత్స అందించేందుకు ఏరియాల వారీగా డిస్పెన్సరీలు, ఆపై రీజినల్ ఆస్పత్రులు, కొత్తగూడెంలో ప్రధాన ఆస్పత్రి ఉంది. అయితే, రీజినల్, ప్రధాన ఆస్పత్రి నుంచి ప్రైవేట్ ఆస్పత్రులకు రిఫరల్ కేసులు పెరుగుతున్నాయి. దీంతో ఏటా సుమారు రూ.150 కోట్ల వరకు బిల్లులు చెల్లించాల్సి వస్తోంది. దీంతో రీజినల్ ఆస్పత్రుల్లో సేవలు మెరుగుపరుస్తూనే హైదరాబాద్‌లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని సొంతంగా నిర్మించాలనే ప్రణాళికలు సిద్ధం చేశారు. తద్వారా సిబ్బందికి మెరుగైన వైద్యం అందడమే కాక సంస్థపై భారం తగ్గుతుందని సింగరేణి యాజమాన్యం భావిస్తోంది.

స్కూల్ యూనిఫాం.. ఇక పక్కా కొలతలు

▶ మొదటి పేజీ తరువాయి

ఫిర్యాదు వస్తే తిరిగి దాన్ని సరిచేయాలని స్పష్టం చేసింది. ప్రతి విద్యార్థి పూర్తిగా సంతృప్తి చెందితేనే స్వయం సహాయక బృందాల (ఎస్‌హెచ్‌జీ)కు బిల్లులు మంజూరు చేయాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ఈసారి ఆరు, ఏడు తరగతుల విద్యార్థులకు నిక్కర్ బదులు ఫ్యాంట్లు ఇస్తున్నట్లు కూడా ప్రభుత్వం వెల్లడించింది.

19.91 లక్షల మంది విద్యార్థులు.. రెండేసి జతలు..

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 19.91 లక్షల మంది విద్యార్థులకు ఏటా రెండు జతల యూనిఫాం అందిస్తున్నారు. ఇందుకు అయ్యే వస్త్రం కోసం ప్రభుత్వం రూ. 90 కోట్లు వెచ్చిస్తోంది. స్థానిక స్వయం సహాయక సంఘాల చేత యూనిఫాం కుట్టిస్తోంది. ఇందుకుగాను వారికి కుట్టుకూలి కింద రూ. 30 కోట్లు చెల్లించనుంది. పాఠశాలల పునఃప్రారంభం రోజే యూనిఫాంను విద్యార్థులకు అందించాల్సి ఉంది.

సాధ్యాసాధ్యాల మాటేమిటి?

ప్రభుత్వ ఆదేశాలపై స్వయం సహాయక బృందాలు అభ్యంతరం చెబుతున్నాయి. ఇలాంటి ఆదేశాలిచ్చేటప్పుడు క్షేత్ర స్థాయి పరిస్థితులనూ తెలుసుకోవాలని కోరుతున్నాయి. ప్రభుత్వం వస్త్రం సేకరించి జిల్లాలు, మండలాలకు పంపేందుకే మే ఆఖరు వరకు సమయం పడుతుందని అంటున్నాయి. ఆ తర్వాత కేవలం 15 రోజుల్లోనే యూనిఫాం కుట్టి ఇవ్వాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని టైలరింగ్ మహిళలు అంటున్నారు. అదీగాక.. ప్రతి విద్యార్థికి వస్త్రం సగటున అర మీటరే వస్తోందని.. దీనివల్ల కొందరికి సరిపోవట్లేదని చెబుతున్నారు. ప్రతి జతకు ప్రభుత్వం ఇచ్చే రూ. 75 కుట్టుకూలి కనీస వేతనంగా కూడా ఉండట్లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో స్వయం సహాయక బృందంలో కనీసం నలుగురు చొప్పున ఉండే సభ్యులు పాఠశాలల చివరి పనిదినంలోగా కొలతలు తీసుకోవడం ఎలా సాధ్యమని ప్రశ్నిస్తున్నారు. విద్యార్థులు సొంతంగా కొలతలు తీసుకొని పంపిస్తే తమకు తేలికగా ఉంటుందని చెబుతున్నారు.



టెన్షన్ పెడితే ఎలా?

ప్రభుత్వం ఇచ్చే కుట్టుకూలీ కనీసం ట్రాన్స్‌పోర్టు ఖర్చులకు కూడా సరిపోవడం లేదు. వస్త్రం సగటున ప్రతీ విద్యార్థికి 50 సెంటీమీటర్లే వస్తుంది. అదీగాక 15 రోజుల్లో కుట్టి ఇవ్వమని ఒత్తిడి చేస్తున్నారు. మా పరిస్థితినీ ప్రభుత్వం ఆలోచించాలి. టెన్షన్ పెడితే ఎలా? ప్రతీ స్కూల్‌కు వెళ్లి కొలతలు తీసుకొని, యూనిఫాం అందించాలంటే 45 రోజులు పడుతుంది. అంత సమయం ఎక్కడిస్తున్నారు. కొలతలు వాళ్ళే తీసి ఇవ్వాలి. అప్పుడే సమయం కలిసి వస్తుంది.


– ఎ. మాధవీగౌడ్ (టైలర్, కరీంనగర్)



ఎక్కువ మంది టైలర్లను తీసుకుంటే సమస్యకు పరిష్కారం

ప్రతి విద్యార్థికి కచ్చితమైన కొలతలతో యూనిఫాం అందించాలనే నిర్ణయం సరైందే. సరిగా కుట్టలేదని విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. అయితే టైలర్ల విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. కుట్టడానికి ఎక్కువ మందిని పెడితే సమస్య పరిష్కారం అవుతుంది.

– పరాంకుశం రాజాభాను చంద్రప్రకాశ్ (ప్రభుత్వ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం పూర్వ అధ్యక్షుడు)



సత్యం అనే సరస్సు మురికిగా ఉన్నప్పుడు కాదు.
అది లోతు తక్కువగా ఉన్నప్పుడు జ్ఞాన పిపాసి
ఆ నీటిలోకి అడుగు పెట్టటానికి ఇష్టపడడు.
– ఫ్రెడరిక్ నీషే

సాక్షి
మంగళవారం, 1 ఏప్రిల్ 2025

దుష్టసంస్కృతిపై కొరడా!

'భావప్రకటన స్వేచ్ఛను అణచివేయడం ఒకటి కాదు... రెండు తప్పులతో సమానం. ఎందుకంటే అది చెప్పేవారి హక్కుతోపాటు వినేవారి హక్కునూ ఉల్లంఘిస్తుంది' అంటాడు అమెరికా సంఘ సంస్కర్త, పౌరహక్కుల నేత ఫ్రెడరిక్ డగ్లస్. ఈ రెండింతల తప్పు చేయటం మన ప్రభుత్వాలు దిన చర్యగా మార్చుకున్నాయి. ఈ నేపథ్యంలో పౌరుల భావప్రకటన స్వేచ్ఛ అత్యంత కీలక మైనదని, వ్యక్తులు లేదా వ్యక్తుల సమూహం తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేయటం నాగరిక సమాజంలో అంతర్భాగమని సుప్రీంకోర్టు ధర్మాసనం మొన్న శుక్రవారం తేల్చిచెప్పింది. 'ఆ అభిప్రాయాలతో లేదా ఆలోచనలతో విభేదించవచ్చు. ఆ అభిప్రాయాలకు భిన్నంగా మరో అభిప్రాయాన్ని ప్రకటించటం ద్వారా దాన్ని ఎదుర్కొనాలి తప్ప అణిచేస్తామనటం రాజ్యాంగాన్ని ఉల్లంఘించటమే అవుతుంది' అని తెలియజేసింది. ఇన్‌స్టాలో, ఎక్స్‌లో గుజరాత్ కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్‌గఢీ పెట్టిన కవిత వల్ల సమాజంలో విద్వేషాలు రగులుతాయని ఆరోపిస్తూ అక్కడి పోలీసులు కేసుపెట్టారు. దీన్ని తప్పుబడుతూ, కేసును కొట్టివేస్తూ ఇచ్చిన ఈ తీర్పు అనేక విధాల ఎన్నదగినది. రాజ్యాంగ విలువల పట్లా, పౌరుల హక్కులపట్లా వీసమెత్తు గౌరవం లేని అనైతిక పాలకులు ఇష్టారాజ్యంగా రాజకీయ ప్రత్యర్థులపై తప్పుడు కేసులు పెట్టడం ఈమధ్య బాగా ముదిరింది. పాలకులు చెప్పిందే తడవుగా తప్పుడు కేసులు పెట్టే పోలీసులు కొందరైతే... వారి మెప్పు కోసం అనవసర ఉత్సాహాన్ని ప్రదర్శించే బాపతు మరికొందరు. ఆంధ్రప్రదేశ్ మొదలుకొని ఎక్కడ చూసినా ఇలాంటివారి హవా నడుస్తోంది. రాజ్యాంగాన్ని బేఖాతరు చేయటమంటే... దాని ప్రసక్తి లేకుండా పాలించాలనుకోవటమంటే హక్కులు లేని అధికారాన్ని చలాయించాలని చూడటమే.

గుజరాత్ పోలీసులకు అభ్యంతరకరంగా అనిపించిన కవిత చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. అందులో ఒక మతాన్ని, వ్యవస్థనూ లేదా వ్యక్తిని కించపరిచింది లేదు. దేశద్రోహం పోకడలు రవ్వంతయినా లేవు. 'ఓ రక్త పిపాసులారా వినండి...' అంటూ మొదలయ్యే ఆ కవితలో అలాంటివారికి ప్రేమను పంచుతామన్న సందేశమే ఉంటుంది. అన్యాయానికి ఒడిగట్టినా దాన్ని న్యాయంతోనే ఎదుర్కొంటామంటుంది. ఇందులో పోలీసులకు ఏది అభ్యంతరమనిపించిందో గానీ... వెనకా ముందూ చూడకుండా కేసు పెట్టారు. విచారణ సందర్భంలో గుజరాత్ ప్రభుత్వం తరఫున వాదించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా 'ఒక్కొక్కరు దీన్ని ఒక్కోవిధంగా విశ్లేషించుకుంటారు' అని పోలీసులను సమర్థిస్తుండగా సృజనాత్మకతను గౌరవించే సంస్కృతి లేకపోవటాన్ని ధర్మాసనం ఎత్తిచూపింది. ఇటీవల ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సైతం దాదాపు ఇదే స్వరంతో పోలీసులను తప్పుబట్టింది. రహదారుల బాగుకు నిధుల కోసం ఊరూరా టోల్‌గేట్లు పెడతామని ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ప్రకటనపై వ్యంగ్యంగా, ప్రతీకాత్మకంగా రూపకం తయారుచేయడాన్ని నేరంగా పరిగణిస్తూ కేసు పెట్టడాన్ని నిలదీసింది. అవసరాన్నిబట్టి కేసులు పెట్టడం కాక, ఏదో ఒక కేసు పెట్టాలి, ఎవరో ఒకర్ని అరెస్టు చేయాలని చూడటం సరికాదని హెచ్చరించింది. ఇదొక్కటే కాదు... ఇలాంటి కేసులు కూటమి ప్రభుత్వం లెక్కకు మిక్కిలి బనాయిస్తోంది. ఈమధ్యకాలంలో వైఎస్సార్ కాంగ్రెస్ నాయకులనూ, కార్యకర్తలనూ అరెస్టు చేయని రోజంటూ లేదు. ఎప్పుడో మూడు నాలుగేళ్లక్రితం సామాజిక మాధ్యమాల్లో పెట్టిన ఏదో పోస్టు కారణంగా ఇప్పుడు మనోవ్యాధి పట్టుకుందని కూటమిలోని మూడు పార్టీల నాయకులూ పోలీస్‌స్టేషన్లకు పోతున్నారు.

అధికారంలో ఊరేగుతున్నవాళ్లు ఫిర్యాదు చేసినంతమాత్రాన కేసులు పెట్టడం సబబా అన్న విచక్షణ కూడా పోలీసులకు ఉండటం లేదు. అధికారపక్షం కేసులు పెట్టడంలోని ఉద్దేశం, దాన్నుంచి ఆశిస్తున్న ప్రయోజనం వారికి తెలియందేమీ కాదు. అయినా ఈ నాటకం యథావిధిగా సాగిపోతోంది. అసమ్మతి గొంతు నొక్కడానికి నిరంతరం ప్రయత్నిస్తూనేవున్నారు. 'ఒక చిన్న కవిత వల్లనో, ఒక స్టాండప్ కామెడీ వల్లనో సమాజంలో భిన్న వర్గాల మధ్య విద్వేషాలు రగులుతాయని ఎలా అనుకుంటున్నారు...మన రాజ్యాంగ మౌలిక సిద్ధాంతాలు అంత బలహీనమైనవనుకుంటున్నారా?' అని సుప్రీంకోర్టు ధర్మాసనం గుజరాత్ ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించింది. ఇదే మాదిరి సంస్కృతిని అమలు చేస్తున్న అన్ని ప్రభుత్వాలకూ ఈ ప్రశ్న చెంపపెట్టు. నిరంతరం అభద్రతాభావంతో బతికీడ్చే వ్యక్తులనూ లేదా విమర్శ వల్ల తమ అధికారానికీ, పదవికీ ముప్పుకలుగుతుందనుకునే వారినీ ప్రమాణంగా తీసుకుని దేనిపైనా నిర్ణయానికి రావొద్దని ధర్మాసనం పోలీసులకు హితవు చెప్పింది.

కింది స్థాయి కోర్టులు సక్రమంగా వ్యవహరించలేదని గమనించినప్పుడు దాన్ని సరిదిద్దాల్సిన హైకోర్టులు సైతం అదే బాటలో పోతుండటాన్ని సుప్రీంకోర్టు తప్పుబట్టింది. రాజ్యాంగ ఆదర్శాలను ప్రభుత్వాలు అణిచివేయకుండా చూడటం రాజ్యాంగ న్యాయస్థానాలుగా హైకోర్టులతోపాటు సుప్రీంకోర్టు కర్తవ్యం. కానీ ఇమ్రాన్ ప్రతాప్‌గఢీ కేసులో గుజరాత్ హైకోర్టు ఆ విషయంలో పూర్తిగా విఫలమైందన్నది సుప్రీం అభిప్రాయం. ఈమాదిరి కేసుల విషయంలో పోలీసులు ఎలా వ్యవహరించాలో ఈ సందర్భంగా ధర్మాసనం సూచించింది. ఫిర్యాదు అందిందే తడవుగా ఎఫ్ఐఆర్ నమోదు చేయటం కాక, ముందు పోలీసు అధికారి ప్రాథమిక విచారణ జరపాలని ఆదేశించింది. సరైందనుకుంటేనే కేసు నమోదు చేయాలని, లేనిపక్షంలో ఫిర్యాదీదారుకు ఆ సంగతి చెప్పాలని తెలిపింది. సుప్రీంకోర్టు తాజా తీర్పయినా అకారణంగా, అన్యాయంగా కేసులు బనాయించే పాలకుల దుష్ట సంస్కృతికి కళ్లెం వేయగలిగితే ప్రజాస్వామ్యం సురక్షితంగా మనుగడ సాగించగలుగుతుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** శు.తదియ ఉ.9.54 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** భరణి ప.3.24 వరకు, తదుపరి కృత్తిక, **వర్జ్యం:** రా.2.37 నుండి 4.07 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.24 నుండి 9.13 వరకు, తదుపరి రా.10.52 నుండి 11.39 వరకు, **అమృతఘడియలు:** ఉ.10.55 నుండి 12.24 వరకు.

సూర్యోదయం : 6.00
సూర్యాస్తమయం: 6.09
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

వైఫల్యాల వెనుక వ్యవస్థ లోపాలు!

కామెంట్



కరణ్ థాపర్

జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో పెద్ద మొత్తంలో అక్రమ నగదు కనిపించినట్లు గత వారం 'టైమ్స్ ఆఫ్ ఇండియా' బయట పెట్టింది. అంతకు మునుపు, జస్టిస్ శేఖర్ యాదవ్ న్యాయవ్యవస్థ గౌరవప్రతిష్ఠలకు భంగం కలిగిస్తూ మాట్లాడారు. భారతదేశం మెజారిటీ ప్రజల ఆకాంక్షల మేరకు పని చేస్తోందని జస్టిస్ శేఖర్ యాదవ్ గత డిసెంబరులో ఒక ప్రైవేటు కార్యక్రమంలో అనడం వివాదాస్పదమయింది. అప్పుడు ఆయనపై సరైన చర్యలు తీసుకోలేదు. ఇప్పుడీ రెండో కేసులో అంతటా నిరసన పెల్లుబుకటంతో ఆలస్యంగా చర్యలు ప్రారంభమయ్యాయి. ఇక్కడ ఒక కీలకమైన ప్రశ్న ఉత్పన్నమవుతోంది. న్యాయవ్యవస్థ స్పందనలు అర్థవంతంగా, బాధ్యతాయుతంగా ఉంటున్నాయా? లేవని సమాధానం చెప్పుకునేటట్లయితే, జ్యుడీషియరీ జవాబుదారీతనం కోసం పనిచేయాల్సిన అంతర్గత విచారణ యంత్రాంగం ఏం చేస్తున్నట్లు? ఇక న్యాయమూర్తుల ఎంపిక విధానం ఈ పరిస్థితికి దారి తీసిన రెండో సమస్య. హైకోర్టు స్థాయిలో జరిగే నియామకాల తీరు మరీ ఆందోళన కలిగిస్తోంది.

న్యాయవ్యవస్థ జవాబుదారీతనాన్ని కాపాడవలసిన అంతర్గత యంత్రాంగం (ఇన్–హౌస్ మెకానిజం) గుణదోషాల్ని జస్టిస్ అజిత్ ప్రకాష్ షా 'రోసలిండ్ విల్సన్ స్మారక ఉపన్యాసం'లో తీవ్రాతి తీవ్రంగా విమర్శించారు. ఇది 2019 నాటిదైనా నేటి సందర్భానికి అతికినట్లు సరిపోతుంది.

మొట్టమొదటగా అంతర్గత వ్యవస్థ స్వభావం మీద ఆయన అస్త్రం ఎక్కుపెట్టారు. అది అనుసరించే పద్ధతులు ఎప్పటికప్పుడు తాత్కాలికంగా, ఇష్టాగోష్ఠిలా ఉంటాయి. ''ఈ ప్రొసీజర్‌కు ఎలాంటి చట్టబద్ధ ప్రాతిపదిక లేదు''. '' న్యాయ వ్యవస్థ లోపల దానికి ఉన్న మన్నన పరిమితం''. ''ఇందుకు నిదర్శనం – కమిటీ నివేదిక వ్యతిరేకంగా వచ్చిందని చెప్పి రాజీనామాకు సిద్ధపడిన న్యాయమూర్తి ఒక్కరంటే ఒక్కరూ లేకపోవటం...'' అని ఆయన అంటారు.

''న్యాయవ్యవస్థ దానికదే ఒక చట్టం, ఒక ప్రపంచం'' అన్నట్లు అంతర్గత యంత్రాంగం పరిగణిస్తుందని జస్టిస్ షా మరీ ముఖ్యంగా ప్రస్తావించారు. వారిని వారే నియమించుకుంటారు. తమ ప్రవర్తనను నియంత్రించే విధివిధానాలను వారే అంతర్గతంగా రూపొందించుకుంటారు. ఇది ''ఒక తరహా స్వీయపాలన'' అంటూ, ''ఎలాగైతే ఉండాలో కచ్చితంగా అందుకు భిన్నంగా ఉంది..'' అని విమర్శించారు.

అంతర్గత యంత్రాంగం వాస్తవ పనితీరు ఎలా ఉంటుందో తెలిపేందుకు పలు విమర్శలు ఉన్నాయి. న్యాయమూర్తుల నడత గురించి బహిరంగంగా చెప్పుకున్న సందర్భాలు చాలానే ఉన్నా, వారిపై ఇన్–హౌస్ విచారణలు ఏనాడూ జరగలేదు. అలాగే, జడ్జీల మీద నిర్దిష్ట ఆరోపణలు చేసిన కేసుల్లోనూ అంతర్గత విచారణకు ఆదేశాలు లేవు.



చిక్కుల్లో జస్టిస్ యశ్వంత్ వర్మ (ఫైల్ ఫొటో)

◆ న్యాయవ్యవస్థ జవాబుదారీతనాన్ని కాపాడవలసిన అంతర్గత యంత్రాంగం (ఇన్–హౌస్ మెకానిజం) గుణదోషాల్ని జస్టిస్ అజిత్ ప్రకాష్ షా 'రోసలిండ్ విల్సన్ స్మారక ఉపన్యాసం'లో తీవ్రాతితీవ్రంగా విమర్శించారు. ఇది 2019 నాటిదైనా నేటి సందర్భానికి అతికినట్లు సరిపోతుంది.

◆ న్యాయమూర్తుల నడత, ప్రవర్తన గురించి మాట్లాడుకుంటున్నప్పుడు వారి ఎంపిక విధానం గురించిన ప్రశ్న తలెత్తక మానదు. కొలీజియం వ్యవస్థ పరిపూర్ణంగా పని చేసే పరిస్థితి లేదనే చెప్పాలి. మనకు వేరొక విధానం కావాలి. దాని కంటే ముందు, ప్రస్తుత కొలీజియం వ్యవస్థ ఎక్కడ విఫలమైందో చూడాలి.

◆ అంతర్గత యంత్రాంగం, నియామక విధానం.. ఏమాత్రం అలక్ష్యం చేయదగినవి కావు. ఈ అలక్ష్యం మన న్యాయ వ్యవస్థను, ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తుంది. వాస్తవానికి వీటికి దేనికదిగా కాకుండా, రెంటికీ కలిపి పరిష్కారం ఆలోచించాలి. పాలక, న్యాయ వ్యవస్థల పరస్పర సహకారంతోనే ఇది సాధ్యమవుతుంది.

న్యాయవ్యవస్థ జవాబుదారీతనం కోసం తటస్థమైన, అధికారికమైన, చట్టబద్ధ యంత్రాంగం ఒకటి ఎందుకు ఉండాలో జస్టిస్ షా తీవ్ర పదజాలంతో వివరించారు. ''న్యాయపీఠం మీద కూర్చున్న క్షణం నుంచీ వారి ప్రవర్తన ఎలా ఉండాలో నిర్దేశించే నైతిక వర్తన నియమావళి న్యాయమూర్తులకు మనసుల్లో పాతుకుపోయి ఉండాలి. కాని అలా ఉండదు. కచ్చితంగా చెప్పాలంటే, వారు తమ ముందుండే లాయర్లు, వాదులు, ప్రతివాదులు, నేరస్థులు, సాక్షులు, పోలీసుల మాదిరిగానే ఫక్తు సాధారణ మానవులు. వారు నిర్వహించే పదవుల స్వభావాన్ని బట్టి వారికి నైతికతను ఆపాదిస్తే అది మోసం, ప్రమాదకరం...'' అన్నారు.

న్యాయమూర్తుల నడత, ప్రవర్తన గురించి మాట్లాడుకుంటున్నాం కాబట్టి, వారి ఎంపిక విధానం గురించిన ప్రశ్న తలెత్తక మానదు. కొలీజియం వ్యవస్థ పరిపూర్ణంగా పనిచేయడం లేదనడంలో సందేహం లేదు. మనకు వేరొక విధానం కావాలి. దాని గురించి మాట్లాడుకునే ముందు, ప్రస్తుత కొలీజియం వ్యవస్థ ఎక్కడ విఫలమైందో చూద్దాం.

జస్టిస్ షాతో నేను ఈ విషయం మాట్లాడినప్పుడు, ఆయన పలు అంశాలు చెప్పారు. మొదటిది – జడ్జీలను ఎంపిక చేయడానికి ఇవీ అంటూ చెప్పగలిగిన ఆమోదిత ప్రమాణాలేవీ లేవు. అంతా ''అడ్ హాక్''గా ఉన్నట్లు ఉంటుంది. నోటిమాట చెల్లుబాటు అవుతుంది. తరచూ ఇష్టులకే పెద్దపీట వేస్తారు.

ఎంపికల్లో అత్యుత్తములను నిర్లక్ష్యం చేయడం కూడా పరిపాటి. ఇది మరీ ఆందోళనకరం. కొట్టొచ్చినట్లు కనబడే రెండు ఉదాహరణలు జస్టిస్ షా చెప్పారు. జస్టిస్ అకిల్ ఖురేషీ, జస్టిస్ మురళీధర్‌లు సుప్రీం కోర్టులో స్థానం పొందలేకపోయారని, సుప్రీంలో ప్రవేశించడానికి వారు పూర్తిగా అర్హులని ఆయన విశ్వసిస్తారు.

ఎంపిక ప్రక్రియ నుంచి ప్రభుత్వాన్ని దూరం పెట్టడానికి కొలీజియం వ్యవస్థ రూపొందింది. అయినప్పటికీ ప్రభుత్వం తాను చేయగలిగినంతా చేయగలదు. పార్లమెంటులో మంచి మెజారిటీ ఉన్న ప్రభుత్వం కొలీజియం సిఫారసులను తొక్కిపట్టగలదు. అంటే ఏదైతే జరగకూడదన్న భావనతో కొలీజియం ఏర్పడిందో దొడ్డిదారిన అదే జరుగుతోంది.

ఏమైనప్పటికీ, హైకోర్టు జడ్జీల నియామక స్థాయిలో కొలీజియం వ్యవస్థ అత్యంత బలహీనమైనదని భావించాలి. ఇది ఆందోళనకర పరిస్థితి. ఎందుకంటే, సుప్రీంకోర్టులో బహుశా 95 శాతం మంది న్యాయమూర్తులు హైకోర్టు జ్యుడీషియరీ నుంచే ఎంపిక అవుతారు. హైకోర్టు జడ్జీల నియామకాలు లోపభూయిష్ఠంగా ఉన్నప్పుడు ఆ ప్రభావం సుప్రీం కోర్టు మీదా పడుతుంది.

చివరగా, మనం చర్చించిన రెండు సమస్యలూ... అంతర్గత యంత్రాంగం, నియామక విధానం... ఏమాత్రం అలక్ష్యం చేయదగినవి కావు. ఈ అలక్ష్యం మన న్యాయవ్యవస్థను, ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తుంది. వాస్తవానికి వీటికి దేనికదిగా కాకుండా, రెంటికీ కలిపి పరిష్కారం ఆలోచించాలి. పాలక, న్యాయ వ్యవస్థల పరస్పర సహకారంతోనే ఇది సాధ్యమవుతుంది. మరి ఇందుకు అవి సిద్ధంగా ఉన్నాయా?

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

అప్పుడిక తప్పదు



ఉక్రెయిన్‌లో రక్తపాతాన్ని ఆపటానికి రష్యా, నేను ఒక ఒప్పందాన్ని కుదుర్చుకోలేకపోతే ; అది రష్యా తప్పు అని నేను భావిస్తే, అప్పుడు నేను రష్యా నుంచి బయటికి వచ్చే చమురుపై 'సెకండరీ' ట్యారిఫ్ విధిస్తాను. (సెకండరీ ట్యారిఫ్ అంటే... అమెరికా ఆంక్షలు ఉన్న దేశాలకు రష్యా సరఫరా చేసే చమురుపై అదనంగా సుంకాలను విధించటం).

– డొనాల్డ్ ట్రంప్, అమెరికా అధ్యక్షుడు

పోటీతత్వమే ప్రధానం



ట్యారిఫ్‌ల గురించి అదే పనిగా ఆలోచించి ఆందోళన చెందటం తగిన పని కాదని నేను అనుకుంటున్నాను. మనం దృష్టి పెట్టవలసింది పోటీతత్వం మీద! ఈ ట్యారిఫ్ మైండ్‌సెట్ నుంచి ప్రతి ఒక్కరూ బయట పడాలని నేను భావిస్తున్నాను.

– జెంషీద్ గోద్రెజ్, 'గోద్రెజ్ అండ్ బోయిస్' ఛైర్మన్, ఎండీ

వ్యూహం తప్పినట్లే..!



అన్నామలైని తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడి స్థానం నుంచి మార్చేస్తారని ప్రచారం జరుగుతోంది! అదే నిజం అయితే బీజేపీకి అది ఆత్మహత్యా సదృశమే. యువకుడు, ధైర్యవంతుడు, సాహసోపేతమైన రాజకీయ వ్యక్తిత్వం కలిగిన అన్నామలైతో మోదీ తనను తాను పోల్చుకున్న సంగతిని పార్టీ వ్యూహకర్తలు మర్చిపోకూడదు.

– డాక్టర్ ప్రవీణ్ కుమార్, పొలిటికల్ ఎనలిస్ట్

జెండా ఎగరేస్తాం



స్థావరాలలో (సెటిల్‌మెంట్స్) సాధారణ పరిస్థితులను నెలకొల్పేందుకు, పాలనాధికారాల రూపకల్పనకు మేము మా ప్రయత్నాలను కొనసాగిస్తూనే ఉంటాము. దాగి ఉండి, క్షమాపణలు చెప్పటానికి బదులుగా మేము జెండాను ఎగరేస్తాం. నిర్మాణాలు చేపడతాం. స్థావరాలను ఏర్పాటు చేస్తాం. (వెస్ట్ బ్యాంక్‌లోని 13 యూదు స్థావరాలను వాటి పొరుగు సమాజాల నుండి వేరు చేయాలనే ఇజ్రాయెల్ నిర్ణయం పై).

– బెజాలెల్ స్మోట్రిక్, ఇజ్రాయెల్ ఆర్థిక మంత్రి

ఆహ్వాన వాణిజ్యం



అస్థిరత, అనిశ్చితి పెరుగుతున్న నేటి విచ్ఛిన్న ప్రపంచంలో నష్టాలను నివారించటానికి, సవాళ్లను ఎదుర్కోవటానికి దేశాలు తమ మార్కెట్‌లలో, పరిశ్రమలలో స్వేచ్ఛా వాణిజ్యానికి ద్వారాలు తెరవటం ఎంతో అవసరం.

– లీ చియాంగ్, చైనా ప్రధాని

మారితేనే ముందుకు!



నేటి యుద్ధక్షేత్రంలో మనుగడ సాగించటం అంటే అత్యుత్తమంగా ఉండటం మాత్రమే కాదు. మార్పునకు సిద్ధంగా ఉండటం, ఎప్పటికప్పుడు పుట్టుకొస్తున్న కొత్త అవకాశాలను చేజిక్కించుకుంటూ ముందుకు సాగిపోవటం కూడా!

– జనరల్ అనిల్ చౌహాన్, ఛీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్

సాధించి తీరుతాం!



2030 నాటికి సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్న 500 గిగా వాట్‌ల శిలాజేతర ఆధారిత ఇంధన ఉత్పత్తి సామర్థ్యానికి మనం చేరుకోగలమని నేను గట్టిగా విశ్వసిస్తున్నాను. ఇప్పటికే మనం రూ. 32 లక్షల కోట్ల పెట్టుబడులకు హామీలు పొందగలిగాం. ఇది సాకారం అవుతుందని నాకు పూర్తి నమ్మకం ఉంది.

– ప్రహ్లాద్ జోషీ, పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

ఇన్ బాక్స్

ఆస్పత్రులపై నియంత్రణేదీ?

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల తీరు రోజురోజుకీ ఆందోళనకరంగా మారుతోంది. అధిక ఫీజులు, నకిలీ డాక్టర్లు, అనుమతులు లేని ఆస్పత్రులు – ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెడుతూ వ్యాపార లాభాలను కాపాడుకోవడమే ధ్యేయంగా సాగుతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో, ముఖ్యంగా హైదరాబాద్ జిల్లాలో, 2,367 ప్రైవేట్ ఆస్పత్రులు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లు, నర్సింగ్ హోమ్‌లు ఉన్నాయని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వీటిలో 276 ఆస్పత్రులు ప్రభుత్వ అనుమతులు లేకుండా నడుస్తున్నాయంటే, పరిస్థితి తీవ్రత ఎంతగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ అనుమతులు లేని ఆస్పత్రుల్లో అనుభవం లేని వైద్యులు చికిత్సలు చేస్తూ రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఇటీవల రోగులు మృత్యువాత పడుతున్న ఘటనలు అధికంగా నమోదవుతున్నాయి. ఇటీవల (మార్చి 29న) గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఒక ఆస్పత్రిని సీజ్ చేయడం, ఐదుగురు నకిలీ డాక్టర్లపై కేసులు నమోదు చేయడం ఈ సమస్య లోతును సూచిస్తోంది. ఏపీ నుంచే కాక ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి కూడా హైదరాబాదుకు వైద్యం కోసం ఎందరో వస్తూ ఉండటం ఈ సందర్భంగా గమనార్హం.

ప్రజల ఆరోగ్యం వ్యాపార సరుకుగా మారిన ఈ పరిస్థితిలో, ప్రభుత్వ ఆస్పత్రుల దుఃస్థితి మరింత ఆందోళన కలిగిస్తోంది. ఉస్మానియా, గాంధీ వంటి ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగుల రద్దీకి తగ్గట్లు బెడ్‌లు, సిబ్బంది లేకపోవడంతో సేవలు అందించడం సవాల్‌గా మారింది. దీనికితోడు, వైద్య పరీక్షల కోసం ప్రైవేట్ ల్యాబ్‌లకు రిఫర్ చేయడంతో పేద, మధ్యతరగతి రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఈ సమస్యలకు పరిష్కారం కోసం తెలంగాణ ఎమ్మెల్సీ కోదండరాం ప్రైవేట్ ఆస్పత్రుల ఫీజులపై ప్రభుత్వ నియంత్రణ, దానికోసం సమర్థవంతమైన కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. ఇది స్వాగతించదగిన ప్రతిపాదన. అయితే, ఈ చర్యలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా, నిరంతర పర్యవేక్షణ, కఠిన చర్యలతో అమలు జరగాలి.

– ముద్దం నరసింహ స్వామి, సీనియర్ జర్నలిస్ట్

సన్న బువ్వ సంబురం!

సందర్భం



డా॥ కొనగాల మహేష్

ఉగాది పండగ పూట, పేదల ఆకలి తీర్చాలని ఉచిత సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం పేదల పక్షపాతి అని మరోసారి రుజువు చేసుకుంది. పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో హుజూర్ నగర్ నుండి ప్రజా పంపిణీ విధానంలో ఇకనుండి పేద ప్రజలందరికీ 6 కిలోల చొప్పున సన్న బియ్యం అందించే చరిత్రాత్మక పథకానికి స్వీకారం చుట్టింది ప్రభుత్వం. తెలంగాణ మొత్తం జనాభాలో 3.10 కోట్ల (84%) మంది ప్రజలకు, శ్రీమంతులు తినే సన్నబియ్యాన్ని ఉచితంగా రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేయాలనే సంకల్పానికి యావత్ తెలంగాణ హర్షం వ్యక్తం చేస్తోంది. ఉమ్మడి రాష్ట్రంలో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం కోట్ల విజయభాస్కర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పేదలకు రూ. 1.90 లకు కిలో బియ్యం పథకాన్ని ప్రారంభిస్తే, తెలంగాణ ఏర్పాటైన 11 ఏళ్లకు రేవంత్ రెడ్డి సీఎంగా మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే పేదలకు సన్నబియ్యం అందించే బృహత్తర కార్యక్రమం అమలు చేస్తోంది.

గతంలో దొడ్డు – నాసిరకం బియ్యం పంపిణీ చేయడంతో పేదవాడి ఆకలి తీర్చాలనే ప్రజా పంపిణీ వ్యవస్థ లక్ష్యం నీరుగారింది. నెలకు రూ. 10,600 కోట్లు ఈ బియ్యం పంపిణీపై ఖర్చు చేసినా ఫలితం పేదలకు అందలేదు. రైసు మిల్లర్లకు, దళారులకు, అవినీతి పరులకు మంచి ఆదాయ వనరుగా రేషన్ బియ్యం మారిపోయాయి. రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి, తిరిగి ప్రభుత్వానికి లాభకరమైన ధరకు అమ్మి మిల్లర్లు గత ప్రభుత్వ కాలంలో దోపిడీకి పాల్పడినట్లు ఆధారాలు బయటపడ్డాయి.

ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే, కేసీఆర్ 10ఏళ్ల పాలనలో నిర్లక్ష్యానికి గురైన ప్రజా



పంపిణీ వ్యవస్థను ప్రక్షాళన చేయాలని సంకల్పించింది. వెంటనే అందుకు సంబంధించిన కార్యాచరణ మొదలుపెట్టింది. రాష్ట్రంలో సన్న వడ్ల సాగును ప్రోత్సహించి, సన్న వాటిని సాగు చేసిన రైతులకు క్వింటాలుకు రూ. 500 చొప్పున బోనస్‌గా అందించింది. తద్వారా, సన్న బియ్యాన్ని సమీకరించి తెలుగువారి నూతన సంవత్సరం (ఉగాది పండుగ) పర్వదినాన అశేష ప్రజానీకం సాక్షిగా తెలంగాణ ప్రజలందరికీ సన్న బియ్యం అందించే బృహత్తర కార్యక్రమాన్ని మొదలుపెట్టినం. ఇప్పుడున్న 90.42 లక్షల రేషన్ కార్డులకు అదనంగా పది లక్షల రేషన్ కార్డులు కొత్తగా జారీ చేస్తూ లబ్ధిదారులందరికీ సన్న బియ్యం అందేలా పక్కా ప్రణాళికను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుంది.

ఈ మంచి పని చేస్తే మమ్మల్ని అభినందించాల్సింది పోయి, బీజేపీ కోడిగుడ్డు మీద ఈకలు పీకే రాజకీయం మొదలుపెట్టింది. పండుగ రోజు కూడా పచ్చి అబద్ధాలతో బీజేపీకి చెందిన కేంద్ర మంత్రి ఒకరు ఈ ప్రజా ప్రభుత్వాన్ని విమర్శించారు. రేషన్ షాపులలో మోదీ ఫోటో పెట్టాలని ఆయన వితండవాదం చేస్తున్నారు. బీజేపీ భాగస్వామిగా ఉన్న పక్క రాష్ట్రంలోనూ కేవలం ముఖ్యమంత్రి ఫొటో మాత్రమే ఉంది కాని ప్రధాని మోదీది లేదనే విషయం తెలియనిది కాదు. మరి తెలంగాణలో మోదీ ఫోటో ఎందుకు పెట్టాలో వారే చెప్పాలి. కాంగ్రెస్ తన పథకాల ద్వారా ప్రజలకు మరింత చేరువ అయితే తమ పార్టీని ప్రజలు దూరంగా పెడతారని బీజేపీవారు భావించడం వల్లనే ఇటువంటి అర్థం పర్థం లేని డిమాండ్లతో ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు.

ఎవరు ఎన్ని విమర్శలు చేసినా తెలంగాణలో ఉన్న ప్రతి పేద ఇంటికీ నెల నెలా సన్నబియ్యం అందించే యజ్ఞానికి సబ్బండ వర్గాలు సహకరిస్తాయి. ప్రతిపక్షాల అబద్ధపు ప్రచారాలను ప్రజలే తిప్పికొడతారు. సమాజంలోని మేధావులు, కవులు, కళాకారులు ప్రజా సంక్షేమం కొరకు చిత్తశుద్ధితో అడుగులు వేస్తున్న ఈ ప్రజా ప్రభుత్వానికి సహకరిస్తూ అండగా నిలబడాలని కోరుతున్నాం.

వ్యాసకర్త కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి । 98667 76999

మనిషిని మార్చే సాన్నిధ్యం

వర్ధమాన మహావీరుని కాలంలోనే మక్కలి గోశాల్, అజిత్ కేశకంబల్, సంజయ్ విలేతిపుత్ర అనే ప్రముఖులూ ఉండేవారు. వారంతా మహామేధావులు, పండితులు, చక్కటి సంభాషణా చతురత గలవారు. ఒక్కొక్కరికీ వేలమంది శిష్యులుండేవారు. వారు వారి గురువులను 'తీర్థంకరుడు' అనే గౌరవానికి అర్హులుగానే భావించేవారు. కానీ మహావీరుడు 'తీర్థంకరుడై' వేల ఏండ్లుగా జనంచే పూజింపబడుతున్నాడు. కానీ వారేమో చక్కటి వాగ్ధాటి, పాండిత్యం ఉన్న వారైనా కనుమరుగై కాలగర్భంలో కలిసి పోయారు.



జ్యోతిర్మయం

ఎక్కువ కాలం మౌనంగా ఉండి, ఎపుడో నాలుగు మాటలు చెప్పిన మహావీరుడు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాడు. కారణం ఏమై ఉంటుంది? మహావీరుని జ్ఞానం స్వానుభవంతో వచ్చినది, ఇతరులది కేవలం శాస్త్ర పాండిత్యం. అంతరంగంలోని కరుణ నుండి వెలువడిన వాక్కులు మహావీరునివి! వారివేమో మెదడు నుండి బయల్పడినవి. మహావీరుని మాట కాదు... ఆయన ఉనికే చుట్టూ వున్న వారిపై గణనీయమైన ప్రభావం చూపి వారిలో సమూల మార్పు తెచ్చేది.

ఆనాడు దొంగతనం చేసి కుటుంబ పోషణ చేసే ఒక గజదొంగ తన అంత్యదశలో తన కుమారుడికి ఇచ్చిన సలహా: 'నీవు ఎట్టి పరిస్థితుల్లోనూ మహావీరుడున్న ప్రాంతానికి వెళ్ళవద్దు. ఈ ఊరికి ఆయన వచ్చాడని తెలిస్తే వెంటనే నీవు పొరుగూరికి పారిపో. పొరబాటున కూడా ఆయన చెప్పే ఒక్క మాట కూడా నీ చెవిలో పడకుండా జాగ్రత్త పడు. ఒక్క మాట విన్నా నీవు మన వృత్తిని కొనసాగించలేవు, కుటుంబ పోషణ చేయలేవు జాగ్రత్త.' దీన్ని బట్టి మహావీరుని మాట ఎంతటి ప్రభావం చూపగలదో అర్థం చేసుకోవచ్చు. (27–35 పుటలు: హిడెన్ మిస్టరీస్–ఓషో) పుణ్య పురుషుల సాన్నిధ్యంలో క్రూరమృగాలు సాధు జంతువులవుతాయి, దుర్మార్గులు సన్మార్గులవుతారు.

– రాచమడుగు శ్రీనివాసులు

విద్యార్థులకు 'బెస్ట్' ఇవ్వరా?

బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకానికి మూడేళ్లుగా నిలిచిన రూ. 120 కోట్లకుపైగా నిధులు
ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాల అసంతృప్తి.. ఈ ఏడాది ప్రవేశాలు తీసుకోవద్దని నిర్ణయం?

సాక్షి, హైదరాబాద్: ప్రతిభావంతులైన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అత్యున్నత ప్రైవేటు స్కూళ్లలో చదువు చెప్పించే లక్ష్యంతో అమలవుతున్న బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీమ్ (బీఏఎస్ఎస్)ను నిధుల సమస్య వెంటాడుతోంది. ఈ పథకం కింద మూడేళ్లుగా రూ. 120 కోట్లకుపైగా బకాయిలు ఉన్నట్లు సంక్షేమ శాఖల అధికారులు చెబుతున్నారు. నిధులు విడుదల కాకపోవడంతో బీఏఎస్ఎస్ కింద విద్యార్థులను చేర్చుకున్న పాఠశాలల యాజమాన్యాలు 2025–26 విద్యా సంవత్సరం నుంచి ప్రవేశాలు తీసుకోవద్దని ప్రాథమికంగా నిర్ణయించినట్లు సమాచారం.

లక్ష్యంతో పోలిస్తే సగం మందే విద్యార్థులున్నా అందని నిధులు

బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీమ్ (బీఏఎస్ఎస్)ను కేవలం ఎస్సీ అభివృద్ధి శాఖ, గిరిజన సంక్షేమ శాఖల ద్వారా ప్రభుత్వం అమలు చేస్తోంది. ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రతిభగల ఎస్సీ, ఎస్టీ విద్యార్థులను ఈ పథకం కింద ఎంపిక చేసి పాఠశాలల్లో ప్రవేశాలు కల్పిస్తోంది. ఎంపికైన ఒక్కో విద్యార్థికి రెసిడెన్షియల్ కేటగిరీలో ఏటా రూ. 42 వేల చొప్పున, నాన్ రెసిడెన్షియల్ విభాగంలో ఏటా రూ. 28 వేలు చొప్పున విడుదల చేయాల్సి ఉంటుంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం కింద 200కుపైగా



ప్రైవేటు స్కూళ్లు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులను చేర్చుకున్నాయి. వాటిలో బేగంపేట, రామాంతాపూర్‌లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ కూడా ఉంది. బీఏఎస్ఎస్ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం ఏటా దాదాపు 65 వేల మంది విద్యార్థులకు అవకాశం కల్పించాలని లక్ష్యం నిర్దేశించుకుంది. అందులో ఎస్సీ అభివృద్ధి శాఖ ద్వారా 58,500 మందికి, గిరిజన సంక్షేమ శాఖ ద్వారా 6,500 మందికి అవకాశం కల్పించాలనుకుంది. కానీ ఏటా విద్యార్థుల ప్రవేశాలు మాత్రం 30 వేలు దాటట్లేదు. వాస్తవ లక్ష్యం కంటే సగం మంది విద్యార్థులే ప్రవేశాలు పొందుతున్నప్పటికీ కనీసం ఆ మేరకు నిధులు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా పథకం ద్వారా అర్హత సాధించి ప్రవేశాలు పొందిన విద్యార్థులు ఒకట్రెండు తరగతులు చదివి తిరుగుముఖం పడుతున్నారు.

విద్యార్థుల లెక్క తేల్చేలా..

ప్రస్తుతం పాఠశాలలవారీగా విద్యార్థుల సంఖ్యను తేల్చేందుకు ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖలు జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశాయి. ప్రస్తుత విద్యా సంవత్సరం ముగిసే నాటికి ఎందరు విద్యార్థులు బీఏఎస్ఎస్ కింద చదువుతున్నారనే లెక్కలు తేల్చాలని జిల్లా సంక్షేమాధికారులకు రాష్ట్ర కార్యాలయం అధికారులు స్పష్టం చేశారు.

క్లుప్తంగా...

ఈనెల 3న 14 కొత్త ఎక్సైజ్ స్టేషన్లు ప్రారంభం

- గండిపేట, అమీన్‌పూర్ స్టేషన్లను ప్రారంభించనున్న మంత్రి జూపల్లి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన 14 ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లను ఈనెల 3వ తేదీన ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు హైదరా బాద్, రంగారెడ్డి ఎక్సైజ్ డివిజన్ల పరిధిలో 13, వరంగల్ రూరల్‌లో ఒక స్టేషన్‌ను గురువారం ప్రారంభించనున్నారు. గండిపేట, అమీన్‌పూర్ ఎక్సైజ్ స్టేషన్లను ఆ రోజున మంత్రి జూపల్లి ప్రారంభిస్తారని సోమవారం ఎక్సైజ్ వర్గాలు వెల్లడించాయి. వాస్తవానికి మంగళవారమే ఈ స్టేషన్లను ప్రారంభించాల్సి ఉన్నప్పటికీ జీహెచ్ఎంసీ పరిధిలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున కార్యక్రమాన్ని గురువారానికి వాయిదా వేయాల్సి వచ్చినట్టు ఆ వర్గాలు వెల్లడించాయి. గండిపేట, అమీన్‌పూర్ స్టేషన్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ఎం.రిజ్వీ, కమిషనర్ చెవ్వూరు హరికిరణ్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొంటారని, మిగిలిన చోట్ల ఆయా ప్రాంతాల ఎక్సైజ్ అధికారులు ప్రారంభిస్తారని ఎక్సైజ్ వర్గాలు తెలిపాయి. కాగా, కొత్త స్టేషన్లను ఏర్పాటు చేసినప్పటికీ సిబ్బంది నియామకం ఇంకా జరగకపోవడంతో పలుచోట్ల పాత స్టేషన్లలో ఎస్‌హెచ్‌వోలుగా ఉన్నవారే కొత్త స్టేషన్లను కూడా పర్యవేక్షించనున్నారు.

ప్రత్యేక విమానంలో కొడాలి నాని ముంబైకి తరలింపు

హైదరాబాద్: వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే కొడాలి నానిని బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి ప్రత్యేక విమానంలో ముంబైకి తరలించారు. ఇటీవల అస్వస్థతకు గురైన ఆయన హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకున్నారు. యాంజియో నిర్వహించిన వైద్యులు ఆయన గుండెలో మూడు బ్లాక్‌లు ఉన్నట్లు తేల్చారు. దీంతో కొడాలి నానిని బైపాస్ సర్జరీ నిమిత్తం కుటుంబ సభ్యులు సోమవారం ఉదయం 11 గంటల సమయంలో బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి ప్రత్యేక విమానంలో (ఎయిర్ అంబులెన్స్) వైద్యుల పర్యవేక్షణలో ముంబైకి తరలించారు. అక్కడ ఆయనకు బైపాస్ సర్జరీ చేయనున్నట్లు తెలిసింది.


దేవాదుల టన్నెల్ మరమ్మతులకోసం డీ వాటరింగ్



టన్నెల్ వద్ద డీ వాటరింగ్ చేస్తున్న దృశ్యం

ధర్మసాగర్: దేవాదుల ఎత్తిపోతల పథకంలో భాగంగా హనుమకొండ జిల్లాలోని ధర్మసాగర్ రిజర్వాయర్‌కు సమీపంలో నిర్మించిన టన్నెల్‌కు అక్కడక్కడా ఆదివారం లీకేజీలు ఏర్పడిన నేపథ్యంలో అధికారులు డీ వాటరింగ్ పనులు చేపట్టారు. ప్యాకేజీ–3కు సంబంధించి దేవన్నపేట పంప్‌హౌస్ నుంచి ధర్మసాగర్ రిజర్వాయర్ సమీపం వరకు పైపులైన్ వేసి అక్కడి నుంచి దాదాపు 200 మీటర్ల టన్నెల్‌ను నిర్మించారు. మార్చి 27న రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు దేవన్నపేట పంప్‌హౌస్ నుంచి రిజర్వాయర్‌లోకి నీటిని విడుదల చేశారు. కాగా టన్నెల్‌లో లీకేజీ కారణంగా నీరు వృథాగా పోతుండడంతో అధికారులు పంప్‌లు ఆఫ్‌చేసి డీ వాటరింగ్ చేస్తున్నారు. ఈ విషయంపై దేవాదుల ఈఈ సీతారాం నాయక్‌ను వివరణ కోరగా.. లీకేజీల విషయం కనుక్కోవడానికి టన్నెల్‌లో అధికంగా ఉన్న నీటిని డీ వాటరింగ్ చేస్తున్నామని, నీటిని పూర్తిగా తొలగించిన తర్వాత లీకేజీని గుర్తించి మరమ్మతులు చేపడతామని చెప్పారు.

పంట ఎండిపోయిందని రైతు ఆత్మహత్య



తిరగుడు స్వామి

రాజంపేట (కామారెడ్డి): బోరుబావిలో నీరు రాక పంట ఎండిపోతుండడాన్ని తట్టుకోలేక ఓ రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం పొందుర్తి గ్రామానికి చెందిన రైతు తిరగుడు స్వామి (36) తనకున్న రెండెకరాల భూమిలో వరి సాగు చేశాడు. ఎండల తీవ్రత పెరగడం, భూగర్భ జలమట్టం పడిపోవడంతో ఇటీవల బోరుబావి ఎండిపోయింది. దీంతో కళ్లముందే పంట ఎండిపోతుండడాన్ని చూసి స్వామి తట్టుకోలేకపోయాడు. పంట సాగుకోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలంటూ మనోవేదనకు గురై సోమవారం ఉదయం ఇంట్లోనే ఉరివేసుకుని చనిపోయాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై పుష్పరాజ్ తెలిపారు.

ఫిలిప్పీన్స్‌కు తెలంగాణ బియ్యం

- తొలి కన్‌సైన్‌మెంట్ కింద కాకినాడ షిప్‌యార్డు నుంచి 12,500 మెట్రిక్ టన్నుల బియ్యం ఎగుమతి
- 8 లక్షల మెట్రిక్ టన్నుల ఎగుమతి ఒప్పందం... మొదటి విడతగా లక్ష మెట్రిక్ టన్నులు
- కాకినాడ షిప్‌యార్డ్‌కు వెళ్లి జెండాఊపి ఓడను పంపిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

(కాకినాడ నుంచి 'సాక్షి'ప్రత్యేక ప్రతినిధి)



జాతీయ జెండాను ఊపి నౌకను పంపిస్తున్న మంత్రి ఉత్తమ్

అంతర్జాతీయ మార్కెట్‌లోకి బియ్యం ఎగుమతి చేసే స్థాయికి తెలంగాణ ప్రభుత్వం ఎదిగింది. గతంలో రాష్ట్రంలో పండించిన బియ్యం విదేశాలకు ఎగుమతి అయినా... కేంద్ర ఆహార మంత్రిత్వ శాఖ పరిధిలోని ఎఫ్‌సీఐ ద్వారా సెంట్రల్ పూల్ నుంచి పంపేది. కానీ తొలిసారిగా కేంద్రంతో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా ఫిలిప్పీన్స్ దేశానికి బియ్యాన్ని ఎగుమతి చేసి రికార్డు సృష్టించింది. తొలి కన్‌సైన్‌మెంట్ కింద 12,500 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని తీసుకెళ్లే భారీ నౌకను సోమవారం ఏపీలోని కాకినాడ షిప్‌యార్డులో జెండా ఊపి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పంపించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ రైతు దేశానికే కాకుండా ప్రపంచంలోని ఇతర దేశాలకు బియ్యాన్ని అందించే స్థాయికి ఎదిగారన్నారు. సారవంతమైన భూములు, అనుకూలిస్తున్న వాతావరణ పరిస్థితులకుతోడు కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న మద్దతుతో ధాన్యం ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని చెప్పారు. ఈ ఏడాది రాష్ట్రంలో 280 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి సాధించామని, ఇది రాష్ట్ర అవసరాలు, కేంద్ర పూల్‌కు అవసరమైన దాని కంటే ఎక్కువని ఆయన వివరించారు. బియ్యాన్ని ఇతర దేశాలకు నేరుగా పంపించడం ద్వారా స్వయం సమృద్ధి సాధించి, రైతులకు మరింత ప్రోత్సాహం ఇవ్వాలని భావిస్తున్నట్టు తెలిపారు. ధాన్యం సేకరణ, నిర్వహణ ఖర్చుల కోసం రాష్ట్ర ప్రభుత్వం భారీ వ్యయం చేస్తోందని, కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ఖర్చును కేంద్ర ప్రభుత్వం, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) సకాలంలో అందించకపోవడంతో వడ్డీ రూపంలో ఆర్థిక భారం పడుతోందన్నారు.

తెలంగాణ బియ్యంపై ఫిలిప్పీన్స్ ప్రభుత్వం ఆసక్తి

తెలంగాణ బియ్యం నమూనాలను పరిశీలించి, నాణ్యతకు మెచ్చి దిగుమతి చేసుకోవడానికి ఫిలిప్పీన్స్ ప్రభుత్వం ఆసక్తి చూపిందని మంత్రి ఉత్తమ్ చెప్పారు. రెండు పక్షాల అధికారుల మధ్య చర్చల అనంతరం, 8 లక్షల మెట్రిక్ టన్నుల మేర బియ్యాన్ని సేకరించేందుకు ఒప్పందం కుదుర్చుకుందన్నారు. అందులో తొలి విడతగా లక్ష మెట్రిక్ టన్నుల బియ్యం పంపించాలని నిర్ణయించామన్నారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ (టీజీఎస్‌సీఎస్‌సీఎల్), ఫిలిప్పీన్స్ ప్రభుత్వాన్ని ప్రాతినిధ్యం వహిస్తున్న ప్లాంటర్స్ ప్రొడక్ట్స్ మధ్య ఒప్పందం కుదిరిందని, ఎగుమతి చేసే బియ్యం ఐఆర్ 64 /ఎంటీయూ 1010 రకానికి చెందినవని చెప్పారు. నాణ్యతతో కూడిన బియ్యాన్ని పంపించడం ద్వారా ఫిలిప్పీన్స్ ప్రభుత్వం సంతృప్తి వ్యక్తం చేసిందన్నారు. ఈ ఎగుమతి కోసం రాష్ట్రంలోని 103 రైస్ మిల్లులు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) ధాన్యం మిల్లింగ్ చేశాయని మంత్రి వెల్లడించారు.

బియ్యం నాణ్యత చాలా బాగుంది : జెఫరీ గఫూజ్

ఫిలిప్పీన్స్‌కు ప్రధానాహారం బియ్యమేనని, అక్కడి జనాభాకు అవసరమైన బియ్యం ఉత్పత్తి కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఫిలిప్పీన్స్‌కు చెందిన ప్లాంటర్ ప్రొడక్ట్స్ ప్రతినిధి జెఫరీ గఫూజ్ అన్నారు. ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ ఫిలిప్పీన్స్‌కు అవసరమైన బియ్యం కోసం భారత్‌లోని చాలా రాష్ట్రాలను పరిశీలించగా, తెలంగాణలో నాణ్యమైన బియ్యం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ ప్రసాద్, పౌరసరఫరాల సంస్థ జనరల్ మేనేజర్ రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ విందుకు సీఎం రేవంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రంజాన్ పర్వదినం సందర్భంగా తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ (టీఎంఆర్ఈఐఎస్) వైస్ చైర్మన్ ఫహీం ఖురేషి నివాసంలో జరిగిన విందుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఎంపీలు అసదుద్దీన్ ఒవైసీ, గడ్డం వంశీ, ఎమ్మెల్యే గడ్డం వివేక్ తదితరులు ఈ విందులో పాల్గొన్నారు.



మాజీ హోం మంత్రి మహమ్మద్ మహమూద్ అలీ కుటుంబ సభ్యులతో కలిసి ఎర్రవెల్లికి వెళ్లారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి కేసీఆర్ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

నిర్మాత ముళ్లపూడి బ్రహ్మానందం కన్నుమూత



సాక్షి, హైదరాబాద్: సినీ నిర్మాత ముళ్లపూడి బ్రహ్మానందం (68) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన పరిస్థితి విషమించడంతో ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో మృతి చెందారు. దివంగత దర్శకుడు ఈవీవీ సత్యనారాయణ సోదరి మంగాయమ్మను ముళ్లపూడి బ్రహ్మానందం పెళ్లి చేసుకున్నారు. ఆ తర్వాత ఈవీవీ ప్రోత్సాహంతోనే చిత్ర పరిశ్రమలోకి అడుగు పెట్టారు. 'నేను, అల్లుడుగారు వచ్చారు, మనోహరం, ఓ చిన్నదానా' వంటి సినిమాలను నిర్మించారు. ముళ్లపూడి బ్రహ్మానందానికి భార్య మంగాయమ్మ, కుమారుడు సతీశ్, కుమార్తె మాధవి ఉన్నారు. ఆస్ట్రేలియాలో ఉన్న కుమారుడు వచ్చాక బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు సంతాపం వ్యక్తంచేశారు.

అత్యాచారం చేసి.. నోట్లో మూత్రం పోసి..

- వివాహితపై సామూహిక లైంగిక దాడి..
- మొక్కులు చెల్లించుకునేందుకు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి వచ్చిన బాధితురాలు..
- అదను చూసి.. ఘాతుకం.. పోలీసుల అదుపులో నిందితులు..



మాట్లాడుతున్న ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్

సాక్షి, నాగర్‌కర్నూల్: ఓ వివాహితపై అత్యంత పాశవికంగా సామూహిక లైంగికదాడికి పాల్పడిన ఏడుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఓ వివాహితకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం ఊర్కొండపేటలోని ఆంజనేయస్వామి ఆలయంలో మొక్కు చెల్లించుకునేందుకు ఆమె తన తల్లిదండ్రులు, పిల్లలతో కలిసి శనివారం సాయంత్రం వచ్చింది. మొక్కులు చెల్లించుకొని, కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ పరిసరాల్లోనే నిద్రించారు. రాత్రి 10 గంటల సమయంలో బహిర్భూమికి వెళ్లేందుకు ఆలయ సమీపంలోని ఖాళీ ప్రదేశానికి వెళ్లింది. అక్కడ తనకు వరుసకు బావ అయ్యే వ్యక్తి కనిపిస్తే అతనితో మాట్లాడుతోంది. అక్కడే మద్యం తాగుతున్న స్థానిక ఆటోడ్రైవర్లు, ఊర్కొండపేటకు చెందిన యువకులు మొత్తం ఏడుగురు వీరిని గమనించారు. ఒక్కసారిగా దాడి చేసి, దుస్తులు విప్పి.. అవే దుస్తులు, చొక్కాలతో ఆమె బంధువును చెట్టుకు కట్టేశారు. అనంతరం వివాహిత చేతులను కాళ్లతో తొక్కిపట్టి.. నోటిలో గుడ్డలు కుక్కి.. ఒకరి తర్వాత ఒకరు సామూహికంగా లైంగిక దాడికి పాల్పడ్డారు. విచక్షణారహితంగా కొడుతూ చిత్రహింసలకు గురిచేశారు. తట్టుకోలేకపోయిన ఆ వివాహిత తనను వదిలేయాలంటూ వారి కాళ్లపై పడి ప్రాథేయపడింది. కనీసం తాగేందుకు నీళ్లు ఇవ్వమని వేడుకున్నా కనికరించలేదు. పైగా నోట్లో మూత్రం పోసి అత్యంత పాశవికంగా ప్రవర్తించినట్టు తెలిసింది. అనంతరం ఆమె ఒంటిపై ఉన్న బంగారు నగలు, పుస్తెలు, కమ్మలను దోచుకెళ్లారు. సోమవారం ఉదయం బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. ఘటనా స్థలాన్ని నాగర్‌కర్నూల్ ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ పరిశీలించారు. నిందితులు అత్యంత క్రూరంగా లైంగిక దాడికి పాల్పడ్డారని, ఇప్పటికే ఏడుగురు నిందితులను గుర్తించి అదుపులో తీసుకున్నట్టు వెల్లడించారు. ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టామన్నారు.

నారాయణపూర్ జిల్లాలో ఎదురుకాల్పులు

- గాయాల పాలై తప్పించుకుపోయిన మావోలు
- తుపాకులు, తూటాలు, ఇతర సామగ్రి స్వాధీనం

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో సోమవారం మావోయిస్టులు–పోలీసుల నడుమ ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో గాయపడిన పలువురు మావోయిస్టులు అక్కడి నుంచి తప్పించుకునిపోయారు. నారాయణపూర్ జిల్లాలోని అబూజ్‌మడ్ ప్రాంతం ఘుండిపారా అటవీ ప్రాంతంలో మావోయిస్టు పార్టీ కంపెనీ నంబర్–1కు చెందిన మావోయిస్టులు సంచరిస్తున్నారనే నిఘా వర్గాల సమాచారంతో డీఆర్‌జీ, బస్తర్ ఫైటర్స్, ఎస్టీఎఫ్ బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ సందర్భంగా తారసపడిన మావోయిస్టులు బలగాలపైకి కాల్పులు జరపగా పోలీసులు ఎదురుకాల్పులు మొదలుపెట్టారు. అక్కడినుంచి మావోయిస్టులు తప్పించుకుపోగా, ఆ ప్రాంతంలో రక్తపు మరకలు, గాయపడిన వారిని ఈడ్చుకుంటూ వెళ్లిన ఆనవాళ్లను గుర్తించామని పోలీసులు వెల్లడించారు. ఘటనా ప్రాంతం నుంచి ఒక ఎస్ఎల్ఆర్ తుపాకీ, 12 లైవ్ ఎస్ఎల్ఆర్ కాట్రిజ్‌లు, ఎస్ఎల్ఆర్ మ్యాగజైన్, కిట్ బ్యాగు, వాకీటాకీ, రేడియో, విప్లవ సాహిత్యం, నిత్యావసర వస్తువులే కాక మందులు లభ్యమయ్యాయి. ఈ ఘటనపై నారాయణపూర్ జిల్లాలోని కోహ్కామెట్టా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

మావోల హింసాత్మక ఘటనల్లో 81 శాతం తగ్గుదల

- 2010లో దేశవ్యాప్తంగా 1,936 ఘటనలు, 2024లో 374కే పరిమితం
- తెలంగాణలో గతేడాది 8 ఘటనలు
- నక్సల్స్ చేతిలో చనిపోయిన వారి సంఖ్యలోనూ 85% తగ్గుదల
- ఇవీ కేంద్ర హోంశాఖ గణాంకాలు

సాక్షి, హైదరాబాద్: ఓవైపు ఆపరేషన్ కగార్...మరోవైపు కేడర్, సరైన వ్యూహాలు, ఆయుధాలు లేక మావోయిస్టులు చతికిలపడిపోయారు. దేశవ్యాప్తంగా నక్సల్స్ హింసాత్మక ఘటనల్లో 81 శాతం తగ్గుదల నమోదు కావడమే ఇందుకు నిదర్శనం. దేశవ్యాప్తంగా 2010లో మావోయిస్టులు 1,936 హింసాత్మక ఘటనలకు పాల్పడగా, 2024లో కేవలం 374కే పరిమితమైనట్టు కేంద్రహోంశాఖ ఇటీవల వెల్లడించింది. మొత్తంగా హింసాత్మక ఘటనల్లో 81 శాతం తగ్గుదల నమోదైనట్టు పేర్కొంది. గతేడాదిలో తెలంగాణవ్యాప్తంగా కేవలం ఎనిమిది ఘటనలే చోటుచేసుకున్నాయని చెప్పింది. దేశవ్యాప్తంగా మావోయిస్టులు హింసకు పాల్పడిన ఘటనలు, వారి చేతుల్లో చనిపోయిన భద్రత బలగాలు, సాధారణ పౌరుల సమాచారంపై రాజ్యసభ సభ్యులు ఇటీవల అడిగిన ప్రశ్నలకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. తెలంగాణలో 2021లో నాలుగు, 2022లో 9, 2023లో మూడు, 2024లో ఎనిమిది ఘటనలకు మావోయిస్టులు పాల్పడినట్టు చెప్పారు. మావోయిస్టులు హింసకు పాల్పడిన ఘటనలో సాధారణ పౌరులు, సాయుధ పోలీసు బలగాలు కలిపి 2024లో 150 మంది చనిపోగా.. 2010లో 1,005 మంది మృత్యువాత పడ్డారు. నక్సల్స్ చేతుల్లో చనిపోయిన వారిసంఖ్యలోనూ 85 శాతం తగ్గుదల నమోదైనట్టు తెలిపారు. ఓవైపు మావోయిస్టులను కట్టడి చేయడంతోపాటు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో తీసుకున్న ప్రత్యేక కార్యక్రమాలతోనూ ఇది సాధ్యమైందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్, విలేజ్ డిఫెన్స్ కమిటీల ఏర్పాటు తదితర పథకాలకు 2014–15 ఆర్థిక సంవత్సరం నుంచి 2024–25 ఆర్థిక సంవత్సరం వరకు మొత్తం రూ.3,260.37 కోట్లు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసినట్టు పేర్కొన్నారు. గత పదేళ్లలో హెలికాప్టర్ల కొనుగోలు, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో క్యాంపుల ఏర్పాటు, ఆయుధాలు తదితరాల కోసం సెంట్రల్ ఏజెన్సీస్ ఫర్ ఎల్‌డబ్ల్యూఈ మేనేజ్‌మెంట్ పథకం కింద రూ.1,120.32 కోట్లు ఇచ్చినట్టు వెల్లడించారు. ఆయా రాష్ట్రాల ఇంటెలిజెన్స్ బ్రాంచ్‌లు, స్పెషల్ ఫోర్స్‌లు, జిల్లా పోలీస్ బలగాల కోసం స్పెషల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ స్కీం (ఎస్ఐఎస్) కింద మరో రూ. 1,741 కోట్లు మంజూరు చేసినట్టు తెలిపారు.

ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్

దివంగత శాకమూరి అప్పారావు ఉద్యమ సహచరి రేణుక మృతి

- దళసభ్యురాలి నుంచి డీకేఎస్‌జడ్‌సీ వరకు...
- ఆమె స్వస్థలం ఉమ్మడి వరంగల్ జిల్లా కడవెండి
- కడవెండిలో నేడు రేణుక అంత్యక్రియలు



రేణుక (ఫైల్)

చర్ల/సాక్షిప్రతినిధి, వరంగల్/అల్వాల్: ఛత్తీస్‌గఢ్‌లో సోమవారం జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్ట్ పార్టీ కీలక మహిళా నేత మృతి చెందారు. మృతురాలిని దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలు, సెంట్రల్ రీజినల్ బ్యూరో ప్రెస్‌టీం ఇన్‌చార్జి గుమ్ముడవెల్లి రేణుకగా పోలీసులు ధ్రువీకరించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఈమెపై ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల్లో రూ.45 లక్షల రివార్డుంది. బీజాపూర్ –దంతెవాడ జిల్లాల సరిహద్దుల్లోని నెల్గోడ, ఇకెలి, బెల్నార్ గ్రామ అటవీ ప్రాంతాల్లో మావోయిస్టులు సంచరిస్తున్నారన్న నిఘావర్గాల సమాచారంతో డీఆర్‌జీ, సీఆర్‌పీఎఫ్ బలగాలు ఆదివారం సాయంత్రం నుంచి కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో సోమవారం ఉదయం 9 గంటల సమయంలో బలగాలకు మావోయిస్టులు తారసపడ్డారు. ఈ సందర్భంగా ఇరువర్గాలమధ్య సుమారు రెండు గంటలపాటు కాల్పులు జరిగాయి. అనంతరం ఆ ప్రాంతంలో ఒక మహిళా మావోయిస్టు మృతదేహం, ఇన్సాస్ రైఫిల్, ల్యాప్‌టాప్, విప్లవ సాహిత్యం, మందుగుండు సామగ్రి లభించాయని పోలీసులు తెలిపారు. కాగా, ఎదురుకాల్పుల సమయంలో పలువురు మావోయిస్టులు తప్పించుకున్నారనే అనుమానంతో బలగాలు కూంబింగ్ ముమ్మరం చేశాయి.

ఎల్ఎల్‌బీ చదువుతూ విప్లవ బాట...

మృతి చెందిన మావోయిస్టును దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలు, సెంట్రల్ రీజినల్ బ్యూరో ప్రెస్‌టీం ఇన్‌చార్జి గుమ్ముడవెల్లి రేణుక అలియాస్ భాను అలియాస్ దమయంతి, అలియాస్ చైతె అలియాస్ సరస్వతిగా గుర్తించామని దంతెవాడ ఎస్పీ గౌరవ్ రాయ్ ధ్రువీకరించారు. దళ సభ్యురాలి నుంచి మావోయిస్టు పార్టీలో అంచెలంచెలుగా ఎదిగిన రేణుక బస్తర్ దండకారణ్యంలో కీలక మహిళా మావోయిస్టు నేతగా మారింది. 2006లో సౌత్ బస్తర్‌లో కేంద్ర కమిటీ సభ్యుడు దుల్లలా దాదా అలియాస్ ఆనంద్‌తో కలిసి పనిచేశారు. మావోయిస్ట్ పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడు శాకమూరి అప్పారావు అలియాస్ రవితో 2005లో రేణుకకు వివాహమైంది. 2010లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో అప్పారావు చనిపోయారు. స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడిగా ఉన్న ఈమె సోదరుడు జీవీ ప్రసాద్ అలియాస్ గుడ్సా ఉసెండి 2014లో తెలంగాణ పోలీసులకు లొంగిపోయారని పోలీసులు చెప్పారు. రేణుక స్వస్థలం జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కడివెండి గ్రామం. తిరుపతి పద్మావతి యూనివర్సిటీ నుంచి ఎల్ఎల్‌బీలో గోల్డ్‌మెడల్ సాధించిన రేణుక 1996లో మావోయిస్టు పార్టీలో చేరారు. ప్రస్తుతం ఈమె పార్టీ సెంట్రల్ రీజినల్ బ్యూరో ప్రెస్‌టీం ఇన్‌చార్జిగా, మావోయిస్టులు వెలువరిస్తున్న ప్రభాత్, మహిళామార్గం, అవామీ జంగ్, పీపుల్స్ మార్చ్, ఝుంకార్, పితూరి వంటి పత్రికలకు ఎడిటర్‌గా కూడా ఉన్నారు. కాగా, ఈ ఏడాది ఇప్పటి వరకు బస్తర్ ప్రాంతంలో వివిధ ఎన్‌కౌంటర్లలో 119 మంది మావోయిస్టులు మృతి చెందినట్లు పోలీసులు వెల్లడించారు.

కడవెండికి నేడు రేణుక మృతదేహం...

రేణుక మృతదేహం మంగళవారం కడవెండికి రానుంది. దంతెవాడ పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు రేణుక సోదరుడు జీవీకే ప్రసాద్, కుటుంబసభ్యులు, బంధువులు సోమవారం సాయంత్రమే అక్కడికి బయలుదేరి వెళ్లారు. కాగా మావోయిస్టు ఉద్యమంలో సుమారు మూడు దశాబ్దాలపాటు పనిచేసిన రేణుక అలియాస్ భాను మృతితో కడవెండిలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా, రేణుక తల్లిదండ్రులు సోమయ్య, జయమ్మ, సోదరుడు రాజశేఖర్ ప్రస్తుతం అల్వాల్ వెంకటాపురంలో నివాసముంటున్నారు. రేణుక మృతి చెందిన విషయం తెలుసుకొని కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

విప్లవమే శ్వాసగా జీవించిన రేణుక

దండకారణ్యంలో జరిగిన ఎన్‌కౌంటర్లో మరణించిన కామ్రేడ్ రేణుక చివరివరకూ విప్లవమే శ్వాసగా జీవించింది. తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో నా సహచరి సావిత్రి, రేణుక ఇద్దరూ క్లాస్‌మేట్స్, అంతకుమించి ప్రాణ స్నేహితులు. ఆపై ఉద్యమ సహచరులు. బీఎల్ కోర్స్ పూర్తయ్యాక 1995 సెప్టెంబర్‌లో జరిగిన ఫేర్‌వెల్ పార్టీలో సావిత్రితో కలిసి పాల్గొంది. కామ్రేడ్ రేణుకకు నా విప్లవ జోహార్లు.

– బల్ల రవీంద్రనాథ్, రాజకీయ ఖైదీల విడుదల కమిటీ



బీఎల్ కోర్సు పూర్తయిన సందర్భంగా స్నేహితురాలు సావిత్రి, లా డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్‌తో రేణుక

ఆర్టీసీలో ఈడీల బదిలీ

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీలో కీలకమైన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల (ఈడీ) బదిలీలు జరిగాయి. కొందరు రీజనల్ మేనేజర్లకు ఈడీలుగా పదోన్నతులు లభించాయి. కరీంనగర్ జోన్ ఈడీగా ఉన్న ఖుస్రోషా ఖాన్‌ను హైదరాబాద్ జోన్ ఈడీగా బదిలీ చేశారు. ప్రస్తుతం ఆదిలాబాద్ రీజనల్ మేనేజర్‌గా ఉన్న సోలోమన్‌కు పదోన్నతి కల్పిస్తూ కరీంనగర్ ఈడీ బాధ్యతలు అప్పగించారు. బస్‌భవన్‌లో ఈడీ ఆపరేషన్స్, ఇంజనీరింగ్, ఐటీ.. తదితర విభాగాలు పర్యవేక్షిస్తున్న మునిశేఖర్‌కు అదనంగా మెడికల్ విభాగం కేటాయించి, ఇంజనీరింగ్ విభాగాన్ని తొలగించారు. బస్‌భవన్‌లో సీఎంఈగా ఉన్న వెంకన్నకు ఇంజనీరింగ్, అడ్మినిస్ట్రేషన్ విభాగాల ఈడీగా అదనపు బాధ్యతలు కేటాయించారు. సికింద్రాబాద్ రీజనల్ మేనేజర్‌గా ఉన్న రాజశేఖర్‌కు గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఈడీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

ఈసారి ఎండలు ఎక్కువే!



న్యూఢిల్లీ: ఈసారి ఎండల భగభగ తప్పదని వాతావరణ శాఖ హెచ్చరించింది. దేశంలో ఏప్రిల్, మే, జూన్ నెలల్లో ఎండలు సాధారణానికి మించిన తీవ్రతతో ఉండొచ్చని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) తెలిపింది. మధ్య, పశ్చిమ, వాయవ్య భారతం మైదాన ప్రాంతాల్లో వడగాడ్పులు ఎక్కువ రోజులు కొనసాగే అవకాశముందని కూడా అంచనా వేసింది. తూర్పు, పశ్చిమ భారతం మినహా దేశంలోని మిగతా అన్ని ప్రాంతాల్లోనూ ఈసారి సాధారణ గరిష్ట స్థాయికి మించి ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని పేర్కొంది. తూర్పు, పశ్చిమ భారతంలో సాధారణ ఉష్ణోగ్రతలే కొనసాగుతాయంది. అత్యధిక ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగతలు సైతం సాధారణ స్థాయికి మించి ఉండే అవకాశముందని ఐఎండీ చీఫ్ మృత్యుంజయ మహాపాత్ర సోమవారం వర్చువల్ మీడియా సమావేశంలో వివరించారు. 'ఏప్రిల్ నుంచి జూన్ వరకు ఉత్తర, తూర్పు, మధ్య భారతదేశం, వాయవ్య భారతంలోని మైదాన ప్రాంతాల్లో సాధారణం కంటే రెండు నుంచి నాలుగు రోజులు అధికంగానే వడగాడ్పులు వీచే అవకాశముంది. మామూలుగా, ఈ కాలంలో నాలుగు నుంచి ఏడు రోజులు మాత్రమే వడగాడ్పులు వీస్తుంటాయి'అని ఆయన తెలిపారు. వడగాడ్పుల తీవ్రత తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల్లో రాజస్తాన్, గుజరాత్, హరియాణా, పంజాబ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, బిహార్, జార్ఖండ్, పశ్చిమబెంగాల్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లతోపాటు కర్ణాటక తమిళనాడుల్లోని ఉత్తర ప్రాంతాల్లో ఎక్కువగానే ఉంటుందని ఐఎండీ పేర్కొంది.

5 లక్షల కోట్ల టన్నుల మంచు కరిగింది



అపారమైన మంచు నిల్వలకు గ్రీన్‌లాండ్ ఆలవాలం. ప్రపంచంలోని మొత్తం మంచినీటిలో 8 శాతం అక్కడే ఉందని అంచనా. అలాంటి గ్రీన్‌లాండ్‌లో మంచు శరవేగంగా కరిగిపోతోంది. ఎంతగా అంటే ఏటా సగటున 5,500 కోట్ల టన్నుల మేరకు! 1992లో మొదలైన ఈ ధోరణి ఏటా అంతకంతకూ పెరుగుతూనే వస్తోందట. ఆ లెక్కన గత 28 ఏళ్లలో అక్కడ ఏకంగా 5 లక్షల టన్నుల మంచు మాయమైపోయిందట! గ్రీన్‌లాండ్‌పై గ్లోబల్ వార్మింగ్ ప్రభావంపై చేపట్టిన అధ్యయనంలో సైంటిస్టులు ఈ మేరకు తేల్చారు. ఇది ఒక్క గ్రీన్‌లాండ్‌కే పరిమితం కాదని నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్పియరిక్ అడ్మినిస్ట్రేషన్ (ఎన్‌ఓఏఏ) తెలిపింది. ''మొత్తమ్మీద ధ్రువాల వద్ద మంచు కరుగుదల ప్రమాదకర స్థాయిలో ఉంది. ఇది చాలా ఆందోళనకర పరిణామం''అని ఆందోళన వెలిబుచ్చింది. అక్కడ మంచు ఈ స్థాయిలో కరిగిపోవడానికి నిర్దిష్ట కారణాలేమిటో తేల్చే పనిలో పడింది. అక్కడినుంచి ఆవిరవుతున్న నీరు ఎటు వెళ్తోందో తెలియడం లేదని సైంటిస్టులు చెబుతున్నారు. ఈ మిస్టరీని ఛేదించేందుకు అక్కడి నీటి ఆవిరిని డ్రోన్ల సాయంతో సేకరించి పరిశోధిస్తున్నారు. ఇందుకోసం భూ ఉపరితలం నుంచి 5,000 అడుగుల ఎత్తు దాకా వివిధ స్థాయిల్లో నీటి ఆవిరిని పలు దఫాలుగా సేకరించారు. ''ఆవిరయ్యే నీటిలో ఎంతోకొంత తిరిగి మంచుగా మారి అక్కడే పడుతుంది. కానీ చాలావరకు మాత్రం గ్రీన్‌లాండ్ జలవ్యవస్థకు శాశ్వతంగా దూరంగా వెళ్లిపోతోంది. ఇదే ఆందోళన కలిగించే విషయం''అని అధ్యయనానికి సారథ్యం వహించిన కెవిన్ రోజ్మియారెక్ వివరించారు.

\- సాక్షి, నేషనల్ డెస్క్

ట్రంప్ మూడో ముచ్చట తీరేనా?



అమెరికా రాజ్యాంగం అనుమతించేది రెండుసార్లే

- అయినా తనకు బోలెడు దారులున్నాయన్న అధ్యక్షుడు
- 2028లో అధ్యక్ష బరిలో వాన్స్, రన్నింగ్‌మేట్‌గా ట్రంప్
- నెగ్గాక వాన్స్ రాజీనామా, మూడోసారి పీఠంపై ట్రంప్
- ఆ ఆలోచన ఉందని ఇంటర్వ్యూలో చెప్పిన ట్రంప్
- సాధ్యాసాధ్యాలపై రాజ్యాంగ నిపుణుల అనుమానం

'మూడోసారి కూడా అధ్యక్షుడు కావాలనుకుంటున్నా. నేనేమీ జోక్ చేయడం లేదు. సీరియస్‌గానే చెప్తున్నా. నన్ను మూడోసారి కూడా అధ్యక్షునిగా చూడాలని అమెరికన్లలో చాలామంది కోరుకుంటున్నారు' - రెండోసారి అధ్యక్షుడై మూడు నెలలైనా నిండకముందే డొనాల్డ్ ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు అందరినీ ఆశ్చర్యానికి గురి చేశాయి. మూడో టర్ము గురించిన ఆకాంక్షలను వెలిబుచ్చడం ఆయనకు ఇది తొలిసారేమీ కాదు. అధ్యక్ష ఎన్నికల ప్రచారం సందర్భంగా కూడా ఈ విషయాన్ని ప్రస్తావించారు. అనంతరం గత జనవరిలో కూడా, 'ఒకట్రెండు సార్లు మాత్రమే కాదు, మూడు, ఇంకా చెప్పాలంటే నాలుగుసార్లు కూడా దేశానికి సేవ చేయడం నాకు అత్యంత గౌరవప్రదమైన విషయం'అని చెప్పుకొచ్చారు. రెండుసార్లకు మించి అధ్యక్ష పదవి చేపట్టేందుకు అమెరికా రాజ్యాంగం అనుమతించదని తెలిసీ ట్రంప్ ఎందుకిలాంటి ప్రకటన చేశారన్నది ఆసక్తికరం. మనసుంటే మార్గముంటుందన్నట్టు, 'మూడో'ముచ్చట తీర్చుకునేందుకు ట్రంప్‌కు అవకాశముందని అభిమానులు చెబుతున్నారు. అందుకే అంత బాహాటంగా ఆ ప్రకటన చేశారంటున్నారు. అదెంతవరకు సాధ్యమన్న దానిపై జోరుగా చర్చ జరుగుతోంది. అంతేగాక ట్రంప్ యోచనకు అనుకూలంగా, వ్యతిరేకంగా కూడా పలు వాదనలు తెరపైకి వస్తున్నాయి. అవేమిటంటే...

అమెరికా రాజ్యాంగానికి చేసిన 22వ సవరణ ప్రకారం ఒక వ్యక్తి రెండుసార్లకు మించి అధ్యక్ష పదవి చేపట్టడానికి వీల్లేదు. అంతేకాదు. ఏ కారణాలతోనైనా రెండేళ్లు, అంతకంటే ఎక్కువకాలం అధ్యక్షునిగా చేసినా సరే, ఈ సవరణ ప్రకారం వారు మరొక్కసారి మాత్రమే తిరిగి ఎన్నిక కావచ్చు. ఈ లెక్కన ట్రంప్ కోరిక నెరవేరాలంటే రాజ్యాంగాన్ని సవరించాల్సి ఉంటుంది. కానీ అది అత్యంత కష్టసాధ్యం. ఎందుకంటే ఆ సవరణను కాంగ్రెస్ ఉభయ సభలూ మూడింట రెండొంతుల మెజారిటీతో ఆమోదించాలి. ఆ మీదట మూడొంతుల రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఆమోదముద్ర వేయాలి. కానీ అధికార రిపబ్లికన్లకు కాంగ్రెస్‌లో అంత మెజారిటీ లేదు. పైగా 50 రాష్ట్రాల్లో 18 విపక్ష డెమొక్రాట్ల చేతుల్లోనే ఉన్నాయి.

రాజ్యాంగాన్ని సవరించాలి

అధ్యక్ష పదవికి రెండుకంటే ఎక్కువసార్లు 'ఎన్నిక'కావడాన్ని మాత్రమే 22వ సవరణ నిషేధిస్తోంది. వారసత్వంగా ఆ పదవిని పొందే విషయంపై మాత్రం అందులో ఎలాంటి ప్రస్తావనా లేదు. దీన్ని ట్రంప్ తనకు అనుకూలంగా వాడుకోనున్నట్టు ఆయన మద్దతుదారులు చెబుతున్నారు! ''ఏ కారణంతోనైనా అధ్యక్షుడు రాజీనామా చేస్తే నిబంధనల ప్రకారం ఆ పదవి ఉపాధ్యక్షునికే దక్కుతుంది. కనుక 2028లో ట్రంప్ ఉపాధ్యక్ష బరిలో దిగుతారు. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ అధ్యక్ష పదవికి పోటీ చేస్తారు. గెలిస్తే వెంటనే రాజీనామా చేస్తారు. తద్వారా ట్రంప్ ఆటోమేటిగ్గా మూడోసారి అధ్యక్షుడైపోతారు''అంటున్నారు. ఈ ఆలోచన తన మనసులో ఉందని ట్రంప్ అంగీకరించారు కూడా. కానీ దీనిపై భిన్న వాదనలున్నాయి. ఇది అసాధ్యమని యూనివర్సిటీ ఆఫ్ నోర్టెడామ్‌లో ఎన్నికల నిబంధనల నిపుణుడైన ప్రొఫెసర్ డెరెక్ ముల్లర్ చెబుతున్నారు. ''అధ్యక్ష పదవికి పోటీ చేసేందుకు అర్హత లేని వ్యక్తి ఉపాధ్యక్ష పదవికి కూడా పోటీ పడేందుకు కూడా అనర్హుడేనని 12వ రాజ్యాంగ సవరణ స్పష్టం చేస్తోంది. 2028లో అధ్యక్ష పదవికి పోటీ చేసేందుకు ట్రంప్ అనర్హుడు గనుక ఉపాధ్యక్ష పదవికి పోటీ చేసేందుకు కూడా అనర్హుడే అవుతారు''అని ఆయన స్పష్టం చేశారు. ఇవన్నీ కాకుండా ఒకవ్యక్తి మూడుసార్లు అధ్యక్ష పదవికి పోటీ చేసేందుకు అనుమతిస్తూ రాజ్యాంగాన్ని సవరించాలని రిపబ్లికన్ నేత ఆండీ ఓగ్లెస్ గత జనవరిలో ప్రతిపాదించారు. అంతగా అయితే ఆ మూడుసార్లు వరుసగా కాకుంటే చాలంటూ ఓ నిబంధన విధిస్తే సరిపోతుందని సూచించారు.

'ఉపాధ్యక్ష' దారిలో...

9 మంది గెలవకుండానే అధ్యక్ష పీఠమెక్కారు

అమెరికా చరిత్రలో ఏకంగా 9 మంది ఉపాధ్యక్షులు ఎన్నికల పోరులో గెలవకుండానే అత్యున్నత పీఠమెక్కారు. అధ్యక్షుని మరణం, లేదా రాజీనామా వల్ల తాము అధ్యక్షులయ్యారు.

వయసు అనుమతించేనా?

మూడోసారి అధ్యక్ష పదవి చేపట్టేందుకు వయసు కూడా ట్రంప్‌కు అడ్డంకిగానే మారేలా కన్పిస్తోంది. ఆయనకిప్పటికే 78 ఏళ్లు. ఆ లెక్కన ఈ పదవీ కాలం ముగిసేసరికి 82 ఏళ్లకు చేరుకుంటారు. ఆ వయసులో తిరిగి ఎన్నికల బరిలో దిగాల్సి ఉంటుంది. అదెంత వరకు సాధ్యమన్నది కాలం గడిస్తే గానీ తేలదు.

ట్రంప్ మూడో టర్ము వ్యాఖ్యలను విపక్ష డెమొక్రాటిక్ పార్టీ తీవ్రంగా ఖండించింది. ''ఇటువంటి ఆలోచనలతో ప్రజాస్వామ్యానికి ఆయన మరింతగా తూట్లు పొడుస్తున్నారు. రెండోసారి అధ్యక్షుడైతేనే ప్రపంచమంతటినీ ఇంతటి గందరగోళంలోకి నెట్టేస్తున్న ఆయన మూడోసారి గద్దెనెక్కేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ వీల్లేదు. కాంగ్రెస్‌లోని రిపబ్లికన్ ప్రతినిధులకు రాజ్యాంగంపై ఏమాత్రం విశ్వాసమున్నా ట్రంప్ మతిలేని మూడో టర్ము ఆకాంక్షలను తక్షణం బాహాటంగా ఖండించాలి''అని డిమాండ్ చేసింది. రిపబ్లికన్లలో కూడా కొందరు మూడో టర్ము సరైన యోచన కాదంటున్నారు. ఈ ఆలోచనకు తాననలే మద్దతివ్వబోనని ఓక్లహామీ సెనేటర్ మార్క్‌వైన్ ములిన్ ఇటీవలే చెప్పారు.

వద్దే వద్దు: డెమొక్రాట్లు

రూజ్‌వెల్ట్ నాలుగు సార్లు!

రెండు కంటే ఎక్కువ సార్లు అమెరికా అధ్యక్ష పదవి చేపట్టిన ఏకైక నేతగా ఫ్రాంక్లిన్ డి.రూజ్‌వెల్ట్ నిలిచిపోయారు. 32వ అధ్యక్షునిగా 1933లో తొలిసారి గద్దెనెక్కిన ఆయన 1945లో మరణించేదాకా పదవిలోనే కొనసాగారు! అత్యధిక కాలం పాటు అధ్యక్షునిగా కొనసాగిన రికార్డు కూడా ఆయనదే. అధ్యక్ష పదవిని రెండుసార్లకు మించి చేపట్టరాదన్న సంప్రదాయాన్ని అమెరికా మొదటినుంచీ పాటిస్తోంది. దీనికి బాటలు వేసింది తొలి అధ్యక్షుడు జార్జి వాషింగ్టనే. ఆయన వరుసగా రెండుసార్లు గెలిచారు. మూడోసారీ అధ్యక్షుడు కావాలని దేశమంతా కోరినా సున్నితంగా నిరాకరించి తప్పుకున్నారు. అప్పటినుంచి అందరు అధ్యక్షులూ అనుసరిస్తూ వస్తున్న ఆ సంప్రదాయాన్ని రూజ్‌వెల్ట్ మాత్రం అతిక్రమించారు. రెండో ప్రపంచ యుద్ధాన్ని, హిట్లర్ సారథ్యంలో నాజీల దూకుడును బూచిగా చూపిస్తూ 1940, 1944 అధ్యక్ష ఎన్నికల్లో వరుసగా మరో రెండుసార్లు పోటీ చేసి గెలిచారు. అయితే 1944లో నాలుగోసారి బరిలో దిగేనాటికే రూజ్‌వెల్ట్ ఆరోగ్యం క్షీణించింది. 1945లో అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన మూడు నెలలకే మరణించారు. అనంతరం రెండుసార్లకు మించి అధ్యక్ష పదవి చేపట్టకుండా 1951లో 22వ రాజ్యాంగ సవరణ అమల్లోకి వచ్చింది.

\- సాక్షి, నేషనల్ డెస్క్

సెప్టెంబర్‌లో మోదీ రిటైరవుతారు: రౌత్

ఆర్‌ఎస్‌ఎస్ కార్యాలయానికి అందుకే వచ్చారని వ్యాఖ్య

ముంబై: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం నాగ్‌పూర్‌లోని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్) ప్రధాన కార్యాలయాన్ని సందర్శించడంపై శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ సెప్టెంబర్‌లో పదవి నుంచి వైదొలగనున్నారని, ఇందుకు సంబంధించిన రిటైర్మెంట్ దరఖాస్తు ఇచ్చేందుకే సంఘ్ ఆఫీసుకు వచ్చారని పేర్కొన్నారు. గడిచిన 10, 11 ఏళ్లలో ఎన్నడూ ఆర్‌ఎస్‌ఎస్ కార్యాలయానికి రాని మోదీ, ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్‌కు టాటా బైబై చెప్పేందుకే ఇప్పుడు వచ్చారంటూ వ్యాఖ్యానించారు. 'ప్రధాని మోదీ టైం అయిపోయింది. దేశ నాయకత్వంలో మార్పు చేయాలని ఆర్‌ఎస్‌ఎస్ అనుకుంటోంది. తదుపరి బీజేపీ చీఫ్‌ను కూడా ఎంపిక చేయనుంది'అని తనకు అర్థమైందని రౌత్ తెలిపారు. రౌత్ వ్యాఖ్యలపై బీజేపీ సీనియర్ నేత, మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్ స్పందించారు. మోదీ మరిన్ని సంవత్సరాలు ప్రధానిగా కొనసాగుతారని స్పష్టం చేశారు. '2029లోనూ ఆయనే ప్రధాని. ఆయన వారసుడిని ఎంపిక చేయాల్సిన అవసరమే లేదు. మోదీయే మా నేత. తండ్రి ఉండగా వారసుడిని ఎంపిక చేయడం తగని పని. అది మొఘలుల సంస్కృతి'అంటూ వ్యాఖ్యానించారు.





వాటర్ డ్రోన్ పరీక్ష సక్సెస్

న్యూఢిల్లీ: భారత నావికాదళ అమ్ములపొదిలోకి మరో కొత్త అస్త్రం వచ్చి చేరబోతోంది. సముద్రజలాల్లో శత్రు దేశాల యుద్ధనౌకలపై ఓ కన్నేసి, నిఘాను అత్యంత సమర్థవంతంగా నిర్వహించే అధునాతన'వాటర్ డ్రోన్'ను రక్షణ పరిశోధనాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీవో) విజయవంతంగా పరీక్షించింది. అన్ని దశల పరీక్షలను పూర్తిచేసుకున్నాక ఇది భారత నౌకాదళాల చేతికి రానుంది. దీంతో సముద్రజలాలపై ఉపరితల నిఘా కార్యకలాపాల్లో భారత్ సామర్థ్యం ద్విగుణీకృతం కానుంది. నీటిలో కాస్తంత మునిగి కనిపించకుండా దూసుకెళ్లే హై ఎండ్యూరన్స్ అటానమస్ అండర్‌వాటర్ వెహికల్ (హెచ్‌ఈ ఏయూవీ)ను విజయవంతంగా పరీక్షించినట్లు డీఆర్‌డీవో సోమవారం ప్రకటించింది. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లోని తన ఖాతాలో ఒక ప్రకటన విడుదలచేసింది. జలాంతర్గామిలా కనిపించే అత్యంత చిన్న స్వయంచాలిత వాహనాన్ని వాటర్ డ్రోన్‌గా పిలుస్తారు. సరస్సులో వాటర్ డ్రోన్‌ను పరీక్షిస్తున్న వీడియోను డీఆర్‌డీఓ తన 'ఎక్స్' సామాజిక మాధ్యమ ఖాతాలో పోస్ట్‌చేసింది. ఉపరితలంలో, కాస్తంత మునిగి ప్రయాణిస్తూ ఈ అటానమస్ వెహికల్ నిర్దేశిత పరామితులను అందుకుందని సంస్థ పేర్కొంది. సోనార్, కమ్యూనికేషన్ సామర్థ్యాలను అత్యంత కచ్చితత్వంతో ప్రదర్శించిందని ప్రకటించింది. నావల్ సైన్స్ అండ్ టెక్నాలాజికల్ లేబొరేటరీ ఈ వాటర్ డ్రోన్‌ను అభివృద్ధిచేసింది. దాదాపు 6 టన్నులు బరువు ఉండే ఈ డ్రోన్ పొడవు 9.75 మీటర్లు. శత్రువుల యుద్ధనౌకల సిబ్బంది కంట్లోపడకుండా నీటి ఉపరితలంపై పెద్దగా అలల అలజడి సృష్టించకుండా నిశ్శబ్దంగా, మెల్లగా ముందుకెళ్తుంది. అత్యవసర సందర్భాల్లో గంటకు గరిష్టంగా 14 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లగలదు. దాక్కోవాల్సిన పరిస్థితుల్లో సముద్రజలాల్లో ఏకంగా 300 మీటర్ల లోతు వరకు వెళ్లగలదు. సమీపంలో సంచరించే భారత జలాంతర్గాముల రక్షణ, అన్వేషణ సామర్థ్యాలను సైతం ఈ వాటర్‌డ్రోన్ మెరుగుపరుస్తుందని డీఆర్‌డీవో పేర్కొంది.

2,000 దాటిన భూకంప మృతులు

బ్యాంకాక్: మయన్మార్‌లో భూకంప మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. శుక్రవారం నాటి భూ విలయం ధాటికి 2,000 మందికిపైగా మరణించినట్లు ప్రభుత్వ మీడియా వెల్లడించింది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని సోమవారం తెలియజేసింది. దేశవ్యాప్తంగా 10 వేలకు పైగా నివాస భవనాలు కుప్పకూలడమో, తీవ్రంగా దెబ్బ తినడమో జరిగిందని ఐరాస నివేదించింది. మసీదులు, బౌద్ధారామాలు సహా వందలాది భవనాలు నేలకూలాయని, చాలామంది శిథిలాల్లో చిక్కుకున్నారని పేర్కొంది. మాండలే నగరంలోని ఉల్ హలా థీన్ బౌద్ధారామం కుప్పకూలడంతో 200 మంది భిక్షువులు ప్రాణాలు కోల్పోయారు. దేశవ్యాప్తంగా మసీదులు కుప్పకూలడంతో శుక్రవారం మధ్యాహ్న ప్రార్థనల్లో ఉన్న 700 మంది ముస్లింలు మరణించినట్టు సమాచారం. ఓ పాఠశాల భవనం ధ్వంసం కావడంతో 50 మంది చిన్నారులు బలయ్యారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడం, ఇంధనం కొరత వల్ల సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. ఆహారం, నీరు, ఔషధాలు అందుబాటులో లేక జనం అల్లాడిపోతున్నారు. వ్యాధులు విజృంభించే ప్రమాదముందని స్థానికులు చెబుతున్నారు. ఆసుపత్రుల్లో చికిత్సకు సౌకర్యాలు లేకపోవడం ఆందోళనకు గురి చేస్తోంది. ''ఇప్పటిదాకా 2,065 మంది మృతి చెందారు. 3,900 మంది గాయపడ్డారు. 270 మంది ఆచూకీ తెలియడం లేదు'' అని ఎంఆర్‌టీవీ వెల్లడించింది. మారుమూల ప్రాంతాలకు సహాయక బృందాలు ఇంకా చేరుకోలేదు. దాంతో అక్కడ ఎందరు మరణించిందీ ఇప్పుడే చెప్పలేని పరిస్థితి!

ప్రధాని మోదీ వ్యక్తిగత కార్యదర్శిగా నిధి తివారీ నియామకం



న్యూఢిల్లీ: ప్రధానమంత్రి కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న యువ ఐఎఫ్‌ఎస్ అధికారిణి నిధి తివారీని ప్రధాని మోదీ వ్యక్తిగత కార్యదర్శిగా నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ నియామకం తక్షణం అమల్లోకి వస్తుందని మార్చి 29వ తేదీన కేంద్ర సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఒక ఉత్తర్వులో పేర్కొంది. 2014 బ్యాచ్‌కు చెందిన ఈ యువ ఐఎఫ్‌ఎస్ అధికారిణి తాజా నియామకాన్ని 'నియామకాల కేబినెట్ కమిటీ' ఆమోదం తెలిపిందని కేంద్ర సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వ శాఖ సోమవారం ప్రకటించింది. నిధి ప్రస్తుతం ప్రధాని కార్యాలయంలో డెప్యూటీ సెక్రటరీగా పనిచేస్తున్నారు. గత 11 ఏళ్లుగా మోదీ ప్రాతినిధ్యంవహిస్తున్న వారణాసి పార్లమెంట్ నియోజకవర్గంలోని మహమూర్‌గంజ్ ప్రాంతం నిధి స్వస్థలం. అఖిలభారత సర్వీసుల కోసం 2013లో నిర్వహించిన సివిల్స్ పరీక్షల్లో నిధి 96వ ర్యాంక్ సాధించడం విశేషం.శిక్షణ తర్వాత నిధి తొలుత వారణాసిలో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేశారు. తర్వాత విదేశాంగ శాఖలో పనిచేశారు. అక్కడి నిరాయుధీకరణ, అంతర్జాతీయ భద్రతా విభాగంలో సేవలందించారు. తర్వాత ఢిల్లీలోని ప్రధానమంత్రి కార్యాలయానికి బదిలీ అయ్యారు. 2022లో అండర్ సెక్రటరీగా చేరి 2023 జనవరి ఆరోతేదీ నుంచి డెప్యూటీ సెక్రటరీగా పనిచేస్తున్నారు. పీఎంలో ఆమె అంతర్జాతీయ వ్యవహారాల విభాగంలో విధులు నిర్వర్తించారు. 'విదేశీ వ్యవహారాలు, భద్రత' విభాగంలో పనిచేస్తూ నేరుగా జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌కు తన రోజువారీ విధి నిర్వహణ సంబంధ వివరాలు, నివేదికలను అందజేసేవారు.

నిధుల మళ్లింపు కేసులో దోషిగా తేలిన పెన్

- ఐదేళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధం
- పారిస్ కోర్టు సంచలన తీర్పు

పారిస్: ఫ్రాన్స్ నేషనల్ ర్యాలీ పార్టీ అగ్రనేత మెరీన్ లీ పెన్(56)కు కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఆర్థిక అవకతవకల కేసులో పారిస్ న్యాయస్థానం ఆమెను దోషిగా నిర్ధారించింది. ఐదేళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధం విధిస్తూ సోమవారం సంచలన తీర్పు వెలువరించింది. ఇది తక్షణమే అమల్లోకి వస్తుందని ప్రకటించింది. కోర్టు తీర్పు పూర్తిగా వెలువడకముందే లీ పెన్ కోర్టు గది నుంచి బయటకు వెళ్లిపోయారు. కరుడుగట్టిన అతివాద నాయకురాలిగా గుర్తింపు పొందిన మెరీన్ లీ పెన్ 2027లో జరిగే ఫ్రాన్స్ అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయడానికి ఏర్పాట్లు చేసుకుంటున్న తరుణంలో ప్రతికూలంగా తీర్పు రావడం శరాఘాతంగా మారింది. అయితే ఈ తీర్పుపై ఉన్నత న్యాయస్థానంలో అప్పీల్ చేసుకునే వెసులుబాటు ఉంది. అయినప్పటికీ ఆమెకు ఉపశమనం దక్కే అవకాశం లేదని న్యాయ నిపుణులు చెబుతున్నారు. మరో రెండేళ్లలో ఎన్నికలు జరుగనున్నాయి. ఆలోగా పై కోర్టులో విచారణ జరగడం, తీర్పు రావడం కష్టమేనని అంటున్నారు. యూరోపియన్ యూనియన్ నిధులను దుర్వినియోగం చేసినట్లు లీ పెన్‌పై ఆరోపణలు వచ్చాయి. 2004 నుంచి 2016 మధ్య సుమారు 33 లక్షల డాలర్లను సొంత పార్టీకి మళ్లించినట్లు దర్యాప్తులో తేలింది. ఈ కేసులో లీ పెన్‌తోపాటు మరో 12 మందిని సైతం న్యాయస్థానం దోషులుగా గుర్తించింది. లీ పెన్ గతంలో మూడుసార్లు ఫ్రాన్స్ అధ్యక్ష ఎన్నికల్లో పోటీ పడ్డారు. 2022లో ఎమ్మానుయేల్ మేక్రాన్ చేతిలో పరాజయం పాలయ్యారు.



అమెరికా పర్యటనా?... వద్దు బ్రో!

- ట్రంప్ వచ్చాక అంతర్జాతీయ పర్యాటకుల్లో గుబులు
- పర్యాటక రంగం ఈ ఏడాది 5.5 శాతం పతనమయ్యే అవకాశం
- అమెరికా ట్రిప్పులను రద్దు చేసుకుంటున్న విదేశీయులు
- ట్రంప్ విధానాలతో పర్యాటక రంగంపై తీవ్ర ప్రభావం



లీడ్స్ (యూకే): ప్రపంచంలో అత్యుత్తమ పర్యాటక దేశాల జాబితాలో అమెరికా టాప్–3లో ఉండడం పరిపాటి. శాన్ ఫ్రాన్సిస్కో, న్యూయార్క్, షికాగో వంటి నగరాలు, అక్కడున్న జాతీయ పార్కులు, వినోద కేంద్రాలు అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షిస్తుంటాయి. 2023లో 66.5 మిలియన్ల మంది అమెరికాను సందర్శించినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. 2024లో ఈ సంఖ్య మరింత ఎక్కువేనని అంచనా వేస్తున్నారు. అయితే, ఈ ఏడాది పరిస్థితి మారిపోయింది. డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత ఇతర దేశాలతో సంబంధాలు దెబ్బతింటున్నాయి. విదేశీ ఉత్పత్తులపై ట్రంప్ సుంకాల మోత మోగిస్తున్నారు. అక్రమ వలసదార్ల పేరిట వేలాది మందిని బలవంతంగా బయటకు తరిమేస్తున్నారు. ఈ పరిణామాలన్నీ కలిసి పర్యాటక రంగంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. అమెరికాలో పర్యటించాలని నిర్ణయించుకున్నవారు సైతం పునరాలోచన చేస్తున్నారు. అమెరికా పట్ల ప్రపంచ దేశాల దృక్పథంలో మార్పు కనిపిస్తోంది.

- అమెరికా పర్యాటక రంగం ఈ ఏడాది కనీసం 5.5 శాతం పతనమయ్యే అవకాశం ఉన్నట్లు పరిశోధక సంస్థ 'టూరిజం ఎకనామిక్స్' అంచనా వేసింది. ఈ మేరకు ఇటీవల ఒక నివేదిక విడుదల చేసింది. పర్యాటక రంగం ఈ ఏడాది 9 శాతం వృద్ధి చెందనున్నట్లు ఇదే సంస్థ గతంలో అంచనా వేయడం గమనార్హం.
- ప్రధానంగా డొనాల్డ్ ట్రంప్ ప్రారంభించిన టారిఫ్‌లు, వాణిజ్య యుద్ధంతో పర్యాటకానికి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం కనిపిస్తోంది. ఈ ఏడాది టూరిజంపై జనం చేసే ఖర్చు 18 బిలియన్ డాలర్లు తగ్గనున్నట్లు అంచనా.
- అమెరికా పర్యాటకానికి కెనడా ప్రజలే అతిపెద్ద వనరు. కెనడా ఉత్పత్తులపై 25 శాతం సుంకాలను ట్రంప్ విధించడం కెనడా పర్యాటకులకు నచ్చడం లేదు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి కెనడా నుంచి వచ్చే పర్యాటకుల సంఖ్యలో భారీగా తగ్గుదల నమోదవుతోంది. కొన్నిసార్లు ఇది 45 శాతంగా ఉంటోంది.
- అమెరికా ప్రయాణాలకు డిమాండ్ తగ్గడంతో విమానాల సంఖ్యను తగ్గించాల్సి వచ్చిందని ఎయిర్ కెనడా ప్రకటించింది. అమెరికాకు వెళ్లడానికి జనం ఆసక్తి చూపడం లేదని వెల్లడించింది.
- అమెరికాకు ఇప్పటికే ట్రిప్పులు ప్లాన్ చేసుకున్న వారిలో 36 శాతం మంది వాటిని రద్దు చేసుకున్నారని కెనడియన్ మార్కెట్ రీసెర్చర్ 'లెగర్' తెలియజేసింది.
- గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది కెనడా నుంచి అమెరికాకు ప్యాసింజర్ బుకింగ్‌లు 70 శాతం పడిపోయాయని ఏవియేషన్ అనలిటిక్స్ కంపెనీ 'ఓఏజీ' ప్రకటించింది.
- పర్యాటకుల రాక తగ్గుతుండడం పట్ల యూఎస్ ట్రావెల్ అసోసియేషన్ ఆందోళన వ్యక్తంచేసింది. కెనడా నుంచి పర్యాటకుల సంఖ్య 10 శాతం తగ్గినా 2.1 బిలియన్ డాలర్ల నష్టం వాటిల్లుతుందని స్పష్టంచేసింది. 1.40 లక్షలు ఉద్యోగాలు ఊడిపోయే ప్రమాదం ఉందని పేర్కొంది.
- అమెరికాలో ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయ వాతావరణం మారిపోయిందని, పర్యాటకులకు అది అనువుగా లేదని విదేశీయులు అభిప్రాయపడుతున్నారు. విదేశీయులు, వలసదార్లతోపాటు స్వలింగ వివాహాల పట్ల ట్రంప్ ప్రభుత్వం కఠినంగానే వ్యవహరిస్తోంది. అందుకే ఇప్పుడు అక్కడికి వెళ్లడం క్షేమకరం కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.
- పశ్చిమ యూరప్ ప్రజల్లో ట్రంప్ ప్రభుత్వంపై స్పష్టమైన వ్యతిరేకత కనిపిస్తోంది. ఇటీవల ఒక సర్వేలో బ్రిటన్‌లో 53 శాతం, జర్మనీలో 56 శాతం, స్వీడన్‌లో 63 శాతం, డెన్మార్క్‌లో 74 శాతం మంది ట్రంప్ సర్కారుపై ప్రతికూల అభిప్రాయం వ్యక్తం చేశారు. అమెరికాపై ఈ స్థాయిలో వ్యతిరేకత కనిపించడం 2016 తర్వాత ఇదే మొదటిసారి.
- అమెరికాకు పొరుగు దేశం మెక్సికో నుంచి కూడా అధికంగా టూరిస్టులు వస్తుంటారు. ట్రంప్ తొలి హయాంలో మెక్సికో టూరిస్టుల సంఖ్య బాగా తగ్గడం గమనార్హం. అప్పుడు మెక్సికో నుంచి విమాన ప్రయాణాలు 3 శాతం తగ్గాయి. 2025లో కూడా 2024తో పోలిస్తే ఇప్పటికే 6 శాతం తగ్గాయి.
- అమెరికాకు వెళ్తే అరెస్టయ్యే, నిర్బంధానికి గురయ్యే ప్రమాదముందని చాలా దేశాలు తమ పౌరులను అప్రమత్తం చేస్తున్నాయి. జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నాయి.
- అమెరికాలో పర్యటన కష్టంగా మారుతోందనే ఉద్దేశంతో అంతర్జాతీయ టూరిస్టులు ప్రత్యామ్నాయాల వైపు దృష్టి సారిస్తున్నారు. బెర్ముడా హోటళ్లలో బుకింగ్‌ల కోసం ఆరా తీస్తున్న వారి సంఖ్య భారీగా పెరిగింది. అమెరికా పర్యటనలు రద్దు చేసుకుంటున్నవారు యూరప్ దేశాలను డెస్టినేషన్‌గా ఎంచుకున్నారు.
- 2026లో ఫిఫా ఫుట్‌బాల్ వరల్డ్ కప్ అమెరికా, కెనడా, మెక్సికోల్లో జరుగనుంది. 2028 ఒలింపిక్స్ అమెరికాలోని లాస్ ఏంజెలెస్‌లో జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో విదేశీ పర్యాటకుల్లో భయాందోళనను తొలగించడానికి అమెరికా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చూడాలి.

సాక్షి
హైదరాబాద్
మంగళవారం : 1 : ఏప్రిల్ : 2025



ఓవర్‌టేక్ చేయబోయి..

బస్సును ఓవర్‌టేక్ చేసే క్రమంలో అదుపు తప్పిన ఇన్నోవా వాహనం ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీ కొట్టింది. చర్లపల్లిలో జరిగిన ఈ ఘటనలో ఒకరు మృతిచెందారు. -8లో



క్రియేటర్.. హుషార్..

క్రియేటర్ మీట్స్ నగర యువతలో జోష్ నింపుతున్నాయి. స్నాప్ చాట్, ఇన్‌స్టా మాధ్యమాల ఆధ్వర్యంలో ఈ ఈవెంట్స్ నిర్వహిస్తున్నారు. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37.0/24.0

నగరంలో మంగళవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 37, కనిష్టంగా 24 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.

చార్మినార్ వద్ద..





మాసబ్‌ట్యాంక్ వద్ద ప్రార్థనలు..





మీరాలం ఈద్గాలో..



రంజాన్ కా షాన్

ప్రేమ పూర్వక ఆలింగనాలు..పరస్పర శుభాకాంక్షలు..సామూహిక ప్రార్థనలు.. ప్రత్యేక వంటకాల ఘుమఘుమలు.. షీర్ కుర్మా తియ్యదనం మధ్య గ్రేటర్ పరిధిలో సోమవారం ముస్లింలు ఈద్–ఉల్–ఫితర్ (రంజాన్) పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఉదయం నుంచే ఆయా ప్రాంతాల్లోని ఈద్గాలు, మసీదులు కిక్కిరిసిపోయాయి. సామూహిక ప్రార్థనల అనంతరం బంధు మిత్రులు ఒకరికొకరు ఈద్ ముబారక్ చెప్పుకుంటూ.. షీర్ కుర్మాతో నోరు తీపి చేసుకున్నారు. మీరాలం ఈద్గా, మక్కా మసీదు, చార్మినార్ తదితర ప్రాంతాల్లో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో రాజకీయ నాయకులు, అధికారులు పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. – చార్మినార్

మీరాలం ఈద్గాలో ఎంపీ అసద్ ప్రార్థనలు



చార్మినార్: శాంతి సామరస్య జీవన విధానమే అల్లా మనకు బోధించారని..రంజాన్ మాసంలో ఐదుసార్లు నమాజ్ చేస్తూ కఠోర ఉపవాస దీక్షలు కొనసాగించిన ముస్లింలకు రంజాన్ ఈద్ ముబారక్ అని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. ఈద్–ఉల్–ఫితర్‌ను పురస్కరించుకుని సోమవారం మీరాలం ఈద్గాలో జరిగిన సామూహిక ప్రార్థనలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా శాంతి సామరస్యంతో రంజాన్ పండుగ జరుగుతోందన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల పరిరక్షణ కోసం తాము నిరంతరం కృషి చేస్తామన్నారు. హక్కులను కాపాడుకునేందుకు అల్లా మాకు మరింత బలాన్ని ఇవ్వాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో పలువురు ముస్లిం మత పెద్దలతో పాటు మజ్లిస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, ముస్లింలు పాల్గొన్నారు.

ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపిన సీవీ ఆనంద్



మీరాలం ఈద్గా వద్ద సీవీ ఆనంద్

చార్మినార్: నగరంలో కలిసి మెలిసి ఉత్సవాలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని, ఈసారి కూడా రంజాన్ మాసం పూర్తి శాంతియుత వాతావరణంలో గడిచిందని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. ఈద్–ఉల్–ఫితర్ (రంజాన్) పండుగ సందర్భంగా సోమవారం మీరాలం ఈద్గా వద్ద సామూహిక ప్రార్థనల నేపథ్యంలో బందోబస్తును ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సీవీ ఆనంద్ ముస్లిం ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ.. చిన్నారులకు చాక్లెట్లు అందజేశారు. ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ సీపీ లా అండ్ ఆర్డర్ విక్రంసింగ్ మాన్, జాయింట్ సీపీ ట్రాఫిక్ జోయల్ డెవిస్, నగర ట్రాఫిక్ డిసిపి–3 ఆర్.వెంకటేశ్వర్లు, దక్షిణ మండలం డీసీపీ స్నేహా మెహ్రాతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

8 నుంచి ఓయూ డిగ్రీ వార్షిక పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో ఏప్రిల్ 8 నుంచి రెగ్యులర్ డిగ్రీ కోర్సుల వార్షిక పరీక్షలు ప్రారంభంకానున్నాయి. బీఏ, బీకాం, బీఎస్సీ, ఇతర డిగ్రీ కోర్సుల వివిధ సెమిస్టర్ పరీక్షలకు టైంటేబుల్‌ను విడుదల చేశారు. కాగా, మూడేళ్లుగా విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ప్రభుత్వం విడుదల చేయనందున పరీక్షలను బహిష్కరించనున్నట్లు ప్రైవేటు కాలేజీల యజమానులు ఓయూ అధికారులకు లేఖ అందించారు.

‘భవిష్యత్’ బాస్ ఎవరు?

త్వరలోనే ఫ్యూచర్ సిటీ అథారిటీకి కమిషనర్ నియామకం

- యువ ఐఏఎస్ అధికారికి పగ్గాలు ఇచ్చే అవకాశం..
- శశాంక, హరీష్, గోపిల పేర్లు పరిశీలన
- ఇప్పటికే అథారిటీ కోసం 90 పోస్టులకు గ్రీన్ సిగ్నల్



హరీష్ గోపి శశాంక

సాక్షి, సిటీబ్యూరో: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డ్రీమ్ ప్రాజెక్ట్ అయిన ఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో కీలకమైన అడుగు పడనుంది. ఈ మేరకు ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ)కి కమిషనర్‌ను నియమించనున్నారు. చురుకైన యువ ఐఏఎస్ అధికారిని ప్రాజెక్ట్ సారథిగా నియమిస్తే బాగుంటుందనే భావనలో సీఎం రేవంత్ ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రతిపాదిస్తున్న ఫోర్త్ సిటీని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. ఈ నేపథ్యంలోనే ఎఫ్‌సీడీఏ పరిధిని ప్రత్యేకంగా భావిస్తోంది. ప్రపంచ ప్రఖ్యాత ఐటీ, ఫార్మా, క్రీడారంగాలకు ప్రాధాన్యతనిస్తున్న సర్కారు..ఆ మేరకు జోన్‌లను కూడా నిర్దేశిస్తోంది. వీటన్నింటిని గమనంలోకి తీసుకుంటున్న ప్రభుత్వ పెద్దలు అంతర్జాతీయ నగరాలపై అవగాహన ఉన్న యువ అధికారులకు దీని పాలనపగ్గాలు కట్టబెట్టే దిశగా ఆలోచన చేస్తోంది. ఈ నేపథ్యంలోనే..గతంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్లుగా వ్యవహరించిన కె.శశాంక(2013), డాక్టర్ ఎస్.హరీశ్(2015) పేర్లను పరిశీలిస్తోంది. ఈ ప్రాంతంపై వీరికి స్పష్టమైన అవగాహన ఉండడం కలిసొచ్చే అంశంగా భావిస్తోంది. అలాగే గోపి (2016) పేరును కూడా పరిగణనలోకి తీసుకుంటున్న సర్కారు.. అతి త్వరలోనే తుది నిర్ణయాన్ని ప్రకటించే అవకాశముంది.

90 పోస్టులకు గ్రీన్‌సిగ్నల్..

హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ తర్వాత గ్రేటర్‌లో ఫోర్త్ సిటీ అవసరం ఉందని సీఎం రేవంత్ నిర్ణయించారు. 765.28 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఫోర్త్ సిటీని అభివృద్ధి చేయాలన్నది రేవంత్ సర్కార్ లక్ష్యం. మహేశ్వరం, ఆమన్‌గల్, కడ్తాల్, కందుకూరు, ఇబ్రహీంపట్నం, యాచారం, మంచాల ఏడు మండలాల్లోని 56 గ్రామాలు ఎఫ్‌సీడీఏ పరిధిలోకి వస్తాయి. ఇప్పటికే ఎఫ్‌సీడీఏ కోసం కొత్తగా 90 పోస్టులకు మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది వీటిలో 34 రెగ్యులర్ పోస్టులు కాగా..మిగిలిన 56 పోస్టులను ఔట్ సోర్సింగ్/కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేస్తారు. ఎఫ్‌సీడీఏ కమిషనర్ నియామకం పూర్తవగానే ఫ్యూచర్ సిటీ నిర్మాణం మరింత వేగం పుంజుకుంటుందని అధికారులు చెబుతున్నారు.

నాలుగేళ్లలో కార్యరూపం..

ఇప్పటికే ఫోర్త్ సిటీలో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ నిర్మాణం ప్రారంభమవగా పనులు చకచకా సాగుతున్నాయి. ఉగాది తర్వాత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సిటీ నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఇదే సమయంలో ఫ్యూచర్ సిటీకి అన్ని ప్రాంతాల నుంచి అనుసంధానం చేసేందుకు గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్ల నిర్మాణానికి సైతం ప్రణాళికలు సిద్ధమయ్యాయి. మరో వైపు ఫ్యూచర్ సిటీలో పలు జాతీయ, అంతర్జాతీయ సంస్థల ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియను సైతం తెలంగాణ ప్రభుత్వం వేగవంతం చేసింది. వచ్చే నాలుగేళ్లలో ఫ్యూచర్ సిటీకి ఓ రూపం తీసుకువచ్చేలా పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తోంది.



ఆల్‌టైమ్ రికార్డు!

రూ.2 వేల కోట్లు దాటిన వసూళ్లు

- ఆస్తిపన్ను వసూళ్లలో జీహెచ్‌ఎంసీ గ్రేట్..



సాక్షి, సిటీబ్యూరో: ఆస్తిపన్ను వసూళ్లలో జీహెచ్‌ఎంసీ చరిత్ర సృష్టించింది. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది రూ. 2 వేల కోట్లకు పైగా వసూలు చేసింది. 2014–15లో మూడంకెల నుంచి నాలుగంకెలకు ఆస్తి పన్ను వసూలైంది. తొలిసారిగా వెయ్యి కోట్ల మార్కు దాటి అప్పట్లో రూ.1085.73 కోట్లు వసూలు చేసింది. తిరిగి ఇప్పుడు రెండు వేల కోట్ల మార్కు దాటింది. సోమవారం సాయంత్రం 6 గంటల వరకు రూ.2012.36 కోట్లు వసూలైంది. అర్ధరాత్రి వరకు ఆన్‌లైన్ చెల్లింపులకు అవకాశం ఉండటంతో మంగళవారం కచ్చితమైన లెక్కలు వెల్లడి కానున్నాయి. భారీ బకాయిదారులకు ప్రభుత్వం కల్పించిన ఓటీఎస్ రాయితీ కూడా ఇందుకు ఉపకరించింది. మార్చి నెలలో చివరి మూడు వారాల్లోనే దీనివల్ల రూ.465.07 కోట్లు వసూలైంది.

నేటి నుంచే ‘ఎర్లీబర్డ్’!

ఆస్తిపన్నుపై 5 శాతం రాయితీ.. నెలాఖరు వరకు

జీహెచ్‌ఎంసీ పరిధిలో కొత్త ఆర్థిక సంవత్సరం (2025–26) మొదటి నెల (ఏప్రిల్)లోనే ఆస్తిపన్ను మొత్తం చెల్లించే వారికి 5 శాతం రాయితీ వర్తించే ‘ఎర్లీబర్డ్’ పథకం మంగళవారం నుంచే అమల్లోకి వస్తుంది. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఆస్తిపన్ను పాతబకాయిలు లేనివారికి, 2025–26 ఆర్థిక సంవత్సరం మొత్తం ఆస్తిపన్ను ఒకే దఫా చెల్లించేవారికి మాత్రమే ఈ రాయితీ వర్తిస్తుంది. ఇది కేవలం కొత్త ఆర్థిక సంవత్సరానికి మాత్రమే. పాత బకాయిదారులకు ఈ రాయితీ వర్తించదని జీహెచ్‌ఎంసీ స్పష్టం చేసింది. ఏప్రిల్ 30వ తేదీ వరకు ‘ఎర్లీబర్డ్’ కింద 5 శాతం రాయితీతో ఆస్తిపన్ను చెల్లించవచ్చు.

2014-15 నుంచి ఆస్తిపన్ను వసూళ్లు ఇలా..


సంవత్సరం	వసూలు (రూ.కోట్లు)
2014-15	1085.73
2015-16	1129.33
2016-17	1311.06
2017-18	1326.83
2018-19	1337.65
2019-20	1356.47
2020-21	1632.9
2021-22	1466.58
2022-23	1680.54
2023-24	1917.00
2024-25	(పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది)

అక్రమంగా అలారం చైన్ లాగేస్తున్న ప్రయాణికులు

హడలెత్తిస్తున్న ‘అలారం హాల్టింగ్’!

అకస్మాత్తుగా నిలిచిపోతున్న రైళ్లు..

- సూపర్‌ఫాస్ట్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ‘అలారం హాల్టింగ్’
- ఏటా సుమారు 5 వేల రైళ్ల నిర్వహణకు ఆటంకాలు
- లక్షలాది మంది ప్రయాణికులకు ఇబ్బందులు





సాక్షి, సిటీబ్యూరో: అగ్నిప్రమాదాలు జరగలేదు. అగంతకులు ప్రవేశించలేదు. అత్యవసర పరిస్థితి అసలే కాదు. అయినా సరే కొందరు ఆకస్మాత్తుగా రైళ్లను ఆపేస్తున్నారు. అవసరం ఉన్నా లేకపోయినా అలారం చైన్ లాగేస్తున్నారు. దీంతో గంటకు సుమారు 80 కిలోమీటర్ల వేగంతో పరుగులు తీసే రైళ్లకు బ్రేకులు పడుతున్నాయి. హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాల్లో రాకపోకలు సాగించే పలు రైళ్లలో ఈ ‘అక్రమ హాల్టింగ్’ దక్షిణమధ్య రైల్వే అధికారులను ఆందోళనకు గురిచేస్తోంది. రైలు ఒకసారి పట్టాలపైన నిలిచిపోతే తిరిగి కదిలేందుకు కనీసం 15 నిమిషాలకు పైగా సమయం తప్పదు. దీంతో రైళ్ల రాకపోకల్లోనూ జాప్యం చోటుచేసుకుంటుంది. వివిధ జిల్లా కేంద్రాల నుంచి హైదరాబాద్‌కు రెగ్యులర్‌గా రాకపోకలు సాగించే కొందరు ప్రయాణికులు తమ స్నేహితుల కోసం, బంధువుల కోసం అక్రమంగా అలారం చైన్ లాగి రైళ్లకు బ్రేకులు వేస్తున్నట్లు అధికారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇలా ప్రతి సంవత్సరం సుమారు 5000 రైళ్లకు ఎక్కడో ఒక చోట అనవసరమైన బ్రేకులు పడుతున్నాయి. ఈ అక్రమ హాల్టింగ్ సమస్య రైళ్ల నిర్వహణలో అధికారులను హడలెత్తిస్తోంది. మరోవైపు రైళ్లు నడిపే లోకోపైలెట్‌లు, విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది సైతం తీవ్ర ఒత్తిడికి గురవుతున్నట్లు దక్షిణమధ్య రైల్వే ఉన్నతాధికారి ఒకరు విస్మయం వ్యక్తం చేశారు.

దుర్వినియోగమవుతున్న అలారం చైన్....

సాధారణంగా ప్రతి రోజు వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది ప్రయాణికులు ఉద్యోగ, వ్యాపార అవసరాల దృష్ట్యా నగరానికి రాకపోకలు సాగిస్తారు. ఈ క్రమంలో కొన్ని హాల్టింగ్ సదుపాయంలేని రైల్వే స్టేషన్‌లలో ట్రైన్ కోసం ఎదురుచూసే స్నేహితులు, బంధువుల కోసం చైన్‌లు లాగుతున్నారు. కొన్ని చోట్ల చైన్‌లు లాగి తమకు అవసరమైన చోట ట్రైన్ దిగి తాపీగా వెళ్లిపోతున్నారు. ‘ఖమ్మం, వరంగల్, కాజీపేట్ తదితర స్టేషన్‌ల నుంచి సికింద్రాబాద్‌కు వచ్చే దక్షిణ్ ఎక్స్‌ప్రెస్, గోదావరి, గౌతమి, ఇంటర్‌సిటీ వంటి కొన్ని రైళ్ల కోసం ప్రయాణికులు ఆలస్యంగా స్టేషన్‌లకు చేరుకుంటారు. అప్పటికే రైళ్లు కదులుతాయి. అలాంటి సమయాల్లో అప్పటికే ట్రైన్ ఎక్కిన వాళ్లు తమకు తెలిసిన ప్రయాణికుల సూచనల మేరకు చైన్‌లు లాగుతున్నారు. దీంతో అప్పుడప్పుడే వేగాన్ని అందుకున్న ట్రైన్‌లు ఆగిపోతాయి.’ అని ఒక అధికారి విస్మయం వ్యక్తం చేశారు. ఒక్క ఖమ్మం, వరంగల్ వంటి ప్రాంతాలే కాకుండా అన్ని వైపులా ఈ సమస్య తీవ్రంగా ఉందని పేర్కొన్నారు. నగర శివారు ప్రాంతాలకు చేరుకున్న తరువాత కూడా కొంతమంది తమకు అవసరమైన చోట ట్రైన్ దిగేందుకు చైన్ లాఘవాన్ని ప్రదర్శిస్తున్నట్లు అధికారుల పరిశీలనలో వెల్లడైంది.

రైళ్ల రాకపోకల్లో ఆలస్యం...

- తరచుగా తలెత్తే ఈ సమస్యల వల్ల రైళ్ల నిర్వహణలో సాంకేతిక ఇబ్బందులు తలెత్తుతున్నట్లు అధికారులు తెలిపారు.
- ఒకసారి చైన్ లాగడం వల్ల 15 నిమిషాలకు పైగా రైలు ఆగుతుంది. అలాగే లోకోపైలెట్‌లు, ఇతర సిబ్బంది తీవ్రమైన ఒత్తిడికి గురవుతారు.

చైన్ లాగాలంటే...

- రైల్వే భద్రతా చట్టం ప్రకారం అనూహ్యమైన ప్రమాదాలు జరిగినప్పుడు అలారం చైన్ లాగేందుకు అవకాశం ఉంది. అగ్ని ప్రమాదాలు, దొంగతనాలు, అసాంఘిక శక్తుల వేధింపులు, ఆకస్మికంగా తీవ్రమైన అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు చైన్ లాగి ట్రైన్ ఆపేందుకు అవకాశం ఉంది.
- ఆ సమయంలో అధికారులకు సహేతుకమైన సమాచారాన్ని అందజేయాలి. అవసరమైతే ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ వంటి పోలీసుల సహాయం తీసుకోవాలి.
- ఒకసారి చైన్ లాగిన వెంటనే అధికారులు, సిబ్బంది సంబంధిత బోగీ వద్దకు వచ్చి వివరాలు తెలుసుకుంటారు. ఆ సమయంలో అక్రమంగా రైలును నిలిపినట్లు తేలితే చట్టపరంగా జైలు శిక్ష పడే అవకాశం ఉంది.
- అలారం చైన్‌పైన అవగాహన కల్పించేందుకు ఆర్పీఎఫ్ వివిధ రూపాల్లో ప్రదర్శనలను ఏర్పాటు చేస్తోంది.అలాగే కొన్ని ప్రధాన రైళ్లలో నిఘా వ్యవస్థలను సైతం ఏర్పాటు చేసింది.
- గత సంవత్సరం దక్షిణమధ్య రైల్వేలో అక్రమంగా అలారం చైన్ లాగిన ఉదంతాలపైన 5,704 కేసులు నమోదయ్యాయి. సుమారు 5,388 మందిని అరెస్ట్ చేశారు.
- ఈ ప్రయాణికులపైన సుమారు రూ.14 లక్షల జరిమానా విధించినట్లు అధికారులు తెలిపారు.

మన సంస్కృతిని కాపాడుకుందాం

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

గన్‌ఫౌండ్రీ: తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు ఉగాది ప్రతీక అని, ఈ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకుంటూ ముందు తరాలకు అందించడం మన బాధ్యత అని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో కిన్నెర ఆర్ట్ థియేటర్స్, కిన్నెర కల్చరల్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో శ్రీ విశ్వావసు నామ ఉగాదిని పురస్కరించుకొని వివిధ రంగాల్లో సేవలందిస్తున్న ప్రముఖులకు పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ సంప్రదాయాలు, శాస్త్రీయ, సంగీత కళల పరిరక్షణకు సాంస్కృతిక సంస్థలు చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రముఖుల సందేశాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కేంద్ర రక్షణ శాఖ పూర్వ సలహాదారు డాక్టర్ జి.సతీష్‌రెడ్డికి కల్నల్ నాగేంద్రరావు స్మారక పురస్కారం, ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ దశరథ రామిరెడ్డికి సరస్వతి కృష్ణ స్మారక పురస్కారాలను ప్రదానం చేశారు. అంతకు ముందు కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత మద్దాలి ఉషా గాయత్రి ఆధ్వర్యంలో ప్రదర్శించిన ‘అలివేలు మంగ చరితం’ కూచిపూడి నృత్య రూపకం ఆహూతులను అలరించింది. కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎల్వీ సుబ్రమణ్యం, కిన్నెర కార్యదర్శి మద్దాలి రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.



అవార్డులు అందుకుంటున్న డాక్టర్ సతీష్‌రెడ్డి, డాక్టర్ దశరథ రామిరెడ్డి

నకిలీ వైద్యులదే రాజ్యం

- పేదలు, వలస కార్మికులే బాధితులు
- పుట్టగొడుగుల్లా క్లినిక్‌లు
- స్టెరాయిడ్స్, అబార్షన్లు సైతం
- ఏడాదిలో 420 కేసులు నమోదు
- హైదరాబాద్‌లోనే అత్యధికం



నిజాంపేట్ సర్కిల్‌లో ఓ మహిళ తాను వైద్యురాలినంటూ నమ్మబలికి క్లినిక్‌లు నడిపిస్తోంది. అంతటితో ఆగకుండా చట్టవ్యతిరేకంగా అబార్షన్లు సైతం చేస్తోంది. దీనిపై ఫిర్యాదులు అందడంతో తనిఖీలు నిర్వహించిన అధికారులు ఆమెపై కేసు నమోదు చేశారు.
ఇటీవల మియాపూర్ కాలనీ, ఆరాంఘర్, చంపాపేట్, తదితర ప్రాంతాల్లోనూ అర్హత లేకుండా అల్లోపతి మందులు రాయడం, గర్భిణులకు పరీక్షలు నిర్వహించడం, స్కానింగ్‌లు చేయడం వంటి కార్యక్రమాలకు పాల్పడుతుండటంతో 12 మందిపై కేసులు నమోదు చేశారు. ఇవే కాదు.. గడిచిన ఏడాది కాలంలో 420 మంది నకిలీ వైద్యులపై కేసులు నమోదు చేశారు. వీరికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ.5 లక్షల వరకు జరిమానాలు విధిస్తున్నారు.

సాక్షి, సిటీబ్యూరో: ఒకరిది అవసరం.. మరొకరిది అవకాశం.. వెరసి అనామకులైన వ్యక్తులు సైతం వైద్యులుగా సమాజంలో చలామణి అయిపోతున్నారు. హైదరాబాద్ వంటి మహా నగరం సుమారు 60 శాతం మందికి పైగా నకిలీ వైద్యులు మనుగడలో ఉన్నారంటే ఆశ్చర్యపోవాల్సి అవసరం లేదు. 2024 ఫిబ్రవరి నుంచి 2025 ఫిబ్రవరి వరకు తెలంగాణ మెడికల్ కౌన్సిల్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో మొత్తం 420 మందికిపై కేసులు నమోదు చేశారు. ఇందులో హైదరాబాద్ పరిధిలోనే సుమారు 200 పైగా కేసులు నమోదు కావడం గమనార్హం. ప్రపంచంలో అత్యాధునిక వైద్య సేవలకు మెడికల్ హబ్‌గా పేరుగాంచిన హైదరాబాద్‌లోనూ ఈ స్థాయిలో నకిలీ, అర్హత లేని వ్యక్తులు వైద్యం చేయడం విస్మయానికి గురిచేస్తోంది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం నిర్దిష్టమైన సిలబస్ నేర్చుకుని, ప్రథమ చికిత్సలో శిక్షణ పొందిన వారిని ఆర్‌ఎంపీ, పీఎంపీలుగా ప్రథమ చికిత్స అందించవచ్చని జీవో జారీ చేసింది. తదుపరి కాలంలో ఈ సర్టిఫికెట్ల జారీ ప్రక్రియను ప్రభుత్వం నిలిపివేసింది. అయితే ఆర్‌ఎంపీ, పీఎంపీల పేరుతో చలామణీ అవుతున్న కొందరు నకిలీ వైద్యులు ఎలాంటి అర్హతలు లేకుండా వైద్య సేవలందిస్తున్నారు. ప్రథమ చికిత్సకే పరిమితం కావాల్సిన వారు క్లినిక్‌లు ఏర్పాటు చేసి చట్ట వ్యతిరేకంగా స్కానింగ్‌లు, అబార్షన్లు చేయడం, అవసరం లేకున్నా స్టెరాయిడ్స్, యాంటీబయోటిక్స్ ఇవ్వడం, గ్లూకోజ్‌లు పెట్టడం, బీపీ మందులు రాయడం, ఎంబీబీఎస్ వైద్యులతో సమానంగా అన్ని చికిత్సలు నిర్వహిస్తున్నారు. దీనిపై ఫిర్యాదులు అందడంతో గత ఏడాది కాలంగా తెలంగాణ మెడికల్ కౌన్సిల్ తనిఖీలు నిర్వహిస్తోంది. ఈ క్రమంలో పదో తరగతి, ఇంటర్ పాస్ కాని వారు కూడా వైద్యులుగా చెలామణీ అవుతున్నట్లు గుర్తించారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న నకిలీ వైద్యులపై కేసులు నమోదు చేయడం, జరిమానాతో పాటు జైలుకు పంపిస్తున్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం



జ్వరం వచ్చిందని వస్తే ఇష్టానుసారంగా ఐవీ ఇంజెక్షన్, ఇస్తున్నారు. ఎంబీబీఎస్ డిగ్రీ లేకుండా ఎవరూ ప్రాక్టీస్ చేయకూడదని జాతీయ వైద్య కమిషన్ చెబుతోంది. స్థానికంగా కొంత మంది ఎలాంటి అర్హతలు లేకున్నా ఇష్టానుసారంగా వైద్య సేవలందిస్తున్నారు. అవసరం లేకపోయినా ఇష్టారీతిన యాంటీబయోటిక్స్, స్టెరాయిడ్స్, నొప్పి నివారణ ఇంజెక్షన్స్ ఇస్తున్నారు. ఫలితంగా ప్రజారోగ్యానికి పెను ముప్పు పొంచి ఉంది. గీత దాటి వ్యవహరించే వారిపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ కఠినంగా వ్యవహరిస్తుంది. నిత్యం తనిఖీలు నిర్వహించి, కేసులు నమోదు చేస్తున్నాం.

– జీ. శ్రీనివాస్ తెలంగాణ మెడికల్ కౌన్సిల్ వైస్ చైర్మన్

పేదలే బాధితులు..



హైదరాబాద్‌కు వలస వచ్చిన పేద కుటుంబాలకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకునే స్తోమత లేదు. నగరంలో జనాభా అవసరాలకు సరిపడా ఆసుపత్రులు కావాలి. ఆరోగ్య శ్రీ, ఆయుష్మాన్ పథకాల్లో అర్హులు కాకపోవడంతో ఖర్చులకు భయపడి, స్థానిక ఆర్‌ఎంపీ, పీఎంపీలను ఆశ్రయిస్తున్నారు. భవిష్యత్తులో రాష్ట్ర జనాభాలో 50 శాతం మంది హైదరాబాద్‌లోనే స్థిరపడే అవకాశం ఉంది. దీనికి అనుగుణంగా వైద్య సదుపాయాలను మెరుగుపరచాలి. ఆర్‌ఎంపీలను నియంత్రించడం కంటే వారిని పర్యవేక్షించడం, ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలన మెరుగుపరచడంపై దృష్టి సారించాలి.

– కిరణ్ మాదల, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెలంగాణ శాఖ కో– కన్వీనర్

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

నాంపల్లి: గూడ్స్ రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన నాంపల్లి రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలోని భరత్‌నగర్–బోరబండ రైల్వేస్టేషన్ల మధ్యలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..సుమారు 55 ఏళ్ల వయస్సు గల ఓ గుర్తుతెలియని వ్యక్తి గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడి ఒంటిపై మెరూన్ బ్లాక్ కలర్ టీ షర్టు, తెలుపు రంగు ప్యాంటు ధరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి..

కుత్బుల్లాపూర్: కారు ఢీ కొనడంతో రోడ్డు దాటుతున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కొంపల్లి గార్డెన్ హౌసింగ్ సొసైటీకి చెందిన మహేంద్ర చౌదరి(34) ఆదివారం రాత్రి తన బంధువు లాలు చౌదరితో కలిసి సరుకులు కొనుగోలు చేసేందుకు కొంపల్లికి వచ్చాడు. పని ముగించుకున్న అనంతరం కొంపల్లి సినీ ప్లానెట్ వద్ద రోడ్డు దాటుతుండగా మేడ్చల్ నుంచి సుచిత్ర వైపు వెళుతున్న ఫార్చునర్ కారు అతడిని ఢీకొట్టింది. ఈ ఘటనలో అతడి తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తిట్టాడని చంపేశాడు..



వెంకటేశ్వర్లు (ఫైల్)

- ఫైనాన్స్ వ్యాపారి దారుణ హత్య
- సహజీవనం చేస్తున్న మహిళ కుమారుడి ఘాతుకం

చైతన్యపురి: తిట్టాడని డైలీ ఫైనాన్స్ వ్యాపారిని అతడితో సహజీవనం చేస్తున్న మహిళ కుమారుడు దారుణంగా హత్య చేసిన సంఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..రంగారెడ్డి జిల్లా, పులిమామిడి గ్రామానికి చెందిన బచ్చు వెంకటేశ్వర్లు అలియాస్ రాజు (47) గత కొన్నాళ్లుగా కర్మన్‌ఘాట్‌లోని జానకీ ఎన్‌క్లేవ్‌లో నివాసం ఉంటున్నాడు. అతడి భార్య విడిపోవటంతో ఒక్కడే ఉంటూ డైలీ ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్నాడు. సూర్యాపేట జిల్లా శ్రీనివాసపురం గ్రామానికి చెందిన మామిడి గురవమ్మ భర్త మృతి చెందటంతో కుమారుడు పవన్, కుమార్తెతో కలిసి అదే ప్రాంతంలో నివాసం ఉంటోంది. ఈ క్రమంలో వెంకటేశ్వర్లు, గురవమ్మలకు పరిచయం ఏర్పడింది. గురవమ్మ కుమారుడు, కుమార్తె మరో ఇంట్లో ఉంటుండగా ఆమె వెంకటేశ్వర్లుతో సహజీవనం చేస్తోంది. గత కొద్ది రోజులుగా వెంకటేశ్వర్లు గురవమ్మ ఆమె కొడుకు, కుమార్తెను దూషిస్తున్నాడు. ఆదివారం ఉగాది పండుగ నేపథ్యంలో గురవమ్మ తన కుమారుడు, కుమార్తెను ఇంటికి పిలిచింది. రాత్రి వెంకటేశ్వర్లు, గురవమ్మ, పవన్‌ల మధ్య గొడవ జరగడంతో పవన్ కత్తితో వెంకటేశ్వర్లుపై దాడి చేశాడు. అనంతరం సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాడు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అపస్మారక స్థితిలో ఉన్న వెంకటేశ్వర్లును చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతను మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. హత్యకు పాల్పడిన పవన్ పరారీలో ఉన్నాడని, మృతుడి మేనల్లుడి ఫిర్యాదు మేరకు గురవమ్మతో పాటు ఆమె కుమారుడు పవన్, కుమార్తెలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

చోరీ కేసులో నిందితుల రిమాండ్

రూ.9 లక్షల బంగారు ఆభరణాలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రాములు

అల్వాల్: చోరీకి పాల్పడిన ఇద్దరిని అల్వాల్ పోలీసులు 72 గంటల్లోనే అరెస్ట్ చేశారు. పేట్‌బషీర్‌బాగ్ ఏసీపీ రాములు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 27న అర్ధరాత్రి అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీనగర్ కాలనీలో ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో సుమారు రూ.9 లక్షల విలువైన 12 తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. సుమారు 100 కెమెరాల ఫుటేజీని పరిశీలించి ఇద్దరు నిందితులను గుర్తించారు. నిందితుల్లో హస్మత్‌పేట్‌కు చెందిన కౌశిక్ (19), ఎల్బీనగర్‌కు చెందిన రవితేజ(20)లను కానాజిగూడలో 29న సాయంత్రం అరెస్ట్ చేసి వారి నుంచి బంగారు ఆభరణాలు, ద్విచక్ర వాహనం, 2 సెల్‌ఫోన్లు, సుత్తిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు.

నిందితులిద్దరూ స్నేహితులు..

నిందితులు ఇద్దరు స్నేహితులని తొమ్మిదోతరగతి వరకు కలిసి చదువుకున్నారన్నారు. ఆర్థిక పరిస్థితులు బాగాలేక రవితేజ క్లాత్‌స్టోర్‌లో సేల్స్‌మెన్‌గా, కౌశిక్ స్వీపర్‌గా పనిచేస్తున్నారని, కేటరింగ్ పార్ట్‌టైమ్‌గా చేసే వీరిద్దరూ ఈనెల 27న జాన్వీ ఫంక్షన్‌హాల్‌లో పనిపూర్తయిన తర్వాత మద్యం సేవించి దొంగతనానికి పాల్పడ్డారన్నారు. రవితేజ గతంలో మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజా కేసులో జైలుకెళ్లి వచ్చాడన్నారు. ఇన్‌స్పెక్టర్ రాహుల్‌దేవ్, డీఐ తిమ్మప్ప, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ డాలినాయుడు పాల్గొన్నారు.

బస్సును ఓవర్‌టేక్ చేయబోయి..

- ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీ కొట్టిన ఇన్నోవా..
- భర్త మృతి, భార్య, ఇద్దరు పిల్లలకు తీవ్రగాయాలు..



భార్య పిల్లలతో పుల్లారావు(ఫైల్)..



బైక్‌ను ఢీ కొట్టిన ఇన్నోవా, పుల్లారావు మృతదేహం

కుషాయిగూడ: బస్సును ఓవర్‌టేక్ చేసే క్రమంలో అదుపు తప్పిన ఇన్నోవా వాహనం ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో భర్త మృతి చెందగా, భార్య, ఇద్దరు పిల్లలు తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం చర్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రవికుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గుంటూరుకు చెందిన కొండేపాటి పుల్లారావు నగరానికి వచ్చి బీఎన్‌రెడ్డి నగర్‌లో నివాసం ఉంటున్నాడు. సోమవారం అతను భార్య పిల్లలతో కలిసి బైక్‌పై ఈసీనగర్ నుంచి పెద్ద చర్లపల్లి వైపుగా వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ఇన్నోవా వాహనం బస్సును ఓవర్ టేక్ చేయబోయి అదుపుతప్పి ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో పుల్లారావు (32) అక్కడికక్కడే మృతి చెందగా, అతడి భార్య నాగరాణి, కుమారులు రుత్విక్, రాజేష్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను పోలీసులు చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. వారు ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు. ఇన్నోవా డ్రైవర్ అజాగ్రత్త కారణంగా ఈ ప్రమాదం జరిగిందన్నారు.

రూ. 7 వేలు చెల్లించాల్సిందే

- వస్త్ర దుకాణం యజమానికి రంగారెడ్డి జిల్లా వినియోగదారుల కమిషన్ ఆదేశం
- 45 రోజుల్లో పరిహారం చెల్లించాలి
- లేదా మరో రూ.3 వేలు చెల్లించాల్సి ఉంటుంది

సిటీ కోర్టులు : నాణ్యతలేని దుస్తులు విక్రయించి బాధితురాలిని ఇబ్బందులకు గురి చేసిన వస్త్ర దుకాణం యజమానిపై రంగారెడ్డి జిల్లా కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎంతో నాణ్యమైనవని నమ్మించి విక్రయించిన దుస్తులు ఒక్కరోజులోనే పాడైపోవడంతో రిటన్ తీసుకునేందుకు నిరాకరించడం షాప్ నిర్వాహకుల నిర్లక్ష్యమేనని స్పష్టం చేసింది. నాసిరకం దుస్తులు విక్రయించినందుకు వాటి ధర రూ.2900 తోపాటు మానసికంగా ఇబ్బందులకు గురిచేసినందుకు రూ.2000 కోర్టు ఖర్చుల కింద మరోరూ.5000 వేలు వెంటనే చెల్లించాలని షాప్ యాజమన్యాన్ని ఆదేశించింది. ఈ మొత్తాన్ని 45 రోజుల్లోపు బాధితురాలికి చెల్లించాలని లేని పక్షంలో మరో రూ.3000 కలిపి ఇవ్వాల్సి ఉంటుందని ఆదేశిస్తూ ఇటీవల రంగారెడ్డి జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు సిహెచ్ లతాకుమారి, సభ్యులు పారుపల్లి జవహర్‌బాబు, శ్యామలతో కూడిన బెంచ్ తీర్పును ఇచ్చింది.

కేసు వివరాలిలీ..

సికింద్రాబాద్‌కు చెందిన వనజ గత ఏడాది నాచారంలోని మహావీర్ హోజియరీ ఎక్స్‌ఎల్‌యూ దుకాణంలో రూ.2900 పెట్టి ఓ డ్రెస్ కొనుగోలు చేసింది. ఆ సమయంలో షాప్ యజమాని ఇది చాలా నాణ్యతతో కూడిన వస్తువు అని చెప్పడంతో ఆమె రూ.2900 చెల్లించి డ్రెస్‌ను కొనుగోలు చేసింది. మర్నాడు రోజు డ్రెస్ వేసుకోగా చినిగిపోయింది, దీంతో ఆమె తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని లేని పక్షంలో వేరే డ్రెస్ ఇవ్వాలని షాప్ నిర్వాహకులను కోరింది. దీంతో షాప్ యజమాని ఉద్దేశపూర్వకంగా మీరే డ్రెస్ పాడు చేసుకున్నారని, తాము తిరిగి ఇచ్చేది లేదని చెప్పాడు. దీంతో బాధితురాలు రంగారెడ్డి జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించింది. బాధితురాలు దాఖలు చేసిన పిటిషన్‌ను పరిశీలించిన కమిషన్ షాప్ నిర్వాహకులను పై విధంగా ఆదేశిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

డిజిటల్ అరెస్ట్ కేసులో మహిళా రియల్టర్ అరెస్ట్

బంజారాహిల్స్: డిజిటల్ అరెస్టు పేరుతో మోసానికి పాల్పడిన కేసులో ఓ మహిళా రియల్ ఎస్టేట్ వ్యాపారిని సైబరాబాద్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. నగరానికి చెందిన ఓ బాధిరాలికి ముంబై బ్రాందాలోని కుర్లా పోలీస్‌స్టేషన్ నుంచి ఫోన్ చేస్తున్నామని, మీ పేరున ఉన్న ఐసీఐసీఐ బ్యాంక్ ఖాతాలో అక్రమ లావాదేవీలు జరిగాయని, దీనిపై విచారణ జరుపుతున్నట్లు చెప్పారు. ఇందుకోసం స్కైప్ కాల్ చేసిన అవతలి వ్యక్తి మనీలాండరింగ్ లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాల్లో మీరు పాల్గొన్నారో లేదో నిర్ధారించుకుని, క్లియరెన్స్ సర్టిఫికెట్ అందజేస్తామని, ఇందుకోసం మీరు రూ.3,57,998 పంపించాలని, తిరిగి ఆ మొత్తాన్ని 24 గంటల్లోపు పంపిస్తామని నమ్మబలికారు. దీంతో బాధితుడు తన ఖాతాలో అంత మొత్తం లేకపోయినా రుణం తీసుకుని ఆ మొత్తాన్ని నిందితుడి ఖాతాకు బదిలీ చేశాడు. తాను ట్రాన్స్‌ఫర్ చేసిన నగదు రాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు నిందితులను గుర్తించారు. గుంటూరు కాటవరానికి చెందిన ఫిజియోథెరపిస్ట్ తోట శ్రీనివాసరావు, జీవన్ కుమార్, రఘువీర్‌లను గత నెల 25న అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. ఈ కేసులో నిందితురాలిగా ఉన్న మహిళా రియల్ ఎస్టేట్ వ్యాపారి కొంపల్లికి చెందిన క్రోతపల్లి రితికను సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు, టెలిగ్రామ్, వాట్సప్ కాల్స్ ఆధారంగా మోసాలకు పాల్పడుతున్నట్లు తెలినారు. వారి నుంచి మూడు సెల్ ఫోన్లు, వివిధ బ్యాంకులకు చెందిన 9 చెక్కు బుక్‌లు, 3 పాస్‌బుక్‌లు, రెండు స్టాంపులు, ఒక క్యూఆర్ కోడ్ స్కానర్, మూడు ఏటీఎం కార్డులు, 5 సిమ్‌కార్డులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును సైబర్ క్రైమ్ యూనిట్‌కు చెందిన ఎస్‌ఐ మన్మోహన్, హెడ్‌కానిస్టేబుల్ ఫిరోజ్, కానిస్టేబుల్ రాకేష్, మహిళా కానిస్టేబుల్ కుమ్‌భారవి బృందం దర్యాప్తు చేస్తుంది.

డీజిల్ లీకై రేంజ్ రోవర్ కారు దగ్ధం

కారులో నుంచి సురక్షితంగా బయటపడిన యువకులు



దగ్ధమవుతున్న కారు

నార్కట్‌పల్లి : రేంజ్ రోవర్ కారు డీజిల్ ట్యాంకు లీకేజీ కావడంతో మంటలు ఎగిసిపడి కారు దగ్ధమైంది. ఈ ఘటన సోమవారం నార్కట్‌పల్లి– అద్దంకి హైవేపై నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు వద్ద జరిగింది. హైదరాబాద్‌కు చెందిన శివప్రసాద్, శివకుమార్, గోవర్ధన్ ముగ్గురు స్నేహితులు కలిసి గుంటూరులో ఓ ఫంక్షన్‌కు హాజరయ్యారు. సోమవారం అద్దంకి వద్ద పెట్రోల్ బంక్‌లో రేంజ్ రోవర్ కారుకు పెట్రోల్ పోయించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. చెర్వుగట్టు సమీపంలోకి రాగానే కారు డీజిల్ ట్యాంక్ లీకై చిన్న చిన్న మంటలు రావడాన్ని గుర్తించిన వారు కారును రోడ్డు పక్కన నిలిపి బయటకు వచ్చారు. వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్ని మాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. అప్పటికే కారు చాలా వరకు కాలిపోయింది. నార్కట్‌పల్లి ఎస్‌ఐ క్రాంతికుమార్ వివరాలను అడిగి తెలుసుకున్నారు.

హయత్‌నగర్‌లో అగ్ని ప్రమాదం



స్క్రాప్ దుకాణంలో ఎగిసి పడుతున్న మంటలు

హయత్‌నగర్: హయత్‌నగర్ డివిజన్‌లోని ఓ స్క్రాప్ దుకాణంలో సోమవారం సాయంత్రం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పీఅండ్‌టీ కాలనీలోని దుర్గా ప్లాస్టిక్ స్క్రాప్ దుకాణంలో నిప్పంటుకుని మంటలు ఎగిసి పడుతుండటాన్ని గుర్తించిన స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బది రెండు గంటలు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని, ఆస్తి నష్టం వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు పేర్కొన్నారు.

కోడి పందేల స్థావరంపై దాడులు

- ఆరుగురి అరెస్ట్
- రూ.26,940 నగదు,
- రెండు కోళ్లు, 15 కోడి కత్తులు స్వాధీనం..

కుత్బుల్లాపూర్: కోడి పందేలు ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి నుంచి నగదు, కోడి కత్తులను స్వాధీనం చేసుకున్న ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. దేవరయాంజాల్‌లోని ఈటల రాజేందర్ ఫామ్‌హౌస్ సమీపంలో కోడి పందాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో సోమవారం సాయంత్రం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్‌రెడ్డి తోటలో కోడి పందేలు నిర్వహిస్తున్న తొమ్మిది మంది వ్యక్తులు పోలీసులను గుర్తించి పరారయ్యేందుకు ప్రయత్నించారు. ఆరుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి నుంచి రూ.26,940 నగదు, రెండు కోళ్లు, 15 కోడి కత్తులు, ఏడు మొబైల్ ఫోన్లు, మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడి మృతి



రాకేష్ మృతదేహం

కీసర: ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఓ యువకుడు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం కీసర ఔటర్ రింగ్‌రోడ్డు వద్ద చోటు చేసుకుంది. కీసర ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లాకు చెందిన రాకేష్(26) నగరానికి వలస వచ్చి శామీర్‌పేటలోని లియోనియోలో క్యాటరింగ్ పని చేస్తున్నాడు. సోమవారం అతను తన స్నేహిడుతు హేమంత్‌తో కలిసి బైక్‌పై కీసరకు వచ్చాడు. తిరిగి వెళుతుండగా కీసర ఔటర్ రింగ్ రోడ్డు వద్ద బైక్ అదుపు తప్పి ఇద్దరూ కింద పడ్డారు. ఈ ఘటనలో రాకేష్ తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన హేమంత్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జూబ్లీహిల్స్ సర్కిల్ డీసీగా సమ్మయ్య


సమ్మయ్య

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ సర్కిల్–18 డిప్యూటీ మున్సిపల్ కమిషనర్‌గా సమ్మయ్యను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇప్పటి వరకు ఆయన బేగంపేట సర్కిల్–30 డీసీగా వ్యవహరిస్తున్నారు. సర్కిల్–18 డీసీగా ఉన్న ప్రశాంతిని శేరిలింగంపల్లి సర్కిల్–20 డీసీగా బదిలీ చేశారు. శేరిలింగంపల్లి సర్కిల్ డీసీగా ఉన్న ముకుందరెడ్డి ఆదివారం ఉద్యోగ విరమణ చేశారు. ఆయన స్థానంలో ప్రశాంతిని నియమించారు. ప్రశాంతి స్థానంలో జూబ్లీహిల్స్ సర్కిల్‌కు సమ్మయ్యను నియమిస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

నేలకొరిగిన భారీ చెట్టు


బంజారాహిల్స్ రోడ్ నెం.12లో రోడ్డుపై పడిపోయిన చెట్టు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.12 ప్రధాన రహదారి కిమ్స్ ఎన్‌క్లేవ్ ఎదుట సోమవారం మధ్యాహ్నం ఓ భారీ చెట్టు నేలకూలింది. వెంటనే స్థానికులు జీహెచ్‌ఎంసీ, డీఆర్‌ఎఫ్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకున్న సిబ్బంది కట్టర్ల సహాయంతో చెట్టును కొట్టేసి పక్కకు తప్పించారు. చెట్టు కూలిన సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని అధికారులు తెలిపారు. చెట్టుకూలడంతో రోడ్డుపై రాకపోకలు స్తంభించాయి. చెట్టు తొలగించే వరకు ట్రాఫిక్ పోలీసులు వాహనాలను దారిమళ్లించారు.

ఘనంగా జేఐసీ క్లబ్ డే వేడుకలు


జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో క్లబ్ డే వేడుకలు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో క్లబ్ డే వేడుకలతో పాటు ఉగాది సంబురాలు అంబురాన్ని తాకాయి. జేఐసీ అధ్యక్షుడు కె.సురేందర్‌రెడ్డి, కార్యదర్శి కిలారు రాజేశ్వరరావు వేడుకల్లో పాల్గొన్నారు. సంప్రదాయ దుస్తుల్లో సభ్యులు ఆడి, పాడి సందడి చేశారు. క్లబ్ ఆవరణను పండుగ వాతావరణంలో తీర్చిదిద్దారు. యువతీ, యువకుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. క్లబ్ సభ్యులు వందలాదిగా తరలివచ్చారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ


చెక్కు అందజేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని దుర్గాభవానీనగర్ బస్తీకి చెందిన ఒర్సు రామకృష్ణకు రూ.60 వేలు, బండారు బాల్‌రెడ్డి నగర్ బస్తీకి చెందిన కే.శ్రీకాంత్‌కు రూ.46,500 చెక్కులను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తన కార్యాలయంలో సోమవారం పంపిణీ చేశారు. కొంత కాలంగా వీరు అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందగా వారి ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని సీఎం సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను ఆయన అందజేశారు. ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, వెంకటస్వామి, బీజేపీ జూబ్లీహిల్స్ డివిజన్ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్, సీనియర్ నాయకులు వల్లెపు శంకర్, గందె అరుణ్ కుమార్, గణేష్‌యాదవ్, కస్తూరి మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లంబాడీల మాతృ భాషకు ప్రాధాన్యమివ్వడం హర్షణీయం

అమీర్‌పేట: లంబాడీల మాతృ భాష గోర్ బోలీకి తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యత కల్పించడం హర్షణీయమని బాపూనగర్ బంజార వెల్ఫేర్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కుర్నాల్ కాథోడ్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో గోర్ బోలీని చేర్చాలని మార్చి 28వ తెలంగాణ శాసనసభలో తీర్మానాన్ని ఆమోదించారని తెలిపారు. భాషా వైవిధ్యాన్ని ప్రోత్సహించేలా, తెలంగాణ సంస్కృతిలో భాగమైన లంబాడీలకు గుర్తింపును తెచ్చేందుకు ఇది దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ప్రజాప్రతినిధులకు లంబాడీల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్

ప్రేమ, కరుణ, ఐకమత్యం అనే సందేశాల సారం.. సేవా తత్పరత, ఆధ్యాత్మికత వెల్లివిరిసే సంబురం ఈద్–ఉల్–ఫితర్ పర్వదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. సహనం, దాన, దయ గుణాన్ని, సోదర భావాన్ని, శాంతి సామరస్యాలను పెంపొందించే పవిత్ర పర్వదినం రంజాన్ సందర్భంగా తెల్లవారుజాము నుంచే మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కొత్త దుస్తులు ధరించిన ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలోని బంజారాహిల్స్, సోమాజిగూడ, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, హిమాయత్‌నగర్ డివిజన్ల పరిధిలోని 75కు పైగా మసీదుల్లో ఉదయం నుంచే ప్రార్థనలు నిర్వహించారు. బంజారాహిల్స్ రోడ్ నెం.10లోని ఐపీఎస్ క్వార్టర్స్ పక్కన మైదానంలో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. జూబ్లీహిల్స్ రోడ్‌నెం.82లోని హకీం బాబా దర్గాలో.. నెక్లెస్ రోడ్డులో ప్రార్థనలకు వేలాది మంది తరలివచ్చారు.

బంజారాహిల్స్


శుభాకాంక్షలు తెలుపుతున్న రవిశేఖర్‌రెడ్డి


బంజారాహిల్స్‌లో శుభాకాంక్షలు తెలుపుతున్న బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర


బంజారాహిల్స్ రోడ్ నెం-10లోని ఇండో అరబ్ మస్జిద్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


జహీరానగర్‌లో పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే దానం నాగేందర్


ఖైరతాబాద్ బడా మజీదు వద్ద శుభాకాంక్షలు తెలుపుతున్న గజ్జల ఆనంద్ తదితరులు


బంజారాహిల్స్ రోడ్ నెం-10 మైదానంలో ప్రార్థనలు


చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీతో నవీన్ యాదవ్


ఫిలింనగర్ హకీంబాబా దర్గాలో..

సన్న బియ్యం పంపిణీకి బ్రేక్

బంజారాహిల్స్: ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఈనెల 1వ తేదీ నుంచి ఇవ్వాల్సిన సన్నబియ్యం పంపిణీకి బ్రేక్ పడింది. రేషనింగ్ ఖైరతాబాద్ సర్కిల్–7 పరిధిలోని 81 రేషన్‌షాపుల పరిధిలో రూ.2,95,779 మంది కార్డుదారులకు తీవ్ర నిరాశే మిగిలింది. ఉగాది కానుకగా వీరందరికీ ఒక్కొక్కరికీ ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం పంపిణీ చేయాల్సి ఉంది. అయితే కోడ్ నేపథ్యంలో సన్న బియ్యం పంపిణీ చేపట్టవద్దని ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో సర్కిల్–7 పరిధిలో ఏప్రిల్ నెల కోటా కింద దొడ్డి బియ్యాన్ని పంపిణీ చేయాలని అధికారులు ఆదేశించారు. సన్న బియ్యం బస్తాలు ఒక మూలన పెట్టాలని కూడా ఆదేశించారు. అన్ని రేషన్ షాపులు దొడ్డి బియ్యం పంపిణీ చేయనున్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఏప్రిల్ 29 వరకు అమలులో ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఏప్రిల్ నెల కోటా కింద సన్న బియ్యం ఇవ్వడం లేదని, మే నెల నుంచి పంపిణీ చేస్తామని అధికారులు పేర్కొన్నారు.


బంజారాహిల్స్ రోడ్డు నంబర్–12లోని ఎన్‌బీటీ నగర్ రేషన్ షాపులో సన్నబియ్యం బస్తాలు

మద్యం మత్తులో పట్టుబడ్డ ముగ్గురికి రిమాండ్

ఫిలింనగర్: రెండు రోజుల క్రితం అర్ధరాత్రి మద్యం మత్తులో అదుపుతప్పిన వేగంతో కారు నడుపుతూ ప్రమాదానికి కారకులైన ముగ్గురు యువకులను ఫిలింనగర్ పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలు.. శనివారం తెల్లవారుజామున బంజారాహిల్స్ రోడ్డు నంబర్–12లోని ఎన్‌బీటీనగర్‌కు చెందిన బి.రాజ్‌కిరణ్, మల్లికార్జున్(21), స్నేహిత్(24) ముగ్గురూ కలిసి జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్–92లోని మాజీ మంత్రి జానారెడ్డి ఇంటి ముందు నుంచి ఫిలింనగర్ వైపు మద్యం మత్తులో అత్యంత వేగంతో దూసుకెళ్తున్నారు. క్యాబ్ డ్రైవర్ రాజ్‌కిరణ్ కారు నడిపిస్తూనే పక్కన కూర్చున్న మల్లికార్జున్‌కు డ్రైవింగ్ నేర్పిస్తున్నాడు. ముగ్గురూ మద్యం మత్తులో అతి వేగంతో దూసుకెళ్తుండగా కారు అదుపుతప్పింది. ఎదురుగా ఉన్న రెండు బైక్‌లను ఢీకొట్టడంతో అవి పూర్తిగా దెబ్బతినడంతో పాటు కారు ఓ షోరూంలోకి దూసుకెళ్లింది. కారులోని ముగ్గురు యువకులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఫిలింనగర్ పోలీసులు కారు నడిపిస్తున్న రాజ్‌కిరణ్‌కు డ్రంకన్ డ్రైవ్ పరీక్ష నిర్వహించగా 94 బీఏసీగా నమోదైంది. మిగతా ఇద్దరు కూడా మద్యం తాగినట్లు పరీక్షల్లో బయటపడింది. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఫిలింనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


నిర్లక్ష్యంగా డ్రైవ్ చేసిన యువకులు

లక్ష్యాన్ని మించి ఆస్తి పన్ను వసూలు

బంజారాహిల్స్: ఆస్తి పన్ను వసూళ్లలో ఖైరతాబాద్ సర్కిల్–17, జూబ్లీహిల్స్ సర్కిల్–18 అధికారులు లక్ష్యాన్ని మించారు. ఆఖరి రెండు రోజులు పన్ను వసూళ్లు భారీగా జరిగాయి. అనుకున్న లక్ష్యాన్ని చేరడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఖైరతాబాద్ సర్కిల్ పరిధిలో ఈ ఆర్థిక సంవత్సరం రూ.164 కోట్లు ఆస్తిపన్ను వసూలు లక్ష్యంగా పెట్టుకోగా సోమవారం అర్ధరాత్రి వరకు రూ.173 కోట్లు వసూలయ్యాయి. హెచ్‌ఎండీఏ నుంచి రూ.25 కోట్లు, నిమ్స్ ఆస్పత్రి నుంచి రూ.2.5 కోట్లు వసూలు చేయగా ఆఖరి రోజు రూ.7 కోట్లు వసూలు చేశారు. ఆస్తిపన్ను వసూళ్ల కోసం సర్కిల్‌ను 23 డాకెట్లుగా విభజించారు. ఏఎంసీలు మురళీధర్, శ్రీనివాస్, కైలాష్, చందుతో పాటు ఎనిమిది మంది ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, 11 మంది బిల్ కలెక్టర్లు మూడు నెలల నుంచి శ్రమించారు. ప్రత్యేక దృష్టి పెట్టి నోటీసులు జారీ చేసి మొండి బకాయిలను కూడా రాబట్టారు. పన్ను వసూళ్లలో శ్రద్ధ కనబర్చడమే కాకుండా లక్ష్యాన్ని మించి వసూలు చేసినందుకు సంబంధిత అధికారులను డీసీ రజినీకాంత్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

జూబ్లీహిల్స్ సర్కిల్‌లో రూ.187 కోట్ల వసూలు..

జూబ్లీహిల్స్ సర్కిల్–18 పరిధిలో ఈ ఆర్థిక సంవత్సరం రూ.187 కోట్ల ఆస్తి పన్ను వసూలు లక్ష్యంగా పెట్టుకున్నారు. మార్చి 31 అర్ధరాత్రి వరకు పన్ను వసూలు రూ.187 కోట్లు దాటాయి. రెండు నెలల నుంచి అధికారులు పన్ను వసూళ్లపై పెట్టిన శ్రద్ధ సత్ఫలితాలను ఇచ్చింది. డీసీ ప్రశాంతి ఎప్పటికప్పుడు సమావేశాలు ఏర్పాటు చేస్తూ అధికారులు, సిబ్బందిని పన్ను వసూళ్ల కోసం అప్రమత్తం చేయడంతో లక్ష్యాన్ని అధిగమించారు. చాలా చోట్ల మొండి బకాయిల ఆస్తుల జప్తునకు వెనుకాడలేదు. దీంతో బకాయిదారులు దిగిరాక తప్పలేదు. వారెంట్ ఆఫీసర్ ఉప్పలయ్య, ఏఎంసీ సాయి శ్రీనివాస్ నేతృత్వంలో బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు మూడు వారాల నుంచి ప్రాపర్టీ ట్యాక్స్ వసూళ్లపైనే పూర్తిగా దృష్టి పెట్టారు. డీసీ ప్రశాంతి సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.



ఖైరతాబాద్ జోనల్ కార్యాలయం పౌర సేవా కేంద్రంలో ఆస్తి పన్ను చెల్లిస్తున్న నగరవాసులు

ఎర్రగడ్డ రైతుబజార్ కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: కిలో టమాటా రూ.17, నల్లవంకాయ 23, పొడుగువంకాయ 23, బెండకాయ 40, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 35, క్యాప్సికం 45, పచ్చికాకరకాయ 45, పందిరిబీర 45, క్యాబేజీ 11, క్యారెట్ 23, దొండకాయ 33, గుండు బీన్సీస్ 65, గింజచిక్కుడు 50, గోకరకాయ 45, కీర 18, దోసకాయ 23, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 25, చామగడ్డ 40, మొరంగడ్డ 23, కందగడ్డ 60, క్యాలీఫ్లవర్ 18, సొరకాయ 09, పొట్లకాయ 16, అరటికాయ 09, మునగకాయ 4, మామిడికాయ 23, ముల్లంగి 4–5, ఉల్లిపారక 28 ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకూ అందుబాటులో ఉంటాయి.

అటల్‌బిహారి వాజ్‌పేయికి నివాళి

శ్రీనగర్‌కాలనీ: మాజీ ప్రధాని అటల్‌బిహారి వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని హైదరాబాద్ సిటీ శతజయంతి ఉత్సవాల కన్వీనర్ బంగారు ప్రశాంత్ ఆధ్వర్యంలో హాల్ మీటింగ్‌ను ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి సిటీ ప్రెసిడెంట్ లంకల దీపక్ రెడ్డి, మాజీ ప్రెసిడెంట్ గౌతమ్‌రావు హాజరై ప్రారంభించి వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఉత్సవాలకు సంబంధించి పలు అంశాలపై చర్చించారు. నేతలు నూనె బాలరాజ్, మోహన్‌రావు ఉన్నారు.

ఘనంగా జెక్ కాలనీ ఫెడరేషన్ ఆవిర్భావోత్సవం



సనత్‌నగర్: జెక్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ ఆవిర్భావ వేడుకలను కాలనీ నాలుగో రోడ్డులో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు ఆహూతులను అలరించాయి. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వేడుకలకు గ్రీన్‌సిటీ అధినేత కొండ్రాజు సుబ్బరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాలనీవాసులంతా ఐక్యమత్యంగా ఉండటం ద్వారా అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. ఫెడరేషన్ ఫౌండర్ సెక్రటరీ డీవీ రంగరాజు, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఓఎస్‌డీ వేణుగోపాల్ హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మల్లు ప్రసాద్, రాజశేఖర్ చందులు అతిథులను సన్మానించారు. కార్యక్రమాల్లో ప్రతిభ చూపిన చిన్నారులకు జ్ఞాపికలతో పాటు బహుమతులను ప్రదానం చేశారు. కాలనీ ప్రతినిధులు అనంత రెడ్డి, శివారెడ్డి, విశ్వనాథరాజు, వెంకట్ సోమ, నాగిరెడ్డి, కంజర్ల శ్రీనివాస్‌యాదవ్, వెల్లంకి శారద, బిల్డర్ రాజా, శ్రీనివాస్‌రెడ్డి, శశికళ, రామ సుబ్బారెడ్డి, లక్ష్మారెడ్డి, సుదర్శన్‌రావు, రమణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మంత్రివర్గంలో బంజారాలకు స్థానం కల్పించాలి


మాట్లాడుతున్న వెంకటేష్ చౌహాన్

పంజగుట్ట: మంత్రివర్గంలో బంజారాలకు స్థానం కల్పించకపోతే కాంగ్రెస్ పార్టీకి నష్టం తప్పదని గిరిజన శక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ వెంకటేష్ చౌహాన్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గిరిజన శక్తి రాష్ట్ర కమిటీ, గిరిజన జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంలో లంబాడీల పాత్ర ఎంతో ఉందని, యావత్ బంజారాలు కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండి గెలిపించారని పేర్కొన్నారు. మంత్రివర్గంలో అన్ని సామాజిక వర్గాలకు సముచిత స్థానం కల్పించిన ప్రభుత్వం బంజారాలకు మంత్రివర్గంలో స్థానం కల్పించకపోతే బంజారాలు పార్టీకి దూరమయ్యే అవకాశం ఉందని చెప్పారు. కాంగ్రెస్ అగ్రనాయకులు రాహుల్‌గాంధీ, కె.సి.వేణుగోపాల్, పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను కలిసి వినతిపత్రాలు ఇచ్చామని తెలిపారు. గిరిజన జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు అశోక్ రాథోడ్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు కాంగ్రెస్ పార్టీకి వినతిపత్రాలు ఇచ్చామని, ఇకపై నిరసన కార్యక్రమాలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆల్ ఇండియా ట్రైబల్ జేఏసీ అధ్యక్షుడు సురేష్‌నాయక్, గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్పతి నాయక్, బంజారా గిరిజన విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు శివనాయక్, కొండ్రపల్లి రమేష్, రాజు నాయక్, శివ చౌహాన్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పరంపర నృత్య కళాకారులకు సత్కారం


జూబ్లీహిల్స్ వేడుకల్లో పరంపర కళాకారులను సత్కరిస్తున్న కాలనీవాసులు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నెం.10లో ఎంపీ, ఎమ్మెల్యే కాలనీలో సిద్దార్థ జ్యువెలర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో ప్రసిద్ధి పరంపర అకాడమీకి చెందిన నృత్య కళాకారులను సిద్దార్థ జ్యువెలర్స్ సెలబ్రిటీ డిజైనర్ నాగిని ప్రసాద్‌తో పాటు కాలనీవాసులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పరంపర కళాకారులు ప్రదర్శించిన పలు నృత్యరీతులు కళాకారులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా నాగిని ప్రసాద్ మాట్లాడుతూ మన సంస్కృతి, కళలను కాపాడుతున్న కళాకారులను ఉగాది వేళ సత్కరించుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి, టీటీడీ బోర్డు మాజీ సభ్యురాలు గడ్డం సీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బాలనాగమ్మ నాటకం


బాల నాగమ్మ నాటకంలో రంగస్థల నటుల అభినయం

ఫిలింనగర్: ఫిలినగర్‌లోని ఫిలింఛాంబర్ రామానాయుడు కళామండపంలో ఉగాది నాటకోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. పొత్తూరి వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు నిర్వహించే నాటకోత్సవాల్లో సోమవారం ఉయ్యూరుకు చెందిన శ్రీదేవి కళా నాట్యమండలి కళాకారులు ప్రదర్శించిన బాలనాగమ్మ జానపద నాటకం అలరించింది. బాలనాగమ్మగా వీరమణి, కార్యవర్ధిగా సోమర ఎర్రస్వామి చౌదరి, ఫకీర్‌గా జెట్టి సాంబశివరావు, పులిరాజుగా ముత్యాల నాగేశ్వర్ రావు, సంగుగా ఇంద్రజ, తిప్పడుగా ఈగ నాగేశ్వర్ రావు, లచ్చిగా మనుప్రియ, జంగమ దేవరగా రాధాకృష్ణ నటించారు. రంగస్థల కళాకారులను ప్రోత్సహించడంతో పాటు నేటితరం యువతకు, సినీ ప్రేమికులకు రంగస్థల నాటికలను పరిచయం చేసే ప్రయత్నమే ఈ కార్యక్రమం అని సుబ్బారావు తెలిపారు. ఫినిక్స్ ఫౌండేషన్ చైర్మన్ చుక్కపల్లి సురేష్, చుక్కపల్లి అవినాష్, సొసైటీ కార్యదర్శి కాజా సూర్యనారాయణ, చార్టెడ్ అకౌంటెంట్ దేవనాథ్ సూరి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఆహ్వానం

గోల్కొండ: ఏప్రిల్ 11న కార్వాన్‌లో జరిగే మహాత్మా జ్యోతి బాపూలే 198వ జయంతి ఉత్సవాలకు రావాల్సిందిగా కార్వాన్ బీసీ ఐక్యవేదిక ప్రతినిధులు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కోరారు. సోమవారం కమిటీ ప్రతినిధులు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి ఈ మేరకు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. జ్యోతిబాపూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవర వంశీ, నర్సింగ్, అనిల్, వెంకటేష్, పంబి శ్రీనివాస్ తదితరులున్నారు.

అండర్‌పాస్‌లు ఆకట్టుకునేలా..

మాదాపూర్: మాదాపూర్ పరిసర ప్రాంతాలలో ఉన్న అండర్‌పాస్, ఫ్లైఓవర్ బ్రిడ్జిల గోడలు, పిల్లర్లపై కళాకారులు అందమైన చిత్రాలను వేసి ఆకట్టుకుంటున్నారు. నగర సుందరీకరణలో భాగంగా తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను తెలిపే విధంగా బతుకమ్మ, పోతురాజులు, పేరిణీ నాట్యం చిత్రాలతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలిపే విధంగా పిల్లర్లపై వేసిన చిత్రాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సమాజ సేవకుల చిత్రాలను వేశారు. జేఎన్‌ఎఫ్‌యూ విద్యార్థులు అయ్యప్పసొసైటీకి వెళ్లే అండర్ పాస్ బ్రిడ్జి గోడలపై నగరంలోని ప్రధాన కూడళ్లు, మార్కెట్‌ల గురించి పెయింటింగ్‌లు వేశారు. మొజంజాహీ మార్కెట్, కోఠి, సుల్తాన్‌బజార్ ఇలా 16 ప్రముఖ మార్కెట్‌ల చిత్రాలను వేశారు.



నగరంలో నేడు

- ఫిలింనగర్‌లోని ఫిలిం చాంబర్ రామానాయుడు కళామండపంలో చుక్కపల్లి శంకరరావు శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని పద్య నాటక మహోత్సవంలో భాగంగా సురభి కళా నాట్యమండలి వారి సత్య హరిశ్చంద్ర నాటక ప్రదర్శన సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు జరుగుతుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న ఉగాది వసంతోత్సవాలలో భాగంగా సాయంత్రం 6 గంటల నుంచి నృత్య ప్రదర్శనలు జరుగుతాయి.
- సీడ్ సెక్యూరిటీ ఫర్ హెల్త్ పేరిట విత్తనాల పండుగకు సంబంధించి గ్రీన్ రీవల్యూషన్, పీపుల్స్ పల్స్, ప్రెస్‌క్లబ్‌ల ఆధ్వర్యంలో సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సమావేశం జరుగుతుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో కళాకారుడు రాబిన్ డేవిడ్ తయారు చేసిన స్కల్ప్చర్ ఎగ్జిబిషన్ ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటల వరకు సందర్శకులకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళాశక్తి బజార్‌లో ఉగాది, రంజాన్ ఉత్సవాలు ఉదయం 11.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకు జరుగుతాయి. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాలు, మహిళా పారిశ్రామికవేత్తల ఉత్పత్తుల ప్రదర్శన అందుబాటులో ఉంటుంది.
- హ్యాండ్‌లూమ్ ఇండియా ఆధ్వర్యంలో బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని కళింగ కల్చరల్ సెంటర్‌లో ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు సిల్క్ మార్క్ ధ్రువీకృత సిల్క్ ఉత్పత్తుల ప్రదర్శన జరుగుతుంది.
- మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు హై లైఫ్ సమ్మర్ ఎగ్జిబిషన్ జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

కబ్జాదారుల చెర.. చూడండి జర!

కుంచించుకుపోయిన తార్నాక ఎర్రకుంట చెరువు



- నాడు 25 ఎకరాలు.. నేడు ఐదున్నర ఎకరాలే..
- కబ్జాదారులకు తలొగ్గి ఎఫ్‌టీఎల్ నిర్ధారణపై అధికారుల మీనమేషాలు
- పట్టించుకోని ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు

లాలాపేట: అది నిజాం కాలంనాటి గొలుసుకట్టు చెరువు. అప్పట్లో దీని విస్తీర్ణం 25 ఎకరాలు. కబ్జాదారుల చెరలో చిక్కి కుంచించుకుపోయి ఇప్పుడు ఐదున్నర ఎకరాలే మిగిలింది. అధికారులకు ఫిర్యాదు చేసినా, ఎమ్మెల్యేలకు, ఇతర ప్రజాప్రతినిధులకు విన్నవించినా, ధర్నాలు చేసినా ఫలితం లేకపోయింది. ఇదీ లాలాగూడ రెవెన్యూ గ్రామ పరిధిలోని తార్నాక ఎర్రకుంట చెరువు దుస్థితి. ఉమ్మడి ఏపీ రాష్ట్రంలోనే ఈ చెరువు భూములను కబ్జాదారులు ఆక్రమించారు. ప్రత్యేక రాష్ట్రంలోనూ ఆ చెరువుకు మిషన్ కాకతీయ పథకం గుర్తింపు దక్కలేదు. ఈ ప్రభుత్వమైనా చెరువును పునరుద్ధరించి భూగర్భ జలాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని తార్నాక కాలనీవాసులు కోరుతున్నారు. అయితే ఇప్పటికే కొందరు కబ్జాదారులు కోర్టుల ఆశ్రయించి స్టేలు తీసుకువచ్చి పక్కా నిర్మాణాలు



చెరువు తూము నిర్మాణం పునరుద్ధరణ పనులను అడ్డుకుంటున్న కబ్జాదారులు (ఫైల్)

చేపట్టారు. వీరి ప్రలోభాలకు తలొగ్గి రెవెన్యూ అధికారులు ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారించడంలో మీనమేషాలు లెక్కపెడుతున్నారు.

నిజాం కాలంనాటి గొలుసుకట్టు చెరువు

నిజాం హయాంలో లాలాగూడ రెవెన్యూ గ్రామం సర్వే నెంబర్ 121 నుంచి 125, 126 వరకు దాదాపు 25 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న గొలుసుకట్టు చెరువును నిర్మించారు. ఆనాడు తార్నాక, నాచారం, లాలాపేట, లాలాగూడ ప్రాంతాలకు తాగు, సాగు నీరు అందించిన చెరువు నేడు పూర్తిగా కనుమరుగయ్యే దశకు చేరుకుంది. నేడు దాదాపు ఐదున్నర ఎకరాలు మాత్రమే మిగిలి ఉంది. చెరువు భూములు ఆక్రమణకు గురికాకుండా కాపాడాలని కోరుతూ తార్నాక నాగార్జున నగర్ కాలనీ సంక్షేమ సంఘం నాయకులు 2009లో ఎమ్మెల్యే జయసుధకు, 2014లో ఎమ్మెల్యే పద్మారావు గౌడ్‌కు, ఇటీవల నూతనంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

ముందుకు కదలని మినీ ట్యాంక్‌బండ్

ఆక్రమణలకు గురికాగా మిగిలిన చెరువు భూముల్లో మినీ ట్యాంక్‌బండ్‌ను నిర్మించాలని 2009లో గ్రేటర్ హైదరాబాద్ మేయర్(తార్నాక కార్పొరేటర్) బండ కార్తీకరెడ్డి అప్పటి హైదరాబాద్ కలెక్టర్ నవీన్ మిట్టల్‌కు సూచించారు. అయితే వివిధ కారణాలతో ఆ ప్రతిపాదన కార్యరూపం దాల్చలేదు. ఇరిగేషన్ అధికారులు రెండు పర్యాయాలు చెరువు భూముల్లో జంగల్ కటింగ్ పనులు చేపట్టారు. తూము నిర్మాణం చేపట్టగా కబ్జాదారులు అడ్డుకోవడంతో అవి నిలిచిపోయాయి.

తహసీల్దార్ వివరణ...

ఎర్రకుంట చెరువు భూముల ఆక్రమణలపై మారేడుపల్లి తహసీల్దార్‌ను వివరణ కోరగా ఆర్డీఓతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు.



తార్నాక ఎర్రకుంట చెరువు తూముపై వెలసిన కమర్షియల్ నిర్మాణం

చెరువు భూముల్లో జోరుగా ఆక్రమణలు

తార్నాక ఎర్రకుంట చెరువు భూముల్లో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఇప్పటికే పలు నివాస గృహాలతోపాటు భారీ వాహనాల పార్కింగ్, డంపింగ్ యార్డులు, చెత్త సేకరణ కేంద్రాలు, కేటరింగ్, టెంట్ హౌస్‌లు, హోటళ్లు వెలిశాయి. తాజాగా చెరువు బఫర్ జోన్‌ను ఆనుకుని కొందరు వ్యక్తులు బహుళ అంతస్తు భవన సముదాయం నిర్మిస్తున్నారు. దీనిపై తార్నాక కాలనీవాసులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన కరువైంది. కబ్జాదారులకు అనుకూలంగా వ్యవహరించేందుకే ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారించడంలేదని కాలనీవాసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

పారిశ్రామికవేత్తల మార్గదర్శనానికి 'వికసిత్ భారత్'

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

బంజారాహిల్స్: భారతదేశాన్ని 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మార్చే లక్ష్యంతో పారిశ్రామికవేత్తలకు మార్గదర్శనం చేయడానికి వికసిత్ భారత్ ఎంటర్‌ప్రెన్యూర్ సంస్థను ప్రారంభిస్తున్నట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. సోమవారం బంజారాహిల్స్ రోడ్డు నెంబర్ 5లో వికసిత్ భారత్ ఎంటర్‌ప్రెన్యూర్ నెట్‌వర్క్‌ను ఆయన మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత పరిశోధనలు చేయాలని సూచించారు. సొంత వ్యాపారాలను ప్రారంభించాలని ఆకాంక్షిస్తున్న వారికి సరైన మార్గదర్శనం అవసరమని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో భారీస్థాయిలో పారిశ్రామికవేత్తలను తయారు చేయడం ఎంతో అవసరమన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్టార్టప్‌లను, యువ పారిశ్రామికవేత్తలను బలంగా ప్రోత్సహిస్తున్నారని, కేంద్ర ప్రభుత్వం బ్యాంకుల నుంచి రుణాలు, ఇతర అనుమతుల క్లియరెన్స్ ప్రక్రియలను సులభతరం చేసిందని పేర్కొన్నారు. వ్యాపారాలు మొదలుపెట్టాలనుకునే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ యువతకు శిక్షణ ఇవ్వడానికి వికసిత్ భారత్ ఎంటర్‌ప్రెన్యూర్ సంస్థ దోహదపడుతుందన్నారు. లక్షలాది ఉద్యోగ అవకాశాలు సృష్టించడమే ఈ సంస్థ లక్ష్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.



వికసిత్ భారత్ ఎంటర్‌ప్రెన్యూర్ సంస్థను ప్రారంభిస్తున్న కిషన్ రెడ్డి

ఘనంగా హిందీ ప్రచార సభ వార్షికోత్సవాలు



90వ వార్షికోత్సవాలను ప్రారంభిస్తున్న గైబువల్లి

హిమాయత్‌నగర్: నగరంలోని హిందీ ప్రచార సభ 90వ వార్షికోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రచారసభ ప్రధాన కార్యదర్శి ఎస్.గైబువల్లి మాట్లాడుతూ జాతీయ సమైక్యత చాటే లక్ష్యంతో 1935లో ఉగాది పర్వదినాన తమ సంస్థ హైదరాబాద్‌లో ఆవిర్భవించిందని తెలిపారు. లక్షలాది మంది విద్యార్థులు హిందీ భాష నేర్చుకొని హిందీ ఉపాధ్యాయులుగా, అధ్యాపకులుగా స్థిరపడ్డారని తెలిపారు. వేడుకలను రెండు నెలలపాటు ఘనంగా నిర్వహిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో హిందీ ప్రచార సభ హైదరాబాద్ పరీక్షా సంచాలకులు ప్రొఫెసర్ సురేష్ పురి, కన్వీనర్ శృతికాంత్ భారతి, తెలంగాణ హిందీ ప్రచార సభ అధ్యక్షుడు కె.రామచందర్, కార్యదర్శి ఏకే రాజు, రిజిస్ట్రార్ నామ్ దేవ్ వాగ్మడే, కార్యాలయ కార్యదర్శి కె.వెంకటేశ్వర్, ఉద్యోగ సంఘం కార్యదర్శి శివ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై నిర్బంధం తగదు: జాన్‌వెస్లీ

నేడు హెచ్‌సీయూ వద్ద సీపీఎం ధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న జాన్ వెస్లీ

పంజగుట్ట: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) విద్యార్థులు, స్టూడెంట్ యూనియన్ నాయకుల మీద పోలీసులు నిర్బంధాన్ని ప్రయోగించడం తగదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. యూనివర్సిటీ భూములు అమ్మడాన్ని వ్యతిరేకిస్తూ, అడ్డుకునేందుకు యత్నించిన విద్యార్థి నాయకులపై అక్రమ కేసులను బనాయించడాన్ని నిరసిస్తూ మంగళవారం ఉదయం యూనివర్సిటీ ప్రధాన ద్వారం ముందు భారీ ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.వీరయ్య, పాలడుగు భాస్కర్, ఎం.డి.అబ్బాస్‌లతో కలిసి ఆయన మాట్లాడుతూ విద్యార్థి నాయకులు ఎర్రం నవీన్‌తో పాటు మరికొంతమందిని అక్రమంగా అరెస్టు చేసి రిమాండ్ చేశారని, వీరిని తక్షణమే విడుదల చేయాలన్నారు. విశ్వవిద్యాలయాలను, విద్యావ్యవస్థను బలోపేతం చేయాల్సిందిపోయి యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూములను ప్రభుత్వం అమ్మకానికి పెట్టడం విచారకరమని పేర్కొన్నారు. ఆదివారం రాత్రి ఒక్కసారిగా పెద్ద ఎత్తున పోలీసు బలగాలు, బుల్డోజర్లతో ప్రవేశించి తూర్పు క్యాంపస్ స్థలంలో కూడా చదును చేస్తున్నారని, ఇది సరి కాదని అన్నారు. ప్రశ్నించిన విద్యార్థులను, అమ్మాయిలతో సహా 60 మందిని అదుపులోకి తీసుకుని రాత్రి 10 గంటల వరకు వివిధ పోలీస్‌స్టేషన్లలో నిర్బంధించారని, పోలీసుల దాడిలో ఓ యువకుడి తల పగిలిందని, విద్యార్థినుల దుస్తులు చిరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. మరోమారు ఆందోళన చేయబోమని చెప్పాలంటూ విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేశారన్నారు. ప్రభుత్వం వెంటనే 400 ఎకరాల భూమిని అమ్మే ప్రయత్నాలను ఆపాలని, విద్యార్థులపై పెట్టిన కేసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ఆదిత్య ఫౌండేషన్ అథ్లెట్లకు 25 పతకాలు

సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్ ఔటర్ రింగ్ రోడ్డులో జరిగిన మొదటి నేషనల్ పారా రోడ్ సైక్లింగ్ చాంపియన్‌షిప్-2025లో ఆదిత్య మెహతా ఫౌండేషన్ (ఏఎంఎఫ్) 25 పతకాలు సాధించిందని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఆదిత్య మెహతా ఒక ప్రకటనలో తెలిపారు. అథ్లెట్లకు ప్రత్యేక శిక్షణ, పోషణ, పునరావాస సహాయం అందించామని పేర్కొన్నారు. ఈ విజయంతో అథ్లెట్లు 2025 ఏసియన్ పారా గేమ్స్-2026 కామన్వెల్త్ గేమ్స్-2028 పారా ఒలింపిక్స్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నారని పేర్కొన్నారు.

'మావోయిస్టు నేత పేరిట ప్రకటన నమ్మశక్యంగా లేదు'

ఉస్మానియా యూనివర్సిటీ: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, ఉస్మానియా యూనివర్సిటీ సమస్యలపై పోలీసులు, మావోయిస్టు నాయకులు కాకుండా ఆయా యూనివర్సిటీల అధికారులు స్పందించాలని బహుజన స్టూడెంట్ జాక్ చైర్మన్, బహుజన స్టూడెంట్ ఫెడరేషన్(బీఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు వేల్పుల సంజయ్ అన్నారు. సోమవారం ఇక్కడ ఆయన మాట్లాడుతూ ఓయూలో నిషేధాజ్ఞలపై మావోయిస్టు నేత జగన్ పేరిట వెలువడిన ప్రకటన నమ్మశ్యకంగా లేదని, ఇది పోలీసుల డ్రామా అని అనుమానం వ్యక్తం చేశారు. గత వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ రవీందర్ హయాంలోనే నిషేధాజ్ఞల సర్క్యులర్ జారీ అయిందని అధికారులు అంటున్నారని, అప్పుడు మౌనంగా ఉన్న మావోలు ఇప్పుడు ప్రకటన చేయడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఓయూలో ఆందోళనలు, ధర్నాలు, నిరసనలు చేసే విద్యార్థులకు నిషేధిత మావోయిస్టు పార్టీ ముద్ర వేసేందుకు ప్రభుత్వం పోలీసులతో ఇలాంటి చౌకబారు ప్రకటన ఇప్పించినట్లుగా ఉందని సంజయ్ అనుమానం వ్యక్తం చేశారు. ఓయూలో నిషేధాజ్ఞల సర్క్యులర్‌ను రద్దు చేసే పోరాటం కొనసాగిస్తామని సంజయ్ పేర్కొన్నారు.

వాజ్‌పేయి దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయం

కాచిగూడ: దేశానికి మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి అందించిన సేవలు చిరస్మరణీయమని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి అన్నారు. వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాల సందర్భంగా సోమవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశ రాజకీయాల్లో వాజ్‌పేయికి ఒక ప్రత్యేకమైన స్థానం ఉందన్నారు. ఆయన అందించిన సేవలు ప్రతి ఒక్కరికి తెలియజేయాలని కార్యకర్తలకు సూచించారు. దేశం కోసం తన జీవితాన్ని అంకితం చేసి గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు డాక్టర్ ఎస్.గౌతంరావు, బండారు ప్రశాంత్, నూనె బాలరాజు, రాములు, కృష్ణాగౌడ్, అజయ్, రాహుల్ చంద్ర, కేశబోయిన శ్రీధర్, ప్రవీణ్, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పురస్కారాల ప్రదానం



పురస్కార గ్రహీతలతో గున్నా రాజేందర్ రెడ్డి తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో డాక్టర్ కపిలవాయి లింగమూర్తి సాహిత్య కళాపీఠం ఆధ్వర్యంలో డాక్టర్ కపిలవాయి లింగమూర్తి 97వ జయంతి వేడుకలను సోమవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, రచయిత డాక్టర్ కె.కనకాచారి, కవులు వల్లభాపురం జనార్దన్, వనపట్ల సుబ్బయ్యలకు కపిలవాయి లింగమూర్తి మీనాక్షమ్మల సాహిత్య పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఓయూ తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య సాగి కమలాకర శర్మ మాట్లాడుతూ కపిలవాయి లింగమూర్తి సాహిత్యాన్ని నేటితరానికి పరిచయం చేయాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. కార్యక్రమంలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ అధ్యక్షులు గున్నా రాజేందర్‌రెడ్డి, రచయిత సంగిశెట్టి శ్రీనివాస్, సాహిత్య పీఠం ఉపాధ్యక్షులు కె.కృష్ణమూర్తి, కార్యదర్శి కపిలవాయి అశోక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల స్థాయి పోటీల్లో మిమిక్రీని ఒక అంశంగా చేర్చాలి

గన్‌ఫౌండ్రీ: పాఠశాల స్థాయిలో నిర్వహించే పోటీల్లో మిమిక్రీని ఒక అంశంగా చేర్చాలని పలువురు వక్తలు అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో మిమిక్రీ ఆర్టిస్టులు వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మిమిక్రీ, వెంట్రిలాక్విజం ఫెస్టివల్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా మిమిక్రి కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జీవీఎస్ రాజు మాట్లాడుతూ..వినోద పరిశ్రమలో మిమిక్రి కళాకారులు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. అదేవిధంగా ప్రజా జీవితంలోని ప్రముఖ వ్యక్తుల స్వరాలు, ప్రవర్తనలను అనుకరించడంలో వారి అసాధారణ ప్రతిభ ప్రసిద్ధి చెందుతుందన్నారు. తెలుగు విశ్వవిద్యాలయంలో మిమిక్రీ కోసం డిప్లొమా కోర్సును ప్రవేశపెట్టడం ఎంతో సంతోషకరమన్నారు. సినీ నటుడు శివారెడ్డి మాట్లాడుతూ.. పాఠశాల్లో నిర్వహించేటటువంటి వార్షిక పోటీల్లో మిమిక్రీని తప్పనిసరిగా చేర్చాలని కోరారు. యాంత్రిక జీవన విధానంలో ఒత్తిడిని అధిగమించేందుకు మిమిక్రీ ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. అనంతరం పలువురు మిమిక్రీ కళాకారుల ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జబర్దస్త్ నటుడు రాకేష్, వంశీ సంస్థల వ్యవస్థాపకులు వంశీ రామరాజు, యువ కళావాహిని అధ్యక్షులు లంకా లక్ష్మీనారాయణ, నటుడు మైమ్ మధు, మిమిక్రీ కళాకారులు మల్లం రమేష్, బి.రవి తదితరులు పాల్గొన్నారు.

ఈద్ ముబారక్



సలావుద్దీన్ లోదికి ఈద్ ముబారక్ తెలియజేస్తున్న కేటీఆర్, మహమూద్ అలీ

చార్మినార్: ఉగాది, రంజాన్ పర్వదినాలను ఇరువర్గాల ప్రజలు శాంతియుతంగా నిర్వహించుకున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. చార్మినార్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి మహమ్మద్ సలావుద్దీన్ లోది సోమవారం కేటీఆర్‌తోపాటు మాజీ మంత్రి మహమూద్ అలీ తదితరులను కలిసి ఈద్ ముబారక్ తెలిపారు. భక్తిశ్రద్ధలతో నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు నిర్వహించిన ముస్లింలందరికీ రంజాన్ ఈద్ ముబారక్ తెలిపారు.

రంజాన్ వేడుకల్లో కేటీఆర్...

చాదర్‌ఘాట్: రంజాన్ పర్వదినం పురస్కరించుకొని అజంపురాలోని మాజీమంత్రి మహమూద్ అలీ ఇంటికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విచ్చేశారు. సోమవారం మహమూద్ ఇంటికి చేరుకున్న కేటీఆర్ ఆయన కుటుంబ సభ్యులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్‌ను మహమూద్ అలీ, మలక్‌పేట నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి అజంఅలీ ఘనంగా సన్మానించారు. అనంతరం కేటీఆర్ వారి ఇంట్లో జరిగిన విందులో పాల్గొన్నారు.

క్రైస్తవులపై దాడులను అరికట్టాలి

తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలను కోరిన ఎన్‌సీసీ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌సీసీ నాయకులు

లాలాపేట: క్రైస్తవ సేవకులు, సంఘాలపై పెరిగిపోతున్న దాడులను అరికట్టాలని నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్'(ఎన్‌సీసీ) డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం ఇక్కడ ఎన్‌సీసీ జీహెచ్ఎంసీ రీజినల్ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా ప్రవీణ్ పగడాల హత్యకు సంతాపం ప్రకటించారు. ఎన్‌సీసీ తెలంగాణ అధ్యక్షుడు బిషప్ సంజయ్ ఆనంద్, ప్రధాన కార్యదర్శి బక్క ఏలియా, మహిళా విభాగం అధ్యక్షురాలు ప్రసన్న బోల్డ్ తదితరులు మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు క్రైస్తవులపట్ల వివక్షను ప్రదర్శిస్తున్నాయని ఆరోపించారు. ఇటీవల చిలుకూరి బాలాజీ టెంపుల్ ప్రధాన అర్చకుడిపై దాడి జరిగితే ప్రభుత్వ పెద్దలు, ప్రతిపక్ష పార్టీల నాయకులు క్యూ కట్టి ఆ పూజారిని పరామర్శించారని, పాస్టర్ ప్రవీణ్ పగడాల దారుణ హత్యకు గురైతే తెలంగాణ ప్రభుత్వంకానీ , ప్రతిపక్ష పార్టీల నాయకులుకానీ స్పందించకపోవడం శోచనీయమన్నారు. ఇటీవల అడ్వొకేట్ ఇజ్రాయెల్, కరుణాకర్ లాంటి వారి హత్యలను ప్రభుత్వాలు పట్టించుకోలేదని విచారం వ్యక్తం చేశారు. ఇటీవల ఆయా మతాల్లోని మతోన్మాదులు మీడియా వేదికలపై అనవసర డిబెట్లు పెట్టి పాస్టర్ల హత్యకు కారణమయ్యారని ఆరోపించారు. ఇకనైనా ఇతర మతాలను, ధర్మాలను కించపరిచే చర్చా కార్యక్రమాలు ఆపాలనీ, సోషల్ మీడియా ద్వారా ప్రవీణ్ మృతిపై చేస్తున్న నిరాధారమైన ఆరోపణలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో న్యాయం కోసం అవసరమైతే సుప్రీం కోర్టును ఆశ్రయిస్తామన్నారు. సమావేశంలో ఎన్‌సీసీ లీగల్ సెల్ నాయకుడు ఉపేందర్, కల్చర్ వింగ్ గొంగ్గళ్ల సునీల్, ఎన్‌సీసీ యూత్ వింగ్ బొల్లం సునీల్, ప్రీతి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి చిరునామా తెలంగాణ

మేయర్ గద్వాల విజయలక్ష్మి



గౌస్‌మోహియుద్దీన్ కుటుంబ సభ్యులతో కలిసి షీర్ ఖుర్మా సేవిస్తున్న మేయర్ విజయలక్ష్మి

ముషీరాబాద్: రంజాన్ పండుగ సందర్భంగా భోలక్‌పూర్ డివిజన్ కార్పొరేటర్ గౌస్‌మొహియుద్దీన్ ఆహ్వానం మేరకు సోమవారం మేయర్ గద్వాల విజయలక్ష్మి కార్పొరేటర్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్‌ను కార్పొరేటర్ సన్మానించి షీర్ ఖుర్మాను అందించారు. మేయర్ మాట్లాడుతూ మతసామరస్యంలో తెలంగాణ రాష్ట్రం ఇతర రాష్ట్రాల కంటే ఆదర్శంగా ఉంటుందని, హిందూ, ముస్లింలు మతాలకు అతీతంగా స్నేహపూర్వకంగా వేడుకలు జరుపుకుంటారని అన్నారు. హైదరాబాద్‌లో అన్ని మతాలవారు అన్నదమ్ముల లాగా కలిసి మెలిసి ఉంటారని పేర్కొన్నారు.

మహిళలకు సమానావకాశాలు కల్పించాలి

ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా



కొత్తపేటలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో మహిళలను సన్మానిస్తున్న దృశ్యం

నాగోలు: మహిళలకు సమాన అవకాశాలు కల్పించడం చాలా అవసరమని, ఇది వారికి ఆర్థిక స్వాతంత్ర్యాన్ని ఇస్తుందని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా అన్నారు. కొత్తపేట మహిళా భవనంలో సోమవారం ముత్తూట్ ఫైనాన్స్, కొత్తపేట లయన్స్ క్లబ్-320 ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన 30 మంది మహిళలను గుర్తించి అవార్డులతో సత్కరించారు. దయానంద్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, అప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. కార్యక్రమంలో ముత్తూట్ ఫైనాన్స్ జోనల్ మేనేజర్ సంపత్, ఏపీ, టీఎస్ క్లాడ్ మీడియా చైర్మన్ రామకృష్ణాచార్యులు, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ హెల్త్ క్యాంప్స్ చైర్మన్ డాక్టర్ లయన్ బి.వి జయ రంగ, శ్రీ లక్ష్మి మహిళామండలి సభ్యులు, పలు మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

శోభాయాత్రకు భారీ ఏర్పాట్లు



కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ భగవంతరావు, గోవింద్‌రాఠి తదితరులు

అబిడ్స్: శ్రీరామ నవమి శోభాయాత్రకు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు భాగ్యనగర్ శ్రీరామనవమి ఉత్సవ సమితి చైర్మన్ డాక్టర్ భగవంతరావు, ప్రధాన కార్యదర్శి గోవింద్‌రాఠి తెలిపారు. ఏప్రిల్ 6వ తేదీన సీతారాంబాగ్ నుంచి హనుమాన్ టేక్డీ వరకు లక్షలాది మందితో శోభాయాత్ర నిర్వహిస్తామన్నారు. ఈ మేరకు సోమవారం సిద్దిఅంబర్ బజార్ బహతిభవన్‌లో భాగ్యనగర్ శ్రీరామ నవమి ఉత్సవ సమితి కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ పోలీసులు, వాటర్‌బోర్డు, జీహెచ్ఎంసీ, రెవెన్యూ, విద్యుత్, ఇతర శాఖల అధికారులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కరోడి మాల్, మెట్టు వైకుంఠం, కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్, శ్రీరామ్‌వ్యాస్, కమల్‌సింగ్, నగ్రాచ్ నామ్‌దారి, గోల్కొండ బీజేపీ అధ్యక్షులు ఉమా మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వ్యూహాత్మకంగా చదివినవారే విజేతలు

ఆర్.సి.రెడ్డి స్టడీ సర్కిల్ ముఖాముఖిలో గ్రూప్-1 ర్యాంకర్లు





గ్రూప్-1 ర్యాంకర్లను సన్మానిస్తున్న ఆర్.సి.రెడ్డి



నికిత

సాక్షి, సిటీబ్యూరో: విజేతగా నిలవాలంటే నిరంతర కృషితోపాటు సరైన శిక్షణ అవసరమని టీజీపీఎస్సీ గ్రూప్-1 ఫలితాల్లో టాప్ 8వ ర్యాంక్ సాధించిన నిఖిత అన్నారు. ఇటీవల విడుదలైన గ్రూప్-1 ఫలితాల నేపథ్యంలో నగరంలోని ఆర్.సి.రెడ్డి స్టడీ సర్కిల్ నిర్వహించిన 'విజేతలతో ముఖాముఖి' కార్యక్రమంలో పలువురు టాపర్లు తమ అనుభవాలను పంచుకున్నారు. 24వ ర్యాంక్ సాధించిన సాయి ప్రత్యూష్‌రెడ్డి మాట్లాడుతూ తక్కువ సమయంలో విజయాన్ని సాధించడానికి అధునాతన సాంకేతికతతోపాటు ఆర్.సి.రెడ్డి ఐఏఎస్ స్టడీ సర్కిల్ దోహదపడ్డాయని అన్నారు. పరీక్షల సరళిని అర్థం చేసుకుని, సరైన వ్యూహంతో శ్రమించిన అభ్యర్థులందరూ విజయవంతమయ్యారని స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఆర్.సి.రెడ్డి పేర్కొన్నారు. ఎక్కువమంది తమ మా కోచింగ్ ద్వారా గ్రూప్-1లో విజయం సాధించడం గర్వకారణంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా టాప్ ర్యాంకర్లను ఆర్.సి.రెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో గ్రూప్ - 1 టాపర్లు శాంతిప్రియ, ఖుషీ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్। మంగళవారం।
1। ఏప్రిల్। 2025





సృజనాత్మక శక్తి కలిగిన క్రియేటర్లకు నగరం చిరునామాగా మారుతోంది. పలువురు యువతీ యువకులు సోషల్ మీడియాలో తమ సత్తా చాటుతున్నారు. అత్యధిక ఫాలోవర్లను, వ్యూస్‌ను అందుకుంటూ దూసుకుపోతున్నారు. పెద్ద సంఖ్యలో వెలుగులోకి వస్తున్న సిటీ డిజిటల్ స్టార్స్‌ను సొంతం చేసుకునేందుకు, మరింత మందిని తమవైపు తిప్పుకునేందుకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ నగరంపై దృష్టి సారించాయి. విభిన్న రకాల ఈవెంట్లతో నగర యువతను ఊపేస్తున్నాయి. - సాక్షి, సిటీబ్యూరో

క్రియేటర్.. హుషార్..

నగర యువతలో జోష్ నింపుతున్న క్రియేటర్ మీట్స్

స్నాప్ చాట్, ఇన్‌స్టా మాధ్యమాల ఆధ్వర్యంలో ఈవెంట్స్

యువ సృజనకు గాలం వేసేందుకు పోటాపోటీ సోషల్ యాప్స్

శిక్షణా తరగతుల నుంచి విందు, వినోదాల వరకూ సందడే సందడి

ఈ యాప్స్ ఉపయోగించేవారిలో అత్యధికులు టీనేజర్లు, అందులో యువతులు ఉండడంతో ఈ ఆన్‌లైన్ యాప్స్ వారి కోసం నగరంలో పలు ఆఫ్‌లైన్ శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నాయి. క్రియేటర్లకు అవగాహన, మార్గదర్శకత్వం అందించడంతో పాటు కొత్త కొత్త సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకుంటూ మరింత రాణించేందుకు అన్ని విధాలా సహకరిస్తున్నాయి. అంతేకాకుండా తమ ఫాలోయింగ్, లైక్స్, వ్యూస్ ఉపయోగించుకుంటూ ప్రకటనలు పొందడం, మానిటైజేషన్ అవకాశాలను మెరుగుపరుచుకోవడంపైనా అవగాహన కలిగిస్తున్నాయి.







ప్రత్యేకంగా క్రియేటర్ డే సృష్టి..

అంతర్జాతీయ స్థాయిలో క్రియేటర్ల కోసం ప్రత్యేకంగా క్రియేటర్స్ డే కూడా నిర్వహిస్తున్నారు. మెటా ఆధ్వర్యంలోని ఫేస్‌బుక్, ఇన్‌స్టా ముంబయి, బెంగళూర్ సహా హైదరాబాద్‌లో నూ క్రియేటర్స్ డే ఘనంగా నిర్వహిస్తున్నాయి. దీంతో పాటే ఔత్సాహిక యువత కోసం ఈ యాప్స్ గతేడాదిలో క్రియేటర్స్ ల్యాబ్‌ను కూడా అందుబాటులోకి తెచ్చాయి. నటి రష్మిక మందన్న, హీరో నానితో పాటు బాలీవుడ్ సెలబ్రిటీలు సైతం ఈ ఈవెంట్స్‌లో పాల్గొంటుండడంతో వీటికి యువత నుంచి విపరీతమైన ఆదరణ లభిస్తోంది. ఈ నేపథ్యంలో భవిష్యత్తులో నగరాన్ని క్రియేటర్స్ హబ్‌గా చూడడం తథ్యం అనిపిస్తోంది.

హైదరాబాద్ తొలి ప్రాధాన్యత..

దేశవ్యాప్తంగా దాదాపు 200 మిలియన్ల క్రియేటర్లను కలిగి ఉన్న ప్రముఖ సోషల్ వేదిక స్నాప్‌చాట్ తన తొలి స్నాప్‌చాట్ క్రియేటర్ కనెక్ట్ కార్యక్రమాన్ని నగరంలోని దుర్గం చెరువు సమీపంలో ఉన్న ఆలివ్ బిస్ట్రో రెస్టారెంట్‌లో గత బుధవారం నిర్వహించింది. క్రియేటర్లకు అన్ని రకాలుగా సహాయ సహకారాలతో పాటు ఆదాయం ఆర్జించే అవకాశాలను మెరుగుపరచడమే లక్ష్యంగా ఈ ఈవెంట్ నిర్వహించినట్టు స్నాప్ ఇన్ కార్పొరేషన్ కంటెంట్, ఏఆర్ భాగస్వామ్యాల డైరెక్టర్, సాకేత్ ఝా సౌరభ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రాంతీయ కంటెంట్ క్రియేటర్లకు తోడ్పడేందుకు నగరానికి చెందిన క్రియేటివ్ మీడియా సంస్థలు, తమడ మీడియా, చాయ్ బిస్కెట్, సిల్లీ మాంక్స్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్టు ప్రకటించారు.







సోషల్ మీడియా ద్వారా కనెక్ట్ అవడం బాగుంది..

'యూ ట్యూబ్, ఇన్‌స్టా ద్వారా ప్రపంచ వ్యాప్తంగా నిత్యం వేలాది, లక్షలాది మందితో కనెక్ట్ అవ్వొచ్చు' అని చెప్పారు యాంకర్ లాస్య. ప్రస్తుతం సోషల్ మీడియాలో సెలబ్రిటీగా తనకంటూ ప్రత్యేక ఫాలోయింగ్ తెచ్చుకుంది లాస్య.. ప్రత్యేకంగా ఇలాగే చేయాలనే ముందస్తు ప్లాన్స్ లేకుండా అప్పటికప్పుడు చేసే సరదా బిట్స్ కూడా వీక్షకాదరణ పొందే అవకాశం లభిస్తోంది. ప్రస్తుతం టీవీకి, సినిమాకీ కొంత దూరంగా ఉన్నా, దీని ద్వారా ఆ లోటు తీరుతోంది. అయితే ఇప్పటికీ మంచి అవకాశం వస్తే వెండితెరపై మెరిసేందుకు సిద్ధమే. నా భర్త మంజునాథ్‌తో కలిసి కంటెంట్ క్రియేట్ చేస్తున్నా. ఈ సోషల్ మీడియాలో క్రియేటర్స్‌గా రాణించాలంటే ఎప్పటికప్పుడు మన స్కిల్స్ మెరుగుపరుచుకుంటూ, కొత్త కొత్త పోకడలు అందిపుచ్చుకుంటూ ఉండడం అవసరం. దీనికి ఈ యాప్స్ నిర్వహిస్తున్న ఆఫ్‌లైన్ ఈవెంట్స్ బాగా ఉపకరిస్తున్నాయి. ఈ కారణంగానే మేము స్నాప్ చాట్ ఏర్పాటు చేసిన క్రియేటర్స్ కనెక్ట్ ప్రోగ్రామ్‌కి అటెండ్ అయ్యాం.

– మంజునాథ్ లాస్య (యాంకర్)





నటి సౌమ్య జాను నివాసంలో

రంజాన్ సందడి

బంజారాహిల్స్: రంజాన్ పండుగను పురస్కరించుకుని టాలీవుడ్ సినీనటి సౌమ్య జాను ఫిలింనగర్‌లోని తన నివాసంలో ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. ఇందులో వెండితెర, బుల్లితెర నటీనటులతో పాటు పలువురు రాజకీయ, ఇతర రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు. వీరిలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, కాంగ్రెస్ నేత ఫిరోజ్ ఖాన్, జబర్దస్త్ ఫణి, అదిరే అభి, మహేష్, సినీ నటులు శ్రావణ్, చింటూ, శ్రీధర్ రావు, హేమ, అపూర్వ, జ్యోతి, సమీర్, అభిషేక్ తదితరులు పాల్గొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ పర్వదినాన ఇలా అందరినీ కలుసుకోవడం సంతోషంగా ఉందని సౌమ్య పేర్కొన్నారు.

నృత్యం.. నయనానందకరం



ఆకట్టుకున్న పరంపర సభ్యుల నాట్య సమ్మేళనం

ఔత్సాహికులను అలరించిన కళాకారుల ప్రదర్శన



జూబ్లీహిల్స్ రోడ్ నెం.10లోని ఎంపీ, ఎమ్మెల్యే కాలనీలో ఉగాది ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి పరంపర బృందం చేసిన భరతనాట్యం ప్రదర్శన వీక్షకులను, ఔత్సాహికులను అలరించింది. కళాకారుల నాట్య భంగిమలు అభిమానుల చూపులను కట్టిపడేశాయి. సుమారు రెండు గంటల పాటు పైగా సాగిన కళాకారుల నృత్య ప్రదర్శన ఆద్యంతం ఆసక్తికరంగా, ఆనందభరితంగా సాగాయి. సంస్కృతిని, కళలను మేళవిస్తూ చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. – బంజారాహిల్స్

హ్యాండ్ మేడ్ జ్యువెలరీకి ఆదరణ

ఏఎస్ రావు నగర్ వేదికగా 'ఇంద్రియ' నూతన స్టోర్



సాక్షి, సిటీబ్యూరో: ముత్యాల నగరంగా గుర్తింపు పొందిన భాగ్యనగరంలో ఇప్పటికీ హస్తకళకు, హ్యాండ్ మేడ్ జ్యువెలరీకి ఆదరణ తగ్గలేదని 'ఇంద్రియ' ఆదిత్య బిర్లా జ్యువెలరీ సీఈఓ సందీప్ కోహ్లి తెలిపారు. నగరంలోని ఏఎస్ రావు నగర్ వేదికగా సోమవారం విష్కరించారు. ఇంద్రియ ప్రత్యేక శిల్పకళను, సృజనాత్మకతను కొత్త వినియోగదారులకు చేరువ చేస్తుందన్నారు. నగరంలో చాలా కాలంగా అద్భుతమైన ఆభరణాలకు పర్యాయపదంగా నిలుస్తోందని, ఈ నేపథ్యంలో తమ క్లిష్టమైన కుందన్, పోల్కి డిజైన్లతో పాటు బస్రా ముత్యాలు ప్రత్యేక ఆకర్షణగా ఉంటుందన్నారు.



మధ్యాహ్న మిత భోజన కార్యక్రమంలో మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ (ఫైల్)

నగరంలోని సనత్‌నగర్‌కు చెందిన శ్రీనివాస రామానుజ చారిటబుల్ ట్రస్ట్ పేదలకు, బాటసారులకు సేవలందిస్తోంది. వేసవిలో వారి పాలిట అక్షయ పాత్రలా మారుతోంది. ప్రతి రోజూ మధ్యాహ్నం మితాహారాన్ని అందిస్తూ అభాగ్యుల ఆకలి తీరుస్తోంది. యేటా రెండు నెలల పాటు ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ప్రస్తుతం వేసవి కావడంతో మంగళవారం నుంచి మరోసారి ఈ మహా కార్యక్రమానికి శ్రీకారం చుట్టనుంది. - సనత్‌నగర్

రోజుకో పూట.. నిత్యాన్నదాత

- వేసవిలో స్వచ్ఛంద సంస్థ మితాహారం పంపిణీ
- రెండు నెలల పాటు బాటసారుల ఆకలి తీరుస్తూ..
- పేదలకు శ్రీనివాస రామానుజ చారిటబుల్ ట్రస్ట్ సేవలు

ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 14 ఏళ్లుగా అన్నార్థుల ఆకలి తీరుస్తోంది శ్రీనివాస సమాజ సేవా సమితి. స్థానిక బీకేగూడ పార్కు వద్ద రోజుకు 250 నుంచి 300 మంది వరకూ మధ్యాహ్నం మిత భోజనాన్ని వడ్డించేందుకు సీనియర్ సిటిజన్స్ సిద్ధమయ్యారు.

దాతల సహకారంతో..

రోజుకు ఇద్దరు, ముగ్గురు చొప్పున దాతలు ఈ కార్యక్రమంలో భాగస్వాములు అయ్యేందుకు పోటీపడుతుంటారు. అయితే రోజుకో దాత అనే సంప్రదాయాన్ని ట్రస్ట్ కొనసాగిస్తూ వస్తోంది. దాతల కోరిక మేరకు పుట్టిన రోజు, పెళ్లిరోజు వంటి కొన్ని ప్రత్యేక తేదీల్లో వారి పేరున నలుగురికీ ఆహారాన్ని పంచుతోంది. ఈ యేడాదికి గానూ ఇప్పటికే జూన్ 2 వరకూ అన్ని రోజులకు సరిపడా దాతలు తమ తేదీలను బుక్ చేసుకున్నారు.

రోజుకు రూ.5వేల చొప్పున..

ఒక్కో దాత నుంచి రోజుకు రూ.5వేల చొప్పున మాత్రమే స్వీకరిస్తారు. వీటితో రుచికరమైన వంటకాలను అందిస్తారు. బగారా రైస్, టమాటా రైస్, జీరా రైస్, కర్రీ, పెరుగన్నం, నిమ్మకాయ పచ్చడి, స్వీట్స్‌తో పాటు ప్లేట్లు, ట్రాన్స్‌పోర్ట్ ఛార్జీలను కలిపి రూ.5,000 గా నిర్ణయించారు. ఈ మొత్తాన్ని ట్రస్ట్‌కు నగదు, చెక్కు రూపంలో స్వీకరిస్తారు.

దాతల సహకారం అపూర్వం..

మంగళవారం ఉదయం 11.30 గంటలకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఈ మితాహార కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఇలాంటి అపూర్వమైన కార్యక్రమంలో దాతల సహకారం అపూర్వం. దీనికి సీనియర్ సిటిజన్స్ తోడవ్వడం మా అదృష్టం. వారి సహకారం మరువలేనిది. ఏటా మాదిరిగానే చలివేంద్రం ఏర్పాటుకు ముందుకొచ్చిన శ్యాంసుందర్‌రాజ్‌కు కృతజ్ఞతలు.

- పార్థసారథి, శ్రీనివాస రామానుజ ట్రస్టీ



అరచేతిలో ప్రపంచాన్ని చూపిస్తూ పుట్టిన పిల్లల నుంచి వృద్ధుల వరకూ ప్రతి ఒక్కరూ దీనికి బానిసలే.. అదే నిత్యవ్యాపకంగా మారిన సెల్‌ఫోన్. ఈ మధ్యకాలంలో సెల్ ఉపయోగించని వారు లేరంటే అతిశయోక్తిలేదు. లేచింది మొదలు పడుకునే వరకూ దాదాపు ఫోన్‌తోనే కాలక్షేపం చేస్తున్న వారు అధికం అవుతున్నారు. దీంతో వీరిని రకరకాల రుగ్మతలు వెంటాడుతున్నాయి. వాటిలో ఒకటే పింకీ ట్రిగ్గర్, ఫోన్ పింకీ అని పిలుస్తున్నారు. - ఖైరతాబాద్

పింకీ ట్రిగ్గర్..

- గంటల తరబడి సెల్ వాడకంతో ఫింగర్ డెంట్
- పెరుగుతున్న టెక్స్టింగ్ థంబ్ సమస్యలు
- అలవాట్లు, పద్ధతులు మార్చుకోవాలి : డాక్టర్ చంద్రశేఖర్



అధిక శాతం మంది కనీసం రోజులో 4–6 గంటలు సగటున ఫోన్ వినియోగిస్తున్నారు. ఇక 13–18 మధ్య వయసు వారు 5–7 గంటలు, 18–30 మధ్య వయసు వారు 6–10 గంటలు, ఉద్యోగాలు చేసేవారు 3–5 గంటలు, సీనియర్ సిటిజన్స్ 1–3 గంటల పాటు ఫోన్ వినియోగిస్తున్నట్లు సర్వేలు చెబుతున్నాయి. సోషల్ మీడియా రాకతో ఎంటర్‌టైన్‌మెంట్, ఆన్‌లైన్ గేమ్స్, ఎడ్యుకేషన్, వీడియోలు, రీల్స్ ఇలా ఏ వయసు వారు ఆ స్థాయిలో ఫోన్ వినియోగిస్తున్నారు.

పెరుగుతున్న సమస్యలు..

అతిగా ఫోన్ వినియోగించడం వల్ల రక రకాల రుగ్మతులు వెంటాడుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. అయితే ఇటీవల వెంటాడుతోన్న రుగ్మతల్లో ఒకటి పింకీ ఫింగర్, పింకీ ట్రిగ్గర్, ఫోన్ పింకీ ఒకటి. ఈ పదాలు వినడానికి కొత్తగా అనిపించినా ప్రస్తుతం వేదిస్తోన్న ప్రధాన సమస్య. గంటల తరబడి చిటికెను వేలుపై ఫోన్ బ్యాలెన్స్ చేయడం వల్ల ఈ సమస్య తలెత్తుతోందని అధ్యయనాలు చెబుతున్నాయి. రోజుల తరబడి ఫోన్ బరువు పడడంతో వేలుపై ఒత్తిడి పెరిగి తాత్కాలికంగా చిన్న డెంట్ ఏర్పడుతోంది.



ఒత్తిడి తగ్గించాలి

వేళ్లపై అధిక ఒత్తిడి పడడంతో ఆ ప్రభావం నరాలపైనా పడుతోంది. ఫలితంగా కార్పల్ టన్నల్ సిండ్రోమ్ అనే సమస్యకు దారితీస్తోంది. ఇదో గందరగోళ వైద్య సమస్య అని చెబుతున్నారు. అంతేకాకుండా బొటనవేలు సందుల మధ్య కండరాలు ప్రభావితం చెందడం వల్ల 'టెక్స్టింగ్ థంబ్' సమస్య ఏర్పడుతోంది. దీంతోపాటు ఎక్కువ సేపు తల వంచి ఫోన్ చూడటం వల్ల మెడ కండరాలపై ఒత్తిడి పెరిగి మెడ నొప్పి సమస్యకు దారితీస్తోంది. వీటి నుంచి బయట పడటానికి రెండు చేతులూ వినియోగించడం, ఫోన్ స్టాండ్స్ వాడటం, చేతి వేళ్లకు విశ్రాంతి ఇవ్వడం, చేతుల వ్యాయామం చేయడం ఉత్తమం.

– డాక్టర్ బి.చంద్రశేఖర్, షోల్డర్ సర్జన్, కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్స్, బేగంపేట

ఆర్కిటెక్చర్ అద్భుతాలు..

అధునాతన సాంకేతికతపై సదస్సు, వర్క్‌షాపు



సాక్షి, సిటీబ్యూరో : అందుబాటులో ఉన్న అత్యాధునిక సాంకేతికతతో ఆర్కిటెక్చర్‌లో అద్భుతాలు ఆవిష్కరించవచ్చని ఇంజినీరింగ్ ప్రముఖులు, సాంకేతిక రంగ నిపుణులు అభిప్రాయపడ్డారు. నగరానికి చెందిన కేఎల్‌ఈఎఫ్ డీమ్డ్ టు బీ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 'ఫ్యూచర్ ఎక్స్: రీ ఇమాజినింగ్ స్పేసెస్ అండ్ రీడిఫైనింగ్ ది ఫ్యూచర్' పేరిట నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు సోమవారం ముగిసింది. ఏఐ–ఆధారిత డిజైన్ ఆవిష్కరణలు వంటి అంశాలపై చర్చలు, వర్క్‌షాప్స్‌లో పరిశ్రమ ప్రముఖులు, విద్యావేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన ప్రతీకార టారిఫ్‌ల అమలుకు డెడ్‌లైన్ అయిన ఏప్రిల్ 2 దగ్గరపడటంతో ఎగుమతి సంస్థల్లో గుబులు, గందరగోళం నెలకొంది. ఏయే రంగాలపై ఎంతెంత వేస్తారు, ఏయే రంగాలను వదిలేస్తారు అనే అంశాలపై అందరిలోనూ అయోమయం నెలకొంది. వాణిజ్య ఒప్పందాలపై సంప్రదింపులు జరిపే దేశాల జాబితాలో భారత్‌ని కూడా అమెరికా చేర్చడంతో ... టారిఫ్‌లపై బేరసారాలు చేసేందుకు అవకాశం దొరకవచ్చని, కొన్నాళ్లయినా సుంకాలు వాయిదా పడొచ్చేమోనని ఆశాభావం నెలకొంది. ఈ నేపథ్యంలో టారిఫ్‌లు, ఏయే రంగాలపై ప్రభావం పడొచ్చనే అంశాలను ఒకసారి చూస్తే.. - న్యూఢిల్లీ

ట్రంప్ టారిఫ్‌ల టెన్షన్!!

రేపే డెడ్‌లైన్

ఎగుమతిదార్లలో అయోమయం

రంగాలవారీ వడ్డింపా.. విడివిడిగా ఉత్పత్తుల మీదా అని ఆందోళన

- నాలుగు స్థాయిల్లో టారిఫ్‌ల ప్రభావం ఉండొచ్చని అంచనా
- వాయిదా వేసే అవకాశం ఉందని ఆశాభావం
- భారత్–అమెరికా ద్వైపాక్షిక వాణిజ్యం 119.71 బిలియన్ డాలర్లు

అమెరికా ప్రణాళిక ఏంటంటే..

వివిధ దేశాలతో తమకున్న వాణిజ్య లోటును భర్తీ చేసుకునేందుకు వాటి నుంచి తమకు వచ్చే దిగుమతులపై అమెరికా సుంకాలను విధించడం / పెంచడం వంటి చర్యలు తీసుకునేందుకు ఉద్దేశించిన ప్రతిపాదన ఇది. అమెరికన్ ఉత్పత్తుల దిగుమతులపై ఇతర దేశాలు భారీగా సుంకాలు విధిస్తున్నాయని, అవరోధాలు ఏర్పరుస్తున్నాయనేది ట్రంప్ ఆరోపణ. దీని వల్ల 1 లక్ష కోట్ల డాలర్ల మేర వాణిజ్య లోటు ఉంటోందని, దీనితో అమెరికన్ పరిశ్రమలు, వర్కర్లపైనా ప్రతికూల ప్రభావం పడుతోందనేది ఆయన వాదన. 2021–22 నుంచి 2023–24 మధ్య కాలంలో భారత్‌కు అమెరికా అతి పెద్ద వాణిజ్య భాగస్వామ్య దేశంగా ఉంది. భారత్ ఎగుమతుల్లో 18 శాతం, దిగుమతుల్లో 6.22 శాతం, అన్ని దేశాలతో ద్వైపాక్షిక వాణిజ్యంలో 10.73 శాతం వాటా అమెరికాది ఉంది. 2023–24లో భారత్–అమెరికా ద్వైపాక్షిక వాణిజ్యం 119.71 బిలియన్ డాలర్లుగా నమోదైంది. ఇందులో భారత్ నుంచి 77.51 బిలియన్ డాలర్ల ఎగుమతులు, అమెరికా నుంచి 42.19 బిలియన్ డాలర్ల దిగుమతులు ఉన్నాయి. దీంతో వాణిజ్య మిగులు భారత్ పక్షాన సుమారు 35.31 బిలియన్ డాలర్లుగా నమోదైంది.

భారత ఎగుమతులపై ప్రతీకార టారిఫ్‌లు ఏ స్థాయిలో ఉండొచ్చంటే..

ప్రస్తుతానికి టారిఫ్‌లను ఏ విధంగా విధిస్తారనేది, అంటే ప్రొడక్టు స్థాయిలోనా, లేదా రంగాలవారీగానా, లేదా దేశ స్థాయిలోనా అనే దానిపై ఇంకా స్పష్టత లేదు. దీనిపై నిపుణులు ఏమంటున్నారంటే..

అమెరికా నుంచి దిగుమతులపై భారత్ విధించే సుంకాలు, నిజానికి ఆరోపిస్తున్న దానికంటే చాలా తక్కువ స్థాయిలోనే ఉంటున్నాయని జీటీఆర్ఐ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ తెలిపారు. అమెరికా గానీ సహేతుక వాణిజ్య విధానాన్ని అవలంబిస్తే, పెద్దగా అవాంతరాలు లేకుండా భారత పరిశ్రమలు ఎగుమతులను కొనసాగించవచ్చని, ఇరు దేశాల మధ్య మరింత సమతూకమైన, స్థిరమైన విధంగా వాణిజ్య బంధం బలోపేతం కావచ్చని పేర్కొన్నారు. నాలుగు స్థాయిల్లో టారిఫ్‌ల ప్రభావాలను జీటీఆర్ఐ అంచనా వేసింది.



దేశ స్థాయిలో: భారత్ నుంచి అన్ని ఎగుమతులపై ఒకే రకంగా టారిఫ్‌లు విధించడం: ఒకవేళ ఈ విధానాన్ని అమలు చేస్తే మన ఎగుమతులపై అదనంగా 4.9 శాతం భారం పడుతుంది. ప్రస్తుతం అమెరికా ఉత్పత్తులపై మన దగ్గర టారిఫ్‌లు సగటున 7.7 శాతంగా ఉండగా, మన ఎగుమతులపై అక్కడ సగటున 2.8 శాతంగా ఉంటోంది. ఆ విధంగా రెండింటి మధ్య 4.9 శాతం వ్యత్యాసం ఉంది.



వ్యవసాయం, పరిశ్రమల స్థాయిలో: ఈ విధానాన్ని అమలు చేస్తే వ్యవసాయోత్పత్తులపై అదనంగా 32.4 శాతం, పారిశ్రామికోత్పత్తులపై 3.3 శాతం భారం పడొచ్చు. ప్రస్తుతం అమెరికాకు భారత వ్యవసాయోత్పత్తులపై 5.3 శాతం సుంకాలు ఉండగా, అక్కడి నుంచి దిగుమతులపై అత్యధికంగా 37.7 శాతంగా (వ్యత్యాసం 32.4 శాతం) ఉంటోంది. మరోవైపు పారిశ్రామికోత్పత్తుల విషయానికొస్తే.. అమెరికా నుంచి దిగుమతులపై సగటున 5.9 శాతం, మన ఎగుమతులపై కేవలం 2.6 శాతం (వ్యత్యాసం 3.3 శాతం) ఉంటోంది.

రంగాల స్థాయిలో: వివిధ రంగాల్లో ఇరు దేశాల ఉత్పత్తులపై టారిఫ్‌ల మధ్య వ్యత్యాసాలు వివిధ రకాలుగా ఉన్నాయి. రసాయనాలు..ఫార్మాలో 8.6 శాతం, ప్లాస్టిక్స్‌లో 5.6 శాతం, టెక్స్‌టైల్స్‌పై 1.4 శాతం, వజ్రాలు.. బంగారం మొదలైన వాటిపై 13.3 శాతం, ఇనుము..ఉక్కుపై 2.5 శాతం, మెషినరీ .. కంప్యూటర్స్‌పై 5.3 శాతం, ఎలక్ట్రానిక్స్‌పై 7.2 శాతం, ఆటోమొబైల్స్ .. ఆటో విడిభాగాలపై 23.1 శాతం వ్యత్యాసం ఉంటోంది. ఇది ఎంత ఎక్కువగా ఉంటే, సదరు రంగంపై ప్రభావం కూడా అంతే ఎక్కువగా ఉంటుంది. భారత్ ఎగుమతులు 30 కేటగిరీలుగా ఉంటున్నాయి. ఇందులో వ్యవసాయంలో ఆరు, పరిశ్రమల్లో 24 ఉన్నాయి.

వ్యవసాయం

అత్యధికంగా చేపలు, మాంసం, ప్రాసెస్డ్ సీఫుడ్‌పై ప్రభావం ఉంటుంది. దాదాపు 2.58 బిలియన్ డాలర్ల విలువ చేసే ఎగుమతులపై టారిఫ్‌ల వ్యత్యాసం 27.83 శాతం ఉంటోంది.

1.03 బిలియన్ డాలర్లుగా ఉంటున్న ప్రాసెస్డ్ ఫుడ్, చక్కెర, కోకో ఎగుమతులపై ఏకంగా 24.99 శాతం మేర టారిఫ్‌లు పెరగొచ్చు. దీంతో అమెరికాలో భారతీయ స్నాక్స్ ఖరీదు మరింత పెరగొచ్చు.

చిరుధాన్యాలు, కూరగాయలు, పండ్లు, సుగంధ ద్రవ్యాలపై వ్యత్యాసం (1.91 బిలియన్ డాలర్ల విలువ) 5.72 శాతంగా ఉంటోంది. బియ్యం మొదలైన ఎగుమతులపై ప్రభావం పడొచ్చు.

181.49 మిలియన్ డాలర్ల విలువ చేసే డెయిరీ ఉత్పత్తులపై ఏకంగా 38.23 శాతం టారిఫ్ వ్యత్యాసం ఉంటోంది. దీంతో నెయ్యి, వెన్న, పాల పొడిలాంటివి రేట్లు పెరిగి, మన మార్కెట్ వాటా పడిపోవచ్చు.

199.75 మిలియన్ డాలర్ల విలువ చేసే వంటనూనెల ఎగుమతులపై 10.67 శాతం మేర టారిఫ్ పెరగవచ్చు.

సుమారు 19.20 మిలియన్ డాలర్ల ఎగుమతులే అయినప్పటికీ ఆల్కహాల్, వైన్‌లపై అత్యధికంగా 122.10 శాతం సుంకాలు విధించవచ్చు.

పారిశ్రామిక ఉత్పత్తులు


12.72 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉంటున్న ఫార్మా ఉత్పత్తులకు సంబంధించి టారిఫ్ వ్యత్యాసం 10.90 శాతం మేర ఉంటోంది. ఇది విధిస్తే, జనరిక్ ఔషధాలు, స్పెషాలిటీ డ్రగ్స్ రేట్లు పెరిగిపోతాయి.

14.39 బిలియన్ డాలర్ల విలువ చేసే ఎలక్ట్రికల్, టెలికం, ఎలక్ట్రానిక్స్ ఎగుమతులపై 7.24 శాతం టారిఫ్‌లు పడొచ్చు.

మెషినరీ, బాయిలర్, టర్బైన్, కంప్యూటర్ ఎగుమతుల విలువ 7.10 బిలియన్ డాలర్లుగా ఉంటోంది. వీటిపై 5.29 శాతం టారిఫ్‌ల పెంపు అవకాశాలతో భారత్ నుంచి ఇంజనీరింగ్ ఎగుమతులపై ప్రభావం ఉండొచ్చు.

5.71 బిలియన్ డాలర్ల విలువ చేసే రసాయనాల ఎగుమతులపై (ఫార్మాను మినహాయించి) 6.05 శాతం, 1.71 బిలియన్ డాలర్ల సెరామిక్, గ్లాస్, స్టోన్ ఉత్పత్తులపై 8.27 శాతం, 457.66 మిలియన్ డాలర్ల ఫుట్‌వేర్‌పై 15.56 శాతం ఉండొచ్చు.

టెక్స్‌టైల్స్, ఫ్యాబ్రిక్స్, కార్పెట్లు మొదలైన వాటి ఎగుమతులు 2.76 బిలియన్ డాలర్లుగా ఉండగా వీటిపై సుమారు 6.59 శాతం; 1.06 బిలియన్ డాలర్లుగా ఉన్న రబ్బర్ ఉత్పత్తులపై (టైర్లు, బెల్టులు సహా) 7.76 శాతం; పేపర్.. కలప ఉత్పత్తులపై (969.65 మిలియన్ డాలర్లు) 7.87 శాతం మేర టారిఫ్‌ల ప్రభావం ఉండొచ్చు.



పెద్దగా ప్రభావం / అసలు ప్రభావమే ఉండని రంగాలు

3.33 బిలియన్ డాలర్ల విలువ చేసే ముడి ఖనిజాలు, పెట్రోలియం ఎగుమతులపై టారిఫ్‌లు మైనస్ స్థాయిలో (మైనస్ 4.36) ఉంటున్నాయి కాబట్టి, కొత్తగా విధించడానికేమీ ఉండకపోవచ్చు.

అలాగే, 4.93 బిలియన్ డాలర్ల గార్మెంట్స్ ఎగుమతులపై, వ్యత్యాసం మైనస్ 4.62 శాతంగా ఉంది కాబట్టి టారిఫ్‌ల భారం ఉండకపోవచ్చు.

‘లూలూ’కు రూ.2 వేల కోట్ల స్థలం..

గోల్ ‘మాల్’!

విశాఖ నడిబొడ్డున అత్యంత విలువైన 13.43 ఎకరాల భూమి ధారాదత్తం

టెండర్లు, ఆసక్తి వ్యక్తీకరణ ప్రతిపాదన నోటిఫికేషన్ లేకుండానే కేటాయింపు

బహిరంగ మార్కెట్లో ఎకరం రూ.150 కోట్లకుపైనే

వాణిజ్య కార్యకలాపాలు.. షాపింగ్ మాల్.. మల్టీప్లెక్స్ నిర్మాణాలకు సిద్ధం

లూలూ చైర్మన్ లేఖ రాయగానే రూ.2 వేల కోట్ల భూమిని రాసిచ్చేసిన బాబు సర్కార్

అడ్డగోలుగా కేటాయింపు.. పారదర్శకతకు పాతర.. అంతా స్కామ్‌లమయం

రాయితీల రూపంలో రూ.170 కోట్ల మేర లూలూకు లబ్ధి

సాక్షి, అమరావతి: ‘లూలూ’ గ్రూపుపై చంద్రబాబు సర్కారు వల్లమాలిన ప్రేమ చూపింది. లూలూ గ్రూపు చైర్మన్ యూసుఫ్ అలీ జనవరి 17న సీఎం చంద్రబాబుకు రాసిన ఓ లేఖ ఆధారంగా విశాఖలో అత్యంత ఖరీదైన భూమిని నామమాత్రపు లీజుపై ఆ సంస్థకు ధారాదత్తం చేసింది. విశాఖలోని హార్బర్ పార్క్‌లో 13.43 ఎకరాల భూమిలో అభివృద్ధి ప్రాజెక్టుకు టెండర్.. ఆసక్తి వ్యక్తీకరణ ప్రతిపాదన (ఆర్ఎఫ్‌పీ) నోటిఫికేషన్ జారీ చేయకుండానే వ్యవహారాన్ని పూర్తి చేసింది. హార్బర్ పార్క్‌లో ఎకరం భూమి బహిరంగ మార్కెట్లో రూ.150 కోట్లకుపైగా పలుకుతోందని విశాఖవాసులు చెబుతున్నారు. అంటే.. ఏకంగా రూ.2 వేల కోట్లకుపైగా విలువైన ప్రభుత్వ భూమిని ‘లూలూ’కు రాసిచ్చేసినట్లు స్పష్టమవుతోంది. బీచ్ పక్కనే ఉన్న హార్బర్ పార్క్‌లో 13.43 ఎకరాల ఖరీదైన భూమి వీఎంఆర్‌డీఏ(విశాఖపట్నం మెట్రో రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ) అధీనంలో ఉంది. అత్యంత విలువైన ఈ భూమిలో ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) విధానంలో అభివృద్ధి ప్రాజెక్టు చేపట్టాలంటే టెండర్ నోటిఫికేషన్ జారీ చేసి పారదర్శకంగా ప్రైవేటు సంస్థను ఎంపిక చేయాలి. నిబంధనల ప్రకారం ప్రభుత్వ భూమిని ప్రైవేటు సంస్థలకు 33 ఏళ్లకు మించి లీజుకు ఇవ్వడానికి వీల్లేదని అధికారవర్గాలు చెబుతున్నాయి. కానీ.. ‘లూలూ’కు 99 ఏళ్లకు నామమాత్రపు అద్దెపై అప్పగిస్తూ.. ఆ సంస్థ ఛైర్మన్ విధించిన షరతులన్నింటికీ తలూపుతూ ఖరీదైన భూమిని ప్రభుత్వం కట్టబెట్టేసింది. ఈ వ్యవహారంలో రూ.వేల కోట్లు చేతులు మారడం వల్లే నిబంధనలు తుంగలో తొక్కి ‘లూలూ’పై వల్లమాలిన ప్రేమ చూపించినట్లు స్పష్టమవుతోంది.

18 ఏళ్ల అనుబంధం.. ఆగమేఘాలపై పచ్చజెండా

టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే లూలూ ప్రాజెక్టుకు చంద్రబాబు తిరిగి పచ్చ జండా ఊపారు. గతేడాది సెప్టెంబరు 28న సీఎం చంద్రబాబుతో సమావేశమైన లూలూ గ్రూపు ఛైర్మన్ యూసుఫ్ అలీ విశాఖలో షాపింగ్ మాల్, ఎనిమిది స్క్రీన్‌లతో ఐమ్యాక్స్ మల్టీప్లెక్స్ నిర్మాణంపై చర్చించారు. దీనిపై అదే రోజు ‘ఎక్స్’ వేదికగా సీఎం చంద్రబాబు ట్వీట్ చేయగా.. తనకు చంద్రబాబుతో 18 ఏళ్లగా అనుబంధం ఉందంటూ లూలూ గ్రూప్ ఛైర్మన్ ప్రతిస్పందిస్తూ రీట్వీట్ చేశారు. ఈ క్రమంలో విశాఖ హార్బర్ పార్క్‌లో 13.43 ఎకరాల భూమిని అప్పగిస్తే ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపడతామంటూ ఈ ఏడాది జనవరి 17న సీఎం చంద్రబాబుకు లూలూ గ్రూపు చైర్మన్ లేఖ రాశారు. ఈ ప్రతిపాదనలకు సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఈనెల 13న ఎస్ఐపీబీ(స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు) సమావేశంలో ఆమోదముద్ర వేశారు.



చంద్రబాబుతో లూలూ చైర్మన్ యూసుఫ్ అలీ

భారీ రాయితీలు.. అత్తెసరు అద్దె

తమకు భూమిని 99 ఏళ్ల లీజుకు ఇవ్వాలని.. మల్టీప్లెక్స్ ప్రారంభమయ్యే వరకూ లేదా మూడేళ్ల వరకూ.. ఈ రెండింటిలో ఏది ముందైతే అంతవరకూ అద్దె మినహాయింపు ఇవ్వాలని లూలూ గ్రూపు ఛైర్మన్ సీఎం చంద్రబాబుకు రాసిన లేఖలో కోరారు. పదేళ్లకు ఒకసారి పది శాతం అద్దె పెంచాలని, సాధ్యమైనన్ని అన్నిరకాల రాయితీలు, ప్రోత్సాహకాలు ఇవ్వాలని ప్రతిపాదించారు. వాటన్నింటికీ ప్రభుత్వం తలూపడంపై అధికార వర్గాలు విస్తుపోతున్నాయి. ఎకరానికి నామమాత్రంగా రూ.50 లక్షలు అద్దెగా నిర్ణయించినట్లు చెబుతున్నారు. స్టాంపు డ్యూటీ మినహాయింపు, జీఎస్టీ రాయితీలు తదితర ప్రోత్సాహకాల కింద లూలూ గ్రూప్‌నకు రూ.170 కోట్లకుపైగా ప్రయోజనం చేకూర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైనట్లు చర్చ సాగుతోంది. లాలూ గ్రూప్ కోరికల చిట్టాకు తలూపి అంత లబ్ధి చేకూరుస్తున్నా ఆ ప్రాజెక్టు ద్వారా ప్రభుత్వానికి అద్దె రూపంలో అత్తెసరు ఆదాయం మాత్రమే రానుండటం గమనార్హం. దీన్నిబట్టి ఇందులో భారీ ఎత్తున ముడుపులు చేతులు మారాయనే ఆరోపణలు బలంగా వ్యక్తమవుతున్నాయి. 2018 ఫిబ్రవరి 16న నాటి టీడీపీ సర్కార్ లూలూ సంస్థకు పీపీపీ పద్ధతిలో షాపింగ్ మాల్, ఎనిమిది స్క్రీన్లతో ఐమ్యాక్స్ మల్టీప్లెక్స్ నిర్మాణానికి భూమిని నామమాత్రపు లీజుపై కేటాయించి భారీ రాయితీలు కల్పిస్తూ ఏకపక్షంగా కట్టబెట్టింది. దీని వెనుక భారీ ఎత్తున ముడుపులు చేతులు మారినట్లు అప్పట్లో ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు ఆందోళన నిర్వహించాయి. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి ఉన్నప్పుడు ఆ ప్రాజెక్టును పక్కన పెట్టేసింది.

ఎకరానికి చెల్లించే అద్దె: రూ.50 లక్షలు	లీజు గడువు: 99 ఏళ్లు
రాయితీల రూపంలో లూలూ పొందే లబ్ధి: రూ.170 కోట్లు	(స్టాంపు డ్యూటీ మినహాయింపు, జీఎస్టీ రాయితీలు తదితరాలు)

ఆదాయాన్ని ఆర్జించే వీలున్నా..

వాస్తవానికి లూలూ మాల్‌కు అప్పగిస్తున్న భూమిలో ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నిర్మాణాలను చేపట్టి వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించడం, అద్దెలకు ఇవ్వడం ద్వారా భారీగా ఆదాయాన్ని ఆర్జించే అవకాశం ఉంది. అయితే దీన్ని కాదని.. ఓ ప్రైవేట్ సంస్థకు కారుచౌకగా ఏకంగా 99 ఏళ్లకు లీజుకు అత్యంత ఖరీదైన స్థలాన్ని కట్టబెడుతుండటంపై పెద్ద ఎత్తున సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దీని వెనుక గూడుపుఠాణీ వ్యవహారాలే కారణమనే అనుమానాలు బలపడుతున్నాయి. అక్కడకు సమీపంలోనే రహేజా నిర్మిస్తున్న ఇన్ఆర్బిట్ మాల్ కూడా ఉంది. నిజంగానే షాపింగ్ మాల్ కట్టాలనుకుంటే ప్రభుత్వమే నిర్మించవచ్చు. బ్యాంకు రుణం కూడా పొందే వీలుంది. అలాకాకుండా ప్రభుత్వ స్థలాన్ని ప్రైవేట్ సంస్థలకు పప్పు బెల్లాల మాదిరిగా ధారాదత్తం చేయడం, రూ.వందల కోట్ల రాయితీలు కల్పించడం ఏమిటనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ భూమిని ఒకవేళ ప్రైవేట్ పరం చేయాలనుకుంటే టెండర్లు నిర్వహించి బహిరంగ ప్రకటన జారీ చేయాలి. రూ.2 వేల కోట్లకుపైగా ఆదాయాన్ని ఖజానాకు జమ చేసి పారదర్శకంగా వ్యవహరించాలి. దీనికి విరుద్ధంగా 99 ఏళ్ల పాటు లీజు.. పలు రాయితీలు కల్పించడం వెనుక ‘గోల్‌మాల్’ వ్యవహారాలు దాగి ఉన్నట్లు స్పష్టమవుతోంది.

ఢిల్లీ పెద్దలు దిగివచ్చేలా బీసీల ‘పోరు గర్జన’

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్
- మహాధర్నాకోసం ప్రత్యేక రైలులో ఢిల్లీ వెళ్లిన బీసీ నాయకులు



చర్లపల్లి రైల్వే టెర్మినల్‌లో బీసీ నేతలతో జాజుల

సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ గద్దె మీద కూర్చున్న పెద్దలు దిగివచ్చేలా ఈనెల 2న జంతర్‌మంతర్ వద్ద బీసీల పోరు గర్జన మహాధర్నా నిర్వహించనున్నామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. సోమవారం ఆయన సచివాలయంలోని మీడియా పాయింట్ బయట విలేకరులతో మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా బీసీల కులగణన చేపట్టాలని, బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ రాష్ట్ర అసెంబ్లీలో ఆమోదించిన బిల్లుకు ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే చట్టబద్ధత ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమిళనాడు తరహాలో 9వ షెడ్యూల్‌లో బీసీ రిజర్వేషన్లు చేర్చి రాజ్యాంగ రక్షణ కల్పించాలని కోరారు. బీజేపీ పార్లమెంటులో బీసీ బిల్లును ఆమోదిస్తే రెండున విజయోత్సవ సభ నిర్వహిస్తామని, లేదంటే దేశవ్యాప్తంగా మరో మండల్ ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. బీసీ బిల్లుపై ఢిల్లీ పెద్దలను ఒప్పించి ఆమోదించే బాధ్యతను కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా రిజర్వేషన్లకోసం ఏప్రిల్ 2న ఢిల్లీలో బీసీ సంఘాలు తలపెట్టిన పోరుగర్జనకు రాష్ట్రం నుంచి పెద్ద ఎత్తున నాయకులు తరలివెళ్లారు. సోమవారం చర్లపల్లి రైల్వే స్టేషన్ నుంచి ప్రత్యేక రైలు ద్వారా ఈ నాయకులు ఢిల్లీ బయలుదేరారు. జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఈ రైలుకు జెండా ఊపారు.

ఢిల్లీ బీసీ ధర్నాకు మంత్రులు, ఎమ్మెల్యేలు

- రాహుల్, రేవంత్, భట్టి తదితరులు పాల్గొనే అవకాశం

సాక్షి, హైదరాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ ఏప్రిల్ 2న బీసీ సంఘాలు ఢిల్లీలో తలపెట్టిన పోరుగర్జన మహాధర్నాలో రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, పలువురు బీసీ ఎమ్మెల్యేలు పాల్గొననున్నారు. మంగళవారం సాయంత్రం వీరంతా ఢిల్లీకి బయలుదేరనున్నట్లు సమాచారం. అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల బీసీలకు రాజకీయ, విద్య, ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని బిల్లును ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేల బృందం ఈనెల 2, 3 తేదీల్లో కేంద్ర ప్రభుత్వ పెద్దలను, వివిధ పార్టీల నాయకులను కలవనుంది. బీసీ సంఘాల పోరుగర్జనలో పాల్గొని మద్దతు తెలపనున్నారు. ఇదిలా ఉండగా బీసీ సంఘాల పోరుగర్జనలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ, ఇతర ఏఐసీసీ నేతలు, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ తదితరులు కూడా పాల్గొంటారని సమాచారం.

కేసీఆర్ హయాంలో దుబ్బాకకు తీరని అన్యాయం

- నియోజకవర్గ అభివృద్ధికి సీఎం రేవంత్ ప్రత్యేక హామీ
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక: ‘మా బీఆర్ఎస్ ప్రభుత్వంలో దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధికి సరైన నిధులు రాలేదన్నది జగమెరిగిన సత్యం. గతంలో ఏ ప్రభుత్వాలున్నా దుబ్బాకకు అన్యాయమే జరిగింది’ అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డిని కలవగా నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలా అండగా ఉంటానని ప్రత్యేకంగా హామీ ఇచ్చారని, ఇందుకు సీఎంకు కృతజ్ఞతలు అంటూ ఎమ్మెల్యే తెలిపారు. సోమవారం సిద్దిపేట జిల్లా దుబ్బాకలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డిని కలిశానని మల్లన్నసాగర్ కాల్వల నిర్మాణాలపై త్వరలోనే అధికారులతో సమీక్షించి పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారన్నారు. హబ్షీపూర్–దుబ్బాక–లచ్చపేట రోడ్డుకు రూ.35 కోట్లు మంజూరు చేశారని చెప్పారు. రోడ్ల అభివృద్ధికి రూ.200 కోట్లు కావాలని అడగడంతో త్వరలోనే మంజూరు చేస్తామని చెప్పారన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ప్రభాకర్‌రెడ్డి

‘వికసిత్ భారత్’ నెట్‌వర్క్‌ను ప్రారంభించిన కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: వికసిత్ భారత్ ఎంటర్‌ప్రెన్యూర్ నెట్‌వర్క్‌ను కేంద్ర బొగ్గు, గనుల శాఖమంత్రి కిషన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ భారత్‌ను 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మార్చే లక్ష్యంతో, పారిశ్రామికవేత్తల అభివృద్ధికి మార్గదర్శనం చేయడానికి ‘వికసిత్ భారత్ ఎంటర్‌ప్రెన్యూర్’సంస్థను హైదరాబాద్‌లో ప్రారంభిస్తున్నామని తెలిపారు. ‘ఈ దేశ యువత పరిశోధనలు చేయాలని, తమ సొంత వ్యాపారాలను ప్రారంభించాలని ఆకాంక్షిస్తోంది. అలాంటి వారికి సరైన మార్గదర్శనం అవసరం. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, అసెంబ్లీ కేంద్రాలు, జిల్లా కేంద్రాల్లో భారీ స్థాయిలో పారిశ్రామికవేత్తలను తయారు చేయడం అవసరం. వ్యవసాయ రంగంలో సాంకేతికత ద్వారా మార్పులు తీసుకురావాలి. ప్రధాని మోదీ స్టార్టప్‌లను, యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తున్నారు. కేంద్రం బ్యాంకుల నుంచి రుణాలు, ఇతర అనుమతుల క్లియరెన్స్‌ల ప్రక్రియలను సులభతరం చేసింది. రెండు తెలుగు రాష్ట్రాల యువత వ్యాపారం ప్రారంభానికి శిక్షణ ఇచ్చేందుకు ఈ సంస్థ దోహదమవుతుంది. లక్షలాది ఉద్యోగ అవకాశాలను సృష్టించడమే ఈ సంస్థ లక్ష్యం’అని కిషన్‌రెడ్డి వివరించారు. ఈ సంస్థ కోసం పనిచేసిన అమర్‌నాథ్, వారి బృందానికి అభినందనలు తెలిపారు.

కాంగ్రెస్ సర్కార్‌పై సమరమే

- స్థానిక సమస్యలపై ప్రజా ఉద్యమాలు నిర్మించాలి
- రైతులు, వ్యవసాయ కూలీలు, మహిళలు, నిరుద్యోగ యువత ఇలా అందరి సమస్యలపై పోరాడాలి
- ఆరు గ్యారంటీలు, 420 హామీల అమలులో వైఫల్యాలను ఎండగట్టాలి
- రాష్ట్ర పదాధికారులు, జిల్లా అధ్యక్షుల సమావేశంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి దిశానిర్దేశం

సాక్షి,హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేలా ఉద్యమ కార్యాచరణ రూపొందించి.. ముందుకెళ్లాలని బీజేపీ నిర్ణయించింది. రైతులు, వ్యవసాయ కూలీలు, మహిళలు, నిరుద్యోగ యువత ఇలా అన్నివర్గాల ప్రజల సమస్యలపై పోరాడాలని తీర్మానించింది. ఆరు గ్యారంటీలు, 420 హామీల అమలు విషయంలో కాంగ్రెస్ సర్కార్ చేతులెత్తేసిందంటూ, ఎక్కడికక్కడ స్థానిక సమస్యలపై ప్రజా ఉద్యమాలు నిర్మించాలని నిర్ణయించింది. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అడుగడుగునా నిలదీసి ఒత్తిడి తీసుకువచ్చేలా ఆయా అంశాలపై ఆందోళనలు, నిరసనలకు పార్టీ సిద్ధం కావాలని తీర్మానించింది. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్రమంత్రి, రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర పదాధికారులు, జిల్లా అధ్యక్షుల సమావేశంలో ఈ మేరకు పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్సీలుగా గెలిచిన సి.అంజిరెడ్డి, మల్క కొమరయ్యలను కిషన్‌రెడ్డి, ఇతరనేతలు సన్మానించారు. రాష్ట్ర ఇన్‌చార్జ్ అభయ్‌పాటిల్, సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారి, కేంద్రమంత్రి బండి సంజయ్, ఎంపీలు డా.కె.లక్ష్మణ్, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పాయల్‌శంకర్, పైడి రాకేశ్‌రెడ్డి, పాల్వాయి హరీశ్‌బాబు, ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి. చిత్రంలో లక్ష్మణ్, బండి సంజయ్, చంద్రశేఖర్ తివారి, ఈటల రాజేందర్

→ ఏప్రిల్ 6న పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర పార్టీ కార్యాలయంతోపాటు అన్ని జిల్లా కార్యాలయాల్లో జెండా ఆవిష్కరణ ఉంటుందని సమావేశానంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు మీడియాకు తెలిపారు.

→ 8, 9 తేదీల్లో మండలాల వారీగా క్రియాశీలక కార్యకర్తల సమావేశాలు, 10, 11, 12 తేదీల్లో గావ్ చలో.. బస్తీ చలో అభియాన్ వంటి కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు.

→ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఏప్రిల్ 14 నుంచి విగ్రహాల వద్ద స్వచ్ఛతా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారు : కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

తెలంగాణలో ప్రస్తుత రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చెప్పారు. రాబోయే రోజుల్లో బీజేపీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని, పదేళ్ల బీఆర్ఎస్ పాలన, గత 15 నెలల కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారని చెప్పారు. ‘స్థానిక సంస్థల్లో పార్టీ బలపడేందుకు మోదీ నాయకత్వంలో బీజేపీని గెలిపించాలి. స్థానికసంస్థల ఎన్నికలకు సంసిద్ధమవుతూనేచ సంస్థాగతంగా బలోపేతమయ్యే కార్యక్రమాలు కొనసాగిస్తూ ముందుకెళ్లాలి’ అని కిషన్‌రెడ్డి సూచించారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
మంగళవారం ॥ 1-4-2025

వధువే వరుడై... వరుడే వధువై...



వధువు మెడలో మూడు ముళ్ళు వేస్తున్న వరుడు



వరుడి మెడలో మూడు ముళ్ళు వేస్తున్న వధువు

హిందూ సంప్రదాయం ప్రకారం పెళ్లి కూతురు మెడలో పెళ్లి కొడుకు తాళి కట్టడం సహజం. కానీ ఇక్కడ వధువే వరుడి మెడలో మూడు ముళ్లే స్తుంది. వధూవరులది ఒకే ఊరు. ఇరువురి మెడలో కరెన్సీ నోట్ల దండలు.. పెళ్లిపీటలపై కళ్లద్దాలు ధరిస్తూ దర్శనం. పెళ్లీడుకొచ్చిన అమ్మాయి, అబ్బాయిల మాటకు గౌరవమిచ్చే పెద్దలు. ఒకే ముహూర్తాన వందల సంఖ్యలో సామూహిక వివాహాలు.. దశాబ్దాలుగా ఎన్నికలెరుగని ఆ గ్రామం ఇంతకీ ఎక్కడుందంటే..?



పెళ్లి పీటలపై చలువ కళ్ళద్దాలు మెడలో నోట్ల దండలతో వధూవరులు

శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం నువ్వలరేవు గ్రామం. సుమారు 12వేల జనాభా ఈ ఊరి సొంతం. స్వాతంత్ర్యానికి పూర్వం నావల రేవుగా పిలిచేవారు. కాలక్రమేణా నువ్వలరేవుగా మారింది. రెవిన్యూ రికార్డుల్లో మాత్రం లక్ష్మీదేవిపేటగా కనిపించే ఆ గ్రామంలో అందరూ మత్స్యకారులే... చేపల వేట వీరి ప్రధాన జీవనాధారం. పెద్దవాళ్లు సముద్రంలో వేట సాగిస్తారు.

ముందు వరుడు.. ఆ తర్వాత వధువు

పెళ్లిలో ముందుగా వరుడు వధువు మెడలో తాళికడతాడు. అనంతరం వధువు వరుని మెడలో తాళి కడుతుంది. దీన్నే స్థానికులు దురపం అని వ్యవహరిస్తారు. ఈ సాంప్రదాయం నువ్వలరేవు ప్రత్యేకం. ఇలా ఒకరికి ఒకరు తాళికట్టడంతో ఒకరికొకరు ఆజన్మాంతం రక్షగా ఉంటారన్నది ఇక్కడి వారి విశ్వాసం. అలాగే ఒకరు ఎక్కువ, ఇంకొకరు తక్కువనే భావన తమలో ఉండదని, అమ్మాయైనా, అబ్బాయైనా సమానంగానే భావిస్తామని గ్రామపెద్దలు చెబుతారు.

చాటింపు వేసి.. వివరాలు సేకరించి

అంతగా ఉన్నత చదువులు లేకపోవడంతో ఈ ఊరి యువత ఉపాధి నిమిత్తం హైదరాబాద్, ముంబై, అండమాన్ ప్రాంతాలకు వలస వెళతారు. వీళ్లలో పెళ్లీడుకొచ్చిన యువకులను రెండేళ్లకోసారి గుర్తించి వారి జాబితాను సిద్ధం చేస్తారు. ఆ ఏడాదికి పెళ్లికి సిద్ధమయ్యేవారు ఎవరున్నారన్న సమాచారాన్ని ముందుగా చాటింపు వేయించి వారి వివరాలను సేకరిస్తారు. అలా ఎంపికైన వారందరికీ ఒకే ముహూర్తాన సామూహిక వివాహాలను జరిపిస్తారు.

వధూవరులది ఒకే ఊరు

గతంలో మూడేళ్లకోసారి ఈ పెళ్లిళ్లు చేసేవారు. కానీ ఇప్పుడు యువత సంఖ్య పెరగడంతో రెండేళ్లకోసారి ఈ తంతు జరిపిస్తున్నారు. వరుడికి కావాల్సిన వధువు కోసం ఎక్కడో అన్వేషించరు. ఉన్న ఊరిలోనే వరసకు వచ్చిన అమ్మాయితో నిశ్చయిస్తారు. సామూహిక వివాహ ప్రక్రియలో కులపెద్దలదే కీలక భూమిక. పెళ్లిళ్లన్నీ వారి పర్యవేక్షణలోనే జరుగుతాయి. ముహూర్తాలు నిశ్చయించిన వేళ పెళ్లీడుకొచ్చిన యువతీ యువకులను మరోసారి పెద్దలు పిలుస్తారు. వారి మనసులో ఎవరైనా ఉన్నారా... అని అడిగి తెలుసుకుంటారు. అలా ఇష్టపడినవారికి ఇచ్చి పెళ్లిచేయడంతో ఆ జంటల్లో ఆనందం రెట్టింపవుతుంది. నువ్వలరేవులో బైనపల్లి, బెహరా, మువ్వల అనే ఇంటి పేర్లున్న కుటుంబాలే అధికంగా ఉంటాయి. పెళ్లిళ్లన్నీ ఈ కుటుంబాల మధ్యే జరుగుతాయి.

మూడురోజుల పెళ్లి పండగ

సామూహిక వివాహ వేడుకను మూడురోజుల పాటు నిర్వహిస్తారు. మొదటి రోజు పందిరిరాట వేస్తారు. ఈ సందర్భంగా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఆనందంతో కేరింతలు కొడతారు. రెండోరోజు ప్రధాన ఘట్టం. అదే మాంగల్యధారణ. అయితే ఇక్కడ తాళికట్టేది వరుడు మాత్రమే కాదు. పెళ్లికూతురు సైతం వరుడి మెడలో తాళి కట్టడం విశేషం. మూడోరోజు వధువు పుట్టింటి నుంచి వరుడి ఇంటికి సారె వస్తుంది. ఈ సందర్భంగా పెళ్లి పందిరిలో ఆ సారెను అందరికీ చూపిస్తారు. గ్రామంలోని బంధావతి మాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశాక పెళ్లి వేడుక ముగుస్తుంది. జిల్లాలో సాధారణంగా వరుడి ఇంటివద్ద పెళ్లి జరిపిస్తారు. కానీ నువ్వలరేవులో మాత్రం వధువు ఇల్లే పెళ్లి వేదిక కావడం విశేషం.

ఊరంత కుటుంబం

వధూవరులిద్దరిదీ ఒకే గ్రామం కావడంతో ఊరంతా ఒకరికొకరికి ఏదో బంధుత్వం ఉండటం ఇక్కడి వారి సొంతం. పెళ్లి విందుకు బంధువులందరినీ ఆహ్వానించరు. ఏ ఇంటి పెళ్లి విందుకు ఎవరు వెళ్లాలన్నది గ్రామ పెద్దలే నిర్ణయిస్తారు. అలా ఆహార పదార్థాలను వృథా చేయకుండా, అనవసర ఖర్చులను నియంత్రిస్తూ జాగ్రత్తపడతారు.

వరకట్నానికి దూరం

నువ్వలరేవులో వరకట్నం అనే మాట వినిపించదు. పెళ్లికయ్యే ఖర్చును వధూవరులిద్దరి కుటుంబాలు సమానంగా భరిస్తాయి. ఆడపిల్లను పుట్టినింటి నుంచి మెట్టినింటికి పంపడమే మహాభాగ్యంగా మగపెళ్లివారు భావిస్తారు. పెళ్లిపీటలపై ఆసీనులైన వధూవరులిద్దరూ నల్లకళ్లజోడు ధరిస్తారు. ఇద్దరి మెడలో కరెన్సీ నోట్ల దండలు వేస్తారు. ఈ సామూహిక వేడుకను తిలకించేందుకు పరిసర ప్రాంతాల ప్రజలు తరలి వస్తారు. దీంతో మూడురోజుల పాటు నువ్వలరేవులో తిరునాళ్ల సందడి కనిపిస్తుంది. నువ్వలరేవులో సామూహిక వివాహాలే కాదు, శ్రీరామనవమి ఉత్సవాలను సైతం అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు.

– గుంట శ్రీనివాసరావు, సాక్షి, వజ్రపుకొత్తూరు, శ్రీకాకుళం



ప్రజాసేవే లక్ష్యం

● గ్రూప్ వన్ టాపర్ డా. లక్ష్మీ దీపిక కొమ్మిరెడ్డి

పట్టుదల, తపన, దానికి తగ్గ సాధన తోడైతే ఎంతటి లక్ష్యమైనా తలొంచి తీరుతుందని గ్రూప్‌వన్ టాపర్ లక్ష్మీదీపిక కొమ్మిరెడ్డి నిరూపించారు. తెలంగాణ రాష్ట్రస్థాయిలో టాప్ ర్యాంక్ సాధించానన్న విషయం తెలిసిన దీపిక ముందు కొద్దిసేపటి వరకు అది కలే అనుకున్నారు. నిజమేనని తెలుసుకుని సంభ్రమాశ్చర్యాలలో మునిగి తేలారు. గ్రూప్1 పరీక్షల్లో రాష్ట్రస్థాయి ర్యాంక్ సాధించడానికి ఆమె పడిన కష్టం, తల్లిదండ్రుల ప్రోత్సాహం అన్నీ కలిపి ఆమెను మొదటి స్థానంలో నిలిపాయి. వివరాలు ఆమె మాటల్లోనే ..

''నేను పుట్టి పెరిగింది హైదరాబాద్‌లోనే. ఉండేది సఫిల్‌గూడ ప్రాంతంలో. అమ్మ పద్మావతి గృహిణి, నాన్న కృష్ణ కొమ్మిరెడ్డి రిటైర్డ్ సీనియర్ ఆడిట్ ఆఫీసర్. పదో తరగతి సఫిల్‌గూడలోని డీఏవీ పాఠశాల, ఇంటర్ నారాయణగూడ శ్రీ చైతన్య. 2013లో మెడిసిన్‌లో 119వ ర్యాంక్‌తో ఉస్మానియా మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేశా. మాస్టర్స్ డిగ్రీ చేయడం కోసం అమెరికా వెళ్లాను. అమ్మా నాన్నలకు ఒక్కగానొక్క కూతురిని. అందుకే డాక్టరుగా ఇక్కడే ప్రాక్టీస్ చేద్దామని అనుకున్నా. కానీ అనుకోకుండా నా దృష్టి సివిల్స్‌పై మళ్లడంతో ఆ దిశగా ప్రయత్నించాలనుకున్నాను. అందుకు అమ్మానాన్నలు కూడా అంగీకరించారు.

అదేసమయంలో గ్రూప్స్‌కు నోటిఫికేషన్ రావడంతో దరఖాస్తు చేసుకున్నా. ఆలోచన వచ్చిందే తడవుగా సిలబస్ చెక్ చేశాను. పాత ప్రశ్నాపత్రాలు పరిశీలించాను. ప్రిపరేషన్ సులభమనే అనిపించింది. దాంతో కోచింగ్‌కు వెళ్లాలనిపించలేదు. మొదటి ప్రయత్నంలోనే గ్రూప్1 పరీక్షలో ఫస్ట్ ర్యాంక్ సాధించాను.



తండ్రి కృష్ణ, తల్లి పద్మావతిలతో డా. లక్ష్మీ దీపిక

2020లో మొదటిసారిగా యూపీఎస్సీ పరీక్ష రాశా! కాని, అది నేను అనుకున్నంత సులువు కాదని మూడు ప్రయత్నాలు విఫలం అయ్యేవరకు అర్థం కాలేదు. దాంతో అంతవరకు ఆప్షనల్‌గా ఉన్న తెలుగు బదులు ఆంత్రపాలజీని ఎంచుకుని గత ఏడాది నుంచి పూర్తిస్థాయిలో ప్రిపరేషన్‌పై దృష్టి సారించాను. అలాగే గత సెప్టెంబర్‌లో యూపీఎస్సీ మెయిన్స్, అక్టోబర్‌లో టీజీపీఎస్సీ మెయిన్స్ కూడా రాశాను. ఈ సంవత్సరం మార్చి16న యూపీఎస్సీ ఇంటర్వ్యూకి హాజరయ్యాను.. ఆ ఫలితాలు వస్తాయనుకుంటే ఈ ఫలితాలు ముందుగా వచ్చాయి.

సోషల్ మీడియాను సక్రమంగా ఉపయోగించుకోవాలి

కోచింగ్‌ల మీద ఆధార పడి సమయం, డబ్బును వృథా చేయద్దు. సోషల్ మీడియాలో చాలా మంచి సమాచారం అందుబాటులో ఉంది. దానిని సరిగా ఉపయోగించుకోగలగాలి. కెరీర్‌లో రాణించడానికి అవసరమైన ప్రణాళికను ముందే సిద్ధం చేసుకుని అందుకు తగ్గట్టు కృషి చేయాలి. ఎన్ని కష్టాలు వచ్చినా, ధైర్యంగా ఎదుర్కొని గమ్యమే లక్ష్యంగా ముందుకు సాగాలి. అప్పుడే ఆశయాన్ని సాధించగలం.

– డా. లక్ష్మీ దీపిక కొమ్మిరెడ్డి, గ్రూప్ వన్ టాపర్

సివిల్స్ సాధనే ఆశయం...

నా జీవితాశయం సివిల్స్.. కెరీర్‌లో ఎదుగుదలతోపాటు ప్రజాసేవ చేయాలన్నది నా ఆకాంక్ష. త్వరలోనే వీటిని సాధిస్తానన్న నమ్మకం ఉంది. రోజూ కేవలం మూడు నుంచి నాలుగు గంటలు మాత్రమే చదివేదాన్ని. పరీక్షల సమయంలో మాత్రం 8- 9 గంటలు చదువుకునేదాన్ని. పరీక్షల సమయంలో మా అమ్మ కూడా నాతోపాటే జాగారం చేసేది. వొత్తిడి అనిపించినప్పుడు సరదాగా ముచ్చట్లు పెట్టుకునే వాళ్లం. పుస్తక పఠనం ముందునుంచే ఇష్టం. పాటలు పాడటం నా హాబీ. వొత్తిడి సమయంలో ఇవి నాకు చాలా ఉపయోగపడ్డాయి.'' అంటూ ముగించారు దీపిక.

– పవన్ కుమార్ పలుగుల, సాక్షి, ఉప్పల్/ కాప్రా

సాగుబడి
రేవతి కార్తె: మార్చి 31 నుంచి

మండే ఎండలతో ముప్పు తోటల సంరక్షణ ఎలా?







ఏటేటా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతూ ఉండటంతో పండ్లు, కూరగాయలు, పూల తోటలకు ప్రతి వేసవీ పెను సవాలుగా మారుతోంది. 2024వ సంవత్సరంలో ప్రతి నెలా గత 190 ఏళ్లలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 2025లో గడచిన మూడు నెలల తీరూ అంతే. సాధారణం కన్నా 4-5 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదుకావటం మార్చిలోనే అనుభవంలోకి తెచ్చింది ఈ సంవత్సరం. ఈ నేపథ్యంలో సిద్ధిపేట జిల్లా ములుగులోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిశోధనా సంచాలకులు డాక్టర్ లక్ష్మీనారాయణ ధరావత్ అధిక ఉష్ణోగ్రతల నుంచి వివిధ ఉద్యాన తోటల సంరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలను సవివరంగా తెలియజేస్తున్నారు.

మామిడి

● ప్రస్తుతం కాయలు వివిధ దశల్లో అభివృద్ధి చెందుతున్నాయి. అందువల్ల వేసవిలో స్థిరమైన, తగినంత నీటి సరఫరా ఇవ్వాలి. ● 10 సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న మామిడి చెట్లకు బిందుసేద్యం ద్వారా రోజుకు 4 నుంచి 5 గంటలు నీరు అందించాలి. ● సాధారణ పద్ధతిలో నేల లక్షణాల ఆధారంగా 7 నుంచి 15 రోజుల వ్యవధిలో నీటిని అందించాలి. ● పండ్లకు కాగితపు సంచులు కడితే వేడి నుంచి రక్షించుకోవటానికి సహాయపడుతుంది. ● నీటి యాజమాన్యం సరిగ్గా అమలు చేయకపోతే పండ్ల తొడిమె భాగంలో అబ్సిషన్ పొరలు ఏర్పడి పండ్లు రాలిపోవడానికి కారణమవుతాయి. ● చెట్ల పాదులకు పంట వ్యర్థాలతో ఆచ్ఛాదన (సేంద్రియ మల్చ్) ఏర్పాటు చేయాలి. ● పొడి వాతావరణంలో తామర పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటుంది. నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా ఫిప్రోనిల్ 2 మి.లీ. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి సాయంత్రం వేళలో పిచికారీ చేయాలి. ● పండు ఈగ నివారణకు లింగ ఆకర్షక బుట్టల ఉచ్చులను ఉపయోగించాలి. ● గోలికాయ దశలో మామిడి కాయలు ఉన్నప్పుడు జిఎ3 (50 పిపిఎం) ఒక లీటరు నీటికి 50 మిల్లీ గ్రాములు కలిపి పిచికారీ చేయటం ద్వారా రాలే కాయలను 15% తగ్గించుకోవచ్చు.



ద్రాక్ష

● ప్రతి రోజూ కనీసం చెట్టుకు 6-8 లీటర్ల నీటిని అందించాలి. ● పందిళ్లపై షేడ్‌నెట్స్ వేస్తే, ద్రాక్ష గుత్తులపై సూర్యరశ్మి పడకుండా చేయవచ్చు.



ఆయిల్ పామ్

● ముదురు ఆయిల్ పామ్ చెట్లకు సుమారుగా ఒక రోజుకు గాను ఏప్రిల్ నెలలో 250-300 లీటర్లు, అదేవిధంగా మే నెలలో 300-350 లీటర్ల నీరు అందించాలి. ● సర్పిలాకార తెల్లదోమ ఉధృతి వేసవిలో అధికంగా ఉంది. 'ఇసారియా ఫ్యూమాజోరోజియా' జీవ శిలీంధ్ర నాశనిని వాడి సమర్థవంతంగా అరికట్టవచ్చు. ● కత్తిరించిన ఆకులను, మగ గెలలను, ఖాళీ గెలలను మొక్క మొదళ్లలో మల్చింగ్ వలె పరచాలి. తద్వారా నేలలోని నీటి తేమను కాపాడుకోవచ్చు.

అరటి

● ఎండిన అరటి ఆకులు, వరి గడ్డి, మొక్కజొన్న గడ్డిని మల్చింగ్‌గా వేసి మొక్క మొదళ్లలో నీటి తేమను కాపాడాలి. ● వేసవిలో నేరుగా సూర్యరశ్మి గెలలపై పడటం వలన గెలలు మాడిపోతాయి. తద్వారా వివిధ తెగుళ్ల ఆశించి కాయ / గెల కుళ్లిపోతుంది. కావున, నేరుగా సూర్యరశ్మి గెలలపై పడకుండా పక్కనే ఉన్న ఆకులను గెలలపై కప్పి గెల నాణ్యతను కాపాడాలి. ● వెదురు / సర్వి /సుబాబుల్ వంటి కర్రలను వాడి అరటి చెట్టు కాండానికి ఊతం అందించాలి. లేదా టీవులను నాలుగు వైపులా కట్టాలి. తద్వారా వేసవి వడ గాలులకు అరటి చెట్లు పడిపోకుండా చూసుకోవచ్చు.

కూరగాయ తోటల రక్షణ ఎలా?

టమాట

● అధిక ఉష్ణోగ్రతలు, వేడి గాలుల కారణంగా కాయలు/ పండ్లలో పగుళ్ల వస్తాయి. ఎండ దెబ్బ తగలటం వల్ల నాణ్యతలేని పండ్ల దిగుబడికి దారితీస్తుంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో టమాటలో ఆకు ముడత తెగులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ● నీడనిచ్చే వస్త్రాలతో షేడ్‌నెట్ ఏర్పాటు చేసుకుంటే మొక్కలకు సూర్యకాంతి పడటం తగ్గుతుంది. నేల ఉష్ణోగ్రత, గాలి ఉష్ణోగ్రత తగ్గుతుంది. ● నేల తేమను నిలుపుకోవడానికి, నేల ఉష్ణోగ్రత హెచ్చు తగ్గులను తగ్గించడానికి మొక్క చుట్టూ వెండి రంగు ప్లాస్టిక్ మల్చింగ్ లేదా గడ్డిని వేయాలి. ● అధిక ఉష్ణోగ్రతలు, వేడి గాలుల సమయంలో నేల తేమను త్వరగా కోల్పోతుంది. మొక్కలు ఆకుల ద్వారా తేమను బయటకు వదిలే ప్రక్రియ (బాష్పీభవనం) ద్వారా కోల్పోయిన తేమను తిరిగి పొందడానికి తగినంత, తరచుగా నీటిని అందించాలి. ● వేడిగాలుల సమయంలో తగినంత పోషకాలను అందించాలి. సంక్లిష్ట ఎరువుల (19-19-19 లేదా 13-0-45)తో పాటు సూక్ష్మపోషక మిశ్రమాలను 3-5 రోజుల వ్యవధిలో రెండుసార్లు లీటరుకు 5 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేస్తే కూరగాయ పంటలు వేడి ఒత్తిడిని తట్టుకుంటాయి. ● బాష్పీభవనం తగ్గించడానికి కయోలిన్ 3-5% (30-50 గ్రా./లీ.) పిచికారీ చేయాలి. ● వడలు తెగులు నియంత్రణ కోసం లీటరు నీటికి 3 గ్రా. కాపర్ ఆక్సి క్లోరైడ్‌తో నేలను తడపాలి. ● వైరస్ తెగుళ్ల నివారణకు వ్యాధిసోకిన మొక్క భాగాలను తుంచి నాశనం చేయాలి. ● ఎకరానికి 10 జిగురు పూసిన పసుపు పచ్చ అట్టలను అక్కడక్కడా అమర్చాలి. ● తెగులు ఆశించిన ప్రారంభ దశలో లీటరు నీటికి 5 మి.లీ. వేప నూనెతో పిచికారీ చేయాలి. ● వాహకాలను నివారించడానికి లీటరు నీటికి ఫిప్రోనిల్‌ను 0.2 మి.లీ. లేదా ఇమిడాక్లోప్రిడ్‌ను 0.3 మి.లీ. మోతాదులో కలిపి పిచికారీ చేయాలి



వంగ

● ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వంగ పంటను మొవ్వ, కాయతొలిచే పురుగులు ఆశించే అవకాశం ఉంది. ● వీటి నియంత్రణకు ఎకరానికి 08-10 లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసి, నివారణ చర్యగా లీటరు నీటికి 3 మి.లీ. చొప్పున వేప నూనె (10,000 పిపిఎం)ను కలిపి పిచికారీ చేయాలి. ● పురుగు తీవ్రత ఎక్కువగా ఉంటే లీటరు నీటికి ఫ్లూబెండియామైడ్ మందును 0.25 మి.లీ. లేదా ఇమామెక్టిన్బెంజోయేట్ మందును 0.4 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలి.



బెండ

● ప్రస్తుత వాతావరణ పరిస్థితులు బెండకాయలో పల్లాకు తెగులు వైరస్ వ్యాప్తికి అనుకూలంగా ఉన్నాయి. ● వ్యాధి సోకిన మొక్క భాగాలను తుంచి నాశనం చేయాలి. ● ఎకరానికి 10 జిగురు పూసిన పసుపు పచ్చఅట్టలను అక్కడక్కడా అమర్చాలి. ● తెగులు ఆశించిన ప్రారంభ దశలో లీటరు నీటికి 5 మి.లీ. వేప నూనె కలిపి పిచికారీ చేయాలి. ● వాహకాలను నివారించడానికి ఇమిడాక్లోప్రిడ్‌ను 0.3 మి.లీ. లేదా డయాఫెంథియురాన్‌ను 1.5 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.



రైతులకు ఏమైనా సందేహాలుంటే వివిధ పంటలకు సంబంధించి ఈ క్రింది నెంబర్లను సంప్రదించవచ్చు.

పండ్లు : డా. వి. సుచిత్ర - 6369803253
కూరగాయలు : డా. డి. అనిత -94401 62396
పూలు : డా. జి. జ్యోతి - 7993613179
ఔషధ, సుగంధ ద్రవ్య మొక్కలు: కృష్ణవేణి - 9110726430
పసుపు : మహేందర్ : 94415 32072
మిర్చి : నాగరాజు : 8861188885

కొబ్బరి

● పూత, కాత వస్తున్న చెట్లకు సుమారుగా 50-60 లీటర్ల నీటిని అందించాలి. ● సర్పిలాకార తెల్లదోమ ఉధృతి వేసవిలో అధికంగా ఉంది. దీని నివారణకు వేప నూనె (10,000 పిపిఎం) 2 మిల్లీ లీటర్లు / లీటరు నీటికి కలిపి ఆకులు బాగా తడిచేలా పిచికారీ చేయాలి. 10-15 రోజుల అనంతరం ఇసారియా ఫ్యూమారోజియా అనే జీవ శిలీంధ్ర నాశినిని ఆకుల కింద భాగం తడిచేలా పిచికారీ చేస్తే పురుగు ఉధృతిని సమర్థవంతంగా నివారించవచ్చు. ● పంట వ్యర్థాలను మల్చింగ్‌గా వాడి నేలలోని నీటి తేమను కాపాడాలి.

నిర్వహణ: **పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్**

4-6 తేదీల్లో అనుమాస్‌పల్లిలో దేశీ విత్తన పండుగ

కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్(సిజిఆర్), భారతీయ బీజ్ స్వరాజ్ మంచ్(బిబిఎస్‌ఎం) సంయుక్త ఆధ్వర్యంలో ఏప్రిల్ 4,5,6 తేదీల్లో రంగారెడ్డి జిల్లా కడ్తల్ మండలం అనుమాస్‌పల్లిలోని సిజిఆర్ ఎర్త్ సెంటర్ ఆవరణలో తొలి తెలంగాణ దేశీ విత్తన పండుగ నిర్వహిస్తున్నట్లు సిజిఆర్ ప్రెసిడెంట్ లీలా లక్ష్మారెడ్డి తెలిపారు. దేశంలోని అనేక రాష్ట్రాలకు చెందిన దేశీ విత్తన పరిరక్షకులు పాల్గొనే ఈ విత్తన పండుగలో వందలాది సంప్రదాయ వంగడాలను ప్రదర్శించనున్నారు. 4(శుక్రవారం)న ఉ. 9 గం.కు తెలంగాణ వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని విత్తన పండుగను ప్రారంభిస్తారు. 5న శాసనమండలి అధ్యక్షులు గుత్తా సుఖేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారు. 6న సా. 4 గం.కు జరిగే ముగింపు సభలో తెలంగాణ రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారు. భూతాపం పెరిగిన నేపథ్యంలో ఆరోగ్యానికి, ఆహార భద్రతకు దేశీ విత్తనాలు ఏ విధంగా దోహదపడుతున్నాయో తెలియజెప్పేందుకు మూడు రోజుల పాటు విత్తనాల ప్రదర్శనతోపాటు రైతు సదస్సులు నిర్వహిస్తున్నారు. బిబిఎస్‌ఎం కన్వీనర్ జాకబ్ నెల్లితానం, పద్మశ్రీ పురస్కార గ్రహీత, ఒడిషాకు చెందిన దేశీ విత్తనోద్యమకారిణి రైమంత్ గొరియా, వ్యవసాయ రంగ ప్రముఖులు డా. దొంతి నరసింహారెడ్డి, డా. జీవీ రామాంజనేయులు, జిట్టా బాల్‌రెడ్డి, డా. నక్కా సాయిభాస్కర్‌రెడ్డి తదితరులు ఈ 3 రోజుల సదస్సుల్లో ప్రసంగిస్తారు. హైదరాబాద్ నుంచి (శ్రీశైలం హైవే) కడ్తల్‌కు 60 కి.మీ. దూరం. కడ్తల్ నుంచి అనుమాస్‌పల్లికి సందర్శకుల సౌకర్యం కోసం ఉచిత రవాణా సదుపాయం కల్పిస్తున్నట్లు లీలా లక్ష్మారెడ్డి వివరించారు. అందరూ ఆహ్వానితులే.
వివరాలకు.. అనుదీప్ - 96769 57000.

11 నుంచి హైదరాబాద్‌లో రైతు మహోత్సవం

హైదరాబాద్ నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఏప్రిల్ 11 నుంచి 14 వరకు 4 రోజుల పాటు తెలంగాణ రైతు మహోత్సవం - 2025ను పలు ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల సహకారంతో నిర్వహిస్తున్నట్లు అగ్రి-హార్టీకల్చరల్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ ఎ.వి. రావు తెలిపారు. వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్థక, పౌల్ట్రీ, ఆక్వా, వ్యవసాయ అనుబంధ రంగాల రైతుల సమస్యలకు సరైన పరిష్కారాలు సూచించటమే లక్ష్యంగా ఈ సమగ్ర వ్యవసాయ మహోత్సవం నిర్వహిస్తున్నారు. రైతులు, శాస్త్రవేత్తలు, అధికారులు, విద్యార్థులు, పరిశ్రమదారులు పెద్ద సంఖ్యలో పాల్గొనే ఈ మహోత్సవంలో 400 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. వాతావరణ మార్పులను తట్టుకునే పంటలు/తోటల సాగు పద్ధతులపై, సేంద్రియ ఇంటిపంటల సాగు తదితర అంశాలపై నిపుణులు, ప్రకృతి వ్యవసాయ నిపుణులు, రైతు శాస్త్రవేత్తల ప్రసంగాలు, చర్చాగోష్ఠులు నిర్వహించనున్నారు. విత్తనాలు, సృజనాత్మక యంత్ర పరికరాల ప్రదర్శన కూడా ఉంటుందన్నారు. అందరూ ఆహ్వానితులే. ఇతర వివరాలకు 92465 38694, 93980 59002.


అనిరుధ్

అనిరుధ్ జోడీకి డబుల్స్ టైటిల్

హైదరాబాద్ టెన్నిస్ ప్లేయర్ అనిరుధ్ చంద్రశేఖర్ ఈ ఏడాది తన ఖాతాలో రెండో డబుల్స్ టైటిల్‌ను జమ చేసుకున్నాడు. స్పెయిన్‌లో ముగిసిన జిరోనా ఓపెన్ ఏటీపీ చాలెంజర్-100 టెన్నిస్ టోర్నీలో అనిరుధ్ పురుషుల డబుల్స్ విభాగంలో విజేతగా నిలిచాడు. డేవిడ్ వేగా హెర్నాండెజ్ (స్పెయిన్)తో జత కట్టి ఈ టోర్నీలో ఆడిన అనిరుధ్ ఫైనల్లో 6-4, 6-4తో టాప్ సీడ్ గ్రెగోరి జాక్ (ఫ్రాన్స్)-ఒర్లాండో లూజ్ (బ్రెజిల్) జంటను బోల్తా కొట్టించాడు. 86 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అనిరుధ్-హెర్నాండెజ్ ద్వయం తమ సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది. టైటిల్ నెగ్గిన అనిరుధ్-హెర్నాండెజ్ జోడీకి 7,220 యూరోల (రూ. 6 లక్షల 67 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 100 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. 26 ఏళ్ల అనిరుధ్‌కిది ఏడో ఏటీపీ చాలెంజర్ డబుల్స్ టైటిల్. గతంలో అనిరుధ్ బెంగళూరు ఓపెన్ (2025), విలెనా ఓపెన్ (2024), ఒయిరాస్ ఓపెన్ (2024), విసెంజా ఓపెన్ (2023), డెల్ వాలెస్ ఓపెన్ (2023), పుణే ఓపెన్ (2023) టోర్నీలలో విజేతగా నిలిచాడు.

జొకోవిచ్‌కు చుక్కెదురు

మయామి ఓపెన్ ఫైనల్లో 'చెక్' టీనేజర్ చేతిలో పరాజయం



ఫ్లోరిడా: కెరీర్‌లో 100వ సింగిల్స్ టైటిల్ సాధించాలని ఆశించిన సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్‌కు నిరాశ ఎదురైంది. 2019 తర్వాత పాల్గొన్న మయామి ఓపెన్ ఏటీపీ మాస్టర్స్-1000 సిరీస్ టెన్నిస్ టోర్నీలో జొకోవిచ్ రన్నరప్‌గా నిలిచాడు. చెక్ రిపబ్లిక్‌కు చెందిన 19 ఏళ్ల జాకుబ్ మెన్‌సిక్ అసాధారణ ఆటతీరు కనబరిచి జొకోవిచ్‌కు షాక్ ఇచ్చాడు. 2 గంటల 3 నిమిషాలపాటు జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో మెన్‌సిక్ 7-6 (7/4), 7-6 (7/4)తో గతంలో ఆరుసార్లు మయామి ఓపెన్ చాంపియన్‌గా నిలిచిన జొకోవిచ్‌ను బోల్తా కొట్టించాడు. 6 అడుగుల 4 అంగుళాల ఎత్తు, 83 కేజీల బరువున్న మెన్‌సిక్ 14 ఏస్‌లతో అదరగొట్టాడు. ఇద్దరూ తమ సర్వీస్‌లను ఒక్కోసారి కోల్పోగా... టైబ్రేక్‌లలో మెన్‌సిక్ పైచేయి సాధించి తన కెరీర్‌లో గొప్ప విజయాన్ని అందుకున్నాడు. విజేతగా నిలిచిన మెన్‌సిక్‌కు 11,24,380 డాలర్ల (రూ. 9 కోట్ల 61 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 1000 ర్యాంకింగ్ పాయింట్లు... రన్నరప్ జొకోవిచ్‌కు 5,97,80 డాలర్ల (రూ. 5 కోట్ల 11 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 650 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఈ విజయంతో మెన్‌సిక్ ఏటీపీ సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో ఏకంగా 30 స్థానాలు పురోగతి సాధించి కెరీర్ బెస్ట్ 24వ ర్యాంక్‌కు చేరుకున్నాడు.

పరాగ్‌పై రూ. 12 లక్షలు జరిమానా

గువాహటి: రాజస్తాన్ రాయల్స్ జట్టు తాత్కాలిక కెప్టెన్ రియాన్ పరాగ్‌పై రూ. 12 లక్షల జరిమానా విధించారు. చెన్నై సూపర్ కింగ్స్ జట్టుతో ఆదివారం గువాహటిలో జరిగిన మ్యాచ్‌లో రాజస్తాన్ రాయల్స్ జట్టు నిర్ణీత సమయంలో పూర్తి ఓవర్ల కోటా పూర్తి చేయడంలో విఫలమైంది. ఈ సీజన్‌లో తొలిసారి రాజస్తాన్ జట్టు స్లో ఓవర్ రేట్ నమోదు చేయడంతో... ఐపీఎల్ నియమావళి ప్రకారం ఆ జట్టు కెప్టెన్ రియాన్ పరాగ్‌పై రూ. 12 లక్షలు జరిమానా విధించారు.

ముంబై బోణీ

కోల్‌కతా జట్టుపై 8 వికెట్లతో ఘనవిజయం

- అరంగేట్రంలో అదరగొట్టిన అశ్వని కుమార్
- 4 వికెట్లతో మెరిసిన ముంబై పేసర్
- రికెల్టన్ అజేయ అర్ధసెంచరీ


రింకూ సింగ్‌ను అవుట్ చేసిన సంబరంలో అశ్వని కుమార్

ముంబై: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) చరిత్రలో అత్యంత విజయవంతమైన జట్లలో ఒకటైన ముంబై ఇండియన్స్ జట్టు 18వ సీజన్‌లో గెలుపు బోణీ కొట్టింది. డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టుతో సోమవారం వాంఖడే స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ 8 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఎడంచేతి వాటం యువ పేస్ బౌలర్ అశ్వని కుమార్ ఐపీఎల్ అరంగేట్రం మ్యాచ్‌లో చిరస్మరణీయ ప్రదర్శనతో అదరగొట్టాడు. పంజాబ్‌కు చెందిన అశ్వని తన ప్రతిభతో ముంబై జట్టుకు ఈ సీజన్‌లో తొలి విజయాన్ని అందించాడు. ముంబై కెప్టెన్ హార్దిక్ పాండ్యా టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకోగా... తొలుత బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా నైట్‌రైడర్స్ 16.2 ఓవర్లలో కేవలం 116 పరుగులకే కుప్పకూలింది. 23 ఏళ్ల అశ్వని 3 ఓవర్లలో 24 పరుగులిచ్చి 4 కీలక వికెట్లు పడగొట్టాడు. కోల్‌కతాను తక్కువ స్కోరుకే కట్టడి చేశాడు. అనంతరం ముంబై ఇండియన్స్ జట్టు ఆద్యంతం దూకుడుగా ఆడింది. కేవలం 12.5 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 121 పరుగులు చేసి నెగ్గింది. ఓపెనర్ రికెల్టన్ (41 బంతుల్లో 62 నాటౌట్; 4 ఫోర్లు, 5 సిక్స్‌లు) ధనాధన్ ఆటతీరుతో అజేయ అర్ధ సెంచరీ సాధించాడు. ముంబై గెలుపుతో ప్రస్తుత సీజన్‌లో మొత్తం 10 జట్లూ పాయింట్ల ఖాతా తెరిచినట్టయింది. ఐపీఎల్ అరంగేట్రం మ్యాచ్‌లోనే నాలుగు వికెట్లు పడగొట్టిన తొలి భారతీయ బౌలర్‌గా ఘనత వహించిన అశ్వని కుమార్‌కే 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

ఐపీఎల్-2025: అప్‌డేట్, వివరాలు, విశ్లేషణ కోసం స్కాన్ చేయండి

తడబడుతూనే...

కోల్‌కతాకు శుభారంభం లభించలేదు. తొలి ఓవర్లో నరైన్ (0)ను బౌల్ట్ డకౌట్ చేయగా... రెండో ఓవర్లో డికాక్ (1)ను దీపక్ చహర్ పెవిలియన్‌కు పంపించాడు. మూడో ఓవర్లో అశ్వని తాను వేసిన తొలి బంతికే కెప్టెన్ రహానేను అవుట్ చేశాడు. అశ్వని వేసిన వైడ్ బంతిని రహానే వేటాడి భారీ షాట్ ఆడగా... డీప్ మిడ్‌వికెట్ వద్ద తిలక్ వర్మ అద్భుత క్యాచ్ అందుకున్నాడు. దాంతో కోల్‌కతా 25 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. కోల్‌కతాను ఆదుకుంటాడని భావించి వెంకటేశ్ అయ్యర్ (3) మళ్లీ నిరాశ పరచగా... క్రీజులో ఉన్నంతసేపు ధాటిగా ఆడిన రఘువంశీ (16 బంతుల్లో 26; 3 ఫోర్లు, 1 సిక్స్) పాండ్యా బౌలింగ్‌లో వెనుదిరిగాడు. దాంతో 7 ఓవర్లు ముగిసేసరికి కోల్‌కతా సగంజట్టు పెవిలియన్ చేరింది. ఈ దశలో ఆరో వికెట్‌కు 29 పరుగులు జోడించి... క్రీజులో నిలదొక్కుకున్నట్లు కనిపించిన రింకూ సింగ్ (14 బంతుల్లో 17; 1 ఫోర్, 1 సిక్స్), మనీశ్ పాండే (14 బంతుల్లో 19; 2 ఫోర్లు, 1 సిక్స్)లను అశ్వని ఒకే ఓవర్లో అవుట్ చేయడంతో కోల్‌కతా కోలుకోలేకపోయింది. చివరి ఆశాకిరణం రసెల్ (5)ను అశ్వని 13వ ఓవర్లో బౌల్డ్ చేయడంతో కోల్‌కతా స్కోరు 100 దాటుతుందా లేదా అను మానం కలిగింది. అయితే రమణ్‌దీప్ సింగ్ (12 బంతుల్లో 22; 1 ఫోర్, 2 సిక్స్‌లు) పుణ్యమాని కోల్‌కతా స్కోరు వంద దాటింది. 17వ ఓవర్లో చివరి వికెట్‌గా రమణ్‌దీప్ వెనుదిరగడంతో కోల్‌కతా ఇన్నింగ్స్ ముగిసింది.

రోహిత్ విఫలం

స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబై జట్టుకు ఓపెనర్లు రికెల్టన్, రోహిత్ శర్మ (12 బంతుల్లో 13; 1 సిక్స్) తొలి వికెట్‌కు 46 పరుగులు జోడించి శుభారంభం అందించారు. అయితే ముంబై మాజీ కెప్టెన్ రోహిత్ వరుసగా మూడో మ్యాచ్‌లోనూ విఫలమయ్యాడు. రోహిత్ అవుటైనా మరోవైపు రికెల్టన్ తన ధాటిని కొనసాగించడంతో ముంబైకు ఏ దశలోనూ ఇబ్బంది కాలేదు. విల్ జాక్స్ (17 బంతుల్లో 16; 1 సిక్స్)తో రికెల్టన్ రెండో వికెట్‌కు 45 పరుగులు జోడించాడు. జాక్స్ అవుటయ్యాక వచ్చిన సూర్యకుమార్ (9 బంతుల్లో 27; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధనాధన్ ఇన్నింగ్స్‌తో 13వ ఓవర్లోనే ముంబైను లక్ష్యానికి చేర్చాడు.

స్కోరు వివరాలు

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: క్వింటన్ డికాక్ (సి) అశ్వని కుమార్ (బి) దీపక్ చహర్ 1; సునీల్ నరైన్ (బి) బౌల్ట్ 0; అజింక్య రహానే (సి) తిలక్ వర్మ (బి) అశ్వని కుమార్ 11; అంగ్‌క్రిష్ రఘువంశీ (సి) నమన్ ధీర్ (బి) హార్దిక్ పాండ్యా 26; వెంకటేశ్ అయ్యర్ (సి) రికెల్టన్ (బి) దీపక్ చహర్ 3; రింకూ సింగ్ (సి) నమన్ ధీర్ (బి) అశ్వని కుమార్ 17; మనీశ్ పాండే (బి) అశ్వని కుమార్ 19; ఆండ్రీ రసెల్ (బి) అశ్వని కుమార్ 5; రమణ్‌దీప్ సింగ్ (సి) హార్దిక్ పాండ్యా (బి) సాంట్నర్ 22; హర్షిత్ రాణా (సి) నమన్ ధీర్ (బి) విఘ్నేశ్ 4; స్పెన్సర్ జాన్సన్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (16.2 ఓవర్లలో ఆలౌట్) 116. వికెట్ల పతనం:** 1-1, 2-2, 3-25, 4-41, 5-45, 6-74, 7-80, 8-88, 9-99, 10-116. **బౌలింగ్:** ట్రెంట్ బౌల్ట్ 4-0-23-1, దీపక్ చహర్ 2-0-19-2, అశ్వని కుమార్ 3-0-24-4, హార్దిక్ పాండ్యా 2-0-10-1, విఘ్నేశ్ పుథుర్ 2-0-21-1, మిచెల్ సాంట్నర్ 3.2-0-17-1.

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (సి) హర్షిత్ రాణా (బి) రసెల్ 13; రికెల్టన్ (నాటౌట్) 62; విల్ జాక్స్ (సి) రహానే (బి) రసెల్ 16; సూర్య కుమార్ యాదవ్ (నాటౌట్) 27; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (12.5 ఓవర్లలో 2 వికెట్లకు) 121. వికెట్ల పతనం:** 1-46, 2-91. **బౌలింగ్:** స్పెన్సర్ జాన్సన్ 2-0-14-0, హర్షిత్ రాణా 2-0-28-0, వరుణ్ చక్రవర్తి 3-0-12-0, రసెల్ 2.5-0-35-2, సునీల్ నరైన్ 3-0-32-0.

ఐపీఎల్-2025 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
బెంగళూరు	2	2	0	4	2.266
ఢిల్లీ	2	2	0	4	1.320
లక్నో	2	1	1	2	0.963
గుజరాత్	2	1	1	2	0.625
పంజాబ్	1	1	0	2	0.550
ముంబై	3	1	2	2	0.309
చెన్నై	3	1	2	2	-0.771
హైదరాబాద్	3	1	2	2	-0.871
రాజస్తాన్	3	1	2	2	-1.112
కోల్‌కతా	3	1	2	2	-1.428

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

లక్నో X పంజాబ్
వేదిక: లక్నో
రాత్రి 7:30 గంటల నుంచి
స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

ప్రళయం వస్తోంది



● కార్తీ

హీరో కార్తీ, దర్శకుడు పీఎస్ మిత్రన్ కాంబినేషన్‌లో రూపొందిన 'సర్దార్' చిత్రం 2022లో విడుదలై బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఈ మూవీకి సీక్వెల్‌గా వీరి కాంబినేషన్‌లోనే 'సర్దార్ 2' తెరకెక్కుతోంది. ఈ సినిమా ఫస్ట్ లుక్, ప్రోలాగ్ వీడియోను సోమవారం రిలీజ్ చేశారు మేకర్స్. తండ్రీ కొడుకులుగా కార్తీ ద్విపాత్రాభినయం చేస్తున్న ఈ మూవీలో ఎస్‌జే సూర్య విలన్‌గా, మాళవికా మోహనన్, ఆషికా రంగనాథ్, రజిషా విజయన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఎస్. లక్ష్మణ్ కుమార్, ఇషాన్ సక్సేనా నిర్మిస్తున్న ఈ మూవీ ఈ ఏడాదే రిలీజ్ కానుంది. ''నాతోనే ఇది ముగిసిపోదు.. సర్దార్, నీ దేశం వైపు ఒక ప్రళయం వస్తోంది' వంటి డైలాగ్స్ 'సర్దార్ 2' వీడియోలో ఉన్నాయి.

అందరూ గర్వపడే సినిమా కోర్ట్ - చిరంజీవి


● ప్రియదర్శి, రోషన్, చిరంజీవి, శ్రీదేవి, రామ్ జగదీష్

''కోర్ట్' సినిమా చూశాను.. ఎక్కడా బోర్ కొట్టలేదు. కథని ఆద్యంతం ఆసక్తిగా తీశారు. నటీనటులందరూ అద్భుతంగా నటించారు.. ప్రతి పాత్ర సహజంగా ఉంది. ఈ మూవీని కేవలం ఒక ఎంటర్‌టైన్మెంట్ ఫిల్మ్‌లా కాకుండా ఒక ఎడ్యుకేటివ్ కోర్ట్ డ్రామాగా భావిస్తున్నాను. అందరూ గర్వపడే సినిమా 'కోర్ట్'' అని హీరో చిరంజీవి తెలిపారు. ప్రియదర్శి, శివాజీ, రోషన్, శ్రీదేవి ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'కోర్ట్'. రామ్ జగదీష్ దర్శకత్వం వహించారు. నాని వాల్ పోస్టర్ సినిమా సమర్పణలో ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. దీప్తి గంటా సహ నిర్మాతగా వ్యవహరించిన ఈ చిత్రం మార్చి 14న విడుదలై, హిట్‌గా నిలిచింది. తాజాగా 'కోర్ట్' చిత్రబృందాన్ని చిరంజీవి అభినందించి, సత్కరించారు. అనంతరం చిరంజీవి మాట్లాడుతూ–''కోర్ట్'లో చాలా బలమైన సందేశం ఉంది. నాని ఒక కథపై ఆసక్తి చూపించారంటే కచ్చితంగా అందులో విషయం ఉంటుంది. ఈ సినిమాని ప్రేక్షకులు తప్పకుండా థియేటర్స్‌లోనే చూడాలి'' అన్నారు.


● ప్రదీప్ చిలుకూరి, కల్యాణ్‌రామ్, అశోక్ వర్ధన్


అమ్మలందరికీ మా సినిమా అంకితం - కల్యాణ్‌రామ్

''అర్జున్ సన్నాఫ్ వైజయంతి' సినిమాలోని అమ్మ పాత్రకి విజయశాంతిగారు ఒప్పుకోవడం వల్లే నేను ఈ సినిమా చేశాను. అమ్మలను గౌరవించడం మన బాధ్యత. వాళ్ల కోసం ఎంత త్యాగం చేసినా తప్పులేదు. మా సినిమాని అమ్మలందరికీ అంకితం ఇస్తున్నాం'' అని హీరో కల్యాణ్ రామ్ అన్నారు. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వంలో కల్యాణ్ రామ్, సయీ మంజ్రేకర్ జోడీగా, విజయశాంతి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించిన ఈ చిత్రం త్వరలో రిలీజ్ కానుంది. అజనీష్ లోకనాథ్ సంగీతం అందించిన ఈ సినిమాలోని 'నాయాల్ది..' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను సోమవారం నరసరావుపేటలో రిలీజ్ చేశారు మేకర్స్. రఘురాం సాహిత్యం అందించిన ఈ పాటని నకాష్ అజీజ్, సోనీ కొమాండూరి పాడారు. ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో కల్యాణ్ రామ్ మాట్లాడుతూ– ''ఈ వేడుక చూస్తుంటే పాట రిలీజ్‌లా లేదు.. 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' సక్సెస్ మీట్‌లా ఉంది'' అన్నారు. ''పల్నాటి పౌరుషం కల్యాణ్ రామ్‌గారి క్యారెక్టర్‌లో కనిపిస్తుంది'' అన్నారు ప్రదీప్ చిలుకూరి. ''ఈ సాంగ్‌ను పల్నాడులో లాంచ్ చేయడం చాలా గర్వంగా ఉంది'' అని అశోక్ వర్ధన్ చెప్పారు.

ఎన్టీఆర్.. సీఎం..సీఎం

ఈ పాట ఈవెంట్‌కి కల్యాణ్‌రామ్ వచ్చింది మొదలు ఎన్టీఆర్ సీఎం అంటూ అభిమానులు పెద్దగా నినాదాలు చేశారు. హీరో ఎన్టీఆర్ ఫ్లెక్సీని ప్రదర్శిస్తూ సీఎం.. సీఎం.. అనే నినాదాలతో హోరెత్తించారు.

నేను అందుకున్న గొప్ప ప్రశంస అదే - కల్యాణ్ శంకర్



''మ్యాడ్' సినిమా ఎక్కువగా యువతకి చేరువైంది. ఆ చిత్రానికి సీక్వెల్‌గా రూపొందిన 'మ్యాడ్ స్క్వేర్' మూవీని యువతతో పాటు, కుటుంబ ప్రేక్షకులు కూడా ఆదరిస్తున్నారు.. ఎంజాయ్ చేస్తున్నారు'' అని డైరెక్టర్ కల్యాణ్ శంకర్ తెలిపారు. నార్నె నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ హీరోలుగా నటించిన చిత్రం 'మ్యాడ్ స్క్వేర్'. కల్యాణ్ శంకర్ దర్శకత్వం వహించారు. సూర్యదేవర నాగవంశీ సమర్పణలో హారిక సూర్యదేవర, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం మార్చి 28న విడుదలైంది. ఈ సినిమా విడుదలైన మూడు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.55 కోట్లకు పైగా గ్రాస్ రాబట్టినట్లు ప్రకటించారు మేకర్స్. ఈ నేపథ్యంలో సోమవారం కల్యాణ్ శంకర్ విలేకరులతో మాట్లాడుతూ–''మ్యాడ్ స్క్వేర్'లో పెద్ద కథ ఆశించి సినిమాకి రాకండి, సరదాగా నవ్వుకోవడానికి రండి' అని ముందే చెప్పడం మాకు చాలా ప్లస్ అయింది. రాజమౌళిగారు కూడా సినిమా మొదలుపెట్టే ముందే కథ ఇలా ఉండబోతుంది అని చెబుతుంటారు. అలా చెప్పడం వల్ల ప్రేక్షకులను మనం ముందే ప్రిపేర్ చేసినట్లు అవుతుంది. మా ఫ్రెండ్ వాళ్ల అమ్మ పదిహేనేళ్ల తర్వాత థియేటర్‌లో చూసిన సినిమా 'మ్యాడ్ స్క్వేర్'. 'సినిమా చూస్తున్నప్పుడు నవ్వి నవ్వి కళ్లల్లో నీళ్లు తిరిగాయి' అని ఆమె చెప్పడం నేను అందుకున్న గొప్ప ప్రశంస. ఇతర నిర్మాతల నుంచి కూడా నాకు అవకాశాలు వస్తున్నాయి. కానీ, నాగవంశీగారితో నాకు మంచి ర్యాపో ఉండటంతో ఆయనతోనే వరుస సినిమాలు చేస్తున్నాను. రవితేజగారితో నేను చేయబోయే సినిమాలోనూ కచ్చితంగా వినోదం ఉంటుంది'' అన్నారు.


● వైష్ణవీ చైతన్య

డబుల్ ధమాకా

ప్రేక్షకులకు డబుల్ ధమాకా ఇవ్వనున్నారు హీరోయిన్ వైష్ణవీ చైతన్య. ఆమె నటిస్తున్న తాజా చిత్రం 'జాక్'లో ఆమె తొలిసారి ద్విపాత్రాభినయం చేస్తుండటం విశేషం. తెలుగమ్మాయి అయిన వైష్ణవీ చైతన్య కెరీర్ ప్రారంభంలో 'లవ్ ఇన్ 143 అవర్స్', 'ది సాఫ్ట్‌వేర్ డెవలపర్', 'అరెరే మానస', 'మిస్సమ్మ' వంటి షార్ట్ ఫిల్మ్స్ చేశారు. ఆ తర్వాత 'అల వైకుంఠపురములో', 'వరుడు కావలెను' చిత్రాల్లో అతిథి పాత్రల్లో నటించిన ఆమె 'బేబీ'(2023) మూవీతో హీరోయిన్‌గా మారారు. సాయి రాజేశ్ దర్శకత్వం వహించిన ఈ మూవీ సూపర్ హిట్‌గా నిలిచి, రూ.100 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. ఈ మూవీతో ఆడియన్స్‌లో బోలెడంత క్రేజ్ సొంతం చేసుకున్న వైష్ణవీ చైతన్య ఆ తర్వాత వరుస అవకాశాలతో దూసుకెళుతున్నారు. తాజాగా సిద్ధు జొన్నలగడ్డకి జోడీగా ఆమె నటిస్తున్న చిత్రం 'జాక్'. 'బొమ్మరిల్లు' భాస్కర్ దర్శకత్వంలో బీవీఎస్ఎన్ ప్రసాద్, బాపినీడు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న విడుదల కానుంది. ఈ మూవీలో ఆమె ఫస్ట్ టైమ్ ద్విపాత్రాభినయం చేశారు. అదేవిధంగా '90 ఏ మిడిల్ క్లాస్ బయోపిక్' వెబ్ సిరీస్‌కి సీక్వెల్‌గా రూపొందుతున్న సినిమాలో ఆనంద్ దేవరకొండకి జోడీగా నటిస్తున్నారు వైష్ణవి. సితార ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ ఈ సినిమాని నిర్మిస్తున్నారు.

ఇలాంటి సినిమాలకు ధైర్యం కావాలి - మల్లిడి కృష్ణ


● కృష్ణ, కుశాల్ రాజు, వినాయక్, లతారాజు

దర్శకుడు మల్లిడి వశిష్ఠ ('బింబిసార' మూవీ ఫేమ్) సోదరుడు మల్లిడి కృష్ణ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. కుశాల్ రాజుని హీరోగా పరిచయం చేస్తూ ఆయన తెరకెక్కిస్తున్న చిత్రం షురూ అయింది. ఎంఎస్ఆర్ క్రియేషన్స్‌పై డా. లతారాజు నిర్మిస్తున్న ఈ సినిమా సోమవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. తొలి షాట్‌కు డైరెక్టర్ వీవీ వినాయక్ క్లాప్ ఇవ్వగా, మల్లిడి వశిష్ఠ గౌరవ దర్శకత్వం వహించారు. దర్శక, నిర్మాతలు ఎస్వీ కృష్ణారెడ్డి, అచ్చిరెడ్డి స్క్రిప్ట్‌ని యూనిట్‌కి అందించారు. కుశాల్ రాజు మాట్లాడుతూ– ''నన్ను హీరోగా పరిచయం చేయడం కోసం మా అమ్మ లతాగారు చాలా కేర్ తీసుకున్నారు'' అన్నారు. ''ఈ మూవీలో వినోదం, ప్రేమ సమపాళ్లలో ఉంటాయి'' అని లతారాజు తెలిపారు. ''ఇదొక సైకో డ్రామా. ఓటీటీల యుగంలో ఇలాంటి కథను ఎంచుకోవాలంటే ధైర్యం కావాలి'' అన్నారు మల్లిడి కృష్ణ. ''ఈ సినిమాలో మంచి పాత్ర చేస్తున్నాను'' అన్నారు నటుడు పృథ్వీరాజ్. ఈ కార్యక్రమంలో నిర్మాత బెల్లంకొండ సురేష్ పాల్గొన్నారు. ఈ సినిమాకు సంగీతం: శ్రీచరణ్ పాకాల, కెమేరా: అమర్నాథ్ బొమ్మిరెడ్డి.

ఏ పనైనా చేయగలడు!


● ప్రదీప్, దీపిక, నితిన్, భరత్

ప్రదీప్ మాచిరాజు, దీపిక పిల్లి జంటగా నటించిన చిత్రం 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి'. నితిన్-భరత్ ద్వయం దర్శకత్వంలో మాంక్స్ అండ్ మంకీస్ బ్యానర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 11న రిలీజ్ కానుంది. సోమవారం హైదరాబాద్‌లో ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు మేకర్స్. ''సార్.. మీరు చదివిన చదువుకి చేసే పనికి ఏమైనా సంబంధం ఉందా, మనదేశంలో ఇంజినీరింగ్ చదివినవాడు ఒక్క డాక్టర్ పని తప్ప.. ఏ పనైనా చేయగలడు, కరెక్టే.. సార్' వంటి సంభాషణలు ట్రైలర్‌లో ఉన్నాయి. ప్రదీప్ మాట్లాడుతూ– ''ఈ సినిమా ఆద్యంతం వినోదాత్మకంగా ఉంటుంది. భవిష్యత్‌లో నేను మరిన్ని మంచి సినిమాలు చేసేందుకు ఈ సినిమా నాకు ఒక మెట్టు అవుతుందని భావిస్తున్నా'' అన్నారు. ''ఫ్యామిలీ అంతా కలిసి చూసే సినిమా ఇది'' అన్నారు నితిన్-భరత్. హీరోయిన్ దీపిక మాట్లాడారు. ఈ సినిమాకు సంగీతం: రధన్.

వినోదం నేపథ్యంలో...


● గోపి, సుహాస్, నరేంద్ర రెడ్డి

సుహాస్ హీరోగా కొత్త సినిమా ప్రకటన వచ్చింది. 'రైటర్ పద్మభూషణ్' చిత్ర డైరెక్టర్ షణ్ముఖ ప్రశాంత్ కథను అందిస్తున్న ఈ చిత్రానికి గోపి దర్శకత్వం వహించనున్నారు. త్రిశూల్ విజనరీ స్టూడియోస్‌పై ప్రొడక్షన్ నంబర్ 2గా బి. నరేంద్ర రెడ్డి ఈ సినిమా నిర్మించనున్నారు. ''ఈ చిత్రం పూర్తి వినోదాత్మకంగా ఉండనుంది. అద్భుతమైన కామెడీ టైమింగ్ ఉన్న నటుడిగా పేరొందిన సుహాస్ ఈ చిత్రంలో హిలేరియస్ పాత్రను పోషిస్తున్నారు. జులైలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం'' అన్నారు మేకర్స్.

సాక్షి
బిజినెస్
మంగళవారం
1-4-2025

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
191	73
77,415	23,519

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	17,117	▽	206
డోజోన్స్	41,669	△	85
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,583	▽	76
డాక్స్	22,163	▽	298
షాంఘై	3,356	▽	16
నికాయ్	35,618	▽	1,503

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	85.25	86.27
£	బ్రిటన్ పౌండ్	109.60	112.48
€	యూరో	91.25	93.90
¥	జపాన్ ఎన్ (100)	56.14	57.57
AU$	ఆస్ట్రేలియా డాలర్	52.80	55.02
S$	సింగపూర్ డాలర్	61.42	66.10
SAR	సౌదీ రియాల్	21.89	23.53
UAE D	యూఏఈ దిర్హామ్	22.46	24.25
¥	చైనా యువాన్	10.93	12.75

చిన్న షేర్ల జోష్

బీఎస్‌ఈ స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 8 శాతం అప్
- ఇదే కాలంలో సెన్సెక్స్ ర్యాలీ 5 శాతమే
- మార్కెట్లకు రిటైల్ ఇన్వెస్టర్ల కొనుగోళ్ల దన్ను

2024-25లో మార్కెట్‌ను మించి పరుగు

తాజాగా ముగిసిన ఆర్థిక సంవత్సరం(2024-25)లో దేశీ స్టాక్ మార్కెట్లు స్వల్పంగా బలపడ్డాయి. ప్రామాణిక ఇండెక్స్ సెన్సెక్స్ 5 శాతం లాభపడింది. అయితే అత్యధిక శాతం ఇన్వెస్టర్లను ఆకట్టుకోవడంతో చిన్న షేర్ల ఇండెక్స్ బీఎస్‌ఈలో 8 శాతం పురోగమించింది. ఇందుకు ప్రధానంగా మార్చి నెల మద్దతిచ్చింది.



న్యూఢిల్లీ: పలు ఆటుపోట్ల మధ్య 2024–25లో స్టాక్ మార్కెట్లు నికరంగా లాభపడ్డాయి. సెన్సెక్స్ 3,764 పాయింట్లు(5.1 శాతం) పుంజుకోగా.. బీఎస్‌ఈలో స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 3,472 పాయింట్లు(8 శాతం) ఎగసింది. ఈ బాటలో మిడ్ క్యాప్ సైతం 2,209 పాయింట్లు(5.6 శాతం) వృద్ధి చెందింది. ఇందుకు ప్రధానంగా మార్చి నెల దన్నుగా నిలిచింది. గతేడాది అక్టోబర్ నుంచి అమ్మకాల బాట పట్టిన విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) గత నెలలో ఉన్నట్టుండి కొనుగోళ్ల యూటర్న్ తీసుకోవడంతో మార్కెట్లు భారీ నష్టాల నుంచి రికవరీ సాధించాయి. దీంతో పూర్తి ఏడాదికి లాభాలతో నిలిచాయి. ప్రధానంగా రిటైల్ ఇన్వెస్టర్లు పెట్టుబడులకు ఆసక్తి చూపడం మిడ్, స్మాల్‌క్యాప్ కౌంటర్లకు ప్రోత్సాహాన్నిచ్చినట్లు విశ్లేషకులు పేర్కొన్నారు.

మార్చిలో బూస్ట్

ఎఫ్‌పీఐలు, రిటైలర్ల పెట్టుబడుల దన్నుతో ఒక్క మార్చి నెలలోనే మార్కెట్లు భారీగా టర్న్‌అరౌండ్ అయ్యాయి. సెన్సెక్స్ 4,217 పాయింట్లు(5.8 శాతం) ఎగసింది. బీఎస్‌ఈ స్మాల్ క్యాప్ ఇండెక్స్ 3,555 పాయింట్లు(8.3%) జంప్‌చేస్తే, మిడ్ క్యాప్ 2,939 పాయింట్లు(7.6%) బలపడింది. అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితులు తలెత్తినప్పటికీ దేశీయంగా సుస్థిర ప్రభుత్వ ఏర్పాటు, విధానాల కొనసాగింపుపై అంచనాలు ఇన్వెస్టర్లలో మార్కెట్లపట్ల విశ్వాసాన్ని పెంచాయి. ఫలితంగా గతేడాది పలు ఆటుపోట్ల మధ్య మార్కెట్లు నికరంగా లాభపడ్డాయి.

నష్టాలకు చెక్

గతేడాది అక్టోబర్ మొదలు వరుసగా 5 నెలలపాటు నష్టాలతో ముగిసిన మార్కెట్లు గత నెలలో బౌన్స్ బ్యాక్ అయ్యాయి. తద్వారా గతేడాది నికరంగా లాభాలతో నిలిచినట్లు లెమన్ మార్కెట్స్ డెస్క్ విశ్లేషకులు సతీష్ చంద్ర ఆలూరి పేర్కొన్నారు. ప్రధానంగా మిడ్, స్మాల్‌క్యాప్ ఇండెక్సులు మార్కెట్లను మించి బలపడినట్లు తెలియజేశారు. అందుబాటు విలువలకు చేరిన పలు షేర్లకుతోడు దేశీయంగా నెలకొన్న ఆశావహ పరిస్థితులు, ఎఫ్‌పీఐల పెట్టుబడులు ఇందుకు కారణమైనట్లు వివరించారు. దీంతో ప్రస్తుతం చరిత్రాత్మక సగటులకు పలు కౌంటర్లు చేరినట్లు అభిప్రాయపడ్డారు. ఈక్విటీల విలువలు ఖరీదుగా మారడంతో అక్టోబర్ నుంచి ఎఫ్‌పీఐలు పెట్టుబడులను వెనక్కి తీసుకుంటున్నారు. వెరసి దేశీ స్టాక్ మార్కెట్లు 'బేర్' ట్రెండ్‌లో చిక్కుకున్న సంగతి తెలిసిందే. అయితే ఎఫ్‌పీఐలు పెట్టుబడులవైపు మళ్లడంతోపాటు.. భారీ సంఖ్యలో రిటైల్ ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు ఆసక్తి చూపడంతో మార్కెట్లు నష్టాలనుంచి బయటపడినట్లు నిపుణులు తెలియజేశారు. ఇది చివరికి మార్కెట్లు సానుకూల ధోరణిలో ముగిసేందుకు దోహదం చేసినట్లు వివరించారు. ఫైనాన్షియల్ మార్కెట్లను ప్రభావితం చేయగల యూఎస్ ఫెడరల్ రిజర్వ్ 2025లో వడ్డీ రేట్ల కోత సంకేతాలు ఇవ్వడం సెంటిమెంటుకు బలాన్నిచ్చినట్లు పేర్కొన్నారు.

ప్రీమియం విలువల ఎఫెక్ట్

నిజానికి బుల్ మార్కెట్లలో ప్రధాన ఇండెక్సులతో పోలిస్తే మిడ్, స్మాల్ క్యాప్స్ మరింత అధికంగా ర్యాలీ చేయవలసి ఉన్నట్లు హైట్రో సెక్యూరిటీస్ వ్యవస్థాపకులు తరుణ్ సింగ్ పేర్కొన్నారు. గతేడాది చిన్న షేర్ల ఇండెక్సులు రెండంకెల స్థాయిలో వృద్ధి చూపకపోవడానికి మార్కెట్ల ర్యాలీ చాలా ముందుగానే ప్రారంభంకావడంతో షేర్ల ధరలు భారీగా పెరిగాయని, ఇందుకు తగిన స్థాయిలో కంపెనీల పనితీరు లేకపోవడం ఇన్వెస్టర్లను నిరాశపరచిందని వివరించారు. గత రెండు త్రైమాసికాలలో అంచనాలకంటే దిగువన వెలువడిన ఫలితాలు షేర్ల ప్రీమియం ధరలకు మద్దతివ్వలేకపోయినట్లు తెలియజేశారు. మరోవైపు యూఎస్ కొత్త ప్రెసిడెంట్ ట్రంప్ భారత్‌సహా పలు దేశాలపై ప్రతీకార టారిఫ్‌లకు తెరతీయడం సెంటిమెంటును బలహీనపరచినట్లు మాస్టర్ క్యాపిటల్ సర్వీసెస్ డైరెక్టర్ పాల్కా అరోరా చోప్రా పేర్కొన్నారు.


సరికొత్త రికార్డులు

గతేడాది(2024) సెప్టెంబర్ 27న సెన్సెక్స్ చరిత్రాత్మక గరిష్టం 85,978 పాయింట్లను అధిగమించగా.. బీఎస్‌ఈ మిడ్ క్యాప్ ఇండెక్స్ అదేనెల 24న 49,701ను తాకి సరికొత్త గరిష్టాన్ని అందుకుంది. ఈ బాటలో స్మాల్ క్యాప్ సైతం 2024 డిసెంబర్ 12న 57,828 పాయింట్ల వద్ద లైఫ్‌టైమ్ గరిష్టానికి చేరింది. నిజానికి బ్లూచిప్స్ లేదా లార్జ్‌క్యాప్ స్టాక్స్‌ను ఎఫ్‌పీఐలు అత్యధికంగా కొనుగోలు చేస్తే.. రిటైలర్లు చిన్న షేర్లపట్ల ఆకర్షితులవుతుంటారని విశ్లేషకులు వివరించారు. అయితే ఇకపై ఆయా కంపెనీల ఫలితాల ఆధారంగా స్టాక్ విలువలు సర్దుబాటుకానున్నట్లు తెలియజేశారు. కొత్త ఆర్థిక సంవత్సరం(2025–26)లో అడుగుపెడుతున్న నేపథ్యంలో దేశీ ఈక్విటీ మార్కెట్లు ఆటుపోట్ల మధ్య వృద్ధి బాటలో సాగే వీలున్నట్లు నిపుణులు భావిస్తున్నారు. ప్రపంచ పరిస్థితులు, మార్కెట్ల ట్రెండ్‌సహా దేశీయంగా కార్పొరేట్ ఫలితాలు, ప్రభుత్వ, ప్రయివేట్ పెట్టుబడులు సెంటిమెంటును ప్రభావితం చేయనున్నట్లు వివరించారు.

ఏప్రిల్ 1 విడుదల

నేటి నుంచి అమల్లోకి కొత్త ఆర్థిక మార్పులు

- రూ.12 లక్షలున్నా ఆదాయపన్ను నో
- డిపాజిట్లపై టీడీఎస్‌లోనూ ఊరట
- బ్యాంక్ ఖాతా యాక్టివ్‌గా లేకపోతే యూపీఐలు పనిచేయవు
- రూ.10లక్షలతో పెట్టుబడి విభాగం



న్యూఢిల్లీ: నూతన ఆర్థిక సంవత్సరంలో కొన్ని కీలక ఆర్థిక మార్పులు చోటుచేసుకున్నాయి. ఆదాయ పన్ను దగ్గర్నుంచి క్రెడిట్ కార్డు రివార్డులు, టీడీఎస్ వరకు జరిగే ఈ మార్పుల ప్రభావం.. వ్యక్తిగత బడ్జెట్, ఆర్థిక ప్రణాళికలపై కచ్చితంగా ఉంటుంది. వీటిపై ఓసారి దృష్టి సారిద్దాం.

→ 2025–26 బడ్జెట్‌లో కొత్త ఆదాయపన్ను విధానంలో కల్పించిన పన్ను ప్రయోజనాలు 2025 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చేశాయి. నూతన విధానంలో రూ.12 లక్షలకు మించకుండా ఆదాయం ఉన్న వారు పన్ను చెల్లించక్కర్లేదు. వేతన జీవులు అయితే స్టాండర్డ్ డిడక్షన్ రూ.75వేలతో కలుపుకుని రూ.12.75 లక్షలకు మించని ఆదాయంపై పన్ను చెల్లించాల్సిన అవసరం లేకుండా ఉపశమనం కల్పించారు.

→ వేతన జీవులు, పెన్షనర్లకు ఇంతకుముందు వరకు నూతన పన్ను విధానంలో రూ.50 వేలుగానే ఉన్న స్టాండర్డ్ డిడక్షన్ ప్రయోజనం రూ.75 వేలకు పెరిగింది.

→ 60 ఏళ్లు నిండిన వృద్ధులకు (సీనియర్ సిటిజన్స్) బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రికరింగ్ డిపాజిట్లపై వడ్డీ ఆదాయం ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.50వేలు మించితే టీడీఎస్ అమలు చేసేవారు. ఇప్పుడు ఈ పరిమితి రూ.లక్షకు పెంచారు. దీంతో వృద్ధులకు పెద్ద ఉపశమనం దక్కింది. 60 ఏళ్లలోపు ఉన్న డిపాజిట్లకు వడ్డీ ఆదాయం రూ.40వేలు మించితే టీడీఎస్ అమలు చేస్తుండగా, ఈ పరిమితి రూ.50వేలకు పెరిగింది.

→ ఇన్సూరెన్స్ బ్రోకర్లకు వచ్చే కమీషన్ ఆదాయం ఏడాదిలో రూ.15,000 మించితే టీడీఎస్ అమలు చేస్తుండగా, ఈ పరిమితి రూ.20,000కు పెరిగింది.

→ యాక్టివ్‌గా లేని (కార్యకలాపాల్లేని) ఖాతాలకు అనుసంధానమైన యూపీఐ ఐడీలు ఇక పనిచేయవు. భద్రత దృష్ట్యా వీటిని డీయాక్టివేట్ చేయనున్నారు. తమ ఖాతాలను యాక్టివ్‌గా మార్చుకుని తిరిగి యూపీఐ ఐడీ క్రియేట్ చేసుకోవచ్చు.

→ సెబీ ఆదేశాల ప్రకారం మ్యూచువల్ ఫండ్స్ కొత్త పథకాల (ఎన్‌ఎఫ్‌వోలు) రూపంలో ఇన్వెస్టర్ల నుంచి వసూలు చేసిన నిధులను, ఇష్యూ ముగిసిన తర్వాత 30 పనిదినాల్లో ఇన్వెస్ట్ చేయడం తప్పనిసరి.

→ స్పెషలైజ్డ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్ (సిఫ్) పేరుతో సెబీ ప్రకటించిన కొత్త తరహా పెట్టుబడుల విభాగం ఆచరణలోకి రానుంది. ఇన్వెస్టర్లు కనీసం రూ.10 లక్షలతో ఇందులో పెట్టుబడులు పెట్టుకోవచ్చు.

→ ఇన్వెస్టర్లు తమ డీమ్యాట్ అకౌంట్ స్టేట్‌మెంట్‌లు, కన్సాలిడేటెడ్ అకౌంట్ స్టేట్‌మెంట్లను నేరుగా డిజీలాకర్‌లోకి వెళ్లేలా చేసుకోవచ్చు. తద్వారా ఇన్వెస్టర్లు, వారి నామినీలు ఈక్విటీ పెట్టుబడుల వివరాలను కోరుకున్నప్పుడు సులభంగా పొందేందుకు వీలుంటుంది.

→ ఎస్‌బీఐ తన క్రెడిట్ కార్డుల్లో కొన్ని రకాలపై రివార్డు పాయింట్ల పరంగా చేసిన మార్పులు అమల్లోకి వచ్చేశాయి. దీంతో సింప్లీ క్లిక్ ఎస్‌బీఐ కార్డుదారులు స్విగ్గీ షాపింగ్‌పై ప్రస్తుతం పొందుతున్న పది రెట్ల రివార్డు పాయింట్లు కాస్తా ఐదు రెట్లకు తగ్గిపోయాయి.

→ అమెరికా డిమాండ్ల మేరకు ఆ దేశం నుంచి దిగుమతయ్యే కొన్ని రకాల ఉత్పత్తులపై భారత్ టారిఫ్‌లు తగ్గించాలనుకుంటోంది. దీని ఫలితంగా అమెరికా నుంచి వచ్చే యాపిల్స్, బాదం, ఆటో ఉత్పత్తుల ధరలు దిగిరావొచ్చు.

హల్దీరామ్‌లో వాటా విక్రయం

పెట్టుబడులకు టెమాసెక్, ఐహెచ్‌సీ, అల్ఫా వేవ్ గ్లోబల్ రెడీ

న్యూఢిల్లీ: ఫాస్ట్‌ఫుడ్ కంపెనీ హల్దీరామ్ స్నాక్స్ ఫుడ్ తాజాగా యూఏఈ సంస్థ ఇంటర్నేషనల్ హోల్డింగ్ కంపెనీ(ఐహెచ్‌సీ)తో పాటు ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ అల్ఫా వేవ్ గ్లోబల్‌కు మైనారిటీ వాటా విక్రయించనుంది. సంబంధిత వర్గాల సమాచారం ప్రకారం రెండు సంస్థలు సంయుక్తంగా హల్దీరామ్‌లో 6 శాతం వాటా కొనుగోలు చేయనున్నట్లు తెలుస్తోంది. స్నాక్, ఫుడ్ బ్రాండ్ హల్దీరామ్స్‌లో ఇప్పటికే టెమాసెక్ ఈక్విటీ పెట్టుబడులకు సిద్ధపడగా.. మరో రెండు సంస్థలు ఐహెచ్‌సీ, అల్ఫా వేవ్ గ్లోబల్ సైతం వాటా కొనుగోలు చేయనున్నట్లు హల్దీరామ్ ఒక ప్రకటనలో పేర్కొంది.



అయితే డీల్ వివరాలు వెల్లడించలేదు. గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ టెమాసెక్‌కు ఇప్పటికే మైనారిటీ వాటా విక్రయించేందుకు ఒప్పందం కుదిరిన నేపథ్యంలో హల్దీరామ్ తాజా ప్రకటనకు ప్రాధాన్యత ఏర్పడింది. కాగా.. 10 బిలియన్ డాలర్ల(సుమారు రూ. 85,000 కోట్లు) విలువలో హల్దీరామ్‌లో మైనారిటీ వాటాలు కొనుగోలు చేస్తున్నట్లు అంచనా.

ఐటీసీ గూటికి సెంచరీ పల్ప్

డీల్ విలువ రూ. 3,498 కోట్లు



న్యూఢిల్లీ: ఆదిత్య బిర్లా రియల్ ఎస్టేట్ (ఏబీఆర్ఈఎల్)లో భాగమైన సెంచరీ పల్ప్ అండ్ పేపర్‌ను డైవర్సిఫైడ్ దిగ్గజం ఐటీసీ తాజాగా కొనుగోలు చేసింది. ఈ డీల్ విలువ రూ. 3,498 కోట్లు. దీనితో కీలకమైన రియల్ ఎస్టేట్ విభాగంపై మరింతగా దృష్టి పెట్టేందుకు వెసులుబాటు లభిస్తుందని ఏబీఆర్ఈఎల్ ఎండీ ఆర్‌కే దాల్మియా తెలిపారు. అలాగే ఏబీఆర్ఈఎల్ వాటాదార్లకు అధిక విలువ చేకూర్చేందుకు తోడ్పడుతుందని పేర్కొన్నారు.

రెనో చేతికి నిస్సాన్ వాటా

జేవీలో 51 శాతం కొనుగోలుకి సై



న్యూఢిల్లీ: దేశీ భాగస్వామ్య కంపెనీ(జేవీ) రెనో నిస్సాన్ ఆటోమోటివ్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్(ఆర్ఎన్ఏపీఎల్)లో జపనీస్ భాగస్వామి నిస్సాన్ వాటాను ఫ్రెంచ్ ఆటో రంగ దిగ్గజం రెనో కొనుగోలు చేయనుంది. జేవీలో నిస్సాన్‌కుగల 51 శాతం వాటాను సొంతం చేసుకోనున్నట్లు రెనో తాజాగా పేర్కొంది. తద్వారా జేవీలో 100 శాతం వాటా పొందనున్నట్లు, కొనుగోలు ఒప్పందం(ఎస్‌పీఏ) కుదిరినట్లు తెలియజేసింది. అయితే వాటా విలువను వెల్లడించలేదు. ఈ లావాదేవీ తదుపరి రెనో నిస్సాన్ జేవీలో రెనో గ్రూప్ వాటా 100 శాతానికి చేరనుంది. చెన్నైలోగల ప్లాంటు ద్వారా రెనో, నిస్సాన్ బ్రాండ్ల వాహనాలను జేవీ రూపొందిస్తోంది. ఈ ప్లాంటు 6,300 ఉద్యోగులతో వార్షికంగా 4.8 లక్షల యూనిట్ల తయారీ సామర్థ్యాన్ని కలిగి ఉంది. ప్రస్తుతం సీఎంఎఫ్ఏ, సీఎంఎఫ్ఏ ప్లస్ ప్లాట్‌ఫామ్‌లపై కైగర్, ట్రైబర్, క్విడ్ వాహనాలను తయారు చేస్తున్నట్లు రెనో గ్రూప్ సీఎఫ్‌వో డంకన్ మింటో పేర్కొన్నారు.

భవిత
స్పర్ధయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్టీపీసీలో 182 ఇంజనీర్ పోస్టులు

ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్, న్యూఢిల్లీలో ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 182.
» **పోస్టుల వివరాలు:** ఇంజనీర్(ఆర్ఈ-సివిల్)-40, ఇంజనీర్-80, ఇంజనీర్ (ఆర్ఈ-మెకానికల్)-15, ఎగ్జిక్యూటివ్(ఆర్ఈ-హ్యూమన్ రిసోర్స్)-07, ఎగ్జిక్యూటివ్(ఆర్ఈ-ఫైనాన్స్)-26, ఇంజనీర్(ఆర్ఈ-ఐటీ)-04, ఇంజనీర్(ఆర్ఈ-కాంట్రాక్ట్-మెటీరియల్)-10.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్(సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్, ఐటీ), ఎంఈ, డిగ్రీ, సీఏ, సీఎంఏ, పీజీడీఎం, ఎంబీఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. -వయసు: 30 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** సంవత్సరానికి రూ.11,00,000.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 11.04.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**01.05.2025
» **వెబ్‌సైట్:** https://ngel.in/career

బ్యాంక్ ఆఫ్ బరోడాలో 146 పోస్టులు

బ్యాంక్ ఆఫ్ బరోడాలో ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » **మొత్తం పోస్టుల సంఖ్య:** 146.
» **పోస్టుల వివరాలు:** డిప్యూటీ డిఫెన్స్ బ్యాంకింగ్ అడ్వైజర్(డీడీబీఏ)-01, ప్రైవేట్ బ్యాంకర్-రేడియన్స్ ప్రైవేట్-03, గ్రూప్ హెడ్-04, టెరిటోరి హెడ్-17, సీనియర్ రిలేషన్‌షిప్ మేనేజర్-101, వెల్త్ స్ట్రాటజిస్ట్(ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఇన్సూరెన్స్)-18,ప్రొడక్ట్ హెడ్-ప్రైవేట్ బ్యాంకింగ్-01, పోర్ట్‌ఫోలియో రీసెర్చ్ అనలిస్ట్-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ,పీజీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. » **వయసు:** డిప్యూటీ డిఫెన్స్ బ్యాంకింగ్ అడ్వైజర్ పోస్టుకు 57 ఏళ్లు, ప్రైవేట్ బ్యాంకర్‌కు 33 నుంచి 50 ఏళ్లు, గ్రూప్ హెడ్‌కు 31 నుంచి 45 ఏళ్లు, టెరిటోరి హెడ్‌కు 27 నుంచి 40ఏళ్లు, సీనియర్ రిలేషన్‌షిప్ మేనేజర్, వెల్త్ స్ట్రాటజిస్ట్(ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఇన్సూరెన్స్), ప్రొడక్ట్ హెడ్‌కు 24 నుంచి 45 ఏళ్లు, పోర్ట్‌ఫోలియో రీసెర్చ్ అనలిస్ట్‌కు 22 నుంచి 35 ఏళ్లు.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.04.2025
» **వెబ్‌సైట్:** www.bankofbaroda.in

నెగ్రిమ్స్, షిల్లాంగ్‌లో 130 గ్రూప్ బి, గ్రూప్ సి పోస్టులు

షిల్లాంగ్‌లోని నార్త్ ఈస్టర్న్ ఇందిరా గాంధీ రీజనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ మెడికల్ సైన్సెస్(నెగ్రిమ్స్).. వివిధ విభాగాల్లో గ్రూప్ బి, గ్రూప్ సి పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 130.
» **పోస్టుల వివరాలు:** నర్సింగ్ ఆఫీసర్-105, స్టోర్ కీపర్-03, రేడియోగ్రాఫర్-03, మెడికల్ సోషల్ వర్కర్-01, టెక్నీషియన్(ఎండోస్కోపీ/కొలనోస్కోపీ)-02, టెక్నీషియన్(న్యూక్లియర్ మెడిసిన్)-04, హెల్త్ ఇన్‌స్పెక్టర్-01, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్-01, జూనియర్ ఇంజనీర్(ఎలక్ట్రికల్)-01, ఫార్మసిస్ట్-01, టెక్నికల్ అసిస్టెంట్-01, ఈసీజీ టెక్నీషియన్-01, శానిటరీ ఇన్‌స్పెక్టర్-02, సెక్యూరిటీ గార్డ్-01, రికార్డ్ క్లర్క్-01, డ్రైవర్ గ్రేడ్3-01, డార్క్ రూమ్ అసిస్టెంట్-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, బీఏ, బీఎస్సీ, బీటెక్, డిప్లొమా, ఇంటర్, పదో తరగతి, జీఎన్ఎం, ఎంఏ, ఎంఎస్సీ, ఎంఎస్‌డబ్ల్యూ, డీ ఫార్మసీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. » **వయసు:** 27 నుంచి 35 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.04.2025
» **వెబ్‌సైట్:** https://neigrihms.gov.in

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ పదో తరగతికి సంబంధించిన స్టడీ మెటీరియల్, సిలబస్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, టెక్స్ట్ బుక్స్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్ మొదలైన వాటి కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీకు కావాల్సిన సమాచారం తెలుసుకోండి.

గ్రూప్ 1 మెయిన్స్‌లో మెరవాలంటే

» మే 3 నుంచి ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు
» మెయిన్స్‌కు అర్హత సాధించిన 4,496 మంది అభ్యర్థులు
» విశ్లేషణ, సమకాలీన పరిజ్ఞానంపై పట్టుతో విజయం


ఏపీపీఎస్సీ.. గ్రూప్-1

ఏపీపీఎస్సీ గ్రూప్-1.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయిలో అత్యున్నత పోటీ పరీక్ష! ఈ ఎంపిక ప్రక్రియలో విజయంతో డిప్యూటీ కలెక్టర్, డీఎస్పీ, సీటీఓ తదితర ఉన్నత పోస్ట్‌ల్లో కొలువుదీరొచ్చు. మూడంచెల ఈ ఎంపిక ప్రక్రియలో కీలకమైన రెండో దశ మెయిన్‌లో మెరిసి తుది దశ ఇంటర్వ్యూకు ఎంపికవ్వాలంటే.. ఎంతో కసరత్తు చేయాల్సి ఉంటుంది. తాజాగా ఏపీపీఎస్సీ.. గ్రూప్-1,2023 నోటిఫికేషన్‌కు సంబంధించి మెయిన్స్ పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేసింది. మే 3 నుంచి పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపింది. ఈ నేపథ్యంలో.. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమయంలో.. మెయిన్స్ పరీక్షలో రాణించేందుకు మార్గాలపై ప్రత్యేక కథనం..

- **89:** ఏపీపీఎస్సీ గ్రూప్-1 పోస్టుల సంఖ్య.
- **4,496:** తొలిదశ ప్రిలిమ్స్‌లో విజయం సాధించి మెయిన్స్‌కు ఎంపికైన వారి సంఖ్య.
- **మే3:** గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల ప్రారంభ తేదీ.

ఇప్పుడు వీరంతా మెయిన్స్‌లో ప్రతిభ చూపి ఇంటర్వ్యూకు ఎంపికవ్వాలంటే.. ఇప్పటి నుంచే వ్యూహాత్మకంగా ప్రిపరేషన్ సాగించాలి.

అయిదు పేపర్లలో స్కోరే కీలకం

గ్రూప్-1 మెయిన్స్ ఎగ్జామినేషన్ మొత్తం ఏడు పేపర్లుగా ఉంటుంది. ఇందులో తొలి రెండు పేపర్లు (తెలుగు లాంగ్వేజ్, ఇంగ్లిష్ లాంగ్వేజ్) అర్హత పరీక్షలు. వీటిలో అభ్యర్థులు కనీస అర్హత మార్కులు సాధిస్తేనే.. పేపర్-1 నుంచి పేపర్-5 వరకు మూల్యాంకన చేస్తారు. లాంగ్వేజ్ పేపర్లలో ఓసీ అభ్యర్థులు కనీసం 40 శాతం మార్కులు, రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు కనీసం 35 శాతం మార్కులు సాధించాలి.

పేపర్-1 జనరల్ ఎస్సే

ఈ పేపర్‌లో మూడు వ్యాసాలు రాయాల్సి ఉంటుంది. ఇందుకోసం అభ్యర్థులు సమకాలీన అంశాలపై పూర్తి స్థాయి అవగాహన, విశ్లేషణ, స్వీయ అభిప్రాయ దృక్పథం పెంచుకోవాలి. నిర్దిష్ట సమయంలో ఒక ప్రశ్నకు సంబంధించి అన్ని అంశాలూ ఎస్సేలో పొందుపరిచేలా ప్రాక్టీస్ చేయాలి. ముఖ్యమైన అంశాలకు సంబంధించి సినాప్సిస్, నేపథ్యం, ప్రభావం, ఫలితం, పర్యవసానాలు.. ఇలా అన్ని కోణాల్లో ప్రజెంట్ చేయగలగాలి. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు, ఆర్థిక విధానాలు, అదేవిధంగా జాతీయ, అంతర్జాతీయ పరిణామాలపై విశ్లేషణాత్మక దృక్పథం పెంచుకోవాలి. జాతీయ స్థాయిలో వన్ నేషన్-వన్ ఎలక్షన్, మహిళా రిజర్వేషన్ వంటి బిల్లులు, రాజ్యాంగ సవరణలు, నూతన జాతీయ విద్యా విధానం, సుప్రీంకోర్టు కీలకమైన తీర్పుల గురించి పూర్తి అవగాహన పెంచుకోవాలి.

పేపర్-2(చరిత్ర, సంస్కృతి, భౌగోళిక శాస్త్రం)

దేశ, రాష్ట్ర చరిత్ర, సంస్కృతికి సంబంధించిన అంశాలపై పట్టు సాధించాలి. ప్రాచీన చరిత్ర మొదలు ఆధునిక చరిత్ర వరకు ముఖ్యమైన అంశాలపై దృష్టి సారించాలి. జాతీయోద్యమంలో ఆంధ్రదేశ పాత్ర గురించి అవగాహన పెంచుకోవాలి. జాగ్రఫీకి సంబంధించి రాష్ట్రంలోని భౌగోళిక వనరులు, అడవులు, జీవ సంపద, వ్యవసాయ వనరుల గురించి తెలుసుకోవాలి. వీటిని తాజా పరిస్థితులతో అన్వయం చేసుకోవాలి. అదే విధంగా గత ఏడాది కాలంలో చేపట్టిన వ్యవసాయ పథకాలు, నీటి పారుదల ప్రాజెక్ట్‌లు, వాటి ద్వారా లబ్ధి చేకూరే ప్రాంతాలు వంటి వాటిపై దృష్టి పెట్టాలి.

పేపర్-3 (పాలిటీ, రాజ్యాంగం, పాలన, లా, ఎథిక్స్)

ఈ పేపర్‌లో రాణించాలంటే.. రాజనీతి శాస్త్రం, రాజ్యాంగానికి సంబంధించి ప్రాథమిక భావనలు మొదలు తాజా పరిణామాలు వరకూ.. అన్నింటిని గురించి తెలుసుకోవాలి. గవర్నెన్స్, లా, ఎథిక్స్‌కు సంబంధించి సుపరిపాలన దిశగా చేపడుతున్న చర్యలు, పబ్లిక్ సర్వీస్‌లో పాటించాల్సిన విలువలు, చూపించాల్సిన నిబద్ధత, అంకితభావం వంటి విషయాలపై అవగాహన పెంచుకోవాలి. న్యాయపరమైన అంశాలపైనా పట్టు సాధించాలి. ప్రాథమిక హక్కులు, విధులు, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంబంధాలు, వీటికి సంబంధించి న్యాయ వ్యవస్థకున్న అధికారాల గురించి తెలుసుకోవాలి. అదే విధంగా, సివిల్, క్రిమినల్ లా, కార్మిక చట్టాలు, సైబర్ చట్టాలు, ట్యాక్స్ లాస్‌పై అవగాహన పెంచుకోవాలి.

పేపర్-4 (ఎకానమీ, భారత దేశ, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి)

ఎకానమీకి సంబంధించి మౌలిక భావనలు మొదలు తాజా వృద్ధి రేట్ల వరకూ.. గణాంక సహిత సమాచారం సేకరించుకుని పరీక్షకు సన్నద్ధం కావాలి. ఇటీవల కాలంలో చేపట్టిన ప్రధాన ఆర్థిక సంస్కరణలు, వాటి ద్వారా లబ్ధి చేకూరే వర్గాలు, అదే విధంగా జాతీయ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చేలా తీసుకొచ్చిన విధానాలపై పట్టు సాధించాలి. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లు, ఎకనామిక్ సర్వేలపై అవగాహన పొందాలి.

పేపర్-5 (సైన్స్ అండ్ టెక్నాలజీ)

ఈ పేపర్‌కు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్థాయిలో శాస్త్ర సాంకేతిక రంగాల్లో అమలవుతున్న కొత్త విధానాలు, ప్రధాన సంస్థలు, రాష్ట్ర స్థాయిలో ఐసీటీ విధానాలు, ఇండియన్ స్పేస్ ప్రోగ్రామ్, డీఆర్‌డీఓ, ఇంధన వనరులు, విపత్తు నిర్వహణకు అనుసరిస్తున్న సాంకేతిక విధానాలు తదితర అంశాలపై పట్టు సాధించాలి. పర్యావరణ సంబంధిత అంశాలపైనా దృష్టి సారించాలి. అంతర్జాతీయ పర్యావరణ ఒప్పందాలు, పర్యావరణ పరిరక్షణకు సంబంధించి జాతీయ, రాష్ట్ర స్థాయిలో అమలు చేస్తున్న చట్టాలు, విధానాలపై అవగాహన పొందాలి. తాజాగా దేశ రక్షణ వ్యవస్థలో చేరిన రఫేల్ యుద్ధ విమానాలు, డీఆర్‌డీఓ ప్రయోగించిన క్షిపణులు, వాటి సామర్థ్యం వంటి విషయాలపైనా పట్టు సాధించాలి.

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంపై ప్రత్యేక దృష్టి

ప్రస్తుతం గ్రూప్-1 మెయిన్స్‌కు హాజరవుతున్న అభ్యర్థులు ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014పై ప్రత్యేక దృష్టిపెట్టాలి. జనరల్ ఎస్సే, ఎకానమీ, హిస్టరీ పేపర్లు అన్నింటిలోనూ సిలబస్‌ను పరిశీలిస్తే.. ఈ చట్టం నుంచి ప్రశ్నలు అడిగే అవకాశం ఉన్నట్లు అర్థమవుతోంది. విభజన తర్వాత ఎదురవుతున్న సవాళ్లు, సమస్యలు, వాటి పరిష్కారానికి ప్రభుత్వం చేపడుతున్న చర్యల గురించి తెలుసుకోవాలి.

పునశ్చరణకే అధిక ప్రాధాన్యం

ప్రస్తుత సమయంలో అభ్యర్థులు పునశ్చరణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. కొత్త అంశాల జోలికి వెళ్లకుండా.. ఇప్పటికే పట్టు సాధించిన వాటిపై మరింత అవగాహన పెంచుకోవాలి. పేపర్ వారీగా రోజు వారీ ప్రణాళిక రూపొందించుకోవాలి. పరీక్ష తేదీని పరిగణనలోకి తీసుకుంటే 30 రోజుల వ్యవధి అందుబాటులో ఉంది. ఈ సమయంలో అభ్యర్థులు ప్రతి రోజు అన్ని పేపర్లను చదివే విధంగా ప్రణాళిక రూపొందించుకోవాలి. ప్రతి పేపర్‌కు సగటున రెండున్నర గంటల సమయం కేటాయించేలా చూసుకోవాలి. తమకు క్లిష్టంగా భావించే పేపర్లకు కొంత అధిక సమయం కేటాయించాలి.

రైటింగ్ ప్రాక్టీస్

అభ్యర్థులు ప్రస్తుత సమయంలో రైటింగ్ ప్రాక్టీస్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. పరీక్ష హాల్లో ప్రతి ప్రశ్నకు సగటున లభించే సమయాన్ని పరిగణనలోకి తీసుకుంటూ సమాధానాలు రాయడం ప్రాక్టీస్ చేయాలి. ఆ తర్వాత వాటిని మూల్యాంకన చేసుకుని అన్ని పాయింట్లు రాశామా? లేదా? అని విశ్లేషించుకోవాలి.

భావ వ్యక్తీకరణ

మెయిన్స్ ప్రిపరేషన్ కోణంలో భావ వ్యక్తీకరణ సామర్థ్యాన్ని పెంచుకోవాలి. సంబంధిత అంశంపై సూటిగా, స్పష్టంగా సమాధానం ఇచ్చే నేర్పు ఎంతో అవసరం. అభ్యర్థులు నమూనా ప్రశ్నలను సాధన చేయాలి. అదే విధంగా సమాధానాలు ఇచ్చేటప్పుడు ముఖ్యమైన అంశాలు హైలెట్ అయ్యేలా చూసుకోవాలి. దీంతోపాటు ప్రశ్నను ఏ దృక్పథంలో అడిగారో గ్రహించి.. దానికి అనుగుణంగా సమాధానం రాసేందుకు సిద్ధం కావాలి.

75 మార్కులకు ఇంటర్వ్యూ

మొత్తం 750 మార్కులకు నిర్వహించే మెయిన్ ఎగ్జామినేషన్‌లో సాధించిన మార్కుల ఆధారంగా 1:2 నిష్పత్తిలో(ఒక్కో పోస్ట్‌కు ఇద్దరు అభ్యర్థులు చొప్పున) ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. ఇంటర్వ్యూకు 75 మార్కులు కేటాయించారు. ఇంటర్వ్యూ, మెయిన్ మార్కులను క్రోడీకరించి.. తుది విజేతల జాబితా రూపొందిస్తారు.

ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్.. టైమ్ టేబుల్

తేదీ	పేపర్	మార్కులు
మే 3	తెలుగు లాంగ్వేజ్ పేపర్	150
మే 4	ఇంగ్లిష్	150
మే 5	పేపర్-1(జనరల్ ఎస్సే)	150
మే 6	పేపర్-2 (ఇండియా, ఏపీ చరిత్ర, జాగ్రఫీ)	150
మే 7	పేపర్-3 (రాజ్యాంగం, పాలిటీ, గవర్నెన్స్ లా, ఎథిక్స్)	150
మే 8	పేపర్-4 (భారత్, ఏపీ ఎకానమీ, డెవలప్‌మెంట్)	150
మే 9	పేపర్-5 (ఎస్ అండ్ టీ, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్)	150

మెయిన్ ఎగ్జామినేషన్ మార్కులు	750 మార్కులు
ఇంటర్వ్యూ	75 మార్కులు
మొత్తం	825 మార్కులు

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- ఇండియన్ హిస్టరీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం-మెంటల్ ఎబిలిటీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-జనరల్ స్టడీస్-తెలంగాణ హిస్టరీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం-రీజనింగ్

గోడు చెప్పుకోలేక.. వినేవారులేక!

- అలహాబాద్ ట్రిపుల్ ఐటీలో నిజామాబాద్‌కు చెందిన మూగ, బధిర విద్యార్థి ఆత్మహత్య
- అర్ధరాత్రి భవనం ఐదో అంతస్తు నుంచి దూకి బలవన్మరణం
- 3 నెలలుగా క్లాసులకు హాజరు కావడం లేదన్న యాజమాన్యం


రాహుల్ (ఫైల్)


వర్ని/ప్రయాగ్‌రాజ్: ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్ ట్రిపుల్ ఐటీలో బీటెక్ ఫస్టియర్ చదువుతున్న రాష్ట్రానికి చెందిన ఓ మూగ, బధిర విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం అర్ధరాత్రి హాస్టల్ భవనం ఐదో అంతస్తు నుంచి దూకి ఎం. రాహుల్ చైతన్య (18) అనే యువకుడు తనువు చాలించాడు. పుట్టినరోజున తల్లికి మెసేజ్ పంపి బలవన్మరణానికి పాల్పడటం గమనార్హం. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు తెలియజేశారు. మృతుడి స్వస్థలం నిజామాబాద్ జిల్లా వర్ని మండలం సత్యనారాయణపురం గ్రామం. ఇదే కళాశాలకు చెందిన కాత్రవత్ అఖిల్ (20) అనే మరో తెలంగాణ విద్యార్థి కార్డియాక్ అరెస్ట్‌తో ఆదివారం రాత్రే మరణించడం గమనార్హం. తీవ్రంగా గాయపడిన రాహుల్‌ను సమీపంలోని ఎస్ఆర్ఎన్ హాస్పిటల్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ధూమన్‌గంజ్ ఏసీపీ అజేంద్ర యాదవ్ తెలిపారు. తమ కళాశాలలోని మూగ, బధిర విభాగంలో రాహుల్ చైతన్య బీటెక్ ఫస్టియర్‌లో చేరాడని అలహాబాద్ ట్రిపుల్ ఐటీ పీఆర్వో పంకజ్ మిశ్రా చెప్పారు. గత మూడు నెలలుగా అతను తరగతులకు హాజరుకావడం లేదని.. చదువుల సంబంధిత ఒత్తిడిని ఎదుర్కొంటున్నాడని పేర్కొన్నారు. ఈ ఒత్తిడి గురించి అతను తల్లికి కూడా తెలియజేశాడని వివరించారు. ఇద్దరు విద్యార్థుల మరణంపై అన్ని కోణాల్లో విచారణ చేపట్టేందుకు యాజమాన్యం త్రిసభ్య విచారణ కమిటీని ఏర్పాటు చేసిందన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి వైద్య సిబ్బంది నిర్లక్ష్యం



జగిత్యాల: జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుల తీరు మారడం లేదు. ఆస్పత్రికి వచ్చిన వారి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ధర్మపురి మండలం నక్కలపేట గ్రామానికి చెందిన అభిషేక్ కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో అతడిని తండ్రి 108 వాహనంలో ఆస్పత్రికి తీసుకొచ్చాడు. దారిలోనే 108 సిబ్బంది అభిషేక్‌కు సెలైన్ పెట్టారు. ఆస్పత్రి వద్ద వైద్యులు స్పందించి కుర్చీనో.. స్ట్రెచ్చరో ఏర్పాటు చేయాల్సి ఉండగా.. పట్టింపులేనితనంతో వ్యవహరించారు. కాసేపు వేచిచూసిన ఆ తండ్రి కొడుకు చేతికి ఉన్న సెలైన్ పట్టుకుని ఆస్పత్రిలోకి వెళ్లాడు. తండ్రీకొడుకును చూసిన వారు వైద్యుల తీరుపై మండిపడ్డారు.

బొర్రకు.. బుర్రకు లింకు!



మీ కడుపు చల్లగుండ.. ఎవరికైనా ఏదైనా సాయం చేసినప్పుడు ఇలా దీవించడం చూసే ఉంటారు. మీరు బాగుండాలనే ఆకాంక్ష అది. కానీ కడుపు చల్లగా ఉండటం ఏమిటి అనిపిస్తుంటుందా? నిజమే.. మన కడుపు చల్లగా, అంటే ఆరోగ్యంగా ఉంటే మనం ఆరోగ్యంగా ఉన్నట్టేనని శాస్త్రవేత్తలు ఎప్పుడో తేల్చారు. కానీ పొట్ట మన ఆలోచనలపైనా, మెదడు పనితీరుపైనా ఎఫెక్ట్ చూపుతుందని తాజాగా గుర్తించారు. ఆ లింకేమిటో, దాని ఎఫెక్ట్ ఏమిటో తెలుసుకుందామా... - సాక్షి, సెంట్రల్ డెస్క్

అదో 'మైక్రోబియం' ప్రపంచం..

మన పొట్ట లోపల అంతా మనమే కాదు... ఓ సూక్ష్మజీవ ప్రపంచమే ఉంటుంది. మన జీర్ణాశయం, పేగుల్లో వేల కోట్ల సంఖ్యలో బ్యాక్టీరియా, ఫంగస్, ఇతర సూక్ష్మజీవులు ఉంటాయి. వీటన్నింటినీ కలిపి 'మైక్రోబియం' లేదా 'మైక్రోబయాటా' అని పిలుస్తుంటారు. ఒక రకంగా చెప్పాలంటే మన శరీర కణాల సంఖ్య కంటే... ఈ సూక్ష్మజీవుల సంఖ్యే ఎక్కువగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. మన తినే ఆహారం జీర్ణంకావడంలో, జీవక్రియల్లో, రోగ నిరోధక వ్యవస్థ మెరుగ్గా ఉండటానికి ఈ మైక్రోబియం కీలకపాత్ర పోషిస్తుంది. కానీ అంతకన్నా ఓ అడుగు ముందుకేసి... మన ఆలోచనలను, భావాలను కూడా ఈ 'సూక్ష్మజీవులు' ప్రభావితం చేస్తాయని శాస్త్రవేత్తలు తేల్చారు.

డైరెక్ట్‌గా సిగ్నల్ ఇవ్వడమే..



పొట్టలోని 'మైక్రోబియం'కు, మన మెదడుకు డైరెక్ట్ లింకు ఉందని ఇటీవలి పరిశోధనల్లో శాస్త్రవేత్తలు గుర్తించారు. మైక్రోబియం ఇచ్చే సిగ్నల్స్‌ను బట్టి మెదడు పనితీరు ఉంటుందని తేల్చారు. మన మూడ్, జ్ఞాపకశక్తితోపాటు డిప్రెషన్, యాంగ్జైటీ వంటి మానసిక సమస్యలు కూడా మైక్రోబియం సిగ్నల్స్‌ను బట్టి హెచ్చు తగ్గులకు లోనవుతాయని గుర్తించారు.

పరిశోధనకు 'బుల్లెట్' దిగింది!

1822లో అలెక్సిస్ సెయింట్ మార్టిన్ అనే సైనికుడి పొట్టలోకి తూటా దూసుకెళ్లింది. ఆయనకు విలియం బ్యూమెంట్ అనే ఆర్మీ వైద్యుడు చికిత్స చేశాడు. ఆ సమయంలోనే జీర్ణవ్యవస్థ పనితీరుపై పరిశోధన చేశారు. మన ఎమోషన్ల వల్ల పొట్టపై ఎలాంటి ప్రభావం పడుతుంది? పొట్ట మన మెదడును ఎలా ప్రభావితం చేస్తుందనే అంశాలను అర్థం చేసుకోవడానికి మార్గం వేసింది.

మెదడుకు, పొట్టకు మధ్య 'సూపర్ హైవే'..

మన పొట్టకు, మెదడుకు మధ్య వేగస్ నాడి 'సూపర్ హైవే'గా పనిచేస్తుందట. అక్కడ బాగోలేకుంటే ఇక్కడికి, ఇక్కడ బాగో లేకుంటే అక్కడికి... సిగ్నల్స్ వెళ్లి, రెండింటి పనితీరుపై ఎఫెక్ట్ కనిపిస్తుందని శాస్త్రవేత్తలు తేల్చారు. అందుకే మానసిక సమస్యలతో బాధపడు తున్నవారు పొట్ట సమస్యలతో, పొట్టలో సమస్యలున్నవారు మానసిక సమస్యలతో ఇబ్బందిపడతారని గుర్తించారు.

- ఇక లాక్టోబాసిల్లస్ రామ్నసస్ వంటి బ్యాక్టీరియాలు మనలో ఉత్సాహాన్ని కలిగిస్తాయని ఎలుకలపై చేసిన ప్రయోగాల్లో శాస్త్రవేత్తలు గుర్తించారు కూడా.
- మరోవైపు పొట్టలో ఉండే బ్యాక్టీరియా మన శరీరంలో సెరటోనిన్, డోపమైన్, జీఏబీఏ వంటి హార్మోన్ల ఉత్పత్తిపై ప్రభావం చూపుతున్నట్టు తేల్చారు. ఇవన్నీ కూడా మన మూడ్‌ను, ఏకాగ్రతను ప్రభావితం చేసే హార్మోన్లే కావడం గమనార్హం.
- మనలో మానసిక ఆరోగ్య సమస్యలకు కారణమయ్యే ఇన్‌ఫ్లమేషన్‌ను కొన్ని సూక్ష్మజీవులు తగ్గిస్తాయని కూడా శాస్త్రవేత్తలు గుర్తించారు.
- మనం తినే ఆహారంలోని ఫైబర్‌ను జీర్ణం చేసే బ్యాక్టీరియా.. బ్యూటైరేట్‌గా పిలిచే షార్ట్ చైన్ ఫ్యాటీ యాసిడ్స్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఈ రసాయన సమ్మేళనాలు మన మెదడు పనితీరును అద్భుతంగా మెరుగుపరుస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

గుండె, కిడ్నీలకు మాత్రం దెబ్బపడేలా..

పొట్టలో ఉండే బ్యాక్టీరియాతో మాంసాహారులకు ఓ సమస్య కూడా ఉందని శాస్త్రవేత్తలు తేల్చారు. ముఖ్యంగా మటన్ వంటి రెడ్‌మీట్ తీసుకున్నప్పుడు 'టిమావో (టీఎంఏఓ)'గా పిలిచే రసాయన సమ్మేళనాన్ని బ్యాక్టీరియా ఉత్పత్తి చేస్తుందని... ఈ రసాయన సమ్మేళనం రక్తనాళాల్లో కొలెస్ట్రాల్ పేరుకుపోయి, గుండె జబ్బులకు, కిడ్నీ సమస్యలకు దారితీస్తుందని గుర్తించారు. అయితే ఆలివ్, గ్రేప్‌సీడ్ ఆయిల్ వంటివి ఆహారంలో చేర్చుకుంటే 'టిమావో' ఉత్పత్తి తగ్గుతోందని కూడా గుర్తించారు.

తేడా వస్తే ఊబకాయమే..!

జీర్ణవ్యవస్థలోని మైక్రోబియంలో బ్యాలెన్స్ దెబ్బతిన్నప్పుడు.. మెదడుకు, దాని నుంచి పిట్యూటరీ గ్రంధికి తప్పుడు సిగ్నల్స్ వెళతాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దీనితో ఆకలిని నియంత్రించే హార్మోన్లలో తేడాలు వచ్చి.. అతిగా తినడం, ఊబకాయం బారినపడటం వంటి సమస్యలు వస్తున్నాయని గుర్తించినట్టు వివరిస్తున్నారు.

'మైక్రోబియం' సమస్యలకు కారణమేంటి?

సరైన ఆహారం తీసుకోకపోవడం, ఆల్కాహాల్ అలవాటు, యాంటీ బయాటిక్స్ అతిగా వాడటం, శరీరంలో రోగనిరోధక శక్తి తగ్గిపోవడం, మానసిక ఒత్తిళ్లు, యాంగ్జైటీ వంటి సమస్యలు.. పొట్టలోని 'మైక్రోబియం'లో బ్యాలెన్స్‌ను దెబ్బతీస్తాయి. మంచి బ్యాక్టీరియా తగ్గిపోయి.. చెడు బ్యాక్టీరియా పెరిగిపోతుంది. ఎన్నో సమస్యలు మొదలవుతాయి.

ఇది 'సెట్' అయ్యేదెట్లా?

అన్ని పోషకాలు, ఫైబర్ ఉండే సమతుల ఆహారం తీసుకోవడం మొదటి అడుగు. మానసిక ఒత్తిళ్లు, నిద్రలేమి వంటివి జీర్ణవ్యవస్థ పనితీరును దెబ్బతీసి 'మైక్రోబియం' బ్యాలెన్స్‌ను మార్చేస్తాయి. అందువల్ల వీటిని నియంత్రించుకోవాలి. పెరుగు, ఫెర్మెంటెడ్ పదార్థాలు వంటి ప్రొబయాటిక్ ఆహారం... అరటి, అల్లం, ఉల్లి వంటి పీచు (ఫైబర్) ఎక్కువగా ఉండే ప్రీబయాటిక్ ఆహారం తీసుకుంటే మైక్రోబియం 'సెట్' అవుతుందని.. పరోక్షంగా మెదడు ఆరోగ్యానికీ తోడ్పడుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ఇప్పటికైనా మెదడు మన మాట వినకుంటే.. పొట్టతో 'సిగ్నల్' ఇప్పించే ప్రయత్నం చేయండి మరి.

ఔటర్‌పై పెరిగిన టోల్ చార్జీలు

ఏటా కొనసాగే పెంపులో భాగమే: ఐఆర్‌బీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌వే

సాక్షి, హైదరాబాద్: ఔటర్ రింగ్‌రోడ్డు టోల్‌చార్జీలు పెరిగాయి. సోమవారం అర్ధరాత్రి నుంచే కొత్త చార్జీలు అమల్లోకి వచ్చాయి. ఏటా కొనసాగే టోల్ చార్జీల పెంపులో భాగంగానే చార్జీలను పెంచినట్లు ఓఆర్ఆర్ నిర్వహణ సంస్థ ఐఆర్‌బీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌వే తెలిపింది. భారీ వాహనాలపై కిలోమీటర్‌కు రూ. 15.09 నుంచి రూ. 15.78 వరకు చార్జీలు పెరగ్గా, మినీబస్సులు, తేలికపాటి వస్తు రవాణా వాహనాలపై రూ. 3.77 నుంచి రూ. 3.94 వరకు చార్జీలు పెరిగాయి. కార్లు, జీపుల వంటి తేలికపాటి వాహనాలపై కిలోమీటర్‌కు 10 పైసల చొప్పున చార్జీలు పెరిగాయి. ఈ మేరకు ఈ వాహనాలపైన రూ. 2.34 నుంచి 2.44 చొప్పున చార్జీ పెరిగింది. అలాగే బస్సులు, వాణిజ్యవాహనాలు (3 యాక్సిల్), ట్రక్కులు, తదితర వాహనాలపై కిలోమీటర్‌కు రూ.6.69 నుంచి రూ.7 చొప్పున చార్జీలను పెంచారు. నిర్మాణరంగానికి చెందిన వాహనాలపైన రూ. 12.96 చొప్పున టోల్‌చార్జీలను పెంచారు. 158 కి.మీ. ఔటర్ రింగ్‌రోడ్డుపై మొత్తం 21 ఇంటర్‌ఛేంజ్‌ల నుంచి నిత్యం సుమారు 1.5 లక్షల వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. గత ప్రభుత్వం ఔటర్ రింగ్‌రోడ్డును లీజుకు ఇవ్వడం తెలిసిందే.

పెరిగిన చార్జీలు ఇలా..

- శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి గచ్చిబౌలి వరకు 43 కి.మీ. దూరానికి కార్లు, ఇతర తేలిక వాహనాలపై కిలోమీటర్‌కు పెరిగిన చార్జీల మేరకు రూ. 104.92 చెల్లించాల్సి ఉంటుంది. భారీ వాహనాలు ఎయిర్‌పోర్టు నుంచి గచ్చిబౌలి వరకు 678.54 చార్జీలు చెల్లించాలి.
- పటాన్‌చెరు నుంచి కండ్లకోయ ఇంటర్‌ఛేంజ్ వరకు 36 కి.మీ. దూరానికి కార్లు, జీపులు, ఇతర తేలికపాటి వాహనాలు రూ. 87.84 చొప్పున చెల్లించాలి. అదే భారీ వాహనాలైతే రూ. 568.08 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది.
- మేడ్చల్ నుంచి ఘట్‌కేసర్ వరకు 32.6 కి.మీ. దూరానికి పెరిగిన టోల్ చార్జీల మేరకు తేలికపాటి వాహనాలు రూ. 79.54 చెల్లించాలి. భారీ వాహనాలు మాత్రం రూ. 514.42 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది.

ధర్మ దర్శనానికి 4 గంటలు



యాదగిరి క్షేత్రంలో భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట: వరుస సెలవులు రావడంతో యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు భక్తులు తరలివస్తున్నారు. ఆదివారం ఉగాది, సోమవారం రంజాన్ కావడంతో శ్రీస్వామి క్షేత్రానికి భక్తుల రద్దీ పెరిగింది. భక్తులు అధికంగా శ్రీస్వామి వారి చెంతకు రావడంతో ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల, బస్టాండ్, లక్ష్మీపుష్కరిణి, కల్యాణకట్ట ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. సోమవారం శ్రీస్వామి వారి ధర్మ దర్శనానికి 4 గంటల సమయం, వీఐపీ దర్శనానికి గంటన్నర సమయం పట్టింది. 45 వేలకు పైగా భక్తులు స్వామివారిని దర్శించుకొన్నారు. పలు పూజల ద్వారా నిత్యాదాయం రూ.66,44,697 వచ్చినట్లు ఆలయాధికారులు పేర్కొన్నారు.

వెల్ డాన్



కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడికి కరాటేలో బ్లాక్ బెల్ట్ 7వ డాన్ ప్రదానం

రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు మార్షల్ ఆర్ట్స్ పరీక్షలో నెగ్గారు. ఇదేంటి... రాజకీయ నాయకుడు, అందునా అధికార పార్టీకి రాష్ట్ర సారథి అయిన వ్యక్తి మార్షల్ ఆర్ట్స్ పరీక్షలో నెగ్గడమేంటని అనుకుంటున్నారా? పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు మార్షల్ ఆర్ట్స్ అంటే మక్కువ. కరాటేలో బ్లాక్‌బెల్ట్ 6వ డాన్ ఇప్పటికే సాధించిన ఆయన సోమవారం 7వ డాన్ బెల్ట్ కోసం పరీక్షలో పాల్గొన్నారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని వైడబ్ల్యూసీఏలో దాదాపు మూడు గంటలపాటు జరిగిన ఈ పోటీల్లో నెగ్గిన ఆయన గ్రాండ్‌మాస్టర్ ఎస్.శ్రీనివాసన్ నుంచి సర్టిఫికెట్ అందుకున్నారు. ఈ సందర్భంగా మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ, మార్షల్ ఆర్ట్స్ తన జీవితంలో భాగమని చెప్పారు. మార్షల్ ఆర్ట్స్‌లో ప్రవేశం ఉండటం మంచిదని, ముఖ్యంగా బాలికలకు కరాటే శిక్షణ అవసరమని అన్నారు. యువత చెడు వ్యసనాల బారిన పడకుండా కరాటే లాంటి క్రీడలను అలవర్చుకోవాలని సూచించారు. బ్లాక్‌బెల్ట్ 7వ డాన్ సర్టిఫికెట్ తీసుకోవడం సంతోషంగా ఉందని మహేశ్‌గౌడ్ వ్యాఖ్యానించారు.

సాక్షి, హైదరాబాద్



సెంచరీ బనానా సెలబ్రేషన్

వందేళ్లు నిండిన తల్లిని గౌరవించుకున్న కుమారులు

నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండలంలోని గొర్లోనిబాయి గ్రామంలో అరుదైన ఘట్టం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన జంబుల లచ్చమ్మకు సోమవారంతో 100 సంవత్సరాలు నిండాయి. ఈ క్రమంలో ఉగాది పండుగ సందర్భంగా ఐదుగురు కుమారులు బాలకృష్ణయ్య, రాములు, వెంకటయ్య, భీమన్న, సుఖ్‌దేవ్‌తోపాటు పుట్టింటికి వచ్చిన ఆమె ముగ్గురు కుమార్తెలు, మనవళ్లు, మునిమనవళ్లు అరటిపండ్లతో తులాభారం నిర్వహించారు. తల్లిదండ్రులను భారంగా చూసే ఈ రోజుల్లో అమ్మకు వందేళ్ల పండుగ నిర్వహించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కాగా ఈమె వంశాంకురంగా 65 మంది ఉండటం విశేషం.

కొత్తపల్లి

23 గజాలు రెండు అంతస్తుల భవనం



నానమ్మ కోసం ఇల్లు నిర్మించిన మనవడు

సొంత ఇంటి కల నెరవేరాలంటే.. అందుకు తగిన స్థలం ఉండాలి. కనీసం 100 గజాల జాగా లేకపోతే సౌకర్యవంతమైన ఇల్లు కట్టలేం. కానీ ఓ వ్యక్తి 23 గజాల స్థలంలోనే రెండతస్తుల ఇల్లు నిర్మించి అందరినీ ఆశ్చర్యపరిచారు. వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండ జిల్లా పరకాల పట్టణంలోని 22వ వార్డుకు చెందిన ఫార్మసీ ఉద్యోగి కాపర్తి రాజు తల్లి భారతమ్మ పెంకుటింట్లో నివాసం ఉండేది. కాగా రాజు కుమారుడు దత్తు అదే స్థలంలో తన నానమ్మ కోసం సొంత ప్లాన్‌తో రూ.7 లక్షలు ఖర్చు పెట్టి, 23 గజాల స్థలంలోనే రెండు అంతస్తుల ఇల్లు నిర్మించాడు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో పార్కింగ్, స్టోర్ రూం, మొదటి అంతస్తులో వంటగది, డైనింగ్ హాల్, రెండో అంతస్తులో అటాచ్డ్ బాత్‌రూంతో బెడ్‌రూమ్ నిర్మాణం చేసి స్థానికులనే కాక ఇంజనీర్లను సైతం ఆశ్చర్యపడేలా చేశాడు.

పరకాల

'హీ ఈజ్ మై మండే మోటివేషన్'

- రాష్ట్ర ఐఏఎస్ అధికారి కృష్ణభాస్కర్‌పై 'ఎక్స్'లో దిగ్గజ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా ప్రశంసలు
- రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌గా పనిచేసినప్పుడు భూగర్భ జలమట్టాలను 6 మీటర్లు పెంచారంటూ కితాబు



సాక్షి, న్యూఢిల్లీ: స్ఫూర్తి, ప్రేరణిచ్చే వ్యక్తులను తన 'ఎక్స్'ఖాతా ద్వారా ప్రపంచానికి పరిచయం చేసే ప్రముఖ పారిశ్రామిక దిగ్గజం ఆనంద్ మహీంద్రా.. ఈసారి తెలంగాణకు చెందిన ఓ ఐఏఎస్ అధికారి సేవలను ప్రశంసించారు. ప్రస్తుతం రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న దేవరకొండ కృష్ణ భాస్కర్ రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన కాలంలో నీటి కొరతను తీర్చేందుకు ఎన్నో చర్యలు చేపట్టారని కొనియాడారు. ఆయన చర్యల ఫలితంగా మూడేళ్లలో భూగర్భ జలాల స్థాయి ఏకంగా ఆరు మీటర్ల మేర పెరిగాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కృష్ణభాస్కర్ సాధించిన విజయాన్ని గతేడాది జూన్ 18న బెటర్ ఇండియా అనే సంస్థ తన 'ఎక్స్'ఖాతాలో పోస్ట్ చేసింది. దీన్ని ఆనంద్ మహీంద్రా సోమవారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'వ్యవసాయ రంగంపై ఆధారపడిన మనకు.. భూగర్భ జలాల స్థాయిలను పునరుద్ధరించడంలో దేశం ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి బాగా తెలుసు. అందుకే డి.కె.భాస్కర్ సాధించిన అద్భుత విజయాన్ని ఎంత ప్రశంసించినా తక్కువే. మన సమస్యలేవీ తీర్చలేనివి కావని ఆయన మనకు భరోసా ఇచ్చారు. అందుకు దృఢ సంకల్పం ఒక్కటే అవసరం. హీ ఈజ్ మై మండే మోటివేషన్'అంటూ ఆనంద్ మహీంద్రా పేర్కొన్నారు.

విజయవాడ హైవేపై తగ్గాయి.. మిగతా చోట్ల పెరిగాయి


పంతంగి వద్ద టోల్‌ప్లాజా

మొదటి పేజీ తరువాయి

టోల్ చార్జీలు 3.5% నుంచి 5% వరకు పెరిగాయి.

ఎన్‌హెచ్ 65పై వాహనదారులకు తగ్గిన భారం..

ఎన్‌హెచ్ఏఐ నిర్ణయంతో హైదరాబాద్-విజయవాడ మార్గంలోని ఎన్‌హెచ్-65పై ప్రయాణించే వాహనదారులకు టోల్ చార్జీల భారం కాస్త తగ్గింది. ఈ మార్గం మీదుగా 24 గంటల్లోపు తిరుగు ప్రయాణమయ్యే అన్ని రకాల వాహనదారులకు 25% మేర ఎన్‌హెచ్ఏఐ తగ్గింపు ఇచ్చింది. అయితే ఏపీలోని చిల్లకల్లు టోల్‌ప్లాజా వద్ద ఒకవైపు రూ. 5, రెండువైపులా 10 మాత్రమే తగ్గించింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం నుంచి ఏపీలోని కృష్ణా జిల్లా చిల్లకల్లు వరకు గల 181.5 కి.మీ. మేర ఉన్న జాతీయ రహదారిపై చౌటుప్పల్ మండలం పంతంగి, కేతేపల్లి మండలం కొర్లపహాడ్, ఏపీలోని కృష్ణా జిల్లా చిల్లకల్లు వద్ద టోల్‌ప్లాజాలు ఉన్నాయి.

ఎన్‌హెచ్ 65పై ఎందుకు తగ్గిందంటే..

ఎన్‌హెచ్-65 రోడ్డును గతంలో నాలుగు వరుసలుగా విస్తరించారు. ఆ బాధ్యతను టెండర్ ద్వారా జీఎంఆర్ సంస్థ దక్కించుకొని రూ. 1,741 కోట్లతో పనులు నిర్వహించింది. బీఓటీ పద్ధతిలో పనులు పూర్తయ్యాక 2012 నుంచి టోల్ వసూలు మొదలుపెట్టింది. సాధారణంగా రోడ్డు ప్రధాన క్యారేజ్‌వే నిడివి ఆధారంగా టోల్ నిర్ధారించే విధానం ఎన్‌హెచ్ఏఐలో అమలులో ఉంది. కానీ విజయవాడ రోడ్డుపై బైపాస్ వ్యయం కూడా కలిపి గతంలో టోల్ ధరలు నిర్ధారించారు. దీంతో ఎన్‌హెచ్ఏఐ సహా ఇతర సంస్థల అధీనంలోని రోడ్లతో పోలిస్తే వాటి ధరల్లో కొంత ఎక్కువ చార్జీలు ఖరారయ్యాయి. ఇక రోడ్డు నిర్మాణ వ్యయం తిరిగి వసూలయ్యాక టోల్ ధరల్లో సహజంగా మార్పు చేస్తారు. ఇప్పుడు ఈ రోడ్డును ఆరు వరుసలకు విస్తరించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో జీఎంఆర్‌తో ఉన్న ఒప్పందం రద్దయింది. గత 9 నెలలుగా ఒక ఏజెన్సీతో ఎన్‌హెచ్ఏఐ టోల్ వసూలు చేయిస్తోంది. కొద్ది రోజుల క్రితం ఎన్‌హెచ్ఏఐ ఈ జాతీయ రహదారిపై టోల్ వసూలును రీనోటిఫై చేసింది. ఇంత కాలం జీఎంఆర్ సంస్థ పేరుతో ఉన్న నోటిఫికేషన్‌ను రద్దు చేసి కొత్త నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ క్రమంలో ప్రధాన రోడ్డు నిడివి ఆధారంగా ఎన్‌హెచ్ఏఐ-2008 ఫీ రూల్స్ ప్రకారం ధరలను లెక్కగట్టింది. ఇంతకాలం ఉన్న ధరలతో పోలిస్తే ఇవి తక్కువగా ఖరారు కావడం విశేషం.

మిగతా చోట్ల..

- తెలంగాణలోని మంచిర్యాల నుంచి మహారాష్ట్రలోని చంద్రాపూర్ వెళ్లే జాతీయ రహదారి-363 నిడివి 94 కి.మీ. ఉండగా మంచిర్యాల జిల్లా మందమర్రి, ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం సరండి వద్ద టోల్‌ప్లాజాలు ఉన్నాయి. ట్రాఫిక్, రోడ్డు నిర్వహణ తదితరాలను లెక్కగట్టిన ఎన్‌హెచ్ అధికారులు ఈ మార్గంలో గతేడాదితో పోలిస్తే కనీసం రూ. 5 నుంచి రూ. 20 వరకు టోల్ చార్జీలు పెంచారు.
- వరంగల్-హైదరాబాద్ బైపాస్ రోడ్డుపై జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కోమళ్ల, దేవరుప్పుల మండలం సింగరాజుపల్లి టోల్‌ప్లాజాల్లో 5 శాతం మేర టోల్ చార్జీలు పెరిగాయి.
- హైదరాబాద్ నుంచి నాగపూర్ వెళ్లే ఎన్‌హెచ్-44పై తెలంగాణ పరిధిలోని మార్గంలో 3.5 శాతం మేర టోల్ చార్జీలు పెరిగాయి.

ఏ వాహనానికి ఎంత చార్జీ?

హైదరాబాద్-విజయవాడ హైవేపై తగ్గిన టోల్ రుసుము ఇలా..(రూ.లలో)

పంతంగి టోల్‌ప్లాజా వద్ద...	ఒక వైపు	రెండు వైపులా
కారు, జీపు, వ్యాన్, లైట్ మోటర్‌కు	80	115
మినీ బస్సు, లైట్ కమర్షియల్ వాహనాలకు	125	190
ట్రక్కు, బస్సులకు	265	395
కమర్షియల్ రవాణా వాహనాలకు	290	435
కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద...		
కారు, జీపు, వ్యాన్, లైట్ మోటర్‌కు	120	180
మినీ బస్సు, లైట్ కమర్షియల్ వాహనాలకు	195	295
ట్రక్కు, బస్సులకు	410	615
కమర్షియల్ రవాణా వాహనాలకు	450	675
చిల్లకల్లు (నందిగామ) టోల్‌ప్లాజా వద్ద...		
కారు, జీపు, వ్యాన్, లైట్ మోటర్‌కు	105	155
మినీ బస్సు, లైట్ కమర్షియల్ వాహనాలకు	165	250
ట్రక్కు, బస్సులకు	350	520
కమర్షియల్ రవాణా వాహనాలకు	380	570

వరంగల్-హైదరాబాద్ బైపాస్ రోడ్డుపై టోల్ ప్లాజాల్లో చార్జీలు..

- కారు, జీపు, వ్యాన్, లైట్ మోటార్ వాహనం ఒక వేపు రూ.125, అప్, డౌన్ రూ.190, లైట్ కమర్షియల్ వాహనం, లైట్ గూడ్స్ వాహనం, మినీ బస్సు రూ.205, అప్, డౌన్ రూ.305, బస్సు, ట్రక్కుకు ఒక వైపు రూ.425, అప్, డౌన్ రూ.635, కమర్షియల్ వాహనం ఒక వైపు రూ.465, అప్, డౌన్ రూ.695, హెచ్‌సీఎం, ఈఎంఈ వాహనం ఒకవైపు రూ.665, అప్, డౌన్ రూ.1,000, ఓవర్‌సైజ్ వాహనం ఒక వైపు రూ.810, అప్, డౌన్ రూ.1,215, నెలవారీ పాస్ ధర రూ.340 నుంచి రూ.350కి పెరిగింది.

ఎన్‌హెచ్-44పై ఇందల్వాయి టోల్‌గేట్ వద్ద ఇలా..

నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి టోల్‌ప్లాజా వద్ద కారు, జీపు, వ్యాన్ లేదా లైట్ మోటార్ వాహనాలకు సింగిల్ జర్నీకి రూ. 90గా టోల్ చార్జీ ఖరారైంది. అలాగే 24 గంటల్లోపు రిటర్న్ జర్నీకి రూ. 135, 50 సింగిల్ జర్నీలతో కూడిన మంత్లీ పాస్‌కు రూ. 3,035, టోల్‌ప్లాజాకు 20 కి.మీ. పరిధిలో ఉండి రిజిస్టర్ చేసుకున్న వాహనాలకు మంత్లీ పాస్ రూ. 350కు పెరిగాయి.

- లైట్ కమర్షియల్ వాహనాలు, లైట్ గూడ్స్ వాహనాలు, మినీ బస్‌లకు సింగిల్ జర్నీకి రూ. 145, 24 గంటల లోపు రిటర్న్ జర్నీకి రూ. 220, మంత్లీ పాస్‌కు రూ. 4905లకు పెరిగాయి.
- బస్‌లు, రెండు ఎక్సెల్ గల ట్రక్కులకు సింగిల్ జర్నీకి రూ. 310, 24 గంటల లోపు రిటర్న్ జర్నీకి రూ. 465, మంత్లీ పాస్‌కు రూ.10,280 లకు పెరిగాయి.
- హెవీ కన్‌స్ట్రక్షన్ వాహనాలు, ఎర్త్ మూవింగ్ వాహనాలు, మల్టిపుల్ ఎక్సల్ వాహనాలకు సింగిల్ జర్నీకి రూ.485, 24 గంటల లోపు రిటర్న్ జర్నీకి రూ.725, మంత్లీ పాస్‌కు రూ.16,120 లకు పెరిగాయి.
- ఏడు ఎక్సెల్‌లు కలిగి ఉన్న భారీ వాహనాలకు సింగిల్ జర్నీకి రూ. 590, 24 గంటల లోపు రిటర్న్ జర్నీకి రూ.885, మంత్లీ పాస్‌కు రూ. 19,625లకు చార్జీలు పెరిగాయి.



Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

ఒంటి కాలితో సాధించింది

- పారా త్రోబాల్ క్రీడలో రాణిస్తున్న భాగ్య
- ఒంటి కాలుతో దేశానికి బంగారు పతకం
- అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు
- దివ్యాంగులకు చేయూతనందించాలి: భాగ్య



పారా త్రోబాల్ క్రీడలో అంతర్జాతీయ స్థాయిలో రాణించిన భాగ్య


పతకంతో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన భాగ్య (ఫైల్)

గూడూరు: ప్రతిభకు పేదరికం.. అంగవైకల్యం అడ్డుకాదని నిరూపించింది ఓ యువతి. చిన్నప్పటి నుంచి ఆట, పాటలు, క్రీడలపై మక్కువ పెంచుకొని రాణిస్తోంది. దివ్యాంగురాలైనా పారా త్రోబాల్ క్రీడలో అత్యంత ప్రతిభ కనబర్చి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంది. గతేడాది కాంబోడియాలో జరిగిన అంతర్జాతీయ పారా త్రోబాల్ క్రీడలో దేశం తరఫున పాల్గొని గోల్డ్ మెడల్ సాధించింది మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలోని గొల్లగూడెంకు చెందిన దయ్యాల కొమురయ్య, కొమురమ్మ కూతురు భాగ్య.

ఒకే కాలుతో పుట్టి..

కొమురయ్య, కొమురమ్మలది పేద కుటుంబం. వారికి కొడుకు, కూతురు భాగ్య ఉన్నారు. భాగ్య ఒంటికాలుతో పుట్టింది. తల్లిదండ్రులు అల్లారు ముద్దుగా పెంచారు. ఆమెకు పాటలు పాడటం, డ్యాన్స్ చేయడమంటే చిన్నప్పటి నుంచి ఇష్టం. దీంతో డిగ్రీ పూర్తయిన తర్వాత ప్రస్తుతం హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో జానపద కళల్లో ఎంఏ చేస్తోంది. ఫోక్ ఆర్ట్స్ కోర్సులో భాగంగా డప్పు, జానపద గేయాలు, కర్రసాము, చెక్కభజన వంటి తెలంగాణ సంప్రదాయ కళలను నేర్చుకుంది. బతుకమ్మ పాటలను సేకరించి పాడటం అలవాటుగా మార్చుకుంది.

ఎల్‌బీ స్టేడియంలో ఇచ్చిన ప్రదర్శనతో...

ఇంటర్నేషనల్ డే ఆఫ్ పర్సన్స్ విత్ డిసేబిలిటీస్ అనే కార్యక్రమాన్ని పురస్కరించుకొని 2022, డిసెంబర్ 3న హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నాలుగురోజుల ముందు నుంచి ఆటలు, డ్యాన్స్ ప్రోగ్రామ్స్ జరిగాయి. భాగ్య డ్యాన్స్ చేయగా ఫొటోలు పేపర్‌లో వచ్చాయి. 'అప్పుడు నేను చదువుతున్న పొట్టిశ్రీరాములు యూనివర్సిటీ వీసీ కిషన్‌రావు సర్ నన్ను పిలిపించి మాట్లాడారు. నా కుటుంబ ఆర్థిక పరిస్థితి, పింఛన్‌తో హాస్టల్ ఫీజు కట్టుకుంటూ చదువుకుంటున్నాననే విషయం తెలుసుకొని చలించిపోయారు. వెంటనే ఎవరితో మాట్లాడారో తెలియదు కానీ జర్మనీ నుంచి డ్యాన్స్ చేయడానికి వీలుగా ఉండే ప్రోస్థటిక్ లెగ్‌ను తెప్పించి పెట్టించారు. ఆ తర్వాత ఆ కాలితో నడక ప్రాక్టీస్ చేసి డ్యాన్స్ చేశాను' అని భాగ్య వివరించింది.

రాజరాజేశ్వరుడి ఆశీర్వాద బలంతో..

మహాశివరాత్రి వేడుకలకు వేములవాడ రాజరాజేశ్వరుడి గుడిలో భాగ్య నాట్యం చేసింది. ఈక్రమంలో ఆమె నాట్యం చూసిన ఓ వ్యక్తి ఆమెకు దివ్యాంగులు ఆడే సిట్టింగ్ వాలీబాల్ గురించి తెలియజేశాడు. అయితే ఆ ఆటకు ఇక్కడ ఆదరణ లేదని, రాజస్తాన్, హరియాణా, తమిళనాడు, కర్ణాటకలో ఎంతో ప్రాముఖ్యం ఉందని తెలిపాడు. దీంతో ఆమె ఓ ప్రైవేట్ సంస్థ సహకారంతో ఆ ఆటలో శిక్షణ పొంది ఆ రాష్ట్రాల్లో జరిగిన పోటీల్లో పాల్గొని గెలిచింది. ఆ తర్వాత దేశం తరఫున థాయ్‌లాండ్‌లో జరిగే పోటీలో ఆడే అవకాశం వచ్చింది. కానీ 2019లో కరోనా కారణంగా పోటీలు రద్దయ్యాయి. అయితే ఓ పక్క ఆర్థిక ఇబ్బందులు వేధిస్తున్నప్పటికీ ఆమె క్రీడను వదిలిపెట్టలేదు. నేషనల్ పారా ఒలింపిక్ సంస్థ ఆధ్వర్యంలో 2024, సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంది. ఆ తర్వాత సెప్టెంబర్ 21 నుంచి 23 వరకు జార్ఖండ్‌లో జరిగిన పారా త్రోబాల్ పోటీలకు ఎంపికై ప్రతిభ చాటింది. అనంతరం అదే సంవత్సరం డిసెంబర్ 2 నుంచి 5 వరకు కాంబోడియాలో జరిగిన అంతర్జాతీయ పారా త్రోబాల్ పోటీల్లో పాల్గొని దేశానికి బంగారు పతకం తెచ్చిపెట్టింది. ఈమేరకు తనకు కొందరు ఆర్థిక సహాయం అందించి ప్రోత్సహించారని, వారందరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పారా త్రోబాల్, వాలీబాల్ క్రీడలను ప్రోత్సహించి, తనలాంటి దివ్యాంగులకు చేయూతనందించి, ముందుకు నడిపించాలని భాగ్య కోరుతోంది.


పొట్టి శ్రీరాములు యూనివర్సిటీలో ఒంటి కాలుతో డ్యాన్స్ చేస్తున్న భాగ్య (ఫైల్)



ఎమ్మెల్యేలతో సీఎంను కలిసినా ఫలితం లేదు

పారా త్రోబాల్ క్రీడలో దేశానికి బంగారు పతకం తీసుకొచ్చిన తన గురించి తెలుసుకున్న ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్ నన్ను సీఎం రేవంత్‌రెడ్డిని కలిపించారు. నా గురించి చెప్పి ఉద్యోగం ఇప్పిస్తామన్నారు. దేశానికి బంగారు పతకం తీసుకొచ్చినా, ఇప్పటి వరకు ఎలాంటి ఫలితం లేదు. ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలి.

– భాగ్య, దివ్యాంగురాలు, క్రీడాకారిణి

శభాష్.. మల్లేశ్



కామారెడ్డి అర్బన్: ఈయన బుల్లె మల్లేశ్.. కామారెడ్డి పట్టణం దేవునిపల్లికి చెందిన మల్లేశ్ 67 ఏళ్ల వయసులోనూ నిత్యం తన కష్టాన్ని నమ్ముకుని బతుకుతున్నారు. పనిలేదు.. ఏం పని చేయాలి.. అంటూ దిక్కులు చూసే వారికి ఆదర్శంగా నిలుస్తున్నారు. 9వ తరగతి వరకు చదువుకున్న మల్లేశ్ 18 ఏళ్ల వయసు నుంచే సైకిల్‌పై తన వ్యాపారం ప్రారంభించారు. తన జీవన ప్రస్థానంలో ప్లాస్టిక్ వస్తువులు, ప్రెషర్‌కుక్కర్లు, స్టీల్ సామగ్రి, కుర్చీలు, రెడీమేడ్ దుస్తులు, గోడ గడియారాలు, ఇలా ఎన్నో వస్తువులు ప్రతీరోజు 10 నుంచి 30 కిలోమీటర్ల దూరం సైకిల్‌పై వెళ్లి విక్రయించేవారు. ప్రస్తుతం పట్టణంలో చాయ్ అమ్ముతూ రోజు రూ.500 వరకు సంపాదిస్తున్నారు. తన సంపాదనతో దేవునిపల్లిలో 500 గజాల ప్లాటు కొని, ఇల్లు నిర్మించారు. ఇద్దరు కొడుకులు, బిడ్డ పెళ్లిళ్లు చేశాడు. తన ఆరోగ్యం బాగున్నంత వరకు టీలు అమ్ముతానన్నారు.


రంజాన్ పర్వదినం సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్‌ను ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో కలిసిన ఆయన బాల్యమిత్రుడు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జహంగీర్, బీఆర్‌ఎస్ మైనారిటీ నేత జుబేర్ పాషా

'హెచ్‌సీయూ భూమిపై నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి'

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) భూమిపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ యూనియన్ (పీసీయూ) అధ్యక్షుడు ఆవుల నాగరాజు డిమాండ్ చేశారు. హెచ్‌సీయూకి సంబంధించిన 400 ఎకరాల భూమిని కార్పొరేట్ కంపెనీలకు ఇవ్వాలని చూడటం దారుణమని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణలోని కాంగ్రెస్ పాలకులు విద్యార్థి వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారని ఆరోపించారు. ప్రతిష్టాత్మక హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను బలవంతంగా గుంజుకోవడమంటే పేద విద్యార్థుల చదువులను ధ్వంసం చేయడమేనని, వెంటనే రాష్ట్ర ప్రభుత్వం భూముల అమ్మకం మానుకోవాలని నాగరాజు డిమాండ్ చేశారు.

సైకిల్ చక్రం.. బతుకు చిత్రం



బతుకు చక్రంలో జానెడు పొట్టకోసం ఎవరి తిప్పలు వారివి. పండుగ అందరికీ ఒక్కటే.. కానీ అందరికీ ఒకేలా ఉండదు. పండుగ అంటే కడుపు నిండాలి.. అందరూ కలవాలి. కానీ వీరికి ఒక పండుగ రోజే కడుపు నిండేది. దాని కోసం ఏడాదిపాటు ఎదురు చూస్తారు. ప్రార్థనలకోసం వచ్చేవారి పాదరక్షలకు కాపలాగా ఉంటే తోచినంత సాయం చేస్తారని వాళ్ల ఆశ. ఉదయాన్నే కుటుంబమంతా సైకిల్‌పై వచ్చి ఈద్గా వద్ద ఎవరికి వారుగా చెప్పులకు కాపలాగా ఉండి యాచిస్తారు. ఇలా సైకిల్‌పై ముందు, వెనక చక్రాలు.. ఏమాత్రం వదలకుండా యజమాని చెప్పులకు కాపలాగా సైకిల్‌ను వినియోగించడం 'సాక్షి' కెమెరాకు కనిపించింది. పెద్దపల్లిలోని ఈద్గా వద్ద రంజాన్ ప్రార్థనల సమయంలో యాచకుల కడుపు తిప్పలకు అద్దం పట్టేలా సైకిల్ చక్రం బతుకు చక్రాన్ని తలపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

సింగరేణి.. సూపర్ ప్లాన్

ఏటా ఆరోగ్య రంగంపై రూ.500 కోట్ల వ్యయం.. రిఫరల్ ఆస్పత్రులకే రూ.150 కోట్ల చెల్లింపులు

ఇవి తగ్గించేలా రామగుండం, కొత్తగూడెం ఆస్పత్రుల అప్‌గ్రేడ్

హైదరాబాద్‌లో సొంతంగా అత్యాధునిక ఆస్పత్రి నిర్మాణానికి ప్రణాళిక

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: బొగ్గు ఉత్పత్తికే పరిమితమైన సింగరేణి ఇప్పుడు సంస్థ పరిధిలో పనిచేసే వారి ఆరోగ్యంపై కూడా దృష్టి సారించింది. కార్మికులు, ఉద్యోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని నిర్ణయించింది. ఇందుకోసం ప్రైవేట్ ఆస్పత్రులకు నగదు చెల్లించే బదులు.. హైదరాబాద్‌లో సొంతంగానే కార్పొరేట్ స్థాయి ఆస్పత్రిని నిర్మించే దిశగా అడుగులు వేస్తోంది.

లక్ష కుటుంబాలకు సేవలు..

సింగరేణి సంస్థ పరిధిలో కార్మికుల నుంచి ఎగ్జిక్యూటివ్ కేడర్ వరకు మొత్తంగా 42 వేల మంది పర్మనెంట్ ఉద్యోగులు ఉన్నారు. వీరితో పాటు కాంట్రాక్ట్ పద్ధతిలో 34 వేల మంది కార్మికులు పని చేస్తున్నారు. సింగరేణిలో రిటైర్డ్ అయి హెల్త్ స్కీంలో ఉన్నవారు మరో 30 వేలమంది వరకు ఉన్నారు. మొత్తంగా లక్షకు పైగా కుటుంబాలకు సింగరేణి వైద్యసేవలు అందిస్తోంది. ఇందుకోసం సంస్థ విస్తరించిన ఆరు జిల్లాల పరిధిలో ఆస్పత్రులు ఉన్నాయి. మెరుగైన వైద్యం కోసం రామగుండం, భూపాలపల్లి, మణుగూరు, శ్రీరాంపూర్‌లో రీజనల్ ఆస్పత్రులు, కొత్తగూడెంలో ప్రధాన ఆస్పత్రి ఉంది. వైద్య, ఆరోగ్య విభాగాల కింద ఏటా రూ.500 కోట్ల వరకు సింగరేణి వెచ్చిస్తోంది.

రిఫరల్‌కే రూ.150 కోట్లు..

సాధారణంగా సింగరేణి పర్మనెంట్ ఉద్యోగులు, కార్మికులకు ఆరోగ్య సమస్య ఎదురైతే తొలుత ఆయా ఏరియాల్లో ఉన్న డిస్పెన్సరీలు, ఏరియా ఆస్పత్రులకు వెళతారు. వారి ఆరోగ్య పరిస్థితిని పరీక్షించాక, అవసరమైతే ఏరియాల నుంచి రామగుండంలోని రీజినల్, కొత్తగూడెం ప్రధాన ఆస్పత్రికి రిఫర్ చేస్తారు. ఇక్కడ కూడా నయం కాని అనారోగ్య సమస్యలు ఉన్నా, అత్యవసర, ఆధునిక వైద్యసేవలు అవసరమైనా హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తారు. అయితే సింగరేణిలో గత కొన్నేళ్లుగా రిఫరల్ కేసుల సంఖ్య ఎక్కువగా నమోదవుతోంది. గడిచిన రెండేళ్లలో ఏకంగా 47,201 మందిని హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. దీంతో రిఫరల్ కార్పొరేట్ ఆస్పత్రులకు చెల్లించే బిల్లు ఏటా సుమారు రూ.150 కోట్లు ఉంటోంది. సింగరేణి రిఫర్ చేస్తున్న కేసుల సంఖ్య ఎక్కువగా ఉంటోందని, దీనిపై దృష్టి సారించాలని సింగరేణి సీఎండీ బలరామ్ ఇటీవల సంస్థ పరిధిలోని వైద్యులకు సూచించారు.



కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన ఆస్పత్రి

ఆయా ఆస్పత్రుల్లో సేవలు మెరుగుపరుస్తూ...

ఆరోగ్య రంగంపై ఖర్చులో దాదాపు 30 శాతం వరకు రిఫరల్ వైద్యసేవల పేరిట కార్పొరేట్ ఆస్పత్రులకే చెల్లించాల్సి రావడంపై సింగరేణి దృష్టి సారించింది. దీంతో రామగుండం ఆస్పత్రిలోని సూపర్ స్పెషాలిటీ విభాగంలో కార్డియో సేవలు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. సింగరేణి కార్మికులు ఎక్కువగా ఎదుర్కొనే శ్వాసకోస, కంటిచూపు, కీళ్ల నొప్పులు తదితర విభాగాల్లోనూ సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురానుంది. మలివిడతగా కొత్తగూడెం ప్రధాన ఆస్పత్రిని సూపర్ స్పెషాలిటీ స్థాయికి అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించారు.

హైదరాబాద్‌లోనూ..

బొగ్గుతోపాటు థర్మల్, సోలార్, పంప్డ్ స్టోరేజ్ హైడల్ పవర్ ఉత్పత్తిలో సింగరేణి అడుగు పెడుతోంది. తొలిసారి తెలంగాణ వెలుపల ఒడిశా, రాజస్తాన్‌లో సంస్థ కార్యకలాపాలు మొదలుకానున్నాయి. మరోవైపు కొత్తగూడెం, రామగుండం వంటి ద్వితీయ శ్రేణి నగరాల్లో సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో సేవలు అందించే నిపుణుల కొరత ఏర్పడే అవకాశాన్ని సంస్థ పరిగణనలోకి తీసుకుంటోంది. దీంతో ఓ వైపు సంస్థ పరిధిలో ఉన్న ఆస్పత్రుల్లో మౌలిక వసతులు మెరుగుపరచడం, వైద్యసేవలను అప్‌గ్రేడ్ చేస్తూనే, వేర్వేరు ప్రాంతాల్లో పనిచేసే వారికి అనుకూలంగా ఉండేలా హైదరాబాద్‌లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని సొంతంగా నిర్మించే దిశగా సింగరేణి ప్రణాళిక సిద్ధం చేస్తోంది.

సింగరేణి ఆస్పత్రి నుంచి హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆస్పత్రులకు రిఫర్ చేసిన కేసుల సంఖ్య

ఏడాది	కేసులు
2023	19,884
2024	25,119
2025 (మార్చి 31)	2,198
మొత్తం	47,201

మారిషస్‌లో వైభవంగా ఉగాది వేడుకలు

- తెలుగు మహాసభ ఆధ్వర్యంలో సంబరాల నిర్వహణ
- ప్రముఖ వైద్యుడు గుడారు జగదీశ్‌ని సత్కరించిన మారిషస్ ప్రధాని


జగదీశ్‌ను సన్మానిస్తున్న మారిషస్ ప్రధాని డాక్టర్ నవీన్‌చంద్ర రామ్ గులామ్

సాక్షి, హైదరాబాద్: మారిషస్ తెలుగు మహాసభ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు వైభవంగా జరిగాయి. ఫీనిక్స్‌లోని ఇందిరా గాంధీ సెంటర్ ఫర్ ఇండియన్ కల్చర్‌లో జరిగిన విశ్వావసు నామ సంవత్సర వేడుకల్లో మారిషస్‌లోని తెలుగువారు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రముఖ సామాజిక, సాంస్కృతిక సంస్థ అయిన మారిషస్ తెలుగు మహాసభ నిర్వహించిన ఈ కార్యక్రమం తెలుగు ప్రజల వారసత్వం, సంప్రదాయాలను పరిరక్షించడానికి, ప్రోత్సహించడానికి ఒక వేదికగా నిలిచింది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రపంచ ప్రఖ్యాత వైద్య నిపుణుడు డాక్టర్ గుడారు జగదీశ్ వైద్యరంగంలో చేసిన అసాధారణ కృషికి, ముఖ్యంగా దివ్యాంగుల శ్రేయస్సు కోసం చూపిన అంకితభావానికి గుర్తింపుగా ఆయనను మారిషస్ ప్రధాన మంత్రి సత్కరించారు. నాలుగు దశాబ్దాలుగా దివ్యాంగుల పునరావాసం, సమాజ సేవకు అంకితమైన డాక్టర్ జగదీశ్ పలు దేశాల్లో ప్రత్యేక గుర్తింపు పొందారు. అవిశ్రాంతంగా ఆయన చేసిన సేవ ఎంతో మంది అభాగ్యుల జీవితాలను ప్రభావితం చేసింది. ఈ సేవలను గుర్తించిన మారిషస్ ప్రధాన మంత్రి డాక్టర్ నవీన్‌చంద్ర రామ్ గులామ్.. డాక్టర్ గుడారు జగదీశ్‌ను ''విశ్వ వైద్య దివ్యాంగ బంధు''అవార్డుతో సత్కరించారు.

అసాధారణ మానవతా మూర్తి..

డాక్టర్ జగదీశ్ అసాధారణ మానవతా మూర్తి అని ఆయన అంకితభావాన్ని మారిషస్ ప్రధాని ప్రశంసించారు. తెలుగు సంస్కృతిని కాపాడటానికి, ప్రోత్సహించడానికి, సమాజంపై సానుకూల ప్రభావాన్ని చూపే వ్యక్తులను గుర్తించడంలో మారిషస్ తెలుగు మహాసభ వేదిక కావడం గొప్ప విషయమని ప్రధాని అన్నారు. డాక్టర్ జగదీశ్ అంకితభావం, సమాజం పట్ల సేవానిరతి, ఆయన సేవలు అందరికీ ప్రేరణగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఒక సాధారణ వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన డాక్టర్ జగదీశ్ కాకినాడలోని రంగరాయ మెడికల్ కాలేజీ, అలాగే మంగళూరులోని మణిపాల్ విశ్వవిద్యాలయం వంటి ప్రఖ్యాత వైద్య సంస్థలలో వైద్య విద్యను అభ్యసించి ఆర్థోపెడిక్స్ విభాగంలో నైపుణ్యం పొందారని ప్రధాని నవీన్ చంద్ర వివరించారు. ఆయన ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధ సంస్థల నుంచి అత్యాధునిక పద్ధతులలో శిక్షణ సైతం తీసుకున్నారని తెలిపారు. అమెరికా, జర్మనీ, ఇంగ్లండ్, ఇటలీ, ఫ్రాన్స్, నైజీరియా, కెన్యా, ఒమన్, స్విట్జర్లాండ్, మారిషస్‌లలో ఉచిత క్యాంపులు నిర్వహించి తన సేవలను అందించారని, అనేక జాతీయ మరియు అంతర్జాతీయ జర్నల్స్‌లో తన పరిశోధనలు ప్రచురించారని వెల్లడించారు. రాబోయే రోజుల్లో డాక్టర్ జగదీశ్ మారిషస్‌లో మరింత సేవలను అందించాలని ప్రధాని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగు వారి సంస్కృతిని ప్రతిబింబించే శాస్త్రీయ నృత్యాలు, జానపద పాటలు, సంప్రదాయ సంగీతంతో సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి. అవార్డు ప్రదానోత్సవంలో మారిషస్ ఉప ప్రధాన మంత్రి పాల్ రేమండ్ బెరెంజర్, ప్రజాసేవలు, పరిపాలనా సంస్కరణల మంత్రి లుచ్‌మన్ రాజ్ పెంటియా, విద్య, కళలు, సాంస్కృతిక శాఖ మంత్రి మహేంద్ర గోండీయా, మారిషస్‌లో భారత హై కమిషనర్ అనురాగ్ శ్రీవాస్తవ, ఇందిరా గాంధీ భారత సంస్కృతి డైరెక్టర్ డాక్టర్ కాదంబినీ ఆచార్య, మారిషస్ తెలుగు మహాసభ అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులు పెద్దఎత్తున తెలుగు ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా రంజాన్

రాష్ట్ర వ్యాప్తంగా రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి. నెల రోజుల రంజాన్ ఉపవాసాలు సోమవారంతో ముగియడంతో ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో ఈద్గాల వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికి ఒకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



కడప నగరంలో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లిం సోదరులు



గుంటూరులోని ఉర్దూ బాలుర పాఠశాలలో రంజాన్ ప్రార్థనలు



అనంతపురంలోని అశోక్‌నగర్ ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు

క్లుప్తంగా...

బయోటెక్నాలజీని ప్రోత్సహించేలా సహకరించండి

కేంద్రానికి మంత్రి సత్యకుమార్ విజ్ఞప్తి

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలో బయోటెక్నాలజీని ప్రోత్సహించేందుకు సహకరించాలని కేంద్ర ప్రభుత్వానికి ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. సోమవారం కేంద్ర సైన్స్, టెక్నాలజీ శాఖ మంత్రి జితేంద్ర సింగ్‌తో ఆయన భేటీ అయ్యారు. రాష్ట్రంలో బయోటెక్నాలజీకి సంబంధించిన పలు అంశాలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కేంద్రం సహకారంతో వివిధ ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లే అంశంపై చర్చించారు. దీనికి స్పందించిన జితేంద్రసింగ్ మరింత సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

విద్యాహక్కు చట్టం ఫీజు అంచనాపై కమిటీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఉచిత నిర్బంధ విద్య హక్కు చట్టం–2009 (ఆర్టీఈ) కింద ఏటా పేద పిల్లలకు అందిస్తున్న ఉచిత విద్యలో భాగంగా ఫీజులు నిర్ణయించేందుకు ప్రభుత్వం కమిటీని నియమించింది. కమిటీకి పాఠశాల విద్య కార్యదర్శి చైర్మన్‌గా, సమగ్ర శిక్ష ఎస్పీడీ కన్వీనర్‌గా ఉన్నారు. కమిటీలోని మరో 9 మంది సభ్యుల్లో ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన/ముఖ్య కార్యదర్శిసహా ప్రైవేటు స్కూళ్ల అసోసియేషన్, యూనిసెఫ్ ప్రతినిధులు ఉన్నారు.

పాఠశాల విద్యకు రూ.620 కోట్లు నిధులు

సాక్షి, అమరావతి: విద్యాశాఖలో అమలు చేసిన వివిధ కార్యక్రమాలకు ప్రభుత్వం దాదాపు రూ.620 కోట్లు నిధులను విడుదల చేసింది. 2024–25 విద్యా సంవత్సరానికి గాను సమగ్ర శిక్ష ప్రాజెక్టు ద్వారా ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యతో పాటు ఉపాధ్యాయ విద్యా కార్యక్రమాలను నిర్వహించినందుకు ఈ నిధులు విడుదల చేసినట్లు ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సీఎంతో కేంద్ర ఉక్కుశాఖ అధికారుల చర్చలు

సాక్షి, అమరావతి: కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ ప్రతినిధి బృందం సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఉండవల్లిలోని సీఎం నివాసంలో భేటీ అయ్యింది. కేంద్ర ప్రభుత్వం వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్యాకేజీ, తదనంతర పరిణామాలు, తీసుకోవాల్సిన చర్యలపై ఈ సమావేశంలో చర్చించారు. సమీక్షలో ఉక్కు మంత్రిత్వ శాఖ కార్యదర్శి సందీప్ పౌండ్రిక్, ఆర్ఐఎన్ఎల్ ఇన్‌చార్జ్ సీఎండీ అజిత్ కుమార్ సక్సేనా తదితరులు పాల్గొన్నారు.

సపోరా

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో ఉలవపాడు పండ్ల తోటలకు ప్రసిద్ధి. ఇక్కడి మామిడి తర్వాత అత్యధిక విస్తీర్ణంలో సపోటా సాగవుతోంది. ఉలవపాడు మామిడితోపాటు సపోటాకు దేశీయంగా ఖ్యాతి ఉంది. కాయల నాణ్యతతోపాటు రుచి మధురంగా ఉంటాయి. అటువంటి సపోటా పంట రైతులను తారెత్తిస్తోంది. ఒక పక్క దళారుల దోపిడీ, మరో పక్క ధరల పతనం, ఇంకోవైపు ప్రభుత్వం నుంచి అందని మద్దతు వెరసి.. సపోటా సాగుకు గడ్డు పరిస్థితులు ఎదురవుతున్నాయి. పెట్టుబడులు పెట్టినా.. రాబడి లేక రైతులు తోటలను కొట్టివేస్తున్నారు.



మార్కెటింగ్‌లో దళారుల దోపిడీ

- లాభసాటిగా లేని పంట దిగుబడి, తగ్గిపోయిన ధరలు
- ప్రభుత్వం నుంచి అందని మద్దతు
- తోటలు కొట్టేస్తున్న రైతులు

ఉలవపాడు: అందరి నోరూరించే తియ్యటి ఉలవపాడు సపోటా.. రైతులకు మాత్రం నష్టాలను మిగులుస్తోంది. ఉలవపాడు సపోటాకు దేశీయంగా డిమాండ్‌తోపాటు ఆదరణ ఉంది. కానీ రైతులు మాత్రం ధరలాటలో దగా పడుతున్నారు. ఉలవపాడు మండలంలో గతంలో సుమారు 7 వేల ఎకరాల్లో సపోటా సాగు జరుగుతుండేది. కానీ గడిచిన ఏడేళ్లుగా సపోటా వ్యాపారం ఆశించిన స్థాయిలో లేదు. సాగు ఖర్చులు, కాయల అమ్మకానికి మధ్య భారీ వ్యత్యాసం ఉండడంతో నష్టాలే మిగులుతుండడంతో రైతులు సపోటా సాగుపై అయిష్టత చూపుతున్నారు. కొంత కాలంగా తోటలను రైతులు కొట్టి వేసి ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. ఇటీవల కాలంలో సుమారు 1000 ఎకరాల సపోటా తోటలను కొట్టి వేశారు. ప్రస్తుతానికి సుమారు 5000 ఎకరాల్లోనే సాగవుతోంది. ఇక ఈ ఏడాది ఈ– క్రాప్‌లో కేవలం 1,400 ఎకరాలు మాత్రమే సాగు చేస్తున్నట్లు నమోదైంది. ఈ–క్రాప్‌లో నమోదు కాకుండా అదనంగా మరో 3000 ఎకరాలు పైనే ఉంటుంది. ఉద్యాన శాఖ సైతం మామిడిపై చూపిన శ్రద్ధ సపోటాపై చూపడం లేదు. మామిడి రైతులకు శాస్త్రవేత్తలను రప్పించి సాగు మెళకువలపై అవగాహన కల్పిస్తున్నప్పటికీ సపోటా రైతులను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. దీనికి తోడు మార్కెట్‌లో దళారుల హవా కారణంగా సపోటా రైతు చిత్తయిపోతున్నాడు.

దేశీయంగా డిమాండ్

ఆంధ్రప్రదేశ్‌లో సపోటా అంటే గుర్తుకు వచ్చేది ఉలవపాడే. ఇక్కడ పాల సపోటా, ఫారిన్ సపోటా, బిళ్ల సపోటా రకాలు సాగు చేస్తారు. ఎక్కువగా ఫారిన్ సపోటా కాయలు ఎగుమతి అవుతాయి. తెలుగు రాష్ట్రాల ప్రజలు మాత్రం పాల సపోటాను ఇష్టపడతారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల ప్రజలు ఫారిన్ సపోటా ఇష్టపడతారు. అందుకే ఫారిన్ సపోటా రకం ఎగుమతులు అధికంగా జరుగుతాయి. బిళ్ల రకం కూడా ఎగుమతులు జరుగుతాయి. ప్రధానంగా చెన్నై మార్కెట్‌కు అధికంగా ఈ సపోటా వెళ్తోంది. చెన్నై, హైదరాబాద్, వేలూరు, బెంగళూరు. విశాఖపట్నం, ముంబైలకు ఎగుమతి చేస్తారు. లారీలు, బస్సులు, మినీ వాహనాల ద్వారా కాయల ఎగుమతులు జరుగుతాయి.

దళారుల ధరలాట

ఉలవపాడు రైతులు నేరుగా కాయలు అమ్ముకునే అవకాశం లేదు. ఇక్కడి సపోటాలు దేశీయంగా వివిధ ప్రాంతాలకు ఎగుమతి చేయడం అంటే రైతులకు సాధ్యపడకపోవడంతో దశాబ్దాలుగా దళారులనే రైతులు నమ్ముకుంటున్న పరిస్థితి ఉంది. ఉలవపాడులోని మెయిన్ రోడ్, బైపాస్‌ల్లో సుమారు 20 మంది పైగా దళారులు తమ సొంత మార్కెట్ నడుపుతుంటారు. రైతులు సుమారు 50–60 కేజీల బస్తాలను దళారుల వద్దకు తీసుకువస్తారు. కాయల నాణ్యతను చూసి బస్తా రేటును నిర్ణయిస్తారు. కాయల ప్రారంభంలో బస్తా రూ.700 నుంచి రూ.1,200 వరకు పలుకుతోంది. కాయలు అధికంగా వస్తే బస్తా రూ.500 కన్నా తక్కువకు పడిపోతుంది. దళారులు చెప్పిందే రేటు కావడం, బస్తాకు రూ.100 కమీషన్ రావడంతో వారు మాత్రం లక్షాధికారులు అవుతున్నారు. ప్రస్తుతం ఉలవపాడు మార్కెట్‌లో పాల సపోటా బస్తా రూ.650, ఫారిన్ సపోటా రూ.700, బిళ్ల సపోటా రూ.600 ధర పలుకుతోంది.





గతంలో తోటల విస్తీర్ణం **7** వేల ఎకరాలు

ప్రస్తుతం సాగు **5** వేల ఎకరాలు

సీజన్ ప్రారంభంలో (50-60 కేజీలు) ధర రూ.**1,200**

ప్రస్తుతం (50-60 కేజీలు) ధర రూ.**500** లోపే

నష్టాల్లో రైతులు

ఏడాదికి రెండు సార్లు దిగుబడి వచ్చే సపోటా సాగుకు అధికంగా ఖర్చవుతోంది. చెట్ల కొమ్మ కత్తిరింపులు, కలుపు చెట్ల తొలగింపు, దుక్కి చేయడం, తోటలకు నీరు కట్టడం వంటి వాటికి ప్రతి సీజన్‌కు ఎకరాకు సుమారు రూ.10 వేలు ఖర్చులు అవుతున్నాయి. ఇక కాయల కోత కూలీలకు ఖర్చు అధికం అవుతుంది. వీటిని మార్కెట్‌కు రైతులే సొంత వాహనం పెట్టుకుని దళారుల వద్దకు చేర్చాలి. వారు నిర్ణయించే ధరకు విక్రయించాలి. ఇక బస్తాకు రూ.100 కమీషన్‌గా ఇచ్చుకోవాల్సి ఉంటుంది. సాధారణంగా ఎకరాకు 40 బస్తాల వరకు కాపు వస్తుంది. ఈ ఏడాది వాతావరణం అనుకూలంగా లేక కాపు తగ్గి 30 బస్తాల దిగుబడి వస్తోందని రైతులు అంటున్నారు.



తోటలను కొట్టి కర్రలు తీస్తున్న కూలీలు



స్థానిక మార్కెట్ ద్వారా ఎగుమతులు

లాభాలు లేక కొట్టివేస్తున్నాం



సపోటా సాగులో లాభాలు లేకపోవడంతో తోటలు కొట్టేస్తున్నాం. ఈ ఏడాది నేను 3 ఎకరాల సపోటా తోట కొట్టేశాను. పెట్టుబడి అధికంగా అవుతుంది. కాయలు అమ్మినా.. నష్టాలే వస్తున్నాయి. అందుకని సపోటా కొట్టి సరుగుడు చెట్లు వేశాను.

– నిషాంత్, రైతు, ఉలవపాడు

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



సపోటాలో రైతులకు మంచి దిగుబడి వచ్చేలా అవగాహన కల్పిస్తున్నాం. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడం వల్ల కొంత నష్టం జరుగుతున్న మాట వాస్తవమే. ఉద్యానశాఖ ద్వారా రైతులకు మేలు జరిగేలా సలహాలు సూచనలు అందిస్తున్నాం.

– జ్యోతి, ఉద్యాన శాఖాధికారిణి

కొల్లేరు.. కన్నీరు

తడారి.. ఎడారి

- నీరు లేక నెర్రలు తీస్తున్న సరస్సు
- వలస పక్షులకు తాగునీటి కష్టాలు
- అక్రమ చెరువులతో పారని నీరు
- ఆటపాక పక్షుల కేంద్రంలో బోటు షికారు నిలుపుదల

కైకలూరు: కొల్లేరు చుక్క నీరు లేక కన్నీరు పెడుతోంది. పచ్చని పచ్చిక బయళ్లు, పక్షుల కిలకిల రావాలతో అలరారే సరస్సు ఏడారిని తలపిస్తోంది. సంతానోత్పత్తి కోసం వేలాది కిలోమీటర్ల దూరం నుంచి వస్తున్న వలస పక్షులు నీటి కోసం అల్లాడుతున్నాయి. ఎగువన సముద్రం నుంచి చొచ్చుకొస్తున్న ఉప్పునీటితో కొల్లేరు భూములు చౌడబారుతున్నాయి. పరిస్థితి ఇంతలా ఉన్నా కొల్లేరు నీటి కష్టాలు తీర్చే రెగ్యులేటర్ల నిర్మాణాల ఊసే కూటమి ప్రభుత్వం ఎత్తడం లేదు.

77,138 ఎకరాల్లో..

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 77,138 ఎకరాల్లో కొల్లేరు సరస్సు విస్తరించి ఉంది. మొత్తంగా 122 కొల్లేటి గ్రామాల్లో మూడు లక్షల మందికి పైగా ప్రజలు జీవిస్తున్నారు. సరస్సులోకి 67 డ్రెయిన్ల ద్వారా 1.11 లక్షల క్యూసెక్కుల నీరు వస్తుంది. వీటిలో 12 వేల క్యూసెక్కులు ఉప్పుటేరు ద్వారా సముద్రంలోకి వెళ్తుంది. ఎన్టీఆర్, ఖమ్మం జిల్లాల సరిహద్దుల నుంచి వచ్చే రామిలేరు, బుడమేరు, తమ్మిలేరు వాగులు కొల్లేరుకు ప్రధాన నీటి వనరులు. కేవలం వర్షాకాలంలో మాత్రమే కొల్లేరులో నీరు చేరుతుంది. వాతావరణ మార్పులు కూడా కొల్లేరులో నీటి కొరతకు కారణమవుతున్నాయి. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం కొల్లేరుపై పడుతోందని నిపుణులు అంటున్నారు.

అక్రమ చెరువు గట్లతో..

కొల్లేరులోని చిత్తడి నేలలు మత్స్య ఉత్పత్తుల పెరుగుదలకు అనుకూలం. దీంతో కొల్లేరులో ఆక్వా సాగు నానాటికీ విస్తరించింది. ఆక్రమణలు పెరిగాయి. అక్రమార్కులు కొల్లేరుకు నీటిని చేరవేసే డ్రెయిన్లను పూర్తిగా ఆక్రమించారు. పైగా చెరువు గట్లు 10 అడుగుల పైగానే ఏర్పాటు చేయడంతో నీరు కిందకు పారని పరిస్థితి. ఇటీవల సుప్రీంకోర్టులో విశ్రాంత ఉద్యోగి మృత్యుంజయరావు ఆక్రమణలను తొలగించాలని పిటిషన్ వేశారు. అటవీ అధికారులు సమాచార హక్కు చట్టం ద్వారా కొల్లేరు అభయారణ్యంలో 18 వేల ఎకరాల్లో అక్రమ సాగు జరుగుతున్నట్టు గుర్తించారు. వేలాది ఎకరాల్లోని చెరువుల్లో నీటిని నింపుకోవడంతో దిగువకు నీటిపారుదల స్తంభించి కొల్లేరు బీడుగా మారుతోంది.

పక్షులకు క‘న్నీటి’ కష్టాలు

కొల్లేరుకు 189 జాతులకు చెందిన స్వదేశీ, విదేశీ పక్షులు వస్తుంటాయి. ఏటా వేసవిలో నీటి కోసం ఇవి అల్లాడుతున్నాయి. అయితే ఈ ఏడాది ముందుగానే నీటి కొరత ఏర్పడింది. పక్షి ప్రేమికుల స్వర్గధామంగా పేర్గాంచిన కైకలూరు మండలం ఆటపాక పక్షుల కేంద్రంలో నీరు అడుగంటింది. సంతానోత్పత్తి కోసం వలస వచ్చిన వేలాది పక్షులు ఇక్కడ నివసిస్తున్నాయి. సాధారణ రోజుల్లో 7 అడుగులు ఉండాల్సిన పక్షుల విహార కేంద్రం చెరువులో ప్రస్తుతం కేవలం 4 అంగుళాల నీరు మాత్రమే ఉంది. దీంతో వారం రోజులుగా పక్షుల కేంద్రం చెరువులో బోటు షికారును నిలుపుదల చేశారు.



మండవల్లి మండలం చినఎడ్లగాడి వంతెన వద్ద నెర్రలిచ్చిన కొల్లేరు

రెగ్యులేటర్ల నిర్మాణం ఎప్పుడో?

కొల్లేరు సరస్సులో నిత్యం నీరు నిల్వ ఉండాలంటే రెగ్యులేటర్లను నిర్మించాలని నాలుగు దశాబ్దాలుగా నిపుణులు సూచిస్తున్నారు. వీటి ద్వారా సముద్రం నుంచి ఆటుపోటుల సమయంలో కొల్లేరుకు చేరే ఉప్పునీటిని అరికట్టవచ్చు. వర్షాకాలంలో ఎగువ నుంచి వచ్చే నీటిని నిల్వ చేయవచ్చు. ఈ నీటిలో చేప పిల్లలు (ఫింగర్‌లింగ్స్) వేయడం వల్ల కొల్లేరులో సంప్రదాయ మత్స్యకారులకు ఉపాధి లభిస్తుంది. ఇందు కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రెగ్యులేటర్ల నిర్మాణాలకు రూ.452 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు ఆమోదించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కొల్లేరుకు శాశ్వత పరిష్కారం చూపుతామంటున్న నాయకులు రెగ్యులేటర్ల నిర్మాణంపై మాత్రం స్పష్టమైన ప్రకటన చేయడం లేదు.


రెగ్యులేటర్లే శరణ్యం



కొల్లేరు సరస్సుకు ఇటీవల విజయవాడ బుడమేరు నుంచి వేలాది క్యూసెక్కుల నీరు చేరింది. ఆ నీరంతా సమీపంలోని సముద్రంలోకి వెళ్లింది. ఈ క్రమంలో రెగ్యులేటర్లను నిర్మిస్తే ఎగువ నుంచి చేరే నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉంటుంది. కూటమి ప్రభుత్వం ఈ దిశగా ఆలోచన చేసి రెగ్యులేటర్లు నిర్మించాలి.

– జయమంగళ కాసులు, సర్పంచ్, పెంచికలమర్రు, కైకలూరు మండలం

కొల్లేరు రక్షణ అందరి బాధ్యత



కొల్లేరు అభయారణ్యం పరిరక్షణను అందరూ బాధ్యత గా తీసుకోవాలి. ఏటా కొల్లే రు నీరు లేక ఎండిపోతుంది. ఈ ప్రభావం కొల్లేరులో జీవించే ప్రాణుల మనుగడపై పడింది. పక్షులు నీటి కోసం అలమటిస్తున్నాయి. అటవీశాఖ అధికారులు నీటి వనరులను పెంచాలి. కొల్లేరు సరస్సు, సముద్రానికి మధ్య రెగ్యులేటర్లు నిర్మించాలి.

– ఎల్ఎస్ భాస్కరరావు, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మండవల్లి



ఆధ్యాత్మిక సమాచారం

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 62,263 మంది స్వామివారిని దర్శించుకోగా 25,263 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.65 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలో, దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

గరుడ వాహనంపై కోదండరాముడు

తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు సోమవారం రాత్రి స్వామివారు గరుడ వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. అడుగడుగునా భక్తులకు హారతులు సమర్పించి స్వామి వారిని దర్శించుకున్నారు. ఉదయం మోహినీ అవతారధారుడైన శ్రీరామచంద్రమూర్తి పల్లకీలో కొలువై పురవీధుల్లో ఊరేగుతూ కనువిందు చేశారు.

కిక్కిరిసిన ముక్కంటి ఆలయం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి సోమవారం భక్తులు పోటెత్తారు. వరుస సెలవులు, పండుగలు కావడంతో సుమారు 32 వేల మంది భక్తులు దర్శించుకుని ఉంటారని ఆలయ అధికారులు తెలిపారు. అన్ని రకాల రాహు–కేతు పూజలు సుమారు 4 వేలకు పైగా జరిగాయి. ప్రసాదాలు పెద్ద సంఖ్యలో విక్రయించారు.

విద్యా సమాచారం

జీవో 117 సవరణపై అంకెల గారడీ వద్దు

నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో 40 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని లోక్‌సభ సాక్షిగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, రాష్ట్రంలో 16 వేల ఉపాధ్యాయ పోస్టులే ఉన్నాయని చెప్పడంలో అర్థం లేదని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని ఆక్షేపించింది. ప్రభుత్వం అంకెలు గారడీ కాకుండా వాస్తవానికి దగ్గరగా 117 జీవో సవరణ ఉత్తర్వులు ఉండాలని అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కరణం హరికృష్ణ, మాగంటి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. జీవో ఉపసంహరణ ఉత్తర్వుల్లో ఉపాధ్యాయులపై పనిభారాన్ని 20 శాతంపైన పెంచారన్నారు.



మానవ మనుగడకు ఎండ ఎంత అవసరమో... అందులోని రేడియేషన్‌తో... అందునా ముఖ్యంగా రేడియేషన్ స్పెక్ట్రమ్‌లోని అల్ట్రా వయొలెట్ కిరణాలతో అంత ప్రమాదం. ఎండ ఎప్పుడూ బాహ్య అవయవమైన చర్మంపైనే పడుతుంది కాబట్టి మొదటి ప్రమాదం మేనికే. పైగా ఇప్పుడు వేసవి ఎండల తీవ్రత చాలా ఎక్కువగా ఉంది. గత కొన్నేళ్లతో పోలిస్తే ఫిబ్రవరి మొదటి వారాల్లోనే ఎండ తీవ్రతలు మొదలయ్యాయి. ఈ ఎండల్లో రేడియేషన్ నుంచి ముఖ్యంగా అందులోని అల్ట్రా వయొలెట్ కిరణాల దుష్ప్రభావాలనుంచి ఎలా రక్షించుకోవాలో తెలుసుకుందాం.

ఎండలో ఒళ్లు జాగ్రత్త...!

ఎండ తీవ్రతతో వచ్చే చర్మవ్యాధులివి...

ఎండలోని అల్ట్రావయొలెట్ రేడియేషన్‌కు అదే పనిగా ఎక్స్‌పోజ్ అయ్యేవారిలో కొన్ని రకాల చర్మవ్యాధులు వచ్చే అవకాశముంది. అవి...



- **పాలీమార్ఫిక్ లైట్ ఎరప్షన్స్ :** ఇవి యుక్తవయస్కుల్లో, పిల్లల్లో ఎక్కువ. చర్మంపై ముఖ్యంగా చెంపలపైన, ముక్కుకు ఇరువైపులా ఎర్రగా ర్యాష్ రావడం, అరచేతి పైనా, మెడ వెనక ఈ ర్యాష్ కనిపిస్తుంది. ఇందులో దురద కూడా ఎక్కువే. ముఖం మీద తెల్లటి మచ్చలు వస్తాయి.
- **ఆక్టినిక్ ప్రూరిగో:** ఈ సమస్య ప్రధానంగా అమ్మాయిల్లో ఎక్కువ. చర్మం అలర్జీలు ఉన్నవారిలో ఎక్కువ. మొదట చిన్న చిన్న దురద పొక్కుల్లాగా వచ్చి, అవి పెచ్చులు కట్టి, మచ్చలా మారుతుంటాయి. అలా వచ్చిన మచ్చ ఎన్నటికీ పోదు.
- **హైడ్రోవాక్సినిఫార్మ్ :** ఈ సమస్య పిల్లల్లో కనిపించడం ఎక్కువ. ఇవి దురదగా ఉండే రక్తపు నీటిపొక్కుల్లా ఉంటాయి. చాలా ఎర్రగా మారి, ఆ తర్వాత ఎండి, రాలిపోతాయి. అటు తర్వాత అక్కడ చికెన్‌పాక్స్‌లో ఉండే మచ్చలాంటిది పడుతుంది. చెంపలు, చెవులు, ముక్కు, చేతుల మీద ఈ పొక్కులు ఎక్కువగా వస్తుంటాయి.
- **సోలార్ అర్టికేరియా:** ఎండకు బాగా ఎక్స్‌పోజ్ అయిన వాళ్లల్లో కొద్ది నిమిషాల్లోనే అకస్మాత్తుగా చర్మం మీద ఎర్రగా, దద్దుర్లు వస్తాయి. ఇవి ఎవరిలోనైనా రావచ్చు.
- **క్రానిక్ యాక్టినిక్ డెర్మటైటిస్:** ఇదో రకం స్కిన్ ఇన్ఫెక్షన్. ఇది వచ్చిన చోట చర్మం ఎర్రగా, మెరుస్తున్నట్లుగా, మందంగా మారి, దురద వస్తుంది. అది వచ్చిన చోట చర్మం పొడిగా మారడమే కాకుండా ఉబ్బినట్లుగా అవుతుంది. ఇది ముఖ్యంగా ముఖం మీద ఎక్కువగా కనిపించినప్పటికీ మాడు, వీపు, మెడ, ఛాతి, చేతుల మీదికి కూడా వ్యాపిస్తుంది. పెద్దవయసు వారిలో ఎక్కువగా కనిపిస్తుంది. స్కిన్ అలర్జీ, పుప్పొడితో కనిపించే అలర్జీలతో పాటు కలిసి వస్తుంది.
- **చర్మ క్యాన్సర్లు :** నిరంతరం నేరుగా, తీక్షణంగా పడే ఎండలో ఎక్కువగా ఉండేవారికి చర్మక్యాన్సర్లు వచ్చే అవకాశం ఎక్కువ. వీటిల్లో మెలనోమా, నాన్‌మెలనోమా అని రెండు రకాల క్యాన్సర్లు రావచ్చు.



డా. వై. అరుణ కుమారి
సీనియర్ డెర్మటాలజిస్ట్



సూర్యకాంతిలో అల్ట్రావయొలెట్ రేడియేషన్ భూ వాతావరణంలోకి ప్రవేశించగానే అందులోని అల్ట్రా వయొలెట్-ఏ, అల్ట్రా వయొలెట్-బీ, అల్ట్రా వయొలెట్-సీ (వీటినే సంక్షిప్తంగా యూవీ-ఏ, యూవీ-బీ, యూవీ-సీ అంటారు) అనే మూడు రకాల రేడియేషన్లు వాతావరణంలో ప్రవేశించాక ప్రధానంగా యూవీ-ఏ, యూవీ-బీ కిరణాలు చర్మంపై పడతాయి. అదృష్టవశాత్తూ అల్ట్రా వయొలెట్ రేడియేషన్‌లోని ప్రమాదకరమైన యూవీ-సీ వాతావరణంలోకి ఇంకిపోతాయి. దాంతో యూవీఏ, యూవీబీ రెండూ చర్మంపై పడతాయి. అయితే ఈ రేడియేషన్‌లో దాదాపు 5 శాతం తిరిగి వెనక్కు వెళ్తాయి. మరికొంత పరిమాణం అన్ని వైపులకూ చెదిరిపోతుంది.

ఎండ తీవ్రంగానూ, నేరుగా పడే భూమధ్యరేఖ, ఉష్ణమండల ప్రాంతాల్లో యూవీ కిరణాల ప్రభావం ఎక్కువ అని చాలామంది అనుకుంటారు గానీ... నిజానికి మంచు కప్పి ఉన్న ప్రాంతాల్లోనే రేడియేషన్ ప్రభావమెక్కువ. అంటే భూమధ్య రేఖ కంటే ధ్రువాల వైపు పోతున్న కొద్దీ, అలాగే ఎత్తుకు పోయిన కొద్దీ..., అలాగే వేసవి ముదురుతున్న కొద్దీ, వాతావరణంలో మబ్బులు లేకుండా నీలం రంగు ఆకాశం ఉన్నప్పుడూ ఈ రేడియేషన్‌లోని యూవీ కిరణాల తీవ్రత పెరుగుతుంది.

రేడియేషన్‌లో ప్రమాదకరమైనది యూవీ-బీ...

యూవీ-ఏ, యూవీ-బీలలో రెండోది (యూవీ-బీ) చాలా ప్రమాదకరమైనది. అది చర్మం తాలూకు ‘ఎపిడెర్మిస్’ అనే పొరను తాకాక అక్కడి డీఎన్‌ఏ, ఆర్‌ఎన్‌ఏ, ట్రిప్టోఫాన్, టైరోజిన్, మెలనిన్‌లు ఆ కిరణాలను చర్మంలోకి ఇంకిపోయేలా చేస్తాయి. ఆ తర్వాత అవి చర్మంలోని మరో పొర ‘డెర్మిస్’నూ తాకుతాయి. అక్కడి ఇంట్రావాస్కులార్ హీమోగ్లోబిన్, డెర్మిస్‌లోని టిష్యూ బైలింబిన్ అనే కణజాలాలు వాటిని గ్రహించి మళ్లీ వెనకకు పంపుతాయి. అయితే ఈ ప్రక్రియలో అల్ట్రావయొలెట్ కిరణాలు గ్రహించిన ప్రతి డీఎన్‌ఏలో ఎంతోకొంత మార్పు రావడం జరుగుతుంది. అలాంటి మార్పులు చాలా పెద్ద ఎత్తున లేదా తీవ్రంగా జరిగినప్పుడు చర్మంపై అవి దుష్ప్రభావాల రూపంలో వ్యక్తమవుతాయి.

అల్ట్రా వయొలెట్ రేడియేషన్‌తో ఉండే కొన్ని ప్రయోజనాలివి...

అల్ట్రా వయొలెట్ రేడియేషన్ వల్ల కొన్ని ఉపయోగాలు ఉంటాయి. అవి...

- **విటమిన్ డి ఉత్పత్తికి :** అల్ట్రా వయొలెట్ కిరణాలకు ఎక్స్‌పోజ్ కాకపోతే అసలు విటమిన్-డి ఉత్పత్తే జరగదు. ఎముకల బలానికీ, వ్యాధినిరోధక వ్యవస్థ పటిష్ఠంగా ఉండటానికీ, అనేక జీవక్రియలకూ విటమిన్-డి చాలా అవసరమన్న విషయం అందరికీ తెలిసిందే. ఎముకల బలానికి అవసరమైన క్యాల్షియమ్ మెటబాలిజమ్, ఎముకల పెరుగుదల, నాడీ వ్యవస్థ సక్రమంగా పనిచేయడం కోసం, ఇన్సులిన్ ఉత్పత్తికి కూడా అల్ట్రా వయొలెట్ రేడియేషన్ కొంతమేరకు అవసరమవుతుంది.
- **కొన్ని రకాల ఆరోగ్య సమస్యల చికిత్సల్లో :** సోరియాసిస్, విటిలిగో, ఎగ్జిమా వంటి కొన్ని ఆరోగ్య సమస్యల చికిత్సలో అల్ట్రా వయొలెట్ కిరణాలను ఉపయోగిస్తుంటారు.
- **పుట్టుకామెర్ల చికిత్సలో :** నవజాత శిశువుల్లో వచ్చే పుట్టుకామెర్లు (జాండీస్)ను తగ్గించడం కోసం అల్ట్రా వయొలెట్ కిరణాలు ఉపయోగపడతాయి.



ఇన్‌డోర్స్‌లో ఉన్నా ప్రమాదమే...



ఇండ్లలో ఉన్నవాళ్ల మీద అల్ట్రావయొలెట్ రేడియేషన్ దుష్ప్రభావం ఉండదన్నది చాలా మందిలో ఉండే మరో అపోహ. ఆరుబయటితో పోలిస్తే ఇన్‌డోర్స్‌లో కాస్త తక్కువే అయినా... రేడియేషన్ దుష్ప్రభావాలు గదుల్లో ఉన్నా ఎంతోకొంత ఉండనే ఉంటాయి. గదిలో ఉన్నప్పుడు మనకు అల్ట్రా వయొలెట్ కిరణాల ప్రభావం ఉండదని అనుకుంటాం గానీ... ఇళ్లలో ఉండే ట్యూబ్‌లైట్స్, ఎలక్ట్రిక్ బల్బుల నుంచి కూడా దాదాపు 5 శాతం వరకు రేడియేషన్ ఉంటుంది. ఆకాశంలో మబ్బులు కమ్మి ఉన్నప్పుడు అల్ట్రా వయొలెట్ కిరణాల తీవ్రత కొద్దిగా తక్కువగా ఉండవచ్చు.

కొన్ని వ్యాధుల్లో ఎండ వల్ల పెరిగే తీవ్రత...

కొందరిలో ఈ కింద పేర్కొన్న ఆరోగ్య సమస్యల్లో ఏదో ఒకటి ముందుగానే ఉండవచ్చు. అయితే తీక్షణమైన ఎండకు అదేపనిగా ఎక్కువ సేపు ఎక్స్‌పోజ్ కావడం వల్ల ముందున్న వ్యాధి తీవ్రత పెరగవచ్చు. **ఆ ఆరోగ్య సమస్యల్లో ఇవి కొన్ని...** ● యాక్నె (మొటిమలు) ● అటోపిక్ ఎగ్జిమా (స్కిన్ అలర్జీ) ● పెలగ్రా ● లూపస్ అరిథమెటోసిస్, ● హెర్పిస్ సింప్లెక్స్ ● బుల్లస్ పెఫిగోయిడ్ ● లైకెన్ ప్లానస్ ● సోరియాసిస్ ● వైరల్ ఇన్ఫెక్షన్స్ ● మెలాస్మా వంటివి ముఖ్యమైనవి.

రేడియేషన్ వల్ల చర్మానికి జరిగే అనర్థాలివి...

అల్ట్రా వయొలెట్ కిరణాలకు ఎక్స్‌పోజ్ కావడం వల్ల...

- సన్ బర్న్స్
- సన్ ట్యానింగ్
- చర్మం మందంగా మారడం
- గోళ్లకు నష్టం కావడం
- అసలు వయసు కంటే పెద్ద వయసు వారిగా కనిపించడం.

ఇక ఈ అంశాల గురించి వివరంగా చెప్పాలంటే...

సన్‌బర్న్స్ : రేడియేషన్‌లోని అల్ట్రా వయొలెట్ కిరణాల ప్రభావం మొట్ట మొదట కణాల్లోని చర్మకణాల్లోని డీఎన్‌ఏ పై పడుతుంది. అంతకంటే ముందు మొదట చర్మం వేడెక్కుతుంది. తర్వాత ఎర్రబారుతుంది. ఆరుబయటకు వెళ్లినప్పుడు ఆ ప్రభావం నేరుగా ఎండ పడే చోట... అంటే... ఎండకు ఎక్స్‌పోజ్ అయ్యే ముఖం మీద, చేతుల మీద త్వరగా కనిపిస్తుంది. బాగా ఫెయిర్‌గా ఉండి తెల్లటి చర్మంతో ఉన్నవారిలో సన్‌బర్న్స్ త్వరగా కనిపిస్తాయి. అయితే మన దేశవాసుల్లో సన్‌బర్న్స్ కాస్త తక్కువే.

సన్ ట్యానింగ్ : ఎండ తగిలిన కొద్దిసేపట్లోనే చర్మం రంగు మారి అలా అది కొన్ని నిమిషాలు మొదలుకొని కొన్ని గంటల పాటు అలాగే ఉంటుంది. దీన్నే ‘ఇమ్మీడియెట్ ట్యానింగ్’ అంటారు. ఇలా మారిన రంగు (నల్లబారడం) మొదట తాత్కాలికంగానే ఉంటుంది. కానీ ఎప్పుడూ ఎండలోనే ఉండేవారిలో రంగు మారడం చాలాకాలం పాటు కొనసాగి, ఆ మారిన రంగు కాస్తా అలాగే చాలా కాలం పాటు ఉండిపోతుంది. దీన్నే ‘డిలేయ్‌డ్ ట్యానింగ్’ అంటారు. అటు తర్వాత అలా చాలాకాలం పాటు ఎండకు అదేపనిగా ఎక్స్‌పోజ్ అవుతూ ఉండేవారిలో చర్మం మందంగా మారుతుంది. ఇలా కావడాన్ని ‘హైపర్‌ప్లేషియా’ అంటారు. తెల్లగా, ఎర్రగా ఉన్నవారిలో ఇలా ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.

ఎండ ప్రభావం గోళ్ల మీద కూడా...
ఎండకు అదేపనిగా ఎక్స్‌పోజ్ అవుతుండే గోళ్లకు కూడా నష్టం జరిగే అవకాశముంది. నిత్యం అల్ట్రావయొలెట్ రేడియేషన్‌కు గురయ్యే గోళ్లలో వేలి నుంచి గోరు విడివడి ఊడిపోయే అవకాశముంటుంది. ఇలా జరగడాన్ని వైద్య పరిభాషలో ‘ఒనైకోలైసిస్’ అంటారు.



ఎండలో ఉండే వ్యవధి, తీవ్రత...

పెరుగుతున్న కొద్దీ దుష్ప్రభావాల పెరుగుదల...

ఎండకు ఎంతసేపు అదేపనిగా ఎక్స్‌పోజ్ అవుతుంటే దుష్ప్రభావాలూ అంతగా పెరుగుతాయి. అలాగే అల్ట్రావయొలెట్ రేడియేషన్ తాలూకు తీవ్రత పెరుగుతున్నకొద్దీ నష్టాల తీవ్రత దానికి అనుగుణంగా పెరుగుతూనే ఉంటుంది. ఇందుకు ‘ఫొటో ఏజింగ్’ ఒక ఉదాహరణ. ఫొటో ఏజింగ్ అంటే ఎండకు ఎక్స్‌పోజ్ అవుతున్న కొద్దీ అంటే... ఎక్స్‌పోజ్ అయ్యే వ్యవధి పెరుగుతున్న కొద్దీ ఆ వ్యక్తి తన వాస్తవ వయసుకంటే ఎక్కువ వయసు పైబడినట్లుగా కనిపిస్తుంటాడు. అల్ట్రా వయొలెట్-బీ రేడియేషనే ఇందుకు కారణం. ఆ కిరణాల వల్ల ముఖం అలాగే మేని మీద ముడుతలు రావడం, చర్మం మృదుత్వం కోల్పోవడం, నల్లటి మచ్చలు రావడం, వదులుగా మారిపోవడం, తన పటుత్వం కోల్పోవడం వల్ల ఇలా ఏజింగ్ కనిపిస్తూ ఉంటుంది.

యూవీ రేడియేషన్ అనర్థాల నుంచి కాపాడుకోవడం ఇలా...

- ప్రధానంగా వేసవితో పాటు మిగతా అన్ని కాలాల్లోనూ ఎండ తీక్షణత ఎక్కువగా ఉండే సమయంలో అంటే... ఉదయం పది నుంచి సాయంత్రం నాలుగు వరకు ఎండలోకి వెళ్లకుండా జాగ్రత్త పడాలి.
- చర్మంపై సూర్యకాంతి పడకుండా పొడవు చేతి చొక్కాలు (పొడవైన స్లీవ్స్ ఉండే దుస్తులు) తొడగడం మంచిది.
- ఎండలోకి వెళ్లాల్సి వచ్చినప్పుడు ముఖం కవర్ అయ్యేలా చేసే బ్రిమ్ హ్యాట్స్‌తో పాటు వీలైతే సన్‌గ్లాసెస్ కూడా వాడుకోవడం మంచిది.
- ఎండలోకి వెళ్లడానికి అరగంట ముందుగా సన్ ప్రొటెక్షన్ ఫ్యాక్టర్ (ఎస్‌పీఎఫ్) ఎక్కువగా ఉన్న మంచి సన్‌స్క్రీన్ లోషన్ రాసుకోవాలి. అలా ప్రతి మూడు గంటలకు ఓసారి రాసుకుంటూ ఉండాలి. ఈదేటప్పుడు, చెమట పట్టినప్పుడు రాసుకునేందుకు వీలుగా కొన్ని వాటర్ రెసిస్టెంట్ సన్‌స్క్రీన్ క్రీమ్స్ కూడా అందుబాటులో ఉన్నాయి. ఈ సన్‌స్క్రీన్స్ ఎంచుకునే ముందర ఒకసారి చర్మవ్యాధి నిపుణులను సంప్రదించి తమకు సరిపడే ఎస్‌పీఎఫ్‌ను తెలుసుకుని వాడటం మంచిది.
- డీ-హైడ్రేషన్ నివారించడానికి నీళ్లు, ద్రవాహారాలు ఎక్కువగా తాగుతుండాలి.

అక్టోబర్-నవంబర్‌లలో ఆస్ట్రేలియాలో భారత్ పర్యటన

మెల్‌బోర్న్: వన్డే, టి20 సిరీస్‌లు ఆడేందుకు ఈ ఏడాది అక్టోబర్-నవంబర్‌లలో భారత జట్టు ఆస్ట్రేలియాలో పర్యటించనుంది. అక్టోబర్ 19 నుంచి నవంబర్ 8 వరకు జరిగే ఈ సిరీస్‌లో ఆస్ట్రేలియాతో 3 వన్డేలు, 5 టి20 మ్యాచ్‌లు ఆడుతుంది. తొలి వన్డే అక్టోబర్ 19న పెర్త్‌లో, రెండో వన్డే 23న అడిలైడ్‌లో, మూడో వన్డే 25న సిడ్నీలో జరుగుతాయి. తొలి టి20 అక్టోబర్ 29న కాన్‌బెర్రాలో, రెండో టి20 31న మెల్‌బోర్న్‌లో, మూడో టి20 నవంబర్ 2న హోబర్ట్‌లో, నాలుగో టి20 నవంబర్ 6న గోల్డ్‌కోస్ట్‌లో, ఐదో టి20 నవంబర్ 8న బ్రిస్బేన్‌లో జరుగుతాయి.

వచ్చే ఏడాది భారత మహిళల జట్టు పర్యటన

మరోవైపు భారత మహిళల క్రికెట్ జట్టు వచ్చే ఏడాది ఫిబ్రవరి-మార్చిలలో ఆస్ట్రేలియాలో పర్యటించనుంది. ఈ పర్యటనలో ఆస్ట్రేలియా జట్టుతో టీమిండియా మూడు టి20లు, మూడు వన్డేలు, ఒక టెస్టు మ్యాచ్ ఆడుతుంది. తొలి మూడు టి20లు సిడ్నీ (ఫిబ్రవరి 15న), కాన్‌బెర్రా (ఫిబ్రవరి 19న), అడిలైడ్ (ఫిబ్రవరి 21న)లో జరుగుతాయి. మూడు వన్డేలను బ్రిస్బేన్ (ఫిబ్రవరి 24న), హోబర్ట్ (ఫిబ్రవరి 27న), మెల్‌బోర్న్ (మార్చి 1న)లలో నిర్వహిస్తారు. ఏకైక టెస్టు మార్చి 6 నుంచి 9 వరకు పెర్త్‌లో జరుగుతుంది.

శ్రీలంక క్రికెట్ అధ్యక్షుడిగా మళ్లీ షమ్మీ సిల్వానే



కొలంబో: శ్రీలంక క్రికెట్ అధ్యక్షుడిగా వరుసగా నాలుగో పర్యాయం షమ్మీ సిల్వా ఎన్నికయ్యారు. సోమవారం జరిగిన వార్షిక సర్వసభ్య సమావేశంలో షమ్మీ సిల్వా ఏకగ్రీవంగా ఈ పదవికి ఎన్నికయ్యారు. ఆయన మరో రెండేళ్లపాటు ఈ పదవిలో కొనసాగుతారు. షమ్మీ సిల్వా భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) మాజీ కార్యదర్శి, ప్రస్తుతం అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) చైర్మన్‌గా ఉన్న జై షాకు సన్నిహితుడు. గత ఏడాది డిసెంబర్‌లో ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) అధ్యక్ష పదవి నుంచి జై షా వైదొలగగా... ఆయన స్థానంలో షమ్మీ సిల్వా ఏసీసీ అధ్యక్షుడిగా నియమితుడయ్యారు.

'పటౌడీ ట్రోఫీ'కి మంగళం!

ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు యోచన


రాబోయే సిరీస్‌కు కొత్త పేరు?



2021 ఇంగ్లండ్ పర్యటన సందర్భంగా పటౌడీ ట్రోఫీతో ఇంగ్లండ్ కెప్టెన్ జో రూట్, భారత కెప్టెన్ విరాట్ కోహ్లి (ఫైల్)

లండన్: ఇంగ్లండ్ గడ్డపై భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య జరిగే ద్వైపాక్షిక టెస్టు సిరీస్‌ను 2007 నుంచి మన్సూర్ అలీఖాన్ (ఎంఏకే) పటౌడీ ట్రోఫీ పేరిట నిర్వహించడం జరుగుతోంది. అయితే 'పటౌడీ ట్రోఫీ'కి గుడ్‌బై చెప్పాలని ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) భావిస్తోంది. ఈ ఏడాది జూన్‌లో ఇంగ్లండ్‌లో భారత్ పర్యటన నుంచి దీనిని అమలు చేయాలనే ఆలోచనలో ఈసీబీ ఉందని సమాచారం. 'పటౌడీ ట్రోఫీ'కి మంగళం పాడేందుకు కచ్చితమైన కారణాన్ని ఈసీబీ ఇంకా వెల్లడించకపోయినా... 'పటౌడీ' పేరు బదులుగా రెండు దేశాల నుంచి ఇద్దరు దిగ్గజాల **పేరుతో సరికొత్త ట్రోఫీ తెరపైకి వచ్చే** అవకాశాలు **కూడా కనిపిస్తున్నాయి.** 'పటౌడీ ట్రోఫీ'కి ముగింపు పలికే విషయంపై ఈసీబీ అధికారులు ఎలాంటి వ్యాఖ్యలు చేయడం లేదు. 'పటౌడీ ట్రోఫీ' మార్పు ఉండదని చెప్పడం లేదు. ఎంఏకే పటౌడీ 1961 నుంచి 1975 మధ్య కాలంలో భారత జట్టు తరఫున 46 టెస్టులు ఆడారు. 'పటౌడీ ట్రోఫీ'కి వీడ్కోలు పలుకుతున్నామనే విషయాన్ని పటౌడీ కుటుంబసభ్యులకు ఇప్పటికే ఈసీబీ సమాచారం ఇచ్చిందని తెలిసింది. 'కొంతకాలం తర్వాత ఆయా వ్యక్తుల పేర్లతో **నిర్వహించే ట్రోఫీలకు ముగింపు** పలకడం **సహజం'** అని పటౌడీ కుటుంబానికి సన్నిహితులు వ్యాఖ్యానించడం గమనార్హం. క్రికెట్‌లో 'ట్రోఫీ'లు రిటైర్ కావడం సహజమే. గతంలో ఇంగ్లండ్-వెస్టిండీస్ జట్ల మధ్య 'విజ్డెన్ ట్రోఫీ'తో సిరీస్‌లు జరిగాయి. ఆ తర్వాత కొన్నాళ్లకు 'విజ్డెన్ ట్రోఫీ'కి రిటైర్మెంట్ ఇచ్చేసి దాని బదులుగా రెండు జట్ల మధ్య 'రిచర్డ్స్-బోథమ్ ట్రోఫీ'తో సిరీస్‌లు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఆయా దేశాల మధ్య నాలుగు ట్రోఫీల టెస్టు సిరీస్‌లు నిర్వహిస్తున్నారు. భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య 1996 నుంచి 'బోర్డర్-గావాస్కర్ ట్రోఫీ'... వెస్టిండీస్-ఆస్ట్రేలియా జట్ల మధ్య 1960 నుంచి 'ఫ్రాంక్ వోరెల్ ట్రోఫీ'... ఆస్ట్రేలియా-శ్రీలంక జట్ల మధ్య 2007 నుంచి 'వార్న్-మురళీధరన్ ట్రోఫీ'... న్యూజిలాండ్-ఇంగ్లండ్ జట్ల మధ్య 2024 నుంచి 'క్రో-థోర్ప్ ట్రోఫీ'లను నిర్వహిస్తున్నారు. ఇంగ్లండ్ పర్యటన సమయంలో భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య టెస్టు సిరీస్ 2007 నుంచి 'పటౌడీ ట్రోఫీ'తో జరుగుతోంది. భారత్ వేదికగా ఈ రెండు జట్ల మధ్య టెస్టు సిరీస్‌ను 1951 నుంచి బీసీసీఐ మాజీ అధ్యక్షుడు 'ఆంథోనీ డి మెల్లో ట్రోఫీ' పేరుతో నిర్వహిస్తున్నారు.

వెస్టిండీస్ టెస్టు జట్టు కెప్టెన్సీకి బ్రాత్‌వైట్ గుడ్‌బై



సెయింట్ జాన్స్: నాలుగేళ్ల నుంచి వెస్టిండీస్ టెస్టు జట్టుకు కెప్టెన్‌గా ఉన్న క్రెయిగ్ బ్రాత్‌వైట్ ఆ బాధ్యతల నుంచి వైదొలిగాడు. 32 ఏళ్ల బ్రాత్‌వైట్ 2021లో జేసన్ హోల్డర్ నుంచి పూర్తిస్థాయిలో టెస్టు పగ్గాలు అందుకున్నాడు. తాను టెస్టు ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పేలోపు విండీస్ జట్టుకు నిలదొక్కుకున్న కెప్టెన్ ఉండాలనే ఉద్దేశంతో బ్రాత్‌వైట్ ఈ నిర్ణయం తీసుకున్నాడని విండీస్ బోర్డు తెలిపింది. జూన్ నెలలో స్వదేశంలో ఆస్ట్రేలియాతో జరిగే మూడు టెస్టుల సిరీస్ కోసం విండీస్ టెస్టు జట్టుకు త్వరలోనే కొత్త కెప్టెన్‌ను ఎంపిక చేస్తామని విండీస్ బోర్డు ప్రకటించింది. ఇప్పటికే 98 టెస్టులు ఆడిన బ్రాత్‌వైట్ ఆస్ట్రేలియాతో జరిగే సిరీస్ సందర్భంగా 100 టెస్టుల మైలురాయిని అందుకోనున్నాడు. బ్రాత్‌వైట్ 98 టెస్టులు ఆడి 5,935 పరుగులు సాధించాడు. ఇందులో 12 సెంచరీలు, 31 అర్ధ సెంచరీలు ఉన్నాయి. బ్రాత్‌వైట్ సారథ్యంలో 39 టెస్టులు ఆడిన విండీస్ 10 టెస్టుల్లో గెలిచి, 22 టెస్టుల్లో ఓడిపోయి, 7 టెస్టులను 'డ్రా' చేసుకుంది. బ్రాత్‌వైట్ నాయకత్వంలోని విండీస్ జట్టు 27 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ గత ఏడాది ఆస్ట్రేలియా గడ్డపై టెస్టు విజయాన్ని అందుకుంది. ఈ ఏడాది ఆరంభంలో బ్రాత్‌వైట్ సారథ్యంలో పాకిస్తాన్‌లో పర్యటించిన విండీస్ జట్టు 34 ఏళ్ల తర్వాత పాక్ జట్టుతో సిరీస్‌ను 1-1తో 'డ్రా' చేసుకుంది.

మరోవైపు ప్రస్తుతం వెస్టిండీస్ వన్డే జట్టుకు కెప్టెన్‌గా ఉన్న షై హోప్‌ను టి20 ఫార్మాట్ నాయకత్వ బాధ్యతలు అప్పగించారు. 2023 మే నుంచి విండీస్ టి20 జట్టుకు రావ్‌మన్ పావెల్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. పావెల్ స్థానంలో ఇక నుంచి టి20ల్లో విండీస్ జట్టుకు షై హోప్ కెప్టెన్‌గా ఉంటాడు.

నరేందర్ సారథ్యంలో...

ప్రపంచ బాక్సింగ్ కప్ బరిలో భారత బృందం




న్యూఢిల్లీ: తొలిసారి నిర్వహించనున్న వరల్డ్ బాక్సింగ్ కప్ టోర్నీలో పాల్గొనే భారత పురుషుల జట్టుకు నరేందర్ బెర్వాల్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. బ్రెజిల్‌లోని ఫాజ్ డు లుగాకు నగరంలో సోమవారం నుంచి ఈ టోర్నీ జరుగుతుంది. ఆరు రోజుల పాటు జరిగే ఈ మెగా ఈవెంట్‌లో 19 దేశాల నుంచి 130 మంది బాక్సర్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటారు. హరియాణాకు చెందిన నరేందర్ 2022 ఆసియా క్రీడల్లో 92 కేజీల విభాగంలో భారత్‌కు కాంస్య పతకాన్ని అందించాడు.

- అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) నుంచి తాత్కాలిక గుర్తింపు లభించిన అనంతరం వరల్డ్ బాక్సింగ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తొలి టోర్నీ ప్రపంచకప్ కావడం గమనార్హం. ఆర్థిక అవకతవకలు, అవినీతి ఆరోపణలు, ఇతరత్రా కారణాలతో అంతర్జాతీయ బాక్సింగ్ సమాఖ్య (ఐబీఏ)పై ఐఓసీ వేటు వేసింది. ఐబీఏ స్థానంలో కొత్తగా ఏర్పాటైన వరల్డ్ బాక్సింగ్‌కు గుర్తింపు ఇచ్చింది. వరల్డ్ బాక్సింగ్, ఐఓసీ పర్యవేక్షణలో 2028 లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్‌లో బాక్సింగ్ పోటీలు జరుగుతాయి.
- ఇక తొలి ప్రపంచకప్ విషయానికొస్తే కొత్త వెయిట్ కేటగిరీలలో పురుషుల, మహిళల విభాగాల్లో బౌట్‌లు నిర్వహించనున్నారు. అయితే భారత జట్టు కేవలం పురుషుల విభాగంలో మాత్రమే పోటీపడుతోంది. గత గురువారమే జాతీయ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్ ముగియడంతో భారత మహిళల జట్టును ప్రపంచకప్ కోసం ఎంపిక చేయలేదు.
- గత జనవరిలో జరిగిన జాతీయ పురుషుల చాంపియన్‌షిప్‌లో ఆయా వెయిట్ కేటగిరీల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన బాక్సర్లు వారం రోజుల శిబిరం కోసం బ్రెజిల్‌కు వెళ్లారు. గత ఏడాది పారిస్ ఒలింపిక్స్ ముగిశాక భారత అగ్రశ్రేణి బాక్సర్లు పోటీపడుతున్న మేజర్ ఈవెంట్ ఇదే కానుండటం విశేషం. సుమిత్ (85 కేజీలు) మినహా ప్రస్తుత భారత జాతీయ చాంపియన్లందరూ వరల్డ్‌కప్‌లో బరిలోకి దిగుతున్నారు.
- పారిస్ ఒలింపిక్స్‌లో పోటీపడ్డ నిశాంత్ దేవ్, అమిత్ పంఘాల్ ప్రొఫెషనల్స్‌గా మారడం... వెటరన్ బాక్సర్ శివ థాపాతోపాటు 2023 ప్రపంచ చాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత దీపక్ భోరియాలకు భారత జట్టులో చోటు లభించలేదు.
- ప్రపంచకప్ తొలి రోజు భారత్ నుంచి లక్ష్య చహర్ మాత్రమే బరిలోకి దిగనున్నాడు. 80 కేజీల ప్రిక్వార్టర్ ఫైనల్లో లక్ష్య చహర్ బ్రెజిల్‌కు చెందిన వాండెర్లీ పెరీరాతో ఆడతాడు. భారత్ నుంచి ఇద్దరు బాక్సర్లకు నేరుగా సెమీఫైనల్‌కు ఎంట్రీ లభించింది. మరికొందరు విజయం సాధిస్తే సెమీఫైనల్లోకి ప్రవేశిస్తారు. ఓవరాల్‌గా ఈ టోర్నీలో భారత్‌కు కనీసం ఆరు పతకాలు లభించే అవకాశాలున్నాయి.

భారత పురుషుల బాక్సింగ్ జట్టు: జాదూమణి మండెంగ్‌బమ్ (50 కేజీలు), మనీశ్ రాథోడ్ (55 కేజీలు), సచిన్ సివాచ్ (60 కేజీలు), అభినాశ్ జమ్వాల్ (65 కేజీలు), హితేశ్ (70 కేజీలు), నిఖిల్ దూబే (75 కేజీలు), లక్ష్య చహర్ (80 కేజీలు), జుగ్నూ (85 కేజీలు), విశాల్ (90 కేజీలు), నరేందర్ బెర్వాల్ (ప్లస్ 90 కేజీలు).

రెండో వన్డేకు ఉస్మాన్ ఖాన్ దూరం



హామిల్టన్: న్యూజిలాండ్ జట్టుతో బుధవారం జరిగే రెండో వన్డే మ్యాచ్‌కు పాకిస్తాన్ జట్టు ఓపెనర్ ఉస్మాన్ ఖాన్ అందుబాటులో ఉండటం లేదు. న్యూజిలాండ్‌తో తొలి వన్డే సందర్భంగా ఫీల్డింగ్ చేస్తున్న సమయంలో ఉస్మాన్ గాయపడ్డాడు. ఎంఆర్ఐ స్కాన్ నిర్వహించగా ఉస్మాన్ తొడ కండరాల్లో సన్నటి పగులు ఉన్నట్లు తేలింది. దాంతో అతను రెండో వన్డే నుంచి వైదొలిగాడు. న్యూజిలాండ్‌తో తొలి వన్డేతోనే అంతర్జాతీయ అరంగేట్రం చేసిన ఉస్మాన్ 39 పరుగులు సాధించాడు. మూడు వన్డేల సిరీస్‌లో పాకిస్తాన్ ప్రస్తుతం 0-1తో వెనుకబడి ఉంది.



భారత్ వేదికగా ఆసియా కప్ హాకీ టోర్నీ

న్యూఢిల్లీ: ఈ ఏడాది భారత్ మరో మెగా హాకీ టోర్నీకి ఆతిథ్యం ఇవ్వనుంది. ఆగస్టు 29 నుంచి సెప్టెంబర్ 7 వరకు జరిగే పురుషుల ఆసియా కప్ టోర్నమెంట్‌లో భారత్ వేదిక కానుంది. బిహార్‌లోని రాజ్‌గిర్ పట్టణంలో ఈ టోర్నీని నిర్వహిస్తారు. గత ఏడాది నవంబర్‌లో రాజ్‌గిర్‌లోనే మహిళల ఆసియా చాంపియన్స్ ట్రోఫీ జరిగింది. ఆ టోర్నీ విజయవంతం కావడంతో హాకీ ఇండియా బిహార్ హాకీ సంఘానికి ఆసియా కప్ నిర్వహణ హక్కులను కేటాయించింది. ఈ మేరకు సోమవారం బిహార్ స్పోర్ట్స్ అథారిటీతో ఒప్పందం చేసుకుంది. మొత్తం ఎనిమిది దేశాల మధ్య ఆసియా కప్ టోర్నీ జరుగుతుంది. భారత్, పాకిస్తాన్, జపాన్, కొరియా, చైనా, మలేసియా జట్లు తమ బెర్త్‌లను ఖరారు చేసుకోగా... ఆసియా హాకీ సమాఖ్య (ఏహెచ్‌ఎఫ్ కప్) క్వాలిఫయింగ్ టోర్నీ ద్వారా మరో రెండు జట్లు ఆసియా కప్‌కు అర్హత పొందుతాయి. ఆసియా కప్‌లో విజేతగా నిలిచిన జట్టు వచ్చే ఏడాది బెల్జియం-నెదర్లాండ్స్‌లలో జరిగే ప్రపంచకప్ టోర్నీకి నేరుగా అర్హత సాధిస్తుంది. ఆసియా కప్ టోర్నీ చరిత్రలో దక్షిణ కొరియా అత్యధికంగా ఐదుసార్లు చాంపియన్‌గా నిలిచింది. భారత్, పాకిస్తాన్ జట్లు చెరో మూడుసార్లు విజేతగా నిలిచాయి.

మెరిసిన సౌమ్య గుగులోత్

ఎదురులేని ఈస్ట్ బెంగాల్ ఎఫ్‌సీ



కల్యాణి (పశ్చిమ బెంగాల్): ఇండియన్ ఉమెన్ లీగ్ (ఐడబ్ల్యూఎల్) మహిళల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో ఈస్ట్ బెంగాల్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టు జోరు కొనసాగుతోంది. సోమవారం జరిగిన పదో రౌండ్ మ్యాచ్‌లో ఈస్ట్ బెంగాల్ జట్టు 6-1 గోల్స్ తేడాతో హోప్స్ ఫుట్‌బాల్ క్లబ్ జట్టుపై ఘనవిజయం సాధించింది. ఈస్ట్ బెంగాల్ జట్టుకు ఆడుతున్న తెలంగాణ అమ్మాయి, నిజామాబాద్ జిల్లాకు చెందిన సౌమ్య గుగులోత్ మరోసారి ఆకట్టుకునే ప్రదర్శన చేసింది. మ్యాచ్ మొదలైన 3వ నిమిషంలోనే సౌమ్య చేసిన గోల్‌తో ఈస్ట్ బెంగాల్ జట్టు ఖాతా తెరిచింది. ఈ లీగ్‌లో సౌమ్యకిది ఏడో గోల్ కావడం విశేషం. 7వ నిమిషంలో సంధ్య గోల్‌తో బెంగాల్ ఆధిక్యం 2-0కు పెరగగా... 11వ నిమిషంలో అచెయంగ్ గోల్‌తో బెంగాల్ ఖాతాలో మూడో గోల్ చేరింది. తొలి అర్ధభాగం ముగిసేసరికి ఈస్ట్ బెంగాల్ జట్టు 3-0 గోల్స్‌తో ఆధిక్యంలో నిలిచింది. రెండో అర్ధభాగంలోని 54వ నిమిషంలో కార్తీక ఈస్ట్ బెంగాల్‌కు నాలుగో గోల్‌ను అందించింది. 59వ నిమిషంలో గ్లాడీస్ గోల్‌తో హోప్స్ జట్టు ఖాతా తెరిచింది. స్టాపేజ్ టైమ్‌లో మంజిరి (90+2వ నిమిషంలో), ఎల్షాదాయ్ (90+3వ నిమిషంలో) బెంగాల్ జట్టుకు ఒక్కో గోల్ అందించారు. వెరసి ఈస్ట్ బెంగాల్ 6-1తో భారీ విజయాన్ని ఖరారు చేసుకుంది. ఎనిమిది జట్ల మధ్య జరుగుతున్న మహిళల ఫుట్‌బాల్ లీగ్‌లో ఇప్పటి వరకు ఈస్ట్ బెంగాల్ జట్టు 10 మ్యాచ్‌లు పూర్తి చేసుకుంది. తొమ్మిది మ్యాచ్‌ల్లో గెలిచి, ఒక మ్యాచ్‌లో ఓడిపోయింది. మొత్తం 27 పాయింట్లతో ఈస్ట్ బెంగాల్ జట్టు అగ్రస్థానంలో కొనసాగుతోంది.



శ్రీనిధి డెక్కన్ జట్టుకు ఎనిమిదో పరాజయం

కోజికోడ్: ఐ-లీగ్ జాతీయ పురుషుల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టు ఎనిమిదో పరాజయం చవిచూసింది. గోకులం కేరళ ఎఫ్‌సీ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో శ్రీనిధి డెక్కన్ జట్టు 0-1 గోల్ తేడాతో ఓటమి పాలైంది. ఆట 15వ నిమిషంలో థాబిసో బ్రౌన్ గోల్‌తో గోకులం కేరళ జట్టు 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత గోకులం జట్టు ఈ ఆధిక్యాన్ని నిలబెట్టుకొని ఈ సీజన్‌లో 11వ విజయాన్ని ఖరారు చేసుకుంది. 12 జట్లు పోటీపడుతున్న ఐ-లీగ్‌లో శ్రీనిధి డెక్కన్ జట్టు ఇప్పటి వరకు 21 మ్యాచ్‌లు పూర్తి చేసుకుంది. 7 మ్యాచ్‌ల్లో గెలిచింది. 6 మ్యాచ్‌లను 'డ్రా' చేసుకుంది. 8 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. ప్రస్తుతం శ్రీనిధి జట్టు 27 పాయింట్లతో ఎనిమిదో స్థానంలో ఉంది. శ్రీనిధి జట్టు తమ తదుపరి మ్యాచ్‌ను ఈనెల 5వ తేదీన హైదరాబాద్‌లోని సొంత మైదానం డెక్కన్ ఎరీనాలో స్పోర్టింగ్ క్లబ్ బెంగళూరు జట్టుతో ఆడుతుంది. గత మూడు సీజన్లలో శ్రీనిధి డెక్కన్ జట్టు నిలకడగా రాణిస్తోంది. 2021-2022 సీజన్‌లో మూడో స్థానంలో నిలిచిన శ్రీనిధి జట్టు 2022-2023 సీజన్‌లో రెండో స్థానంలో, 2023-2024 సీజన్‌లో రెండో స్థానంలో నిలిచింది. అయితే ఈసారి శ్రీనిధి డెక్కన్ జట్టు గత సీజన్ ప్రదర్శనను పునరావృతం చేయడంలో విఫలమైంది.

కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లో అనాహత్ సింగ్



న్యూఢిల్లీ: ప్రొఫెషనల్ స్క్వాష్ అసోసియేషన్ (పీఎస్ఏ) మహిళల సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో భారత రైజింగ్ స్టార్ అనాహత్ సింగ్ పురోగతి సాధించింది. సోమవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో 17 ఏళ్ల అనాహత్ సింగ్ కెరీర్ బెస్ట్ 62వ ర్యాంక్‌ను అందుకుంది. రెండు వారాల వ్యవధిలో స్వదేశంలో జరిగిన ఎస్ఆర్ఎఫ్ఐ ఓపెన్ టోర్నీలో, ఇండియన్ ఓపెన్ టోర్నీలో అనాహత్ విజేతగా నిలవడంతో ఆమె 16 స్థానాలు ఎగబాకింది. భారత్ నుంచి టాప్-100లో అనాహత్‌కు మాత్రమే చోటు దక్కడం గమనార్హం. పురుషుల సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో టాప్-100లో భారత్ నుంచి నలుగురు ఉన్నారు. రమిత్ టాండన్ 33వ ర్యాంక్‌లో, వెలవన్ సెంథిల్ కుమార్ 39వ ర్యాంక్‌లో కొనసాగుతుండగా... అభయ్ సింగ్ ఐదు స్థానాలు మెరుగు పర్చుకొని 49వ ర్యాంక్‌లో నిలిచాడు. వీర్ చోత్రాని ఒక స్థానం పురోగతి సాధించి 64వ ర్యాంక్‌లో నిలిచాడు.

నిద్రపై స్క్రీన్ ఎఫెక్ట్!

ఎక్కువ సేపు స్క్రీన్ చూస్తే నిద్రలేమి సమస్య 60 శాతం అధికం ● కొత్త అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ: రాత్రిళ్లు నిద్రపోయే ముందు ఎక్కువ సేపు ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్, స్మార్ట్‌ఫోన్, ట్యాబ్, టెలివిజన్ ఇలా ఏదైనా స్క్రీన్‌ను ఎక్కువసేపు చూస్తే వెంటనే చాలా మందికి నిద్రపట్టదు. చాలా సేపటి తర్వాత నిద్రలోకి జారుకుంటారు. ఈ సమస్య రానురాను శాశ్వతంగా ఉండిపోయి నిద్రలేమి సమస్యకు దారితీస్తుందని తాజా అధ్యయనంలో వెల్లడైంది. ఇన్సోమ్నియాగా పిలిచే నిద్రలేమి సమస్య బారినపడే అవకాశాలు ఏకంగా 60 శాతం అధికమవుతాయని ఈ కొత్త పరిశోధనలో తేలింది. సంబంధిత పరిశోధనా తాలూకు వివరాలు ఇటీవల 'ఫ్రంటియర్స్ ఇన్ సైకియాట్రీ'అనే జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.



వేల మందిపై పరిశోధన

అధ్యయనంలో భాగంగా నార్వేలో 18 నుంచి 28 ఏళ్ల వయసు ఉన్న 45,000 మందికిపైగా విద్యార్థుల రోజువారీ జీవనశైలి వివరాలను సేకరించారు. రోజూ ఏ సమయానికి నిద్రపోతారు, రాత్రిళ్లు నిద్రపోవడానికి ముందు ఎంతసేపు స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్, టెలివిజన్ చూస్తారు, తర్వాత ఎంతసమయానికి నిద్రపడుతుంది, వంటి ఎన్నో వివరాలను రాబట్టారు. డిజిటల్ పరికరాలను వాడేటప్పుడు సినిమాలు చూస్తారా, సోషల్ మీడియా ఖాతాలను చెక్ చేస్తారా వంటి వివరాలను సేకరించారు. ''సోషల్ మీడియా మాధ్యమాల చూడటం కోసం వెచ్చించి సమయం, ఇతర కార్యక్రమాలను చూడటానికి కేటాయించిన సమయాల్లో పెద్ద తేడాలులేవు. ఏ రకం డివైజ్‌ను వాడారు అన్న దానికంటే అసలు ఎంత సమయం వాడారు అనేదే ఇక్కడ ప్రధానం. స్క్రీన్ ఎక్కువసేపు చూడటం వల్ల అంతసేపు నిద్రను వాయిదావేస్తున్నారు. దాంతోపాటు స్క్రీన్ వాడకం వల్ల తర్వాత సైతం నిద్రపట్టక ఇబ్బందిపడుతున్నారు. ఇలా దాదాపు 30 నిమిషాలకంటే ఎక్కువ సమయం నిద్రలోకిజారుకోవడానికి అవస్థలు పడుతున్నారు. నిద్రపట్టక మధ్యలో బెడ్ మీద నుంచి లేచి వచ్చి కొద్దిసేపు అటూ ఇటూ నడవడం లాంటివి చేస్తున్నారు''అని నార్వేనియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్‌లో పరిశోధకుడు, పరిశోధనలో కీలక సభ్యుడు గన్‌హీల్డ్ జాన్సన్ హెజెట్‌ల్యాండ్ చెప్పారు.

రోజంతా ఇబ్బంది

''ఇలా రాత్రిళ్లు స్క్రీన్ చూసి నిద్రపట్టక కాస్త ఆలస్యంగా నిద్రపోయిన వారు తెల్లారాక సైతం ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి నాణ్యమైన నిద్రలేకపోవడంతో తదుపరి రోజంతా దైనందిన జీవిత పనులను సవ్యంగా చేసుకోలేకపోతున్నారు. అధిక స్క్రీన్ వినియోగం అనేది నాలుగు రకాలుగా ఇబ్బందులు పెడుతోంది. తరచూ నోటిఫికేషన్లు టింగ్ టింగ్‌మని వస్తూ నిద్రను పాడుచేస్తాయి. నిద్రపోయే సమయాన్ని స్క్రీన్‌టైమ్ అనేది మింగేస్తోంది. స్క్రీన్‌చూసినంతసేపు నిద్రపోలేని పరిస్థితి ఉండటంతో ఆమేరకు నిద్ర తగ్గుతోంది. అంతసేపు స్క్రీన్ నుంచి వచ్చే కాంతి ప్రభావానికి లోనవడంతో శరీరంలోని జీవగడియారం సైతం సరిగా పనిచేయదు''అని జాన్సన్ వివరించారు.

ఎన్నో సమస్యలు

స్క్రీన్ టైమ్ కారణంగా నిద్ర మాత్రమే తగ్గి కేవలం ఇన్సోమ్నియా బారిన పడతామని భావించకూడదు. అది రోజువారీ జీవితంపైనా ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా విద్యార్థుల మానసిక ఆరోగ్యం మెల్లగా దెబ్బతింటుంది. విద్యా ప్రమాణాలు పడిపోతాయి. సగటున 24 నిమిషాల నిద్రా కాలం తగ్గిపోతుంది. మొత్తంగా విద్యా, ఆరోగ్యం, మానసిక సంబంధ స్థాయిలు దిగజారుతాయి. ఈ సమస్యలు శాశ్వతంగా ఉండకూడదంటే నిద్రకు ఉపక్రమించడానికి కనీసం గంటముందే స్క్రీన్‌ను చూడటం ఆపేయాలి. స్మార్ట్‌ఫోన్‌లో హోమ్‌పేజీపై నోటిఫికేషన్లు కనపడకుండా డిజేబుల్ చేయాలి''అని జాన్సన్ సూచించారు.

భక్తి శ్రద్ధలతో ఈద్









వలసల్లో భేష్... సుంకాల్లో తుస్

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయాలపై జనాభిప్రాయం

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అక్రమ వలసలపై కఠినంగా వ్యవహరిస్తున్నారు. విదేశీ ఉత్పత్తులపై సుంకాలు పెంచేస్తున్నారు. ఎన్ని విమర్శలు వచ్చినా వెనక్కి తగ్గే ప్రసక్తే లేదంటున్నారు. తన నిర్ణయాలకు తిరుగేలేదు అన్నట్లుగా ముందుకెళ్తున్నారు. ఉంటే ఉండండి పోతే పోండి అంటున్నట్లుగా ట్రంప్ ధోరణి సాగుతోంది. అయితే, ఆయన చర్యలపై అమెరికన్ల అభిప్రాయం ఎలా ఉందన్నది ఆసక్తిగా మారింది. వలసలను నియంత్రించే విషయంలో ట్రంప్‌ను మెజార్టీ అమెరికా పౌరులు సమర్థిస్తుండడం గమనార్హం. కానీ, టారిఫ్‌ల విషయంలో ఆయన చేష్టలను వారు తప్పుపడుతున్నారు. టారిఫ్‌ల పెంపు వల్ల దీర్ఘకాలంలో అమెరికాకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. 'ద అసోసియేటెడ్ ప్రెస్–ఎన్‌ఓఆర్సీ సెంటర్ ఫర్ పబ్లిక్ అఫైర్స్ రీసెర్చ్'తాజా సర్వేలో అమెరికన్లు తమ అభిప్రాయాలు వెల్లడించారు. వలసలపై ట్రంప్ వైఖరిని సగానికి పైగా జనం ఆమోదించారు. ఇక టారిఫ్‌లు, ఆర్థికవ్యవస్థ, వాణిజ్య వ్యవహారాలపై ఆయన నిర్ణయాలను ప్రతి 10 మంది కేవలం నలుగురే సానుకూలంగా స్పందించారు. అక్రమ వలసదార్లను బయటకు పంపిస్తుండడం, ఇకపై ఎవరూ చట్టవిరుద్ధంగా అమెరికాలో అడుగుపెట్టకుండా చర్యలు తీసుకుంటుండడం మంచి నిర్ణయమని చాలామంది హర్షం వ్యక్తంచేశారు. ఇప్పటిదాకా అధ్యక్షుడిగా ట్రంప్ పనితీరు పట్ల ప్రతి పది మందిలో ఆరుగురు అసంతృప్తి వ్యక్తంచేశారు. ఆయనపై సానుకూలత కంటే ప్రతికూలతే అధికంగా ఉన్నట్లు సర్వేలో తేలింది. సొంత పార్టీ అయిన రిపబ్లికన్ నేతలు, సభ్యులు ట్రంప్ పనితీరుకు మంచి మార్కులే వేశారు. వలసల విషయంలో ప్రతి 10 మంది 9 మంది, టారిఫ్‌ల విషయంలో ప్రతి 10 మందిలో ఏడుగురు ట్రంప్‌ను సమర్థించారు.

పుతిన్, జెలెన్‌స్కీ మధ్య అంతులేని విద్వేషం

- శాంతి యత్నాలను ముందుకు సాగనివ్వడం లేదు
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆగ్రహం

వాషింగ్టన్: రష్యా, ఉక్రెయిన్ అధినేతలు పుతిన్, జెలెన్‌స్కీలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి రుసరుసలాడారు. రష్యా–ఉక్రెయిన్ మధ్య యుద్ధాన్ని నివారించి, శాంతిని నెలకొల్పడానికి తాను చేస్తున్న ప్రయత్నాలను వారు ముందుకు సాగనివ్వడం లేదని మండిపడ్డారు. ఆ ఇద్దరు నాయకుల మధ్య అంతులేని విద్వేషం కనిపిస్తోందని చెప్పారు. అయినప్పటికీ యుద్ధాన్ని ముగించే విషయంలో ఇప్పటికే ఎంతో పురోగతి సాధించానని అన్నారు. ఆదివారం ఫ్లోరిడాలోని తన ప్రైవేట్ క్లబ్ 'మర్–అ–లాగో'లో 'ఎన్‌బీసీ న్యూస్'వార్తా సంస్థకు ట్రంప్ ఇంటర్వ్యూ ఇచ్చారు. జెలెన్‌స్కీ విశ్వసనీయతను పుతిన్ ప్రశ్నించడం తనకు నచ్చలేదని చెప్పారు. శాంతి ఒప్పందంపై సంతకం చేసే హక్కు జెలెన్‌స్కీకి లేదని, ఉక్రెయిన్‌కు బాహ్య పరిపాలన అవసరమని పుతిన్ చేసిన వ్యాఖ్యల పట్ల ట్రంప్ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. ఇకనైనా పద్ధతి మార్చుకోకపోతే రష్యాపై మరిన్ని ఆంక్షలు విధిస్తామని పరోక్షంగా సంకేతాలిచ్చారు. రెండోసారి అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత పుతిన్ పట్ల సానుకూల ధోరణితో మాట్లాడిన అమెరికా అధ్యక్షుడు హఠాత్తుగా స్వరం మార్చేయడం చర్చనీయాంశంగా మారింది. ఉక్రెయిన్–రష్యా యుద్ధం విషయంలో తాను అనుకున్నది అనుకున్నట్లుగా జరగకపోవడం పట్ల ఆయన ఆగ్రహంతో ఉన్నట్లు తెలుస్తోంది.

క్రిటికల్ మినరల్స్ మైనింగ్‌పై మాట తప్పితే..

ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని నిలిపివేస్తానంటూ పుతిన్ తనకు హామీ ఇచ్చారని, ఈ విషయంలో ఆయన వెనక్కి తగ్గబోరని భావిస్తున్నట్లు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. పుతిన్ తనకు ఎన్నో ఏళ్లుగా తెలుసని, తాము కలిసి పనిచేస్తామని అన్నారు. కాల్పుల విరమణకు పుతిన్ ఎప్పుడు అంగీకరిస్తారో చెప్పలేనని, దానిపై సైకలాజికల్ డెడ్‌లైన్ ఉందని వెల్లడించారు. ఉక్రెయిన్‌కు ఇన్నాళ్లూ అందించిన ఆర్థిక, సైనిక సాయానికి బదులుగా అరుదైన ఖనిజాల తవ్వకానికి అమెరికాకు అనుమతి ఇవ్వడానికి జెలెన్‌స్కీ అంగీకరించిన సంగతి తెలిసిందే. అయితే, విషయంలో జెలెన్‌స్కీ మోసం చేసే అవకాశం ఉన్నట్లు తమకు సమాచారం అందని ట్రంప్ చెప్పారు. క్రిటికల్ మినరల్స్ మైనింగ్ విషయంలో మాట తప్పితే చాలాచాలా పెద్ద సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని జెలెన్‌స్కీని ట్రంప్ తీవ్రంగా హెచ్చరించారు. ఉక్రెయిన్ భద్రతకు స్పష్టమైన హామీని ఇవ్వాలంటూ మిత్రదేశాలతో ఒప్పందం కుదుర్చుకోవాలన్న ఆలోచనలో జెలెన్‌స్కీ ఉన్నట్లు తెలిపారు. ఉక్రెయిన్‌కు 'నాటో'సభ్యత్వం లభించే అవకాశమే లేదని, ఆ విషయం జెలెన్‌స్కీకి కూడా తెలుసని తేల్చిచెప్పారు. సాధ్యమైనంత త్వరగా కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకోవాలని ట్రంప్ ప్రభుత్వం చెబుతుండగా పుతిన్ ప్రభుత్వం అంగీకరించడంలేదు. కనీసం 30 రోజులపాటు దాడులు ఆపేయాలని కోరినా లెక్కచేయడం లేదు. పైగా ఉక్రెయిన్‌పై వైమానిక, క్షిపణి దాడులను మరింత ఉధృతం చేస్తుండడం గమనార్హం.

పాలస్తీనియన్లను పొట్టనబెట్టుకున్న హమాస్

- యుద్ధం ఆపి, గద్దె దిగాలంటూ నిరసన చేసిన ఫలితం
- ఆరుగురిని చంపేసిన హమాస్ సాయుధులు

డెయిర్ అల్ బలాహ్: మీ కోసం పోరాడుతుంటే మాపైనే నిరసన జెండా ఎగరేస్తారా? అంటూ హమాస్ సాయుధబలగాలు కన్నెర్రజేశాయి. పాలస్తీనియన్లలో ఆందోళనబాటపట్టిన వారిని అంతమొందించాయి. దాదాపు 17 నెలలుగా పాలస్తీనియన్లకు మద్దతుగా ఇజ్రాయెల్‌తో పోరాడుతున్న హమాస్‌కు గత వారం అనూహ్య ప్రతిఘటన ఎదురైన విషయం తెల్సిందే. సొంత పాలస్తీనియన్లే నిరసన ప్రదర్శనలు చేయడంతో హమాస్‌లో ఆగ్రహావేశాలు కట్టలు తెంచుకున్నాయని అంతర్జాతీయ మీడియాలో వార్తలొచ్చాయి. గత వారం నిరసన ప్రదర్శనలకు కారకులైన వారిలో ఆరుగురిని చంపేసినట్లు తెలుస్తోంది. ఆందోళనల్లో పాల్గొన్న వారికి గుర్తించి చితకబాదారని సమాచారం. చాలా మందిని కిడ్నాప్ చేశారని, ఇంకొందరి ఆచూకీ గల్లంతైందని, పలువురు అదృశ్యమయ్యారని సామాజిక మాధ్యమాల్లో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. గత వారం ఉత్తర గాజాలోని బీట్ లాహియాలో వందలాది మంది పాలస్తీనియన్లు శాంతియుతంగా ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టడం తెల్సిందే. ''మాకు యుద్ధం వద్దు. హమాస్ అసలే వద్దు''అంటూ నినాదాలు చేస్తున్న వీడియోలు నాడు వైరల్‌గా మారాయి. ఇజ్రాయెల్–హమాస్ యుద్ధం మొదలైననాటి నుంచి ఎన్నడూ చూడని ఈ అనూహ్య, అరుదైన ఘటన హమాస్ సాయుధ విభాగానికి పట్టరాని కోపం తెప్పించిందని తెలుస్తోంది. ఆరుగురు పాలస్తీనియన్లను బహిరంగంగా చంపేశారని, వారిలో గాజా సిటీ సమీప టెల్ అల్–హవా ప్రాంతానికి చెందిన 22 ఏళ్ల ఒడే నజీర్ అల్ రాబాస్ కూడా ఉన్నాడని వార్తలొచ్చాయి. ''జనాలను ఇళ్ల నుంచి ఈడ్చుకొచ్చి మరీ నడిరోడ్డుపై కొట్టారు. హమాస్‌కు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు చేస్తే ఎంతటి తీవ్ర పరిణామాల ఉంటాయో మీకు తెలియాలి అంటూ నజీర్ కుటుంబసభ్యులను హమాస్ సాయుధులు హెచ్చరించారు''అని రమల్లాలోని ఫతాహ్ అనుబంధ పోలీస్ అధికారి, హమాస్ విధానాలను తీవ్రంగా విమర్శించే మజెన్ షాత్ చెప్పారు. నిరసనల్లో పాల్గొన్న మరో వ్యక్తిని నుసేరాత్ శరణార్థి శిబిరం కూడలి వద్ద నిలబెట్టి కాళ్లపై షూట్‌చేశారని మరో ప్రత్యక్ష సాక్షి చెప్పారు. ''గాజా ప్రజలంతా హమాస్‌కు మద్దతు పలకాలన్న నియమం లేదుగా. నెలల తరబడి యుద్ధంతో విసిగిపోయిన ప్రజల్లో కొందరు స్వేచ్ఛగా తమ వాణిని వినిపిస్తే ఇలా దారుణాలకు ఒడిగడతారా?''అని బ్రిటన్‌కు వలసపోయిన గాజావాసి హబీబ్ ఆవేదన వ్యక్తంచేశారు.

రైలు కింద పడి జేఈఈ అభ్యర్థి బలవన్మరణం

ఈ ఏడాదిలో కోటాలో ఇప్పటి వరకు 10 మంది మృతి

కోటా: రాజస్తాన్‌లోని కోటాలో జేఈఈ మెయిన్ పరీక్ష కోసం ప్రిపేరవుతున్న ఇంజనీరింగ్ విద్యార్థి ఒకరు బలవన్మరణం చెందారు. ఈ ఘటనతో ఈ ఏడాదిలో కోటాలో కోచింగ్ తీసుకుంటూ చనిపోయిన విద్యార్థుల సంఖ్య పదికి చేరుకుంది. యూపీలోని కాన్పూర్‌కు చెందిన ఉజ్వల్ మిశ్రా(18) కోటాలోని ఓ ఇన్‌స్టిట్యూట్‌లో రెండేళ్లుగా కోచింగ్ తీసుకుంటున్నాడు. ఏప్రిల్ 2వ తేదీన లక్నోలోని ఓ సెంటర్‌లో పరీక్ష రాయాల్సి ఉంది. ఇతడిని తీసుకెళ్లేందుకు తండ్రి దీపక్ కుమార్ మిశ్రా సోమవారం కోటా చేరుకున్నారు. అయితే, ఆదివారం సాయంత్రం స్థానిక రాజీవ్ గాంధీ నగర్‌లో ఉన్న హాస్టల్ నుంచి బయటకు వచ్చిన ఉజ్వల్ రైల్వే స్టేషన్‌కు వెళ్లాడు. రాత్రి 7 గంటల సమయంలో పట్టాలపై పడుకున్న అతడిపైగా రైలు వెళ్లిందని పైలట్ తెలిపారు. ఆ వెంటనే రైల్వే పోలీసులకు విషయం తెలిపానన్నారు. ఆ సమయంలో వేగంగా వెళ్తున్న రైలును ఆపడం సాధ్యం కాలేదన్నారు. ఉజ్వల్ వద్ద ఎలాంటి సూసైడ్ నోట్ లభ్యం కాలేదని పోలీసులు తెలిపారు. విషయం తెలిసిన దీపక్ కుమార్ మిశ్రా హతాశుడయ్యారు. పరీక్షకు సరిగ్గా ప్రిపేరవ్వలేదని ఉజ్వల్ తనతో అన్నాడని హాస్టల్‌లో ఉండే ఓ విద్యార్థి పోలీసులకు తెలిపాడు. దీపక్‌కుమార్ మిశ్రా లక్నోలో వ్యవసాయ శాస్త్రవేత్తగా పనిచేస్తున్నారు. ఉజ్వల్ ఆత్మహత్య ఘటనపై కేసు నమోదు చేసి, పోలీసులు దర్యాప్తు చేపట్టారు. తాజా ఘటనతో ఈ ఏడాదిలో పోటీ పరీక్షలకు పేరున్న కోటాలో ప్రాణాలు తీసుకున్న విద్యార్థుల సంఖ్య పదికి చేరింది. వీరిలో జనవరిలోనే ఐదుగురు జేఈఈ, ఒక నీట్ అభ్యర్థి ఆత్మహత్య చేసుకోవడం గమనార్హం. కోటాలో 2024లో కోచింగ్ తీసుకుంటున్న 17 మంది, అంతకుముందు 2023లో 26 మంది తనువు చాలించారు.

రైలు ప్రమాదాలను అరికట్టేందుకు కవచ్ 4.0 వెర్షన్

5,743 కిలోమీటర్ల ఆప్టికల్ ఫైబర్ కేబుల్ పూర్తి: అశ్విని వైష్ణవ్

సాక్షి, న్యూఢిల్లీ: రైలు ప్రమాదాలను అరికట్టి, ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించే 'కవచ్–4.0'వెర్షన్‌ను స్వదేశీ టెక్నాలజీతో గత ఏడాది అందుబాటులోకి తెచ్చినట్లు రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. లోకో పైలెట్ విఫలమైన సమయంలో బ్రేకులను కంట్రోల్ చేస్తూ రైలు నడపడంలో కవచ్ ఎంతో సాయపడుతుందన్నారు. ప్యాసింజర్ రైళ్లపై మొదటి ఫీల్డ్ ట్రయల్స్‌ను 2016 ఫిబ్రవరిలో ప్రారంభించగా, 2018–19లో 'కవచ్–3.2'వెర్షన్ వచ్చిందన్నారు. ఈ రెండింటి ఆధారంగా 2020 జూలైలో 'కవచ్'ను జాతీయ ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్(ఏటీపీ)గా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. దక్షిణ మధ్య రైల్వేలో 1,465 కిలోమీటర్ల మార్గంలో 'కవచ్–3.2'వెర్షన్‌ను అమలు చేశామన్నారు. దీని ఆధారంగా మరిన్ని మార్పులు, చేర్పులతో 'కవచ్ స్పెసిఫికేషన్ వెర్షన్–4.0'ను గత ఏడాది ఆమోదించినట్లు చెప్పారు. దీనికోసం 5,743 కిలోమీటర్ల మేర ఆప్టికల్ ఫైబర్ కేబుల్ పూర్తి చేయడంతోపాటు 540 టెలికాం టవర్లను స్థాపించి 664 స్టేషన్లలో కవచ్ సదుపాయం అందించామన్నారు. కవచ్‌ను కవర్ చేసేందుకు 15 వేల కిలోమీటర్ల మేర ట్రాక్ సైడ్ పనులకు బిడ్లు ఆహ్వానించినట్లు తెలిపారు.

ఆరోగ్య వసతులను మెరుగుపర్చాం: అమిత్ షా

హిసార్: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం గత దశాబ్దకాలంలో దేశంలోని ఆరోగ్య మౌలిక వసతులను సమగ్రంగా మెరుగుపర్చిందని హోం మంత్రి అమిత్ షా చెప్పారు. అన్ని స్థాయిల్లోనూ వనరుల అభివృద్ధి జరిగిందన్నారు. సోమవారం మంత్రి హరియాణాలోని అగ్రోహాలో మహారాజా అగ్రసేన్ విగ్రహావిష్కరణ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. మోదీ ప్రభుత్వ హయాంలో దేశంలోని 25 కోట్ల మంది ప్రజలను పేదరికం నుంచి బయటపడేశామన్నారు. పేదల కోసం నాలుగు కోట్ల పక్కా ఇళ్లు నిర్మించి, 20 కోట్ల మందికి నీడ కల్పించినట్లు చెప్పారు. మోదీ ప్రధాని అయ్యేనాటికి దేశంలో ఉన్న ఏడు ఎయిమ్స్‌లో ఆరు వాజ్‌పేయి హయాంలో ఏర్పాటు చేసినవే ఉన్నాయని గుర్తు చేశారు. దేశంలో ఇప్పుడు మొత్తం 23 ఎయిమ్స్ పనిచేస్తున్నాయని వివరించారు. వైద్య కళాశాలల సంఖ్య 387 నుంచి 766కు పెరిగిందని, ఈ కాలేజీల్లో సీట్ల సంఖ్య 51 వేల నుంచి ఏకంగా 1.15 లక్షలకు చేరిందని తెలిపారు. వచ్చే ఐదేళ్లలో మరో 85 వేల సీట్లు జత కలుస్తాయని అమిత్ షా చెప్పారు. జిల్లాకో ప్రధాన ఆస్పత్రిని ఏర్పాటు చేయాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. వచ్చే ఐదేళ్లలో మెడికల్ కాలేజీ ఆస్పత్రి లేని జిల్లా దేశంలో ఒక్కటి కూడా ఉండదని స్పష్టం చేశారు.

నోబెల్ శాంతి బహుమతికి ఇమ్రాన్ పేరు సిఫార్సు

ఇస్లామాబాద్: పాకిస్తాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్(72) నోబెల్ శాంతి బహుమతికి నామినేట్ అయ్యారు. పాక్‌లో మానవహక్కులు, ప్రజాస్వామ్యం కోసం కృషి చేస్తున్న ఇమ్రాన్ పేరును తాము ప్రతిపాదించినట్లు పాకిస్తాన్ వరల్డ్ అలయెన్స్(పీడబ్ల్యూఏ) తెలిపింది. నార్వేకు చెందిన పార్టియెట్ సెంట్రుమ్ అనే రాజకీయ పార్టీ దీనిని గతేడాది డిసెంబర్‌లో నెలకొల్పింది. ఇమ్రాన్‌ను నామినేట్ చేసిన విషయాన్ని ఆదివారం పార్టియెట్ సెంట్రుమ్ 'ఎక్స్'లో ప్రకటించింది. నార్వేకు చెందిన నోబెల్ కమిటీ శాంతి బహుమతి విజేతలను ఎంపిక చేసే సుదీర్ఘమైన 8 నెలల ప్రక్రియ కోసం ఏటా నామినేషన్లను ఆహ్వానిస్తుంటుంది.

యెమెన్‌పై అమెరికా భీకర దాడులు

దుబాయ్: యెమెన్‌లోని హౌతీ రెబల్స్ స్థావరాలే లక్ష్యంగా సోమవారం ఉదయం అమెరికా భారీ వైమానిక దాడులకు పాల్పడింది. రాజధాని సనా చుట్టుపక్కల ప్రాంతాలపై జరిగిన దాడుల్లో కనీసం ముగ్గురు మృతి చెందగా, 12 మంది గాయపడినట్లు హౌతీలు ప్రకటించారు. ఇతర నష్టం వివరాలు తెలియాల్సి ఉంది.

రఫా నుంచి వెళ్లిపోండి: ఇజ్రాయెల్

డెయిర్ అల్–బలాహ్: గాజాలోని దక్షిణ ప్రాంత రఫా నుంచి వెళ్లిపోవాలంటూ పాలస్తీనియన్లకు ఇజ్రాయెల్ ఆర్మీ హెచ్చరికలు చేసింది. మరోసారి ఈ నగరంపై భూతల దాడులకు ఇజ్రాయెల్ సన్నాహాలు చేస్తున్నట్లుగా భావిస్తున్నారు. నగరంలోని దాదాపు అన్ని ప్రాంతాల వారికి ఈ మేరకు హుకుం జారీ చేసింది. వీరంతా మువాసి వైపు వెళ్లిపోవాలని సూచించింది. కాల్పుల విరమణ షరతులకు తలొగ్గేలా హమాస్‌పై ఒత్తిడి పెంచేందుకు ఇజ్రాయెల్ సైన్యం ఇప్పటికే గాజా వాసులకు ఆహారం, ఇంధనం, మందులు, ఇతర మానవతా సాయాన్ని అందకుండా దిగ్బంధించడం తెల్సిందే.

అమెరికాలోనే చనిపోతా: ఎలాన్ మస్క్

విస్కాన్సిన్: టెక్ బిలియనీర్ ఎలాన్ మస్క్ అమెరికా పట్ల తన తిరుగులేని నిబద్ధతను ప్రకటించారు. 'నేను ఎక్కడికీ వెళ్లను. అమెరికాలోనే ఉంటా. ఇక్కడే చచ్చిపోతా. అంగారక గ్రహం మీదికి నేను వెళ్లినా అది కూడా అమెరికాలో భాగంగానే ఉండిపోతుంది'అంటూ ఆదివారం విస్కాన్సిన్ టౌన్‌హాల్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా మస్క్ ఇద్దరు విస్కాన్సిన్ ఓటర్లకు పది లక్షల విలువైన చెక్కులను అందజేశారు. తన రాజకీయ గ్రూపునకు వీరిద్దరినీ ప్రతినిధులుగా ప్రకటించారు. త్వరలో జరగనున్న విస్కాన్సిన్ సుప్రీం కోర్టు ఎన్నికలు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అజెండాకు, నాగరికత భవిష్యత్తుకు కీలకమైనవని పేర్కొన్నారు.

ఆస్తుల వివరాలివ్వని ఐఏఎస్‌లకు జరిమానాలు

పార్లమెంటరీ కమిటీ సూచన

న్యూఢిల్లీ: ఆస్తుల వివరాలను నిర్దేశిత గడువులోగా అందజేయని ఐఏఎస్ అధికారులపై జరిమానా విధించడం వంటి చర్యలు తీసుకోవాలని పార్లమెంటరీ కమిటీ ప్రభుత్వానికి సూచించింది. 2024లో 91 మంది ఐఏఎస్ అధికారులు తమ స్థిరాస్తుల రిటర్నుల(ఐపీఆర్)ను సమర్పించలేదని, అంతకుముందు ఈ సంఖ్య73గా ఉందని తెలిపింది. సిబ్బంది వ్యవహారాల శాఖకు సంబంధించిన పార్లమెంటరీ కమిటీ మార్చి 27వ తేదీన పార్లమెంట్‌కు సమర్పించిన నివేదికలో ఈ వివరాలను పేర్కొంది. కొన్ని పోస్టుల్లోని అధికారులు ఐపీఆర్ దాఖలు చేయడం తప్పనిసరి. అయినప్పటికీ, ఐపీఆర్ ఇవ్వకపోవడంతో 2023లో 15 మంది, 2022లో 12 మంది, 2021లో 14 మంది అధికారులను ఆయా పోస్టుల్లో చేరనివ్వలేదని తెలిపింది. ఐఏఎస్‌లంతా తప్పనిసరిగా రిటర్నులు దాఖలు చేసేలా ఒక పర్యవేక్షణ విభాగాన్ని ఏర్పాటు చేయాలని కమిటీ సూచించింది. ఐపీఆర్‌లు ఇవ్వని వారిపై జరిమానాలు విధించడం వంటి చర్యలు కూడా తీసుకోవాలంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 1,316 మంది ఐఏఎస్ అధికారుల కొరత ఉందని, డిమాండ్‌కు అనుగుణంగా ఎంపిక ప్రక్రియను వేగవంతం చేయాలని కోరింది. ఇందులో భాగంగా చంద్రమౌళి కమిటీ నివేదికలోని అంశాలను అమలు చేయాలని తెలిపింది.

కన్యత్వ పరీక్షకు బలవంతం చేయరాదు

ఛత్తీస్‌గఢ్ హైకోర్టు స్పష్టీకరణ

బిలాస్‌పూర్: కన్యత్వ పరీక్షకు చేయించుకోవాలంటూ మహిళను బలవంతం చేయరాదని ఛత్తీస్‌గఢ్ హైకోర్టు స్పష్టం చేసింది. ఇటువంటి చర్య రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులకు గుండెకాయ వంటిదైన ఆర్టికల్ 21కు విరుద్ధమంది. జీవించే హక్కుకు, గౌరవానికి భంగం కలిగించరాదని, మహిళలకు ఇది కీలకమైనది పేర్కొంది. వేరొకరితో అక్రమ సంబంధం నెరపుతున్న తన భార్యకు కన్యత్వ జరిపించేలా ఆదేశాలివ్వాలంటూ ఓ వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టుపై వ్యాఖ్యలు చేసింది. నపుంసకుడైన భర్తతో కలిసి జీవించలేనని ఆ మహిళ ఆరోపించగా స్పందించిన న్యాయస్థానం..ఇది అబద్ధమని రుజువు చేసుకోవాలంటూ వైద్య పరీక్షలకు సిద్ధం కావాలని పిటిషనర్‌ను కోరింది. లేదా అందుకు తగిన ఆధారాలు చూపించాలంది. జనవరి 9వ తేదీన ఈ మేరకు జారీ చేసిన ఆదేశాలు తాజాగా అందుబాటులోకి వచ్చాయి. ఇద్దరూ పరస్పరం చేసుకున్న ఆరోపణలకు సాక్ష్యాధారాలు అవసరమని, వాటితోనే కేసుకు ముగింపు పలకగలమని తెలిపింది. కోర్బా జిల్లాకు చెందిన వీరిద్దరూ 2023 ఏప్రిల్‌లో పెళ్లి చేసుకున్నారు. భర్తతో కొన్నాళ్లు ఉన్నాక మహిళ పుట్టింటికి వెళ్లిపోయింది. భర్త నపుంసకుడని, అతడితో కలిసి ఉండలేనని ఆరోపించింది. అతడి నుంచి నెలకు రూ.20 వేల భరణం ఇప్పించాలంటూ కుటుంబ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. దీంతో, ఆమె వేరొకరితో సంబంధం నెరుపుతోందని ఆరోపించిన భర్త.. కన్యత్వ పరీక్ష జరిపించాలంటూ పిటిషన్ వేశాడు. కుటుంబ న్యాయస్థానం ఈ పిటిషన్‌ను కొట్టేయడంతో హైకోర్టును ఆశ్రయించాడు. హైకోర్టు ఆదేశాలతో తిరిగి కేసు కుటుంబ న్యాయస్థానానికే చేరింది.

వక్ఫ్ బిల్లుకు సర్వం సన్నద్ధం

మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు వెల్లడి

న్యూఢిల్లీ: వక్ఫ్(సవరణ)బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం పూర్తి సన్నద్ధతతో ఉందని మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెన్ రిజిజు చెప్పారు. బిల్లులోని కొన్ని అంశాలకు సంబంధించి ప్రజలను తప్పుదోవపట్టించి, సమాజంలో ఉద్రిక్తతలను పెంచేందుకు కొన్ని పార్టీలు ప్రయత్నిస్తున్నాయని ఆయన ఆరోపించారు. ముస్లింలకు ప్రయోజనాలను అందించేందుకే ఈ బిల్లును రూపొందించామన్నారు. అయితే, ముస్లింలను రెచ్చగొట్టి రోడ్లపైకి తీసుకువచ్చేందుకు జరిగే ప్రయత్నాలు దేశానికి మంచివి కావని చెప్పారు. బిల్లు చట్టం రూపంలోకి వస్తే మసీదులు, ఖబరస్తాన్‌ల వంటి ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఆయన తిప్పికొట్టారు. పౌరసత్వ సవరణ బిల్లు సమయంలోనూ ఇలాంటి దుష్ప్రచారమే జరిగిందని గుర్తు చేశారు. బిల్లులోని వివరాలను పూర్తిగా అధ్యయనం చేసి, ప్రభుత్వంతో చర్చలు జరపాలని మంత్రి ప్రతిపక్షాలకు సూచించారు. ప్రతిపక్ష ఇండియా కూటమిలోని కొన్ని పార్టీలు సైతం ఈ బిల్లును తొందరగా ప్రవేశపెట్టాలని తనను కోరాయని మంత్రి వివరించారు. అందుకే, సాధ్యమైనంత త్వరగా ఈ బిల్లును ఆమోదింప జేసుకోవాలన్నదే తన ఉద్దేశమన్నారు. అయితే, బిల్లును ప్రవేశపెట్టే తేదీ ఇంకా నిర్ణయం కాలేదని తెలిపారు. మంగళవారం నుంచి పార్లమెంట్ సమావేశాలు పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆయనీ వ్యాఖ్యలు చేశారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఏప్రిల్ 4వ తేదీతో ముగియనున్నాయి. బిల్లు చట్టరూపం దాల్చాలంటే ఈలోగానే ఉభయ సభల ఆమోదం పొందాల్సి ఉంటుంది. బిల్లును ప్రవేశపెట్టడంపై మంగళవారం రాజకీయ పార్టీల నేతలతో మాట్లాడి చర్చించనున్నట్లు ప్రభుత్వం ఇప్పటికే సూచనప్రాయంగా తెలిపింది. దీన్ని బట్టి చూస్తే మంగళవారం వక్ఫ్ బిల్లును మొదటగా లోక్‌సభలో ప్రవేశపెట్టే అవకాశాలు కన్పిస్తున్నాయి. ముస్లింల ప్రయోజనాలకు భంగకరంగా ఉన్న ఈ బిల్లు చట్ట విరుద్ధమని ప్రతిపక్ష పార్టీలు గట్టిగా వ్యతిరేకిస్తున్నాయి. పలు సవరణలతో పార్లమెంట్ సంయుక్త కమిటీ ఆమోదం పొందిన బిల్లుకు వ్యతిరేకంగా పలు ముస్లిం సంస్థలు ర్యాలీలు సైతం చేపట్టాయి.

కుటుంబ గ్రంథాలు అని ఏ వేదాన్ని పిలుస్తారు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

భారతదేశ చరిత్ర

మాదిరి ప్రశ్నలు

1. కింది వాటిలో వృత్తాకార పట్టణ ప్రణాళిక కలిగిన హరప్పా నగరం?
   1) మొహంజోదారో 2) లోథాల్
   3) చన్హుదారో 4) బనవాలి
2. కింది వాటిలో హరప్పా ప్రజలు పూజించిన పక్షి?
   1) పావురం 2) నెమలి
   3) కాకి 4) గద్ద
3. హరప్పా ప్రజలు కింది వారిలో ఎవరితో అంతర్జాతీయ సంబంధాలను కలిగి ఉన్నారు?
   1) ఇరాన్ 2) ఈజిప్టు
   3) బహ్రెయిన్ 4) మెసపటోమియా
4. సరైన దాన్ని గుర్తించండి?

A) కాలిబంగన్	1. కుండలు
B) లోథాల్	2. టెర్రకోట బొమ్మలు
C) చన్హుదారో	3. పశుపతి ముద్రిక
D) మొహంజోదారో	4. ఇటుకతో నిర్మించిన ప్రాంగణం

కోడ్‌ల వరుసలు

	A)	B)	C)	D)
1)	1	3	4	2
2)	4	1	2	3
3)	3	2	4	1
4)	2	4	1	3

5. సింధూ లిపికి చిహ్నంగా సిరా పాత్ర లభించిన నగరం?
   1) చన్హుదారో 2) అమ్రి
   3) లోథాల్ 4) హరప్పా
6. గుర్రం ఆధారాలు లభించిన ప్రాంతం?
   1) హరప్పా, లోథాల్
   2) లోథాల్, రంగపూర్
   3) సుర్కొటోడా, బనవాలి
   4) సుర్కొటోడా, లోథాల్
7. సతి ఆచారాన్ని సూచించే సమాధి బయట పడిన సింధూనగరం?
   1) కాలిబంగన్ 2) హరప్పా
   3) లోథాల్ 4) కోట్‌డిజి
8. కింది వాటిలో సింధన్ అంటే?
   1) వరి 2) గోధుమ
   3) బార్లీ 4) పత్తి
9. కింది వాటిలో సరికాని జత?

సింధూ నగరాలు	ప్రస్తుత రాష్ట్రాలు
1) మొహంజోదారో	సింధూ రాష్ట్రం
2) రోపార్	పంజాబ్
3) మాండ	జమ్మూకశ్మీర్
4) దైమాబాద్	గుజరాత్

10. హరప్పా సంస్కృతికి చెందిన వ్యవసాయ పద్ధతులకు సంబంధించిన ఆధారాలు లభిస్తున్న ప్రాంతం?
    1) కాలిబంగన్, రోపార్
    2) లోథాల్, రంగపూర్
    3) చన్హుదారో, ఖేత్రి
    4) మొహంజోదారో, హరప్పా
11. నాగలిబొమ్మ బయటపడిన సింధూ నగరం?
    1) కాలిబంగన్ 2) బనవాలి
    3) లోథాల్ 4) రంగపూర్
12. సింధూ నాగరికత అవశేషాలను మొదటగా గుర్తించినవారు?
    1) చార్లెస్ మాసన్ 2) డి.ఆర్. సాహ్ని
    3) ఎం.ఎం.వీలర్ 4) ఎం.ఎస్.వాట్స్
13. కింది వాటిలో సింధూ ప్రజల దిగుమతులు, వాటి ప్రాంతాల్లో సరికానిది?


దిగుమతులు	ప్రాంతాలు
1) జేడ్	- మధ్య ఆసియా
2) స్టీ టైట్	- ఇరాన్
3) లేపిస్ లెజులి	- బదక్షాన్
4) రాగి	- మెసపటోమియా

14. అత్యధిక జనాభా కలిగిన సింధూ నగరం?
    1) హరప్పా 2) మొహంజోదారో
    3) కాలిబంగన్ 4) లోథాల్
15. ప్రపంచంలో తొలిసారిగా పత్తిని పండించిన వారు?
    1) ఈజిప్టు ప్రజలు 2) చైనీయులు
    3) సింధూ ప్రజలు
    4) మెసపటోమియన్లు
16. రుగ్వేదంలోని గాయత్రీమంత్రం ఏ దేవతకు సంబంధించింది?
    1) అదితి 2) ఉషస్సు
    3) సావిత్రి 4) అరణ్యాని
17. కింది నాలుగు వేదాలు - వాటి పురోహితులతో సరికాని జత?
    1) రుగ్వేదం- హోత్రి
    2) సామవేదం - ఉద్గాత్రి
    3) యజుర్వేదం - అధ్వర్యు
    4) అథర్వణ వేదం - బ్రాహ్మణుడు
18. కుటుంబ గ్రంథాలు అని ఏ వేదాన్ని పిలుస్తారు?
    1) రుగ్వేదం 2) సామవేదం
    3) యజుర్వేదం 4) అథర్వణ వేదం
19. ప్రసిద్ధమైన "తమసోమా జ్యోతిర్గమయ" అనే శ్లోకం ఏ గ్రంథంలో ఉంది?
    1) ఐతరేయ బ్రాహ్మణం
    2) బృహదారణ్యక ఉపనిషత్
    3) యజుర్వేద సంహిత
    4) భాగవత పురాణం
20. ఏ వేదాన్ని కృష్ణ, శుక్ల అనే రెండు భాగాలుగా విభజించారు?
    1) అథర్వణ వేదం 2) యజుర్వేదం
    3) సామవేదం 4) రుగ్వేదం
21. అష్టాదశ పురాణాల్లో అతి ప్రాచీనమైంది?
    1) విష్ణు పురాణం 2) భాగవత పురాణం
    3) వాయుపురాణం 4) గరుడ పురాణం
22. కిందివాటిలో రేఖాగణిత శాస్త్రం మూలాలు కలిగి ఉంది?
    1) సుళ్వ సూత్రాలు 2) శ్రౌత సూత్రాలు
    3) గృహ సూత్రాలు 4) ధర్మ సూత్రాలు
23. రుగ్వేదంలో ప్రస్తావించని పర్వతశ్రేణి?
    1) వింధ్య, సాత్పురా
    2) సాత్పురా, ఆరావళి పర్వతాలు
    3) ఆరావళి, హిమాలయాలు
    4) హిమాలయాలు, ముజావంత్ పర్వతాలు
24. కింది వాటిలో సరైన సమాధానాన్ని గుర్తించండి?

లిస్ట్-ఎ	లిస్ట్-బి
A. వేదాంగాలు	1. 4
B. ఉపనిషత్తులు	2. 108
C. పురాణాలు	3. 6
D. ఉపవేదాలు	4. 18

	A	B	C	D
1)	3	2	4	1
2)	3	4	1	2
3)	4	3	2	1
4)	1	2	3	4

25. ప్రపంచంలోనే అతి ప్రాచీన గ్రంథం?
    1) రుగ్వేదం 2) సామవేదం
    3) యజుర్వేదం 4)అథర్వణ వేదం
26. కిందివాటిలో సరికాని జత?
    వేదాలు-అనుబంధంగా ఉన్న ఉపనిషత్తులు
    1) రుగ్వేదం- ఐతరేయ, కౌసితాకి
    2) సామవేదం- చాందోగ్య, కేనోపనిషత్
    3) యజుర్వేదం- కథ, బృహదారణ్యక
    4) అథర్వణవేదం- తైత్తిరీయ, శ్వేతాశ్వతార, ఇసా
27. కిందివాటిలో చాతుర్వర్ణ వ్యవస్థకు సంబంధించిన మొదటి సంకేతం దేనిలో కనిపిస్తుంది?
    1) పురుష సూక్తం 2) రుగ్వేదం
    3) శతపథ బ్రాహ్మణం 4) మనుస్మృతి
28. పురాణాల్లోని ప్రసంగాలు దేనికి సంబంధించినవి?
    1) గాథలు 2) మత నియమాలు
    3) నైతిక న్యాయ నిబంధనలు
    4) పైవన్నీ
29. కిందివాటిలో ఇండో-ఆర్యన్ భాషా సమూహానికి సంబంధించనిది?
    1) అవెస్తా 2) ఇంగ్లిష్
    3) అరబ్బీ 4) పర్షియన్
30. కిందివాటిలో మలివేద సాహిత్యంగా దేన్ని పరిగణిస్తారు?
    1) అథర్వణ వేదం
    2) బ్రాహ్మణాలు, అరణ్యకాలు
    3) ఉపనిషత్తులు 4) పైవన్నీ
31. మాక్స్‌ముల్లర్ ప్రకారం రుగ్వేద సంకలన కాలం?
    1) క్రీ.పూ. 2000- 1500
    2) క్రీ.పూ. 1500- 1000



    3) క్రీ.పూ. 2000- 1200
    4) క్రీ.పూ. 1200- 1000
32. పూర్తిగా గద్యశైలిలో రచించిన వేదం?
    1) రుగ్వేదం 2) సామవేదం
    3) యజుర్వేదం 4) అథర్వణ వేదం
33. విజ్ఞానేశ్వరుని 'మితాక్షర'కు మూలంగా ఉన్న స్మృతి?
    1) మనుస్మృతి 2) యాజ్ఞవల్క్య స్మృతి
    3) పరాశర స్మృతి 4) నారద స్మృతి
34. ఆర్యేతరుల కృతిగా భావించే వేదం?
    1) రుగ్వేదం 2) సామవేదం
    3) యజుర్వేదం 4) అథర్వణ వేదం
35. రుగ్వేదంలో వ్యవసాయదారుడిని ఏ పేరుతో సూచించారు?
    1) కినాస 2) శూద్ర
    3) క్షేత్రక 4) కర్షక
36. కిందివాటిలో సరికాని జత?
    1) గొఘన - అతిధి
    2) దౌహిత్రి- కూతురు
    3) గొప - పశుకాపరి
    4) గవిష్టి- యుద్ధం
37. పురోహితుల దైవంగా ఎవరిని పరిగణించారు?
    1) ఇంద్రుడు 2) అగ్ని
    3) వరుణుడు 4) సూర్యుడు
38. కిందివారిలో వైదిక యుగంలోని ఏ సభలను ప్రజాపతి (బ్రహ్మ) పుత్రికలుగా భావిస్తారు?
    1) సభ, సమితి 2) సమితి, విధాత
    3) విధాత, గణ 4) గణ, పరిషత్
39. వేదకాలంలో ఏ వృత్తివారికి ఉపనయనం ధరించే అర్హత కల్పించారు?
    1) స్వర్ణకారులు 2) రథకారులు
    3) చర్మకారులు 4) లోహకారులు
40. కిందివాటిలో సరైన జతను గుర్తించండి?
    1) కులాల-కుండలు తయారు చేసేవారు
    2) నిషాద - చేపలు పట్టేవారు
    3) కైవర్త -బుట్టలు అల్లేవారు
    4) వేణ - వేటాడేవారు
41. మహావీరుడు ఏ భాషలో తన బోధనలను కొనసాగించాడు?
    1) అర్ధమాగధి 2) పాళి
    3) బ్రాహ్మి 4) మార్వారీ
42. అజీవిక మత స్థాపకుడు?
    1) పురాణ కశ్యప 2) పకుద కాత్యాయన
    3) గోసల మస్కరిపుత్ర
    4) అజిత కేశ కంబలి
43. కింది వారిలో అశోక వృక్షాన్ని పూజించిన మతశాఖ?
    1) శక్త 2) పాశుపత
    3) దిగంబర 4) అజీవిక
44. జైన మత వాస్తవ స్థాపకుడు?
    1) రుషభనాథ 2) పార్శ్వనాథ
    3) నేమినాథ 4) వర్ధమాన మహావీర
45. మహావీరుడు జ్ఞానోదయం పొందిన ప్రదేశం?
    1) కుంద గ్రామం 2) వైశాలి
    3) గయ 4) జృంభిక గ్రామం
46. మహావీరుడి మొదటి శిష్యుడు?
    1) జామాలి 2) ఆనందుడు
    3) గోసల మస్కరిపుత్ర 4) భద్రబాహు
47. మహావీరుడు మరణించిన ప్రదేశం?
    1) కుశినగర 2) వైశాలి
    3) రాజగృహ 4) పావా
48. మొదటి జైన సంగీతి ఎక్కడ జరిగింది?
    1) పాటలీపుత్రం 2) వల్లభి
    3) జృంభిక గ్రామం 4) వైశాలి
49. జైన పండితుడు హేమచంద్రుడు ఎవరి ఆస్థానంలో ఉండేవాడు?
    1) అమోఘవర్షుడు
    2) కుమార పాలుడు
    3) జయసింహ సిద్ధరాజు
    4) ఖారవేలుడు
50. దక్షిణాదిలో జైనమతాన్ని ప్రచారం చేసిన వారు?
    1) చంద్రగుప్త మౌర్యుడు
    2) భద్రబాహు 3) స్థూలబాహు
    4) సుదర్శన్
51. జైనమతాన్ని లిచ్ఛవీల రాజమతంగా చేసిన వారు?
    1) చేతక 2) కుమారదేవ
    3) అభయ 4) ఉదయనుడు
52. జైనమతంలో పోసద లేదా ఉపోసత అంటే?
    1) కొత్తవారిని జైన మతంలోకి సభ్యులుగా తీసుకునే కార్యక్రమం
    2) జైన ఉపాసకులు పున్నమి రోజు ఉపవాసం ఉండడం
    3) జైనులు తమ తప్పులను అంగీకరించే కార్యక్రమం
    4) నియమ ఉల్లంఘనకు విధించే శిక్ష
53. బసదులు ఏ మతానికి సంబంధించినవి?
    1) బౌద్ధం 2) జైనం
    3) హిందూ 4) అజీవిక
54. జైన కల్ప సూత్ర గ్రంథకర్త?
    1) కల్యాచార్య 2) గార్ధబిల్ల
    3) భద్రబాహు 4) స్థూల భద్ర
55. కింది వాటిలో సరికాని జత?
    1) రుషభనాథుడు - వృషభం
    2) అరిష్టనేమి - గవ్వ
    3) పార్శ్వనాథ - పాము
    4) వర్ధమాన మహావీరుడు - ఏనుగు
56. భారతదేశంలో వాడుకలోకి వచ్చిన మొదటి లిపి?
    1) బ్రాహ్మి 2) దేవనాగరి
    3) ఖరోష్టి 4) అరామిక్
57. బౌద్ధమతంలో తొలి చీలిక ఏ సమావేశంలో సంభవించింది?
    1) మొదటి 2) రెండవ
    3) మూడవ 4) నాలుగవ
58. శ్రీలంకలో బౌద్ధమతాన్ని ప్రవేశపెట్టిన వారు?
    1) మహేంద్ర, సంఘమిత్ర
    2) చారుమతి, మహాదేవ
    3) అతిష దీపాంకర, పద్మసంభవ
    4) సంతరక్షిత, కమలశీల
59. బౌద్ధ తర్క సిద్ధాంత స్థాపకుడు?
    1) అసంగుడు 2) వసుబంధుడు
    3) దిగ్నాగుడు 4) బుద్ధఘోషుడు
60. భారతదేశంలో తొలిసారిగా విగ్రహారాధనను ప్రారంభించినవారు?
    1) హీనయానులు 2) మహాయానులు
    3) వజ్రయానులు 4) హిందువులు
61. బార్హుత్ శిల్పాల్లో కిందివారిలో ఏ రాజు బుద్ధుడితో సమావేశమైన దృశ్యం కనిపిస్తుంది?
    1) అజాతశత్రు 2) బింబిసార
    3) బిందుసార 4) అశోకుడు
62. అశోకుడి శాసనాల్లోని బ్రాహ్మి లిపిని తొలిసారిగా కనుగొన్నది?
    1) కన్నింగ్ హామ్ 2) మాక్స్‌ముల్లర్
    3) జేమ్స్ ప్రిన్సెప్ 4) మార్టిమర్ వీలర్
63. కింది వాటిలో మౌర్యుల గురించి సమాచారమివ్వని గ్రంథం?
    1) మహావంశం 2) దీపవంశం
    3) దివ్యవదన 4) అశోక వదన
64. భారత చరిత్రలో తొలిసారిగా సింహాసనాన్ని త్యజించిన రాజు?
    1) చంద్రగుప్తమౌర్య 2) బిందుసార
    3) అశోకుడు 4) దశరథ

సమాధానాలు

1) 4; 2) 1; 3) 4; 4) 2; 5) 1; 6) 4; 7) 3; 8) 4; 9) 4; 10) 1; 11) 2; 12) 1; 13) 4; 14) 2; 15) 3; 16) 3; 17) 4; 18) 1; 19) 2; 20) 2; 21) 3; 22) 1; 23) 4; 24) 1; 25) 1; 26) 4; 27) 1; 28) 4; 29) 3; 30) 4; 31) 2; 32) 4; 33) 2; 34) 4; 35) 1; 36) 3; 37) 2; 38) 1; 39) 2; 40) 1; 41) 1; 42) 3; 43) 4; 44) 2; 45) 4; 46) 1; 47) 4; 48) 1; 49) 3; 50) 2; 51) 3; 52) 2; 53) 2; 54) 3; 55) 4; 56) 1; 57) 2; 58) 1; 59) 3; 60) 2; 61) 1; 62) 3; 63) 4; 64) 1.

మొదటి శతాబ్దంలోని జనవరి 1 ఏ రోజు అవుతుంది?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

మెంటల్ ఎబిలిటీ

క్యాలెండర్

క్యాలెండర్ చాప్టర్ నుంచి ప్రతి పోటీ పరీక్షలో 2 - 5 వరకు ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది.

గమనిక: ఈ చాప్టర్‌లోని ప్రశ్నలు సాధించాలంటే బేసి రోజులను గుర్తించడం తెలిస్తే చాలు.

బేసి దినాలు గుర్తించడం

క్యాలెండర్‌లో రెండు రకాల సంవత్సరాలుంటాయి.

- సాధారణ సంవత్సరంలో 365 రోజులు అంటే 52 వారాలు + 1 రోజు. ఆ మిగిలిన ఒక రోజునే 'బేసిదినం' అంటాం.

గమనిక: ఆదివారం నుంచి శనివారం వరకు ఏడు రోజులు ఉంటాయి. కాబట్టి ఇచ్చిన రోజులను 7తో భాగిస్తే వచ్చిన శేషాన్ని 'బేసి దినాలు'గా గుర్తించాలి.

- లీపు సంవత్సరంలో 366 రోజులు అంటే 52 వారాలు + 2 బేసి దినాలు ఉంటాయి.
  గమనిక: లీపు సంవత్సరంలో ఫిబ్రవరిలో 29 రోజులు ఉంటాయి.

లీపు సంవత్సరాన్ని గుర్తించడం

- ఇచ్చిన ఏడాదిలోని చివరి రెండు అంకెల(అంటే ఒకట్లు, పదుల స్థానం)ను 4 నిశ్శేషంగా భాగిస్తే అది లీపు సంవత్సరం. లేకపోతే సాధారణ సంవత్సరం.

శతాబ్దంలోని లీపు సంవత్సరం గుర్తించడం

- శతాబ్దాలన్నీ లీపు సంవత్సరాలు కావు. ఏదైనా ఒక శతాబ్దాన్ని 400 నిశ్శేషంగా భాగిస్తే అది లీపు సంవత్సరం.
  ఉదా: 400, 800, 1200, 1600, 2000 లీపు సంవత్సరాలు. కానీ 500, 600, 1100, 1500, 1700, 1800, 1900 లీపు సంవత్సరాలు కావు.

శతాబ్దం చివరి రోజు వచ్చే వారాలను కనుక్కోవడం

- వంద సంవత్సరాల్లో ఐదు బేసిదినాలు ఉంటాయి. అంటే 76 సాధారణ సంవత్సరాలు + 24 లీపు సంవత్సరాలు ఉంటాయి.
  76×1 బేసిదినం + 24×2 బేసిదినాలు
  = 76+48 = 124 రోజులు.
  124 రోజులను 7తో భాగిస్తే 5 శేషం వస్తుంది. కాబట్టి 100 ఏళ్లలో ఐదు బేసి దినాలు ఉంటాయి. అంటే ఆ రోజు శుక్రవారం.
  200 ఏళ్లలో 5×2 = 10ని 7తో భాగిస్తే 3 బేసి దినాలు అంటే బుధవారం.
  300 సంవత్సరాల్లో 5×3=15ను 7తో భాగిస్తే 1 బేసిదినం అంటే సోమవారం. 400 సంవత్సరాల్లో 0 బేసిదినాలు అంటే ఆదివారం.
  శతాబ్దం చివరి రోజున శుక్రవారం, బుధవారం, సోమవారం, ఆదివారం వస్తాయి.
  లీపు సంవత్సరంలో జనవరి, జూలై..

సాధారణ సంవత్సరంలో జనవరి అక్టోబర్ నెలలకు ఒకే విధమైన క్యాలెండర్ ఉంటుంది.

కింద ఇచ్చిన కోడ్స్ సహాయంతో క్యాలెండర్ సమస్యలకు సులభంగా సమాధానాలు గుర్తించవచ్చు.

శతాబ్దం - కోడ్

1600-1699→6	2000-2099→6
1700-1799→4	2100-2199→4
1800-1899→2	2200-2299→2
1900-1999→0	2300-2399→0

వారం - కోడ్

ఆదివారం - 0	గురువారం - 4
సోమవారం - 1	శుక్రవారం - 5
మంగళవారం - 2	శనివారం - 6
బుధవారం - 3	

నెల - కోడ్

జనవరి - 0	జూలై - 6
ఫిబ్రవరి - 3	ఆగస్టు - 2
మార్చి - 3	సెప్టెంబర్ - 5
ఏప్రిల్ - 6	అక్టోబర్ - 0
మే - 1	నవంబర్ - 3
జూన్ - 4	డిసెంబర్ - 5

గమనిక: బేసి దినాలను కోడ్స్‌గా రాశాం.

వీటిని జ్ఞాపకం ఉంచుకోవడానికి టిప్స్

- శతాబ్దపు కోడ్‌లను గమనిస్తే 6, 4, 2, 0 పునరావృతం అవుతున్నాయి.
- నెలకోడ్‌లను 12 అంకెల మొబైల్ నెంబర్‌గా గుర్తుపెట్టుకోవాలి.
  అది 033 614, 625 035

ఒక తేదీ ఇచ్చి అది ఏ వారమో గుర్తించడానికి కోడ్

తేది + నెలకోడ్ + సంవత్సరం + లీపు సంవత్సరం + శతాబ్దం కోడ్

ఉదా: 22-04-1984 ఏ వారం అవుతుంది?

సాధన: పైన ఇచ్చిన కోడ్ ప్రకారం అన్నింటిని కూడాలి.
22 + 6 + 84 + 21 + 0 = 133
133ను 7తో భాగిస్తే శేషం సున్నా.
అంటే కోడ్ ప్రకారం ఆదివారం అవుతుంది.
తేది = 22, ఏప్రిల్ నెలకోడ్ = 6,
సంవత్సరం = 84,
లీపు సంవత్సరాలు 84/4 = 21
శతాబ్దం కోడ్ = 0
అన్నింటిని కూడితే 133 వస్తుంది.

పై విధంగా ప్రాక్టీస్ చేస్తే తక్కువ సమయంలో కచ్చితత్వంతో సమాధానాన్ని గుర్తించగలం.

సమానమైన క్యాలెండర్‌ను గుర్తించడం

ఉదా:

1. 2003 లాంటి క్యాలెండర్ మళ్లీ ఏ సంవత్సరంలో పునరావృతం అవుతుంది? (ఎస్ఐ-2012)
   ఎ) 2006 బి) 2013
   సి) 2012 డి) 2014
   జవాబు (డి)

సాధన: ఇచ్చిన సంవత్సరం నుంచి బేసి దినాలను లెక్కిస్తూ పోతే ఎక్కడైతే బేసి దినాల మొత్తం 7 అవుతుందో అది సమానమైన క్యాలెండర్ అవుతుంది. ఒకవేళ బేసిదినాల మొత్తం 7 కాకపోతే 14 వరకు లెక్కించాలి.
2003-1, 2004-2 (లీపు సంవత్సరం)
2005-1, 2006-1
2007-1, 2008-2 (లీపు సంవత్సరం)
2007 వరకు బేసిదినాల మొత్తం = 6
2008 వరకు = 8
కాబట్టి 14 వచ్చే వరకు చూద్దాం.
2009-1 2010-1 2011-1
2012-2 2013-1
2013 వరకు బేసి దినాల మొత్తం = 14
కాబట్టి 2014 జవాబు అవుతుంది.
అంటే 2003 లాంటి క్యాలెండర్ 2014లో వస్తుంది.

తేలిక పద్ధతి

కోడ్:		6	11	11	

స్టెప్1: ముందుగా ఇచ్చిన సంవత్సరానికి ముందు, వెనుక లీపు సంవత్సరాలను గుర్తించాలి.

2000	2001	2002	2003	*2004*
	+	+	+	
	6	11	11	
		2014		

స్టెప్ 2: వాటికి మధ్య ఉన్న సంవత్సరాలకు 6, 11, 11లను కలిపితే వాటికి సమాన క్యాలెండర్ వస్తుంది.

స్టెప్ 3: మన ప్రశ్నలోని 2003కు 11ను కలిపితే 2014 సమాధానం వచ్చింది.

గమనిక: అడిగిన ప్రశ్నలోని సంవత్సరం లీపు సంవత్సరం అయితే + 28తో కూడాలి.

ఉదా: 2000 లాంటి లీపు సంవత్సరం 2028లో వస్తుంది.

మాదిరి ప్రశ్నలు

1. 12 ఫిబ్రవరి, 1991 ఏ వారం అవుతుంది?
   ఎ) సోమవారం బి) మంగళవారం
   సి) బుధవారం డి) గురువారం
   సాధన: తేది + నెలకోడ్ + సం. + లీపు సం. + శతాబ్దం కోడ్‌ను ఉపయోగించాలి.
   12 + 3 + 91 + 22 + 0 = 128
   (91/4 = 22 లీపు సంవత్సరాలు)
   128ను 7తో భాగిస్తే శేషం 2.
   కాబట్టి మంగళవారం అవుతుంది.
2. కిందివాటిలో లీపు సంవత్సరం ఏది?
   ఎ) 1500 బి) 1700 సి) 1800 డి) 1600
   సాధన:ఇచ్చినవన్నీ శతాబ్దాలు కాబట్టి శతాబ్దాన్ని 400తో భాగించాలి. అప్పుడు శేషం సున్నా వస్తే అది లీపు సంవత్సరం అవుతుంది.
   400)1600(4
   1600
   0
   శేషం సున్నా
   కాబట్టి 1600 మాత్రమే లీపు సంవత్సరం.
3. 1992లో మొదటిరోజు ఏ వారం?
   ఎ) మంగళవారం బి) బుధవారం
   సి) గురువారం డి) నిర్ణయించలేం
   సాధన: 1992లో మొదటిరోజు అంటే జనవరి 1
   కోడ్ ప్రకారం
   1 + 0 + 92 + 23 + 0 =116
   116ను 7 తో భాగిస్తే శేషం 4.
   అంటే గురువారం అవుతుంది.
4. మొదటి శతాబ్దంలోని జనవరి 1 ఏ రోజు అవుతుంది?
   ఎ) మంగళవారం బి) సోమవారం
   సి) బుధవారం డి) గురువారం
   సాధన: క్యాలెండర్‌లోని మొత్తం సమస్యలు, కోడ్‌లు వీటన్నింటినీ 1 - జనవరి - 01 సంవత్సరం సోమవారం నుంచి మొదలైనట్లుగానే తీసుకున్నారు.
   గమనిక: క్యాలెండర్‌లో మొదటి ఆదివారం 7వ తేది అవుతుంది.
   కాబట్టి 1 - జనవరి - 01న సోమవారం అవుతుంది.
   కోడ్ ప్రకారం తేదీ + నెలకోడ్ + సంవత్సరం + లీపు సంవత్సరం + శతాబ్దం కోడ్
   1 + 0 + 1 + 0 + 6 = 8
   8ను 7తో భాగిస్తే శేషం 1.
   అంటే సోమవారం అవుతుంది.
5. ఒక సంవత్సరంలో ఎన్ని నెలలు సమాన క్యాలెండర్ కలిగి ఉంటాయి?
   ఎ) జనవరి, జూన్
   బి) జనవరి, ఏప్రిల్
   సి) జనవరి, మార్చి
   డి) నిర్ణయించలేం
   సాధన: జవాబు నిర్ణయించలేం (డి)
   ఎందుకంటే ఒక సంవత్సరం అని అడిగారు. కానీ అది సాధారణ సంవత్సరమా లీపు సంవత్సరమా ఇవ్వలేదు.
6. 11-జనవరి-1996 రోజు ఏ వారం అవుతుంది?
   ఎ) బుధవారం బి) గురువారం
   సి) శుక్రవారం డి) శనివారం
   సాధన: కోడ్ ప్రకారం
   11 + 0 + 96 + 24 + 0 = 131
   131ను 7తో భాగిస్తే శేషం 5 అంటే శుక్రవారం.
   కానీ ఇచ్చిన ప్రశ్నలో 1996 లీపు సంవత్సరం. 1996లో జనవరి నెలలోని తేది అడిగారు. ఇది మార్చి నెలకు ముందు కాబట్టి 131-1 = 130ను 7తో భాగించాలి.
   అప్పుడు శేషం = 4 అంటే గురువారం అవుతుంది.
   శుక్రవారం అనేది తప్పు జవాబు.
   గమనిక: ఇచ్చిన ప్రశ్న లీపు సంవత్సరంలోని జనవరి లేదా ఫిబ్రవరిలో ఉంటే బేసిదినాల నుంచి 1ని తీసివేసి మిగిలిన దినాలను 7తో భాగించాలి.
7. 1 మార్చి 1996 రోజు ఏ వారం?
   సాధన: 1 + 3 + 96 + 24 + 0 = 124
   124ను 7తో భాగిస్తే 5 శేషం అంటే శుక్రవారం
   1996 లీపు సంవత్సరం అయినప్పటికీ బేసి దినాల నుంచి '1' తీసివేయలేదు. ఎందుకంటే కనుక్కోవాల్సింది మార్చి నెలలోని తేది.
   ఫిబ్రవరిలో 29 రోజులు ఉంటాయి. కాబట్టి జనవరి, ఫిబ్రవరిలో అడిగిన ప్రశ్నకు బేసి దినాల నుంచి '1' తీసివేయాలి.
8. 2001 జనవరి 1 సోమవారం అయితే ఈ సంవత్సరంలో చివరిరోజు ఏ వారం?
   ఎ) సోమవారం బి) మంగళవారం
   సి) బుధవారం డి) గురువారం
   సాధన: 2001 సాధారణ సంవత్సరం
   = 52 వారాలు + 1 బేసి దినం కాబట్టి సోమవారమే అవుతుంది.
9. మన మొదటి రిపబ్లిక్ డే ఏ రోజు అవుతుంది?
   ఎ) శుక్రవారం బి) శనివారం
   సి) గురువారం డి) మంగళవారం
   సాధన:
   మన మొదటి రిపబ్లిక్ డే
   26 జనవరి 1950
   కోడ్ ప్రకారం
   26 + 0 + 50 + 12 + 0 = 88
   88ను 7తో భాగిస్తే శేషం 4 వస్తుంది.
   అంటే గురువారం అవుతుంది.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. ఒకవేళ జనవరి 1, 2007 సోమవారం అయితే జనవరి 1, 2008 ఏ రోజు అవుతుంది? (గ్రూప్-2, 2008)
   ఎ) ఆదివారం బి) సోమవారం
   సి) బుధవారం డి) మంగళవారం
   సమాధానం: డి
2. భారత స్వాతంత్ర్య దినోత్సవం 1996లో శుక్రవారం అయితే 2000 సంవత్సరంలో ఏ వారం అవుతుంది? (వీఆర్‌వో-2012)
   ఎ) బుధవారం బి) గురువారం
   సి) శుక్రవారం డి) శనివారం
   సమాధానం: ఎ

హైదరాబాద్ నగర వాస్తు శిల్పి ఎవరు?



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర

మాదిరి ప్రశ్నలు

1. వేయి స్తంభాల గుడి నిర్మాణానికి సంబంధించని అంశం?
   1) ఏకశిల 2) త్రికూట శైలి నిర్మాణం
   3) నక్షత్ర ఆకారం
   4) నల్లని రాతి పనితనం
2. బౌద్ధ మతస్థులకు అభయం ఇస్తున్నట్లుగా ఉన్న మాందాత శిల్పం ఎక్కడ ఉంది?
   ఎ) ఏలేశ్వరం బి) జగ్గయ్యపేట
   సి) నాగార్జునకొండ డి) బావికొండ
   1) ఎ, బి మాత్రమే 2) సి మాత్రమే
   3) సి, డి మాత్రమే 4) బి మాత్రమే
3. ఆంధ్రుల గురించి పేర్కొనే అశోకుడి శిలాశాసనం ఏది?
   1) 9వ 2) 13వ 3) 6వ 4)10వ
4. శాతవాహనుల నిజమైన రాజ్యస్థాపకుడు?
   1) గౌతమీపుత్ర శాతకర్ణి
   2) యజ్ఞశ్రీ శాతకర్ణి
   3) సిముఖుడు 4) శాతకర్ణి-1
5. 'ట్రాజెడీ ఆఫ్ హైదరాబాద్' గ్రంథ రచయిత?
   1) వెల్లోడి 2) కె.ఎం. మున్షీ
   3) లాయక్ అలీ 4) జె.ఎన్. చౌదరి
6. కంచి, పొన్న అనే నాట్యగత్తెలు ఏ పాలకుల కాలంలో ప్రసిద్ధి?
   1) వెలమ 2) రెడ్డి
   3) కాకతీయ 4) పైవన్నీ
7. శాతవాహనుల కాలం నాటి అంతర్జాతీయ నౌకా కేంద్రం?
   1) అరికమేడు(పుదుచ్చేరి) 2) బారిగజ
   3) మైసోలియా 4) కళ్యాణి
8. ప్రఖ్యాత అమరావతి స్తూపాన్ని నిర్మించిన శాతవాహన రాజు?
   1) గౌతమీ పుత్ర శాతకర్ణి
   2) యజ్ఞశ్రీ శాతకర్ణి
   3) మూడో పులోమావి
   4) రెండో పులోమావి
9. కాకతీయుల కాలం నాటి ఉద్యోగుల గురించి పేర్కొన్న రచన ఏది?
   1) క్రీడాభిరామం
   2) సకల నీతి సమ్మతం
   3) సుమతీ శతకం 4) భోగినీ దండకం
10. తెలంగాణ సాయుధ పోరాట సమయంలో బండెనక బండి కట్టి... అనే గేయం రచించింది ఎవరు?
    1) గద్దర్ 2) బండి యాదగిరి
    3) దాశరథి 4) దొడ్డి కొమురయ్య
11. శాతవాహనుడి వంశ స్థాపకుడైన శ్రీముఖుడి నాణేలు ఎక్కడ లభించాయి?
    1) పెద్ద బంకూరు 2) కొండాపురం
    3) ధూళికట్ట 4) కోటి లింగాల
12. కుతుబ్‌షాహీల కాలంలో గోల్కొండ రాజ్యంలో ప్రసిద్ధి చెందిన పరిశ్రమ?
    1) వస్త్ర 2) పింగాణీ
    3) గాజు 4) వజ్ర
13. 'కలంకారీ' అంటే?
    1) చిత్రకళ 2) నాట్యకళ
    3) శిల్పకళ 4) లలితకళ
14. 'సుగ్రీవ విజయం' అనే తొలి యక్షగానాన్ని రచించింది?
    1) పొన్నగంటి తెలగనార్యుడు
    2) కందుకూరి రుద్రకవి
    3) సారంగు తమ్మయ్య మంత్రి
    4) పిల్లలమర్రి పిన వీరభద్రుడు
15. 'బిద్రి' పాత్రల తయారీలో రాగి, తుత్తునాగాలను ఏ నిష్పత్తిలో ఉపయోగించారు?
    1) 1:16 2) 4:15
    3) 5:8 4) 2:3
16. ఆర్యసమాజ్ శాఖను హైదరాబాద్‌లో ఎప్పుడు స్థాపించారు?
    1) 1892 2) 1893
    3) 1884 4) 1895
17. హైదరాబాద్ నగర వాస్తు శిల్పి ఎవరు?
    1) షోయబుల్లా ఖాన్
    2) మీర్ మొమిన్ అస్త్రాబాదీ
    3) సుల్తాన్ కులీ 4) మీర్ ఖాసీం అలీ
18. మూసీనదిపై వంతెనను ఇబ్రహీం కుతుబ్‌షా ఎప్పుడు నిర్మించాడు?
    1) 1558 2) 1578
    3) 1568 4) 1548
19. 1944లో భువనగిరిలో జరిగిన సమావేశంలో ఆంధ్ర మహాసభ రెండుగా చీలిపోయింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించినవారు?
    1) మాడపాటి హనుమంతరావు
    2) బద్దం ఎల్లారెడ్డి
    3) రావి నారాయణరెడ్డి
    4) కె.వి.రంగారెడ్డి
20. అచ్చ తెలుగు గ్రంథం 'యయాతి చరిత్ర'ను రచించింది?
    1) తెలగనార్యుడు
    2) కందుకూరి రుద్రకవి
    3) గంగాధరుడు 4) సారంగు తమ్మయ్య
21. గోల్కొండ రాజ్యంలో తొలి మసీదు ఏది?
    1) మక్కా మసీదు 2) టోలి మసీదు
    3) తారామతి మసీదు
    4) జామా మసీదు
22. 'బిద్రి' కళకు ప్రసిద్ధి చెందిన కేంద్రాలు ఏవి?
    ఎ) బీదర్ బి) హైదరాబాద్
    సి) గుల్బర్గా
    1) ఎ మాత్రమే 2) ఎ, సి మాత్రమే
    3) ఎ, బి 4) ఎ, బి, సి
23. నల్లటి రూపం, అమ్మోనియం క్లోరైడ్, సోడియం క్లోరైడ్‌ల మిశ్రమంతో కూడిన కళ ఏది?
    ఎ) కలంకారీ బి) బిద్రి
    సి) ఫిలిగ్రి
    1) ఎ మాత్రమే 2) ఎ, బి మాత్రమే
    3) బి మాత్రమే 4) ఎ, బి, సి
24. 'దక్కన్' చిత్రకళ పితామహుడు?
    1) మీర్ సయ్యద్ ఆలీ 2) అబ్దుల్ సమద్
    3) మీర్ మొమిన్ 4) మీర్ హకీం
25. రుద్రమదేవి 'మరణశాసనం' ఏది?
    ఎ) చందుపట్ల శాసనం
    బి) కందుకూరు శాసనం
    సి) మోటుపల్లి శాసనం
    1) ఎ మాత్రమే 2) ఎ, బి మాత్రమే
    3) బి, సి మాత్రమే 4) ఎ, సి మాత్రమే
26. కింది వాటిలో సరైంది?
    ఎ) ఉస్మానియా విశ్వవిద్యాలయ స్థాపన -1918
    బి) నిజాం కళాశాల స్థాపన -1887
    సి) మహబూబియా కళాశాల స్థాపన-1894
    1) ఎ, బి మాత్రమే 2) బి మాత్రమే
    3) ఎ, బి, సి మాత్రమే
    4) బి, సి మాత్రమే
27. సాలార్‌జంగ్ ప్రవేశపెట్టిన నూతన నాణేలు ఏవి?
    ఎ) దినార్ బి) హాలి సిక్కా సి) రూక
    1) బి మాత్రమే 2) ఎ, బి మాత్రమే
    3) బి, సి మాత్రమే 4) ఎ మాత్రమే
28. కిందివాటిలో సరైంది?
    ఎ) 1883లో చందానగర్ రైల్వే సంఘటన
    బి) 1849లో వహాబీ ఉద్యమం
    సి) 1888లో ముల్కీ ఉద్యమం
    1) ఎ మాత్రమే 2) ఎ, సి మాత్రమే
    3) బి, సి మాత్రమే 4) పైవన్నీ
29. నిజాం కాలంనాటి 'రెవెన్యూ విధానం' ఏది?
    ఎ) మహాకామా - ఇ- నసిరి
    బి) జిలాబంది సి) గల్లాబక్ష్
    1) ఎ మాత్రమే 2) బి, సి మాత్రమే
    3) బి మాత్రమే 4) ఎ, సి మాత్రమే
30. 'సుల్తానిల్ అహాదే-వజ్జమాన్ హమియు మిల్లతిరసూలిర్ రహమాన్' అని తమ నాణేలపై ముద్రించిన రాజ్యవంశం ఏది?
    ఎ) బీజాపూర్ - ఆదిల్‌షాహీలు
    బి) బీదర్ - బరీద్‌షాహీలు
    సి) గోల్కొండ - కుతుబ్‌షాహీలు
    1) ఎ మాత్రమే 2) సి మాత్రమే
    3) బి, సి మాత్రమే 4) ఎ, సి మాత్రమే
31. తెలుగు అక్షరాలతో నాణేలు ముద్రించిన విజయనగర రాజ్యవంశం?
    1) సంగమ 2) సాళువ
    3) తుళు 4) అరవీటి
32. జాజ్‌నగర్ అంటే ఏ ప్రాంతం?
    1) తెలంగాణ 2) పాండ్య - మధురై
    3) ఒడిశా - కళింగ
    4) హోయసల - ద్వారసముద్రం
33. దక్షిణ భారతదేశంలోని వివిధ ప్రాంతాల్లోని తిరుగుబాట్ల గురించి ప్రస్తావించిన శాసనం ఏది?
    1) బయ్యారం 2) కలువచేరు శాసనం
    3) ధర్మసాగరం 4) హన్మకొండ శాసనం
34. 'దక్షిణ భారతదేశపు నాణేలు' గ్రంథం రచయిత ఎవరు?
    1) ఇలియట్ 2) అబ్దుల్ వాలీ
    3) శేర్వాణి 4) రాంప్సన్
35. 'జరిబా హైదరాబాద్' పేరిట నాణేలు ముద్రించింది?
    1) మహమ్మద్ కుతుబ్‌షా
    2) మహమ్మద్ కులీ కుతుబ్‌షా
    3) అబుల్ హసన్ తానీషా
    4) అబ్దుల్లా కుతుబ్‌షా
36. తొలి ఆంధ్ర మహాసభ 1930లో మెదక్ జిల్లాలోని జోగిపేటలో జరిగింది. దీనికి అధ్యక్షత వహించింది ఎవరు?
    1) మాడపాటి హనుమంతరావు
    2) బూర్గుల రామకృష్ణారావు
    3) సురవరం ప్రతాపరెడ్డి
    4) కొండా వెంకట రంగారెడ్డి
37. కాకతీయుల కాలంనాటి సాంఘిక పరిస్థితులు, ప్రతాపరుద్రుడి కాలంలోని నర్తకి మాచల్దేవి గురించి వివరాలు అందించే గ్రంథం ఏది?
    1) ప్రతాపరుద్ర యశోభూషణం
    2) ప్రేమాభిరామం
    3) ప్రియాభిరామం
    4) క్రీడాభిరామం
38. హైదరాబాద్ అంబేద్కర్‌గా ప్రసిద్ధి చెందింది ఎవరు?
    1) భాగ్యరెడ్డి వర్మ 2) బి.ఎస్. వెంకట్రావ్
    3) జూలా రంగారావు 4) శ్యాంసుందర్
39. 'హైదరాబాద్ స్వాతంత్ర్య పోరాటం - నా అనుభవాలు, జ్ఞాపకాలు' ఎవరి ఆత్మకథ?
    1) రావి నారాయణరెడ్డి
    2) స్వామి రామానంద తీర్థ
    3) బూర్గుల రామకృష్ణారావు
    4) మాడపాటి హనుమంతరావు
40. 'గోల్కొండ' రాజ్యంలో వర్తక వ్యాపారాలకు కేంద్రాలు?
    ఎ) ఏలూరు - తివాచీలు
    బి) ఓరుగల్లు - రత్న కంబళ్లు
    సి) గోల్కొండ - వజ్రాలు
    1) ఎ మాత్రమే 2) ఎ, బి మాత్రమే
    3) ఎ, బి, సి 4) బి, సి మాత్రమే

సమాధానాలు

1) 1; 2) 4; 3) 2; 4) 4; 5) 3; 6) 2; 7) 1; 8) 4; 9) 2; 10) 2; 11) 4; 12) 4; 13) 1; 14) 2; 15) 1; 16) 1; 17) 2; 18) 3; 19) 3; 20) 1; 21) 3; 22) 3; 23) 3; 24) 4; 25) 1; 26) 1; 27) 1; 28) 2; 29) 3; 30) 1; 31) 4; 32) 3; 33) 2; 34) 1; 35) 4; 36) 3; 37) 4; 38) 2; 39) 2; 40) 3.

What is the code for "manage"?



BANK EXAMS

Reasoning

Model Questions

Directions (Q. No. 1-7): Study the following information to answer the given questions.

Eight people, viz A, B, C, D, E, F, G and H are sitting in a straight line facing North. Each of them has passed a recruitment exam and must join the office in different months, viz January, February, March, April, May, June, July and August but not necessarily in the same order.

G sits third to the right of the person who joins in May. The person who joins in August sits second to the right of G. A and E are immediate neighbours of each other. Neither A nor E has joining dates in either May or August. Neither A nor E is an immediate neighbour of G.

H sits third to the right of the person whose joining date is in January. Neither A nor E has joining dates in January. H's joining date is not in August.

Only two people sit between E and the person whose joining date is in July. The person whose joining date is in February sits on the immediate left of D.

Only one person sits between E and B. C joins before July. E joins after April. G joins after A.

1. In which of the following months does H join the office?
   1) April 2) June 3) July
   4) February 5) March
2. Who among the following sits exactly between E and B?
   1) The person whose joining date is in May
   2) The person whose joining date is in January
   3) D 4) A
   5) The person whose joining date is in August
3. "H" is related to "July" in a certain way based on the above arrangement. "B" is related to "June" following the same pattern. "____" is related to "May" following the same pattern.
   1) F 2) G 3) A 4) D 5) C
4. Which of the following is true regarding D?
   1) Only two people sit to the left of D
   2) D is sitting second to the right of the person whose joining date is in July
   3) E and B are immediate neighbours of D
   4) D's joining date is in May
   5) None is true
5. Who among the following has joining date in June?
   1) F 2) E 3) G 4) D 5) C
6. How many people sit between C and the person whose joining date is in April?
   1) None 2) One 3) Two
   4) Three 5) Four
7. Who among the following are sitting at extreme ends of the line?
   1) A and the person whose joining date is in August
   2) The person whose joining date is in May and E
   3) C and G
   4) The persons whose joining dates are in March and June
   5) None of these

Directions (Q. No. 8-12): Study the following information to answer the given questions.

Eight people are sitting in two parallel rows containing four people each in such a way that there is an equal distance between adjacent persons. In row 1, A, B, C and D are sitting (but not necessarily in the same order) and all of them are facing North. In row 2, P, Q, R and S are sitting (but not necessarily in the same order) and all of them are facing South. Therefore, in the given seating arrangement, each member sitting in a row faces another member of the other row. S sits second to left of Q. A faces the immediate neighbour of S. Only one person sits between A and C. P does not face A. B is not an immediate neighbour of A.

8. Which of the following is true regarding D?
   1) D sits at one of the extreme ends of the line
   2) A sits on the immediate left of D
   3) Q faces D
   4) C is an immediate neighbour of D
   5) No immediate neighbour of D faces R
9. Who among the following faces C?
   1) P 2) Q 3) R 4) S
   5) Cannot be determined
10. Who among the following sits on the immediate right of the person who faces C?
    1) P 2) Q 3) R 4) S
    5) Cannot be determined
11. Four of the following five are alike in a certain way based on the given seating arrangement and thus form a group. Which is the one that does not belong to that group?
    1) A 2) Q 3) R 4) B 5) S
12. Who among the following faces R?
    1) A 2) B 3) C 4) D
    5) Cannot be determined

Directions (Q. No. 13-18): Study the following information to answer the given questions:

In a certain code,
"time and money" is written as "ma jo ki",
"manage time well" is written as "pa ru jo",
"earn more money" is written as "zi ha ma" and
"earn well enough" is written as "si ru ha".

13. What is the code for "earn"?
    1) si 2) ru 3) ha 4) ma
    5) Cannot be determined
14. Which of the following represents "more time" ?
    1) pa jo 2) zi ki 3) ma ki
    4) si jo 5) jo zi
15. What is the code for "manage"?
    1) ru 2) pa 3) jo
    4) ha 5) Either "jo" or "ru"
16. Which of the following may represent "money matters"?
    1) ki to 2) ma pa 3) fi ma
    4) ha ma 5) ma jo
17. What does "ru" stand for?
    1) well 2) manage
    3) time 4) enough
    5) Either "time" or "enough"
18. Which of the following may represent "good enough"?
    1) ru si 2) da ha 3) si pa
    4) si da 5) ki ru

Directions (Q. No. 19-23): Study the following information carefully and answer the given questions.

A word and number arrangement machine, when given an input line of words and numbers, rearranges them following a particular rule in each step. The following is an illustration of input and rearrangement.

Input: gone over 35 69 test 72 park 27
Step I: 27 gone over 35 69 test 72 park
Step II: 27 test gone over 35 69 72 park
Step III: 27 test 35 gone over 69 72 park
Step IV: 27 test 35 park gone over 69 72
Step V: 27 test 35 park 69 gone over 72
Step VI: 27 test 35 park 69 over gone 72
Step VII: 27 test 35 park 69 over 72 gone


Step VII is the last step of the rearrangement.

As per the rules followed in the above steps, find out in each of the following questions the appropriate step for the given input.

19. **Input:** 86 open shut door 31 49 always 45
    How many steps will be required to complete the rearrangement?
    1) Five 2) Six 3) Seven
    4) Four 5) None of these
20. **Step III of an input:** 25 yes 37 enemy joy defeat 52 46
    Which of the following is definitely the input?
    1) enemy 25 joy defeat yes 52 37 46
    2) 37 enemy 25 joy yes defeat 52 46
    3) enemy joy defeat 25 52 yes 46 37
    4) Cannot be determined
    5) None of these
21. **Step II of an Input:** 18 win 71 34 now if victory 61.
    How many more steps will be required to complete the rearrangement?
    1) Three 2) Four 3) Five
    4) Six 5) More than six
22. **Input:** where 47 59 12 are they going 39
    Which of the following steps will be the last but one?
    1) VII 2) IV 3) V
    4) VIII 5) None of these
23. **Step II of an input:** 33 store 81 75 full of goods 52
    Which of the following will be step VI?
    1) 33 store 52 of 75 81 full goods
    2) 33 store 52 of 75 full 81 goods
    3) 33 store 52 of 75 goods 81 full
    4) There will be no such step
    5) None of these


Explanations

(1-7):



1. 4 **2.** 1 **3.** 1 **4.** 5 **5.** 2
6. 3 **7.** 1

(8-12):



8. 4 **9.** 1 **10.** 2 **11.** 5 **12.** 1

(13-18):

time and money → ma jo ki... (i)
manage time well → pa ru jo...(ii)
earn more money→ zi ha ma..(iii)
earn well enough → si ru ha ...(iv)
From (i) and (ii), time → jo
From (i) and (iii), money → ma
From (i), and → ki
From (ii) and (iv) well → ru
From (ii), manage → pa
From (iii) and (iv), earn → ha
From (iii), more → zi
From (iv), enough → si

13. 3 **14.** 5 **15.** 2

16. Since "matters" is a new word. So, new code is introduced for "matters" ie, "fi". Code for "money" is "ma". **Ans: 3**

17. 1

18. Code for "enough" is "si" and since "good" is a new word, so a new code for "good", ie "da" is introduced. **Ans: 4**

(19-23):

The machine rearranges numbers in ascending order and word in reverse alphabetical order alternately.

19. Input: 86 open shut door 31 49 always 45
Step I: 31 86 open shut door 49 always 45
Step II: 31 shut 86 open door 49 always 45
Step III: 31 shut 45 86 open door 49 always
Step IV: 31 shut 45 open 86 door 49 always
Step V: 31 shut 45 open 49 86 door always
Step VI: 31 shut 45 open 49 door 86 always **Ans: 2**

20. Can't proceed backward. **Ans: 4**

21. Step II: 18 win 71 34 now if victory 61
Step III: 18 win 34 71 now if victory 61
Step IV: 18 win 34 victory 71 now if 61
Step V: 18 win 34 victory 61 71 now if
Step VI: 18 win 34 victory 61 now 71 if
Four more steps are needed to complete the rearrangement. **Ans: 2**

22. Input: where 47 59 12 are they going 39
Step I: 12 where 47 59 are they going 39
Step II: 12 where 39 47 59 are they going
Step III: 12 where 39 they 47 59 are going
Step IV: 12 where 39 they 47 going 59 are **Ans: 5**

23. Step II: 33 store 81 75 full of goods 52
Step III: 33 store 52 81 75 full of goods
Step IV: 33 store 52 of 81 75 full goods
Step V: 33 store 52 of 75 81 full goods
Step VI: 33 store 52 of 75 goods 81 full **Ans: 3**